

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 43

సోమవారం 5-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సన్నిధి

మన గుడి.. మన ఉత్సవం

బ్రహ్మంగారి మఠం...

ఆరంభమైన ఆరాధనోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి


ప్రపంచంలో ఏ వింత జరిగినా 'బ్రహ్మంగారు అప్పుడే చెప్పారు' అనడం మనం వింటుంటాం. అంత గొప్ప కాలజ్ఞాని, రాజయోగి, హేతువాది, తత్త్వ వేత్త, మహిమాన్వితుడు, సంఘ సంస్కర్త, దైవ స్వరూపులుగా వినుతికెక్కిన శ్రీ మద్విరాట్ పోతులూరు వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవాలు ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ఆర్ (కడప) జిల్లా మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారి మఠంలో.. ఆదివారం అంగరంగ వైభవంగా ఆరంభం అయ్యాయి. ఇందుకోసం క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

మానవులకు జ్ఞానబోధ చేసి, సన్మార్గంలో నడిపించడం కోసం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన విశ్వబ్రాహ్మణ దంపతులైన ప్రకృతాంబ, పరిపూర్ణయాచార్యులకు ప్రస్తుత ఉత్తరప్రదేశ్‌లోని సరస్వతీ నదీ తీరంలో క్రీ.శ.1608లో జన్మించారు. వెంటనే తల్లిదండ్రులను కోల్పోయారు. అత్రి మహాముని ఆశ్రమంలో శిష్యుడిగా పెరిగారు. కర్ణాటక రాష్ట్రం పాపాగ్ని మఠం (ప్రస్తుతం చిక్‌బళ్లాపూర్ జిల్లాలోని కళవారహల్లిలో ఉన్నది) మఠాధిపతులు యనమదల వీరభోజయాచార్య, వీరపాపమాంబ అనే విశ్వబ్రాహ్మణ వృద్ధ దంపతులు దత్తత తీసుకున్నారు. కొంత కాలానికి వీరభోజయాచార్య సహజ మరణం పొందారు. బ్రహ్మంగారు తన ఎనిమిదవ ఏటనే లోక సంచార నిమిత్తం బయలుదేరారు. తమిళనాడులోని కాంచీపురంలో ఆనందభైరవ యోగికి వీరనారాయణ మహామంత్రం ఉపదేశించారు. అనేక పుణ్యక్షేత్రాలు సందర్శిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా బనగానపల్లె చేరుకున్నారు. అక్కడ గరిమిరెడ్డి అచ్చమ్మ ఇంటిలో గోపాలకుడిగా ఉన్నారు. రవ్వలకొండలోని గుహలో కాలజ్ఞాన రచన చేశారు. కాలజ్ఞాన తాళపత్ర గ్రంథాలు అచ్చమ్మ ఇంటిలో పాతర తీసి భద్రపరిచారు. యాగంటి గుహలో తపస్సు చేశారు. అచ్చమ్మ, వెంకటరెడ్డి దంపతులు బనగానపల్లెలో నిర్మించి ఇచ్చిన నేలమఠంలో అన్నాజయ్యకు కాలజ్ఞానం బోధించారు. అక్కడ ఆత్మలింగాన్ని ప్రతిష్ఠించి లోక సంచార నిమిత్తం మళ్లీ బయలుదేరారు.


వైఎస్ఆర్ జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి క్షేత్రం

దేశ నలుమూలల సంచారం...

వైఎస్ఆర్ (కడప) జిల్లాలోని మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలం అల్లాడుపల్లెలో.. తాను శిల్పీకరించిన శ్రీవీరభద్ర స్వామి శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కందిమల్లాయపల్లెలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలంలోని పెద్దకొమెర్ల గ్రామానికి చెందిన శివకోటయాచార్య పుత్రిక గోవిందమాంబను వివాహం చేసుకున్నారు. ఐదుగురు పుత్రులు, ఒక పుత్రికను సంతానంగా పొందారు. దూదేకుల కులానికి చెందిన సిద్దయ్య, దళితుడైన కక్కయ్యను శిష్యులుగా స్వీకరించారు. శిష్యగణ సమేతంగా దేశ నలుమూలల సంచరించి వేదాంతతత్వ ప్రచారం చేశారు. కలియుగంలో పాపభారం అధికమైనప్పుడు తాను వీరభోగ వసంతరాయులుగా జన్మించి ధర్మసంస్థాపనం గావిస్తామన్నారు. 85 ఏళ్ల వయసులో (1693) వైశాఖ శుద్ధ దశమినాడు సజీవ సమాధి నిష్ఠ వహించారు. నాటి నుంచి జగత్ కల్యాణం కోసం యోగ నిద్ర ముద్రితులై భక్తుల నీరాజనాలు స్వీకరిస్తున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామిచే ప్రసిద్ధి పొందుట చేత కందిమల్లాయపల్లె తర్వాతి కాలంలో బ్రహ్మంగారి మఠంగా పేరు పొందింది.


కాలజ్ఞాని రచించిన తాళపత్రాలు

ఏటా..

స్వామి సజీవసమాధి నిష్ఠ పొందిన వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా ఏటా ఆరాధన, గురుపూజ మహోత్సవాలు ఆరు రోజుల పాటు కనుల పండువగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఈ నెల 4 నుంచి 9 వరకు నిర్వహించనున్నారు. దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రతోపాటు పలు రాష్ట్రాల నుంచి అశేష భక్తజనం తరలి రానున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ అధికారులు, మఠం నిర్వాహకులు, స్వామి శిష్యబృందం ఏర్పాట్లు చేస్తున్నారు.

– వి.మల్లికార్జున ఆచార్య, సాక్షి, కడప

ఉత్సవాలు ఇలా..

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి గురుదేవుడిగా ప్రసిద్ధి చెందారు కావున.. ఏటా ఆయన శిష్య బృందం, భక్తులు.. ఆరాధన, గురుపూజోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 4న ప్రారంభమైన ఉత్సవాలు 9 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా రోజూ ఉదయం శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనం, అభిషేకం, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహిస్తారు. తర్వాత గుడి ఉత్సవం ఉంటుంది. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం హరికథలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బ్రహ్మంగారి నాటకాలు తదితర ప్రదర్శనలు ఉంటాయి. అలాగే గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి రోజూ ఒక్కో వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. 4న శేషవాహనోత్సవం, 5న గజవాహనోత్సవం, 6న నరసంది ఉత్సవం, 7న నంది ఉత్సవం, 8న బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. 7న సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర దినం కావడంతో.. స్వామివారు దీక్షాబంధనాలంకారోత్సవంలో దర్శనమిస్తారు. బ్రహ్మంగారి మాలధారణ చేసిన భక్తులు ఇరుముడి సమర్పిస్తారు. 9న మహాప్రసాద వినియోగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఆత్మదర్శిని

భయానికి మూలం

మన దుఃఖాన్ని మనమే సృష్టించుకుంటున్నాం. ఒక నీటిబుడగను సృష్టించుకుని మనమే అందులో చిక్కుకుంటున్నాం. శరీరము–మనస్సులే నేను అనే భ్రమను కల్పించుకుని సుఖ దుఃఖాల చక్రంలో చిక్కుకునిపోయాం. నీవు శుద్ధచైతన్యంగా ఉన్నప్పుడు దుఃఖమనేదే లేదు. కేవలం సచ్చిదానందమే ఉంది. మనమే నమ్మకాలను కల్పించుకొని భయమని, దుఃఖమని, కుంగుబాటని వేదన చెందుతున్నాం. కొన్ని జన్మల నుంచి నమ్మకాలను బలపరచుకుంటూ వస్తున్నాం. నేను శరీరము–మనస్సు అని నమ్ముతున్నాం. నిజానికి నీవు వ్యక్తివి కావు. ఈ వ్యక్తికి మూలం ఏది? ఆత్మనే మూలం. అది ఆనందనిలయం. మరి దుఃఖం ఎందుకు వచ్చింది అంటే నీవు ఆత్మవని మరచి వ్యక్తిని అని నమ్ముతున్నావు గనుక. చైతన్యానికి ద్వంద్వాలు లేవు. చైతన్యం భిన్నత్వాన్ని అనుభవించటానికి ఒక రూపంలో వ్యక్తమయ్యింది. దానికి నేను అనేది అవసరం. అక్కడ ఎరుక మాత్రమే ఉండాలి. కానీ నేను శరీరం అనే నమ్మకాన్ని కల్పించుకొని తన నిజతత్వాన్ని మరచిపోయింది. సుఖదుఃఖాల్లో కూరుకుపోయింది. ఆలోచనలు, భావోద్వేగాలు, గుర్తింపు, నమ్మకాలు, ఇష్టాఇష్టాలు వంటి వాటితో వ్యక్తి మొదలైనాడు. నిజానికి ఆ చూసేవాడు వ్యక్తే కాదు. వాడికి దుఃఖం, భయం అనేవే లేవు. అది కేవలం సాక్షీ చైతన్యం. కానీ మనం చూసేవాడు, చూడబడేది అనే ఇద్దరుగా తయారైనాము. చూసేవాడు చైతన్యం, చూడబడేది శరీరం–మనస్సు. నేనే శరీరమనే భ్రమ కల్పించుకొని, శరీర అనుభవాలతో కలిసిపోయి రాగద్వేషాలను కల్పించుకొని, భయం, దుఃఖం, కోపం, ద్వేషం అనేవి ఊహించుకుంటున్నాం. నిజమైన నిన్ను ఎవరైనా భయపెట్టగలరా? కేవలం నీ నమ్మకం వల్లనే భయపడుతున్నావు. ఎక్కడికి పారిపోగలవు నీవు? శరీరం–మనస్సులకు మూలమే నీవు. నీవే అనంత చైతన్యం. నిన్ను ఏ సమస్య ఐనా, ఏ రోగమైనా ఏమీ చేయలేదు. శరీరానుభవాలను సాక్షిగా గమనిస్తూ ఉండు. సదా నీ నిజతత్వం పట్ల ఎరుకతో ఉండు. నీవు అనంత శక్తిమంతుడివి. నిత్యం సచ్చిదానందంలో ఉండాలి.



వ్యక్తిగా ఒక చిన్న పరిధినే నేను అనుకున్నప్పుడే భయం, దుఃఖం ఉంటాయి. అప్పుడే నీకు అభద్రత ఉంటుంది. తోడుకావాలి, కుటుంబం కావాలి, స్నేహితులు కావాలి అని కోరుకుంటావు. ఇదంతా భయం వల్లనే. నీవు చైతన్యంగా ఉన్నప్పుడు నీకు ఏమీ అవసరం లేదు. నీవు సంపూర్ణ భద్రతలోనే ఉంటావు. నీకు అవసరమైనవి సమకూరుతూ ఉంటాయి. నేను కర్తను కాను, కర్మను కాను, క్రియను కాను అనే భావనలో ఉండాలి. సాక్షిగా ఉండాలి. నీ ముందున్న జీవితాన్ని సంపూర్ణంగా జీవిస్తూ ఆత్మతత్వంలో ఉండేటప్పుడు నీలో నిరాశ, నిస్పృహ, బాధ, విసుగు లాంటివి ఎలా ఉంటాయి? భిన్నత్వాన్ని అనుభవించటానికే చైతన్యం శరీరరూపాన్ని సంతరించుకుంది. ఆ శరీరమే నేను అనుకోవడం నీ భ్రమ. భిన్నత్వాన్ని యథాతథంగా సాక్షీభావంతో సంపూర్ణంగా ఆస్వాదిస్తూ ఉండాలి.



– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

జిజ్ఞాస

వేంకటేశ్వర సుప్రభాతం కౌసల్యా సుప్రజా రామా అని ఆరంభం కావడంలో అంతరార్థం ..?

ఈ సుప్రభాతం ఈ నాటిది కాదు. ఏడువందల సంవత్సరాలుగా గానం చేస్తున్నాం. సుప్రజ అంటే మంచి బిడ్డ. కౌసల్య ముద్దు బిడ్డ ఐన రామా! అని విశ్వామిత్ర మహర్షి పిలుపు.

రాముణ్ణి మేల్కొలిపేటప్పుడు కౌసల్య మహర్షికి ఎందుకు గుర్తు వచ్చిందో తెలుసుకుందాం. ఆ అమ్మ పెంపకంలో రాముడు లోకాభిరాముడయ్యాడు. ప్రతిరోజూ ఆమె మేలుకొలుపుతో లోకాన్ని చూసేవాడు. ఆ తల్లిని తలచుకుంటూ... ఆమె ముఖం చూస్తూనే రోజూ నిద్ర లేస్తాడు కౌసల్య ముద్దుబిడ్డ రాముడు. శ్రీ రాముడిలో తల్లి పెంపకంలోని ధైర్యం, కర్తవ్య అవ్యగ్రతలను మహర్షి దర్శించాడు. అందుచేత ఆ పిలుపు. ఆ శ్రీ రాముడే ఆ శ్రీ కృష్ణుడే ఈ కలియుగ వైకుంఠంలో ఆర్త రక్షా దీక్షితుడైన శ్రీ వేంకటేశ్వరుడు అని సుప్రభాత దర్శనం చేసుకొనే పుణ్యాత్ములందరికీ తెలియజేస్తూ మీరు ఆ వైకుంఠుణ్ణే ఈ రూపంలో చూడండి! అని సూచిస్తున్నారు వేంకటేశ్వర సుప్రభాతాన్ని రచించిన ప్రతివాది భయంకర హస్తిగిరి(కంచి) నాథన్ అణ్ణన్ ఆచార్యులు. దశావతారాలతో ఈ భువికి వచ్చిన ఆర్తత్రాణ పరాయణుడూ ఈయనే అని జ్ఞప్తి చేశాడాయన.



సాక్షి సినిమా

రిలీజ్ డేట్ ఎప్పుడు?


నితిన్

''ఇవాళ నా పుట్టినరోజు... ఎవరొచ్చినా లోపలికి పంపించు'' అంటూ వచ్చేవాళ్లు చెప్పే శుభాకాంక్షల కోసం ఎగ్జయిటింగ్‌గా ఎదురు చూశారు దర్శకుడు శ్రీరామ్ వేణు. అయితే వచ్చిన లయ, స్వసిక విజయన్, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ 'సినిమా ఎప్పుడు రిలీజ్ చేస్తారు? ప్రమోషన్స్ ఎప్పుడు మొదలుపెడతారు? చెబుతారా చెప్పరా?' అంటూ కాస్తంత కోపంగా అడగడంతో, శ్రీరామ్ వేణు ఖంగు తిన్నారు. పైగా బేబీ శ్రీరామ్ దీత్య అయితే 'నేను థర్డ్ క్లాస్‌లో ఉన్నప్పుడు మూవీ స్టార్ట్ చేశారు, ఇప్పుడు ఫిఫ్త్ క్లాస్ చదువుతున్నా, మూవీ రిలీజ్ డేట్ ఎప్పుడు?' అని అడగడంతో, బర్త్‌డే విషెస్ చెబుతారని ఆశిస్తే, ఇలా షాక్ ఇచ్చేరేంటి అనుకుంటూ సర్ది చెప్పి, పంపించేస్తారు. చివరికి నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్ నవ్వుకుంటూ... శ్రీరామ్ వేణుతో, రిలీజ్‌ది ఏముందీ? కేక్ కట్ చేద్దువుగాని అంటూ, జూలై 4న థియేటర్లలో 'తమ్ముడు' అని రాసి ఉన్న కేక్‌ని కట్ చేయించారు. నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన చిత్రం 'తమ్ముడు'. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు చేశారు. ఆదివారం (మే 4) శ్రీరామ్ వేణు బర్త్ డే సందర్భంగా పైన పేర్కొన్న విషయాలతో తయారు చేసిన ఓ ఫన్నీ వీడియో ద్వారా సినిమాని జూలై 4న రిలీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నిర్మాత తేనెటీగ రామారావు ఇకలేరు



సీనియర్ నిర్మాత జవ్వాజి వెంకట రామారావు అలియాస్ తేనెటీగ రామారావు (68) కన్నుమూశారు. కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధికి చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. రాజేంద్రప్రసాద్ హీరోగా 'తేనెటీగ', నరేశ్, వాణీ విశ్వనాథ్ జంటగా వంశీ దర్శకత్వంలో 'ప్రేమ అండ్ కో', శివకృష్ణ హీరోగా 'బొబ్బిలివేట', 'ఖడి' వంటి స్ట్రెయిట్ సినిమాలు నిర్మించడంతో పాటు పలు డబ్బింగ్ చిత్రాలను రిలీజ్ చేశారు రామారావు. కాగా, సినిమా పరిశ్రమలో ఆయన్ను 'తేనెటీగ' రామారావు అని పిలుస్తారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 'తేనెటీగ' రామారావు మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.


డబుల్ ధమాకా


త్రిష

చిత్ర పరిశ్రమలోకి వచ్చి రెండు దశాబ్దాలు దాటినప్పటికీ బిజీగా దూసుకెళుతున్నారు త్రిష. తెలుగు, తమిళ, మలయాళ సినిమాలతో ఫుల్ స్వింగ్‌లో ఉన్న త్రిష పుట్టినరోజు మే 4న. ఈ సందర్భంగా డబుల్ ధమాకాలా ఆమె నటిస్తున్న 'విశ్వంభర, థగ్ లైఫ్' సినిమాల నుంచి లుక్స్ రిలీజ్ చేశారు మేకర్స్. చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న 'విశ్వంభర'లో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మిస్తున్నారు. ఆదివారం త్రిష పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆమె నటించిన అవని పాత్ర లుక్‌ను రివీల్ చేశారు. అదే విధంగా కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వం వహించిన 'థగ్ లైఫ్' సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటించారు. ఈ మూవీ నుంచి త్రిష పోస్టర్‌ని, అలాగే తొలి సింగిల్ 'జింగుచు...' పాటను కూడా విడుదల చేశారు. ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ పాటకు అనంత్ శ్రీరామ్ సాహిత్యంగా అందించగా, శ్రీకృష్ణ, మంగ్లీ, ఆశిమా మహాజన్, వైశాలీ సామంత్ ఆలపించారు. ఈ సినిమా జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

హద్దులు చెరిపేసిన 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్'

– కేంద్ర మంత్రి మురుగన్



కేంద్ర మంత్రి మురుగన్‌తో ఐ అండ్ బి కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు

గడచిన 2024–25లో దేశంలో సెన్సారైన భారతీయ ఫీచర్‌ఫిల్మ్‌ల సంఖ్య ఎంతో తెలుసా? అక్షరాలా 3,445. నలభై ఏళ్ళ పైచిలుకు క్రితం 1983లో మన వద్ద కేవలం 741 చిత్రాలు సెన్సారైతే, అంతకు సుమారు అయిదురెట్లు ఎక్కువగా ఇప్పుడు సెన్సార్ జరుపుకున్నాయి. ఆ స్థాయిలో చిత్ర నిర్మాణం పెరిగింది. సెన్సార్ విధానం ఆరంభమైనప్పటి నుంచి ఇప్పటి దాకా సెన్సారైన మొత్తం భారతీయ చిత్రాల సంఖ్య – 69,113. ఒకప్పుడు 2001లో ప్రైవేట్ ఎఫ్.ఎంలు కేవలం నాలుగే ఉంటే, గత ఏడాదికి అది 388కి పెరిగింది. ఇక, ఇరవయ్యేళ్ళ క్రితం 2004–05లో దేశంలో ప్రైవేట్ టీవీ ఛానళ్ళ సంఖ్య 130 ఉంటే, ఇప్పుడది 908కి చేరింది. కమ్యూనిటీ రేడియో స్టేషన్లు సైతం 15 నుంచి 531కి హెచ్చాయి. ఇలాంటి విశేషాలెన్నో ఉన్న హ్యాండ్‌బుక్‌ను కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ విడుదల చేశారు. ముంబైలో ఆదివారంతో ముగిసిన నాలుగు రోజుల 'వరల్డ్ ఆడియో – విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్' (వేవ్స్)–2025లో భాగంగా ఆయన ప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రూపొందించిన నివేదికల్ని జనం ముందుంచారు.

భారత ఆర్థిక వ్యవస్థపై సినిమా, టీవీ, స్ట్రీమింగ్ రంగాల పరిణామశీల ప్రభావాన్ని వివరిస్తూ, అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక 'మోషన్ పిక్చర్ అసోసియేషన్' (ఎంపీఏ) రూపొందించిన సమగ్ర నివేదికను సైతం మంత్రి ఆవిష్కరించారు. ''భాషలు, ప్రాంతాల సరిహద్దులకు అతీతంగా భారతీయ కథలు అందరినీ అలరిస్తాయని మన 'బాహుబలి', 'ఆర్.ఆర్.ఆర్' లాంటి చిత్రాలు నిరూపించాయి. భారతీయ సినిమా ఇవాళ ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, ప్రభావం చూపుతున్నాయి'' అని మంత్రి వ్యాఖ్యానించారు. ఎంపీఏ ఛైర్మన్ – సీఈఓ అయిన ఛార్లెస్ రివ్‌కిన్, ''భారత సినీ, టీవీ, ఆన్‌లైన్ వీడియో సర్వీస్‌ల (స్ట్రీమింగ్) పరిశ్రమల వల్ల 26.4 లక్షల మందికి ఉద్యోగాలు, 6.12 వేల కోట్ల డాలర్లకు పైగా వార్షిక రాబడి లభిస్తోంది'' అని వివరించారు.

25 శాతం వ్యూస్ ఓవర్సీస్‌లోనే!

నేడు డిజిటల్ క్రియేషన్ వేగంగా పెరుగుతున్న భారత్‌లో 20 నుంచి 25 లక్షల మంది క్రియాశీలక డిజిటల్ క్రియేటర్స్ ఉన్నారు. వారు 35 వేల కోట్ల డాలర్లకు పైగా వినియోగదారుల వార్షిక వ్యయం జరిగేలా ప్రభావితం చేస్తున్నారు. నిపుణులు పెద్ద సంఖ్యలో ఉన్నందున, ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో యానిమేషన్, వీఎఫ్ఎక్స్ సేవలు 40 నుంచి 60 శాతం చౌక అని నివేదికల్లో పేర్కొన్నారు. తెరపై భారతీయ కథాకథనాలకు ఎంతటి ప్రాచుర్యమంటే, ఇవాళ మన ఓటీటీ కంటెంట్‌లో దాదాపు 25 శాతం దాకా వ్యూస్ విదేశీ వీక్షకుల నుంచే వస్తున్నాయి. ''అందుకే, సినిమా కేవలం ఆర్థిక వ్యవహారమే కాదు, దేశాల మధ్య దౌత్య, సాంస్కృతిక వారధి కూడా'' అని మంత్రి అభిప్రాయపడ్డారు.


హిమేశ్ రేషమియా

సాధనతోనే సాఫల్యం: ''ఒకప్పుడు అవకాశాలు చాలా తక్కువ. కానీ, ఇవాళ కొత్తవాళ్ళు తమ ప్రతిభను ప్రదర్శించడానికి స్వతంత్ర వేదికలతో పాటు సోషల్ మీడియా ఉంది. అయితే, ఔత్సాహికులకు సాధన అవసరం. ఎప్పటికప్పుడు తమ సంగీత పోర్ట్ ఫోలియోను సిద్ధంగా ఉంచుకొని, మెరుగులు దిద్దుకుంటేనే పైకొస్తారు. తమ గాత్రం, సంగీతం రెండూ నాణ్యంగా ఉండేలా చూసుకొంటేనే జనానికి నచ్చుతుంది. పరిశ్రమలో గుర్తింపు దక్కుతుంది.'' – 'వేవ్స్'లో ప్రముఖ గాయకుడు, మ్యూజిక్ కంపోజర్ హిమేశ్ రేషమియా

డిజిటల్‌కూ తప్పని తలనొప్పి!: థియేటర్లలోని సినిమాలకే కాదు... డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థకు సైతం పెనుభూతంగా మారిన పైరసీ సమస్య పైనా వేవ్స్‌లో చర్చ సాగింది. అందరూ సమన్వయంతో, బహుముఖంగా పోరాడితేనే దాన్ని అరికట్టవచ్చని మీడియా, లా, సైబర్ సెక్యూరిటీ రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. 2025 నుంచి 2029 మధ్య వచ్చే అయిదేళ్ళలో ఆన్‌లైన్ పైరసీ వల్ల పరిశ్రమ ఆదాయంలో 10 శాతం పైగా పోతుందనీ, అదే సమర్థంగా యాంటీ పైరసీ చర్యలు తీసుకోగలిగితే లీగల్ వీడియో సర్వీస్ యూజర్ల ఆదాయం 25 శాతం పెరుగుతుందనీ నిపుణులు అంచనా వేశారు. పైరసీ నివారణ చర్యలు కీలకమనీ, పైరసీదారులను ప్రాసిక్యూట్ చేయడంలోని ఇబ్బందుల్ని పరిష్కరించాలనీ పేర్కొన్నారు. కాగా, రానున్న జూలైలో సీబీఐ, ఇంటర్‌పోల్ సాయంతో ఐఎస్బీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డేటా సైన్స్ సంస్థ ప్రత్యేకంగా 'డిజిటల్ పైరసీ సమ్మిట్'ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

– సాక్షి ప్రత్యేక ప్రతినిధి

చేయకే పరేషాను...


రాశీ సింగ్, రాజ్ తరుణ్

'జానూ మేరీ జానూ...' అని పాడేస్తున్నారు రాజ్ తరుణ్. ఆయన హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పాంచ్ మినార్'. ఈ చిత్రంలో రాశీ సింగ్ హీరోయిన్. గోవింద రాజు సమర్పణలో మాధవి, ఎమ్ఎస్ఎమ్ రెడ్డి నిర్మించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'జానూ మేరీ జానూ...' అంటూ సాగే పాటని ఆదివారం రిలీజ్ చేశారు. శ్రీహర్ష ఈమని సాహిత్యం అందించిన ఈ పాటని వినాయక్ పాడారు. 'జానూ మేరీ జానూ.. చేయకే పరేషాను...' అంటూ ఈ పాట సాగుతుంది. ''క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'పాంచ్ మినార్'. త్వరలో విడుదలకి సన్నాహాలు చేస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఇది బ్లాక్ బస్టర్ పేలుడు


ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో జపనీస్ చిత్రం బుల్లెట్ ట్రైన్ ఎక్స్‌ప్లోజన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

భాష ఏదైనా సరైన భావం పలికించి చూపించేది సినిమా. అందులో డబ్బింగ్ వల్ల ప్రపంచంలోని ఏ మూల సినిమా అయినా మన భాషలో చూస్తుంటే మన చుట్టూ జరిగిన కథే అన్న భావన కలుగుతుంది. మరీ ముఖ్యంగా థ్రిల్లర్ జోనర్ చిత్రాలు ఇట్టే ఆకట్టుకుంటాయి. ఆ కోవకి చెందినదే ఇటీవల నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైన జపనీస్ సినిమా 'బుల్లెట్ ట్రైన్ ఎక్స్‌ప్లోజన్'. ఈ సినిమా ఓ బ్లాక్ బస్టర్ పేలుడు అనొచ్చు. ఈ మూవీ వల్ల మనకు రెండు అనుభూతులు కలుగుతాయి. ఇండియాలో త్వరలో బుల్లెట్ ట్రైన్ పరిగెత్తబోతోంది. ఆ బుల్లెట్ ట్రైన్ అనుభూతిని ఈ చిత్రం ద్వారా అనుభవించవచ్చు. అలాగే జపాన్ దేశంలోని ట్రైన్ స్టేషన్, ట్రైన్ నంబర్లు కూడా మనం ఈ సినిమా ద్వారా గుర్తు పెట్టుకోవచ్చు. బుల్లెట్ ట్రైన్ ఎంత స్పీడ్ ఉంటుందో అంతకు రెండింతలు ప్రేక్షకులు ఈ సినిమాని చూసి థ్రిల్ ఫీలవుతారు. అంతలా ఈ సినిమాలో ఏముందంటే... కథ ప్రకారం ట్రైన్ నెంబర్ 5060బి షిన్ అమోరి నగరం నుండి జపాన్ రాజధాని టోక్యోకి బయలుదేరుతుంది. ఈ ట్రైన్‌లో కజుయాతకైబి ఫస్ట్ లైన్ మేనేజర్‌గా ఉంటాడు. ట్రైన్ బయలుదేరిన కొద్ది నిమిషాలకే ఓ అగంతకుడు స్టేషన్‌కు ఫోన్ చేసి, ట్రైన్‌లో బాంబు పెట్టామని, ట్రైన్ 120 కిలోమీటర్ల స్పీడ్ తగ్గకుండా వెళితేనే బాంబు పేలకుండా ఉంటుందని బెదిరిస్తాడు. ఆ బాంబు తీయాలంటే తనకు 100 బిలియన్ల డబ్బు అప్పజెప్పాలని కండిషన్ పెడతాడు. 2 గంటల 14 నిమిషాల నిడివి ఉన్న ఈ సినిమా దాదాపు ట్రైన్‌లోనే నడుస్తుంది. మరి... ఆగకుండా వెళుతున్న ట్రైన్ పేలిపోతుందా లేదా మేనేజర్ ఆపగలుగుతాడా అన్నది తెలియాలంటే 'బుల్లెట్ ట్రైన్ ఎక్స్‌ప్లోజన్' సినిమా చూడాలి. 1994వ దశకంలో వచ్చిన హాలీవుడ్ సినిమా 'స్పీడ్'ని పోలి ఉంటుందీ సినిమా. కానీ ఈ చిత్రం క్లైమాక్స్ సూపర్ హైలైట్. ప్రేక్షకులకు మంచి థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఈ సినిమా ఉంటుంది.



– హరికృష్ణ ఇంటూరు

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 43
సోమవారం 5-5-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



కోల్‌కతా బతికిపోయింది

రాజస్తాన్ రాయల్స్‌పై ఒక్క పరుగు తేడాతో నెగ్గిన నైట్‌రైడర్స్ -14లో



బఫెట్ వారసుడొచ్చాడు..

బెర్క్‌షైర్ సీఈవోగా గ్రెగ్ అబెల్‌కు బాధ్యతలు -15లో



కాస్మిక్ బోన్‌కు పగుళ్లు

భూమి నుంచి 26 వేల కాంతి సంవత్సరాల దూరంలోఉన్న జీ359.13 అనే కాస్మిక్ బోన్‌కు పగుళ్లు వచ్చినట్లు గుర్తించారు.

వివరాలు 6లో ▸



నిరాఘాటంగా 15 గంటలు..

మాల్దీవ్స్ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు (46) ఏకంగా 15 గంటలపాటు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు!

వివరాలు 6లో ▸



ఆ మృతుల్లో పురుషులే ఎక్కువ!

పురుషులతో పోలిస్తే మహిళల ఆయుర్దాయం ఎక్కువగా ఉంటోంది. అనారోగ్యంతో మరణిస్తున్న వారిలో పురుషులే ఎక్కువ ఉంటున్నారు.

వివరాలు 6లో ▸



ఇస్రో 'డాగ్‌ఫైట్' సక్సెస్

అంతరిక్షంలో ఇస్రో డాగ్‌ఫైట్ విన్యాసాన్ని విజయవంతంగా పూర్తిచేసి అసాధారణ రీతిలో సత్తా చాటింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని కన్నుమూత



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మాటూరి గిరిజాప్రియదర్శిని కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు తుదిశ్వాస విడిచారు.

- వివరాలు 2లో▶

మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదు



'మావోయిస్టులతో మాటల్లేవు.. మాట్లాడుకోవడాల్లేవ్. నిషేధిత సంస్థతో చర్చల ప్రసక్తే లేదు. వారు తుపాకీ వీడాల్సిందే.. పోలీసులకు లొంగిపోవాల్సిందే'అని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

- వివరాలు 7లో▶

పదిరోజుల్లో ఈఏపీ సెట్ ఫలితాలు !



ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీఈఏపీసెట్ ఫలితాలు పది రోజుల్లో విడుదల కానున్నాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ పరీక్షల మూల్యాంకనం 3 రోజుల్లో పూర్తవుతుంది.

- వివరాలు 3లో▶

డాల్ఫిన్లు ఏమంటున్నాయి?



'డాల్ఫిన్‌జెమ్మా' అనే డాల్ఫిన్ ఏఐ మోడల్‌ను (సాఫ్ట్‌వేర్‌ను) భుజాన వేసుకుని 'గూగుల్' సముద్ర పరిశోధనలు చేస్తోంది! డాల్ఫిన్‌లతో మాటలు కలపటానికి వాటి అరుపులను అనుకరిస్తోంది. ఆ అరుపుల అర్థాలను డీకోడ్ చేయవచ్చని భావిస్తోంది.

- వివరాలు 16లో▶

ఇదండీ సంగతి



మనమేమో పుష్కలంగా టెర్రరిస్టులను దిగుమతి చేసుకున్నాం. ఇక మన వస్తువులను ఎవరు దిగుమతి చేసుకుంటారు!

నిప్పుకు తెలుసు.. నీళ్లు రావని..



హైదరాబాద్‌లో పెరుగుతున్న బహుళ అంతస్తుల భవనాలు

50 అంతస్తులకు మించి నిర్మాణాలు

18 అంతస్తుల వరకే మన అగ్నిమాపక శాఖ ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ

- ఆపై అంతస్తుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే పరిస్థితేంటి..?
- భవనాల్లోని సొంత రక్షణ వ్యవస్థే కీలకం అంటున్న అధికారులు
- ఢిల్లీ, ముంబై నగరాల్లో అగ్నిమాపక శాఖ వద్ద 50 అంతస్తులకు సరిపడా ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ
- రాష్ట్రంలోనూ ఆధునిక వ్యవస్థ అత్యవసరమంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ విశ్వనగరంలా మారుతోంది. సిటీ నలువైపులా శరవేగంగా విస్తరిస్తోంది. ఆకాశాన్నంటుతున్నాయా..అన్నట్టుగా బహుళ అంతస్తుల భవనాలు పెరిగిపోతున్నాయి. 50 అంతస్తులకు మించి కూడా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. నగర అభివృద్ధికి చిహ్నాలుగా నిలుస్తున్న ఈ ఆకాశ హర్మ్యాలు.. అంతర్జాతీయంగా హైదరాబాద్ ఖ్యాతిని మరింత పెంచుతున్నాయి. ఇదంతా బాగానే ఉంది. మరి ఈ బహుళ అంతస్తుల భవనాలు ఎంతవరకు భద్రం? ముఖ్యంగా ఏ కారణంతోనైనా, ఊహించని విధంగా ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటి? ప్రమాదాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు తగిన వ్యవస్థ వాటిల్లో ఉంటోందా? మన అగ్నిమాపక శాఖ సామర్థ్యం ఎంతవరకు ఉంది? 40–50 అంతస్తుల వరకు కూడా మంటలను ఆర్పగలిగే, వాటిల్లో ఉండే వారిని రక్షించగలిగే అధునాతన అగ్నిమాపక పరికరాలు ఉన్నాయా? అనే ప్రశ్నలకు సమాధానాలు

మిగతా 2వ పేజీలో ▶

హైరైజ్ బిల్డింగుల్లో ఉండాల్సినవేమిటి?

- నేషనల్ బిల్డింగ్ కోడ్ (ఎన్‌బీసీ) ప్రకారం.. ఎత్తైన భవనాల్లో స్మోక్ డిటెక్టర్లు, వాటర్ స్ప్రింక్లర్లు, ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ సిస్టమ్ (తక్షణ రక్షణ వ్యవస్థ), తగిన నీటి సరఫరా సౌకర్యం, ఫైర్ పంపులు, ఫైర్ ఎస్కేప్ మార్గాలు, ఫైర్‌మెన్ లిఫ్ట్, సర్వీస్ షాఫ్ట్ ఎన్‌క్లోజర్లు, ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ తప్పక ఉండాలి. నివాస సముదాయాలైనా, ఇతర భవనాలైనా ఇవన్నీ తప్పనిసరి. ఇలా అన్ని దశల్లోనూ అగ్నిమాపక వ్యవస్థ సరిగా ఉందా? లేదా? అన్నది అత్యంత కీలకం.

వ్యవస్థ ఇలా పనిచేయాలి

- భవనం ఎత్తు ఆధారంగా పెద్ద పెద్ద ఎలక్ట్రిక్ పంపులు, నీటిని చల్లేలా పూర్తి వ్యవస్థ ఉండాలి. ప్రమాదం జరిగిన వెంటనే ఈ ఎలక్ట్రిక్ పంపులు పనిచేయడం ప్రారంభం కావాలి.
- ఒకవేళ విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రత్యామ్నాయంగా జనరేటర్ల వ్యవస్థ కూడా ఉండాలి. ఇదీ పని చేయకపోతే డీజిల్ పంపు కూడా అందుబాటులో ఉండాలి. ఇవన్నీ కూడా కనీసం రెండు గంటల పాటు మంటలను నిలువరించి, నివాసితులు సురక్షితంగా బయట పడేందుకు వీలుగా ఉండాలి.

సమావేశంలో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్. చిత్రంలో ఏలూరు శ్రీనివాసరావు, మధుసూదన్ రెడ్డి, ఇతర సంఘాల నేతలు



ఇక సమరమే

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పోరుబాట

- సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ప్రత్యక్ష కార్యాచరణ
- ఈ నెల 15 నుంచి జిల్లా కేంద్రాల్లో ధర్నాలు
- జూన్ 9న హైదరాబాద్‌లో 50 వేల మంది ఉద్యోగులతో మహాధర్నా
- వర్క్ టు రూల్, పెన్ డౌన్, సామూహిక సెలవులతో సర్కారుపై ఒత్తిడి
- 16 నెలలు వేచి చూసినా ఫలితం లేకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఆందోళనల బాట అంటున్న నేతలు

3లో

జేఏసీ తీర్మానాలు ఇవీ...

- పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.9 వేల కోట్ల బిల్లులు యుద్ధప్రాతిపదికన క్లియర్ చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాలను తక్షణమే విడుదల చేయాలి.
- ఆరోగ్య రక్షణ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలుచేయాలి.
- కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.
- పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని 51శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలి.
- స్థానికత ప్రాతిపదికగా అదనపు పోస్టులు సృష్టించి జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలి.
- రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పదోన్నతుల కమిటీలను సకాలంలో ఏర్పాటు చేసి ప్రమోషన్లు ఇవ్వాలి.
- ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులకు తిరిగి పూర్వ ప్రాంతాల్లో పోస్టింగులు ఇవ్వాలి.
- 2025 సంవత్సరానికి సంబంధించి ఉద్యోగుల సాధారణ బదిలీలను మే/జూన్‌లోనే నిర్వహించాలి

ఆర్టీఐ కమిషనర్ల నియామకానికి బ్రేక్

- ప్రభుత్వ సిఫారసులను పెండింగ్‌లో పెట్టిన గవర్నర్
- అనర్హులను సిఫారసు చేశారని ఫిర్యాదులు అందడంతో చర్యలు
- ప్రభుత్వం నుంచి వివరణ కోరనున్న రాజ్‌భవన్
- కొందరి పేర్లు మినహా మిగిలిన వారిని ఆమోదించే అవకాశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సమాచార కమిషన్‌లో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, ఇతర సమాచార కమిషనర్ల భర్తీ ప్రక్రియకు బ్రేక్ పడింది. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు సమాచార కమిషనర్ల నియామక ప్రతిపాదనలను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం కోసం గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపించింది. కొందరు అభ్యర్థుల అర్హతల విషయంలో ఫిర్యాదులు అందడంతో సంబంధిత

మిగతా 2వ పేజీలో ▶

సైబర్ సిలబస్


సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు సరికొత్త కమాండో విధానం

పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు సిలబస్ రూపొందించిన ఐఐటీలు

నేరం జరిగిన క్షణాల్లోనే క్రిమినల్స్‌ను గుర్తించేలా శిక్షణ

ఐదేళ్లలో 500 మంది సైబర్ కమాండోల తయారీ లక్ష్యం

కాన్పూర్, మద్రాస్ ఐఐటీలతో పాటు కొట్టాయం, నయారాయపూర్ ఐఐఐటీల సహకారం



సాక్షి, హైదరాబాద్: వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి అంటారు. దేశంలో పేట్రేగిపోతున్న సైబర్ కేటుగాళ్లకు అదే సైబర్ టెక్నాలజీతో చెక్ పెట్టే సరికొత్త వ్యవస్థ రూపుదిద్దుకోబోతోంది. ఇందుకోసం అన్ని రాష్ట్రాల నుంచి సైబర్ నేరాల దర్యాప్తులో చలాకీగా ఉన్న పోలీసులను గుర్తించి, ప్రత్యేక సైబర్ క్లాసులు చెప్పబోతున్నారు. దేశంలో సాంకేతిక విద్యలో అత్యున్నత సంస్థలైన పలు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) లు, ట్రిపుల్ ఐటీలు ఈ దిశగా కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలు తీసుకోబోతున్నాయి. పోలీసులకు ఇవ్వాల్సిన సైబర్ శిక్షణతో కూడిన పాఠ్యాంశాల సిలబస్‌ను ఐఐటీలే రూపొందించాయి. 4 వేల మంది డిజిటల్ అనలిస్టులు, 6 వేల మంది అంతర్జాతీయ సైంటిస్టులు, 500 మంది ఐఐటీ టాపర్స్ కలిసి డిజిటల్ కమాండో వ్యవస్థను బలోపేతం చేసేందుకు నడుం బిగించారు.

అదుపు లేని మోసం: ప్రపంచవ్యాప్తంగా జరిగే డిజిటల్ లావాదేవీల్లో 47 శాతం భారత్‌లోనే జరుగుతున్నాయి. తాజా గణాంకాల ప్రకారం ఏడాదిలోనే రూ.20.68 లక్షల కోట్ల డిజిటల్ లావాదేవీలు జరిగాయి. అయితే, ఇదే స్థాయిలో

మిగతా 2వ పేజీలో ▶

నిర్మల్ కొయ్య బొమ్మ..
పోచంపల్లి చీర..
చేర్యాల పెయింటింగ్..

మిస్ వరల్డ్‌లో మన హస్తకళలు!

- ప్రత్యేకంగా పోటీల్లో వాటికి సంబంధించిన ప్రశ్నలు..
- ఇందుకోసం పోటీదారులకు హస్తకళలపై అవగాహన
- 21న శిల్పారామంలో లైవ్ డెమానిస్ట్రేషన్
- కళాకారులతో సుందరీమణులకు మెళకువలు



సాక్షి, హైదరాబాద్: నిత్యం ఫ్యాషన్ ప్రపంచంలో మునిగితేలే సుందరీమణులు నిర్మల్ కొయ్య బొమ్మలను చెక్కనున్నారు.. పోచంపల్లి చీరల తయారీకి పోగులు సిద్ధం చేయబోతున్నారు. చేర్యాల పెయింటింగ్స్‌కు రంగులద్దనున్నారు.. ఇలా ఒకటేమిటి తెలంగాణ సంప్రదాయ హస్తకళలకు సంబంధించి కాసేపు 'కళాకారులు'కాబోతున్నారు. పోటీలో భాగంగా తెలంగాణ హస్తకళలపై ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వబోతున్నారు. 'ప్రపంచ సుందరి'72వ ఎడిషన్ పోటీలకు వేదికైన హైదరాబాద్ కొత్త 'అందం'తో తళుకులీనుతోంది. ఇప్పటికే కొన్ని దేశాలకు చెందిన పోటీదారులు నగరానికి చేరుకోగా, మరి కొందరు సోమ, మంగళవారాల్లో వస్తున్నారు. వీరి రాకకు దాదాపు వారం ముందే మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ, చైర్‌పర్సన్ జూలియా మోర్లే తన సిబ్బందితో నగరానికి చేరుకున్నారు. హైటెక్‌సిటీ సమీపంలోని ట్రైడెంట్ స్టార్ హోటల్‌లో ఆమె తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పోటీల నిర్వహణ పూర్తిగా మిస్ వరల్డ్ లిమిటెడ్ కనుసన్నల్లోనే జరగనుంది. పోటీల షెడ్యూల్, ఇతివృత్తాలను ఆ సంస్థే నిర్ణయించింది. రాష్ట్రప్రభుత్వ

మిగతా 7వ పేజీలో ▶

స్టాళ్లు చూసి ఆసక్తి..

మార్చి 20న మిస్ వరల్డ్ పోటీల వివరాలను తొలిసారి జూలియా మోర్లే పర్యాటక భవన్‌లో మీడియాకు వెల్లడించారు. మిస్ వరల్డ్–2024 విజేత, చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రిస్టీనీ పిజ్కోవా కూడీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి స్వాగతం పలికేందుకు తెలంగాణ హస్తకళలను స్వయంగా రూపొందిస్తూ కళాకారులతో స్టాళ్లు ఏర్పాటు చేశారు. వాటిని జూలియా, క్రిస్టీనీ ఎంతో ఆసక్తిగా తిలకించారు. క్రిస్టీనా పిజ్కోవా అయితే కాసేపు మగ్గం మీద కూర్చుని పోచంపల్లి చీర అల్లికను పరిశీలించారు. అప్పుడే వీటిపై మిస్‌వరల్డ్ సీఈఓకు ప్రత్యేకాసక్తి కలిగిందని సమాచారం. ఆమె సూచనతో అధికారులు ప్రత్యేకంగా వాటి లైవ్ డెమానిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు చేశారు. చేర్యాల స్క్రోల్ పెయింటింగ్స్, నిర్మల్ చిత్రకళ, నిర్మల్ కొయ్య బొమ్మలు, బిద్రివేర్, బంజారా ఎంబ్రాయిడరీ, పోచంపల్లి, కొత్తకోట, నారాయణపేట, గద్వాల హ్యాండ్‌లూమ్స్, పెంబర్తి ఇత్తడి బొమ్మలు, సిల్వర్ ఫిలిగ్రీ, సిద్దిపేట గొల్లభామ చీరలు, నకాషీ, మట్టికుండల తయారీ, కళంకారీ.. ఇలా పలు కళలకు సంబంధించిన ఏర్పాట్లు చేయటం విశేషం.

నీట్ పరీక్ష కేంద్రం వద్ద తన చెవికి ఉన్న కమ్మలను తీసి ఇస్తున్న విద్యార్థిని



బయాలజీ ఈజీ... ఫిజిక్స్ టఫ్

ముగిసిన నీట్ యూజీ–2025

రాష్ట్రవ్యాప్తంగా 190 కేంద్రాల్లో పరీక్ష

సాక్షి ఎడ్యుకేషన్: ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్)– యూజీ (అండర్ గ్రాడ్యుయేట్) ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ పెన్–పేపర్ (ఓఎంఆర్ షీట్) విధానంలో పరీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా 550 పట్టణాల్లో 5వేలకుపైగా కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. దాదాపు 22.7 లక్షల మంది నీట్ యూజీ– 2025కు

మిగతా 7వ పేజీలో ▶

శ్రీనగర్‌లో సైనికుడి పహారా



అవే ఉద్రిక్తతలు

- పదో రోజూ కొనసాగిన పాక్ కాల్పులు
- మోదీతో ఎయిర్‌ఫోర్స్ చీఫ్ కీలక భేటీ
- త్వరలో తగిన సమాధానం: రాజ్‌నాథ్
- ప్రజలు కోరేదే జరుగుతుందన్న మంత్రి

6లో

అవే ఉద్రిక్తతలు. అదే ఉత్కంఠ. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్, పాక్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు ఏమాత్రం చల్లారడం లేదు. దాయాది కవ్వింపు చర్యలు ఆగడం లేదు. నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం వరుసగా పదో రోజూ కాల్పులకు తెగబడింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం దాకా జమ్మూ కశ్మీర్‌లో కుప్వారా, పూంచ్, రాజౌరీ, మేంధార్, నౌషేరా, సుందర్బనీ, అఖ్నూర్ తదితర 8 ప్రాంతాల్లో కాల్పులు చోటుచేసుకున్నాయి. వాటిని సైన్యం గట్టిగా తిప్పికొట్టింది. వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాలు, భారత్–పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై చర్చించారు.

మూడింట ఒక వంతు రుణమే

- డిజిటల్ చెల్లింపుల్లో సరికొత్త ట్రెండ్
- ఖర్చుల కోసం స్వల్పకాలిక రుణం
- సులభ వాయిదాల్లో చెల్లింపులు
- 'ఫి'కామర్స్ తాజా నివేదికలో వెల్లడి




ఫిన్‌టెక్ రంగంలో ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న విని యోగదారుల ప్రాధాన్యాలు, ప్రభుత్వ చొరవ.. వెరసి భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ వేగంగా మారుతోంది. డిజిటల్ పేమెంట్స్‌లో క్రెడిట్ (రుణ) ఆధారిత చెల్లింపుల వాటా దాదాపు మూడింట ఒకవంతుకు చేరడం విశేషం. ఒకేసారి చెల్లింపులు చేయడం కంటే రుణాలను సులభ వాయిదాల్లో చెల్లించడానికే కస్టమర్లు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. క్రెడిట్ కార్డులు లేదా వడ్డీతో కూడిన ఈఎంఐల ద్వారా పేమెంట్స్ కానిచ్చేస్తున్నారని ఫిన్‌టెక్ కంపెనీ 'ఫి'కామర్స్ నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా 20,000 మందికిపైగా వ్యాపారుల నుంచి విశ్లేషించిన లావాదేవీల సమాచారం ఆధారంగా భారత్‌లో 2024లో జరిగిన చెల్లింపుల తీరుతెన్నులపై ఈ నివేదిక రూపొందించినట్టు కంపెనీ తెలిపింది.

సాక్షి, స్పెషల్ డెస్క్

చిన్న, మధ్యస్థ విలువ కలిగిన లావాదేవీలలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఆధిపత్యం చెలాయిస్తుండగా.. అధిక విలువ కలిగిన కొనుగోళ్లు ఎక్కువగా క్రెడిట్ కార్డులు, ఈఎంఐల (నెలవారీ సులభ వాయిదాలు) ద్వారా జరుగుతున్నాయి.అంటే అధికంగా ఖర్చు చేయాల్సిన సందర్భాల్లో వినియోగదారులు స్వల్పకాలిక రుణాలపై ఆధారపడుతున్నారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, వాహనాలు, వాహన అనుబంధ రంగాలు డిజిటల్ క్రెడిట్ స్వీకరణలో బలమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయి. పండుగ షాపింగ్, పాఠశాల అడ్మిషన్లు, కాలానుగుణ పోకడలు క్రెడిట్ వినియోగంలో పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఇక దేశవ్యాప్తంగా 2024లో జరిగిన రోజువారీ మొత్తం చెల్లింపులలో లావాదేవీల సంఖ్య పరంగా యూపీఐ 65 శాతం వాటాతో తన హవాను ప్రదర్శిస్తోంది. ఈఎంఐలు 20%, క్రెడిట్ కార్డ్స్10%, నెట్ బ్యాంకింగ్ 3%, నేరుగా బదిలీ 2% నమోదయ్యాయి.

అధిక విలువకు క్రెడిట్..





నిప్పుకు తెలుసు.. నీళ్లు రావని..

▶ మొదటి పేజీ తరువాయి

కొంత ఆందోళన కలిగించే విధంగానే ఉన్నాయి. ఇప్పుడున్న అరకొర రక్షణ వ్యవస్థలు, ఆయా భవనాల్లోని సొంత భద్రతా ఏర్పాట్లు, వాటి పర్యవేక్షణ పరిగణనలోకి తీసుకుంటే హైరైజ్ నివాస, వాణిజ్య సముదాయాలన్నీ ఒకింత డేంజర్‌లో ఉన్నట్టుగానే చెప్పాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్ విశ్వనగరంలా మారుతున్నా.. రాష్ట్ర అగ్నిమాపక శాఖ వద్ద కేవలం 18 అంతస్తుల వరకు మాత్రమే ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ ఉన్న నేపథ్యంలో ఆపై అంతస్తుల్లో ప్రమాదం జరిగితే కష్టమేనని, ఆయా భవనాల్లో ఉన్న సొంత రక్షణ వ్యవస్థపైనే అంతా ఆధారపడి ఉంటుందని అంటున్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో ప్రమాదాలను ఎదుర్కోవడానికి అగ్నిమాపక శాఖ సన్నద్ధత ఎంత?, భవనాల్లో ఎలాంటి రక్షణ వ్యవస్థ ఉండాలి? పర్యవేక్షణ మాటేమిటి? యాజమానుల బాధ్యతలేమిటి? తదితర అంశాలపై 'సాక్షి'ప్రత్యేక కథనం.

జీ ప్లస్ 5 దాటితే అనుమతి తప్పనిసరి

హైదరాబాద్‌లో జీ ప్లస్ 5 అంతస్తులకు (నివాస సముదాయాలు) పైబడిన భవనాలన్నిటికీ అగ్నిమాపక శాఖ అనుమతి తప్పనిసరి. అదే వాణిజ్య, ఇతర భవనాలు జీ ప్లస్ 4 మించితే అగ్నిమాపక శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నగరంలోని అన్ని హైరైజ్ భవనాలకూ అగ్నిమాపక శాఖే అనుమతులు ఇస్తోంది. భవనం డిజైన్, నిర్మాణం, తర్వాత ఆక్యుపెన్సీ తదితర అన్ని సందర్భాల్లో అన్నీ పరిశీలించాకే ఎన్‌ఓసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) మంజూరు చేస్తున్నారు. ఒకసారి ఎన్‌ఓసీ వచ్చిన తర్వాత యజమానులు ఐదేళ్లకు ఒకసారి దాన్ని రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా భవనాల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించిన తర్వాతే అధికారులు రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. అయితే అనుమతులు మంజూరు చేస్తున్న అధికారులు, ఆ తర్వాత పూర్తిస్థాయిలో పర్యవేక్షించడం లేదనే విమర్శలున్నాయి. అగ్నిమాపక శాఖలో దాదాపు 40 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉండడం ఈ పరిస్థితికి కారణమనే వాదన ఉంది. ప్రతి నెలా 11వ తేదీన జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి (ఏడీఎఫ్‌ఓ), 23న డీఎఫ్‌ఓలు భవనాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తుంటారు. సిబ్బంది కొరత నేపథ్యంలో భవనాల సంఖ్య మేరకు తనిఖీలు ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి.



మన అగ్నిమాపక శాఖ సన్నద్ధత ఎలా ఉంది?

తెలంగాణ మొత్తం కలిపి 147 ఫైర్ స్టేషన్లు ఉన్నాయి.. జీహెచ్‌ఎంసీ పరిధిలో 34 ఫైర్ స్టేషన్లు, 3 అవుట్ పోస్టులు ఉన్నాయి. అగ్నిప్రమాదాల సమయంలో వెంటనే రంగంలోకి దిగేలా సుశిక్షితులైన అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. హైదరాబాద్‌లో 55 మీటర్ల ఎత్తు వరకు అంటే 18 అంతస్తుల వరకు వెళ్లగలిగే బ్రాంటో స్కైలిఫ్టులు రెండు ఉన్నాయి. వీటికి అదనంగా 133 వాటర్ టెండర్లు (ఫైర్ ఇంజిన్లు), 5 నీటి సరఫరా లారీలు, 56 మల్టీపర్పస్ టెండర్లు, 10 అడ్వాన్స్‌డ్ వాటర్ టెండర్లు, 17 వాటర్ బౌజర్లు సహా కీలక పరికరాలు ఉన్నాయి. ఇక 18 అంతస్తులకు మించిన భవనాల్లో అంతర్గతంగా ఉండే ఫైర్ పంపులు, నీళ్ల ట్యాంకులు, ఇతర వ్యవస్థలను ఉపయోగించుకుని అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఫైటింగ్ చేయాల్సి ఉంటుంది.

ఢిల్లీ, మహారాష్ట్రల్లో మెరుగ్గా..

ఫైర్ సేఫ్టీ అంశంలో మన దేశంలో ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. అక్కడ ఫైర్ సేఫ్టీకి సంబంధించిన చట్టాల అమలు పక్కాగా ఉండడంతో పాటు అగ్ని ప్రమాదాల నియంత్రణ మెరుగ్గా ఉంది. ఢిల్లీలో 110 మీటర్ల స్కైలిఫ్టులు నాలుగు అందుబాటులో ఉన్నాయి. ఫైర్ ఫైటింగ్ పరికరాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో నిబంధనల అమలులో మహారాష్ట్ర ముందంజలో ఉంది. ఢిల్లీ, ముంబై నగరాల్లో 50 అంతస్తుల వరకు చేరుకునే ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ ఉన్నట్లు సమాచారం.

విదేశాల్లో పటిష్ట వ్యవస్థలు

సింగపూర్, దుబాయ్, అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, కెనడా, లండన్ దేశాల్లో ప్రపంచంలోనే అత్యంత పక్కాగా అగ్నిమాపక వ్యవస్థ ఉంది. ఈ దేశాల్లో ఫైర్ స్టేషన్లు అన్ని ప్రాంతాలకు సమీపంలో అందుబాటులో ఉంటాయి. ఫైర్ ఫైటింగ్‌లోనూ ఆయా దేశాల సిబ్బంది ముందుంటున్నారు. పౌరులందరికీ అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా వ్యవహరించాలో పూర్తి అవగాహన కల్పిస్తారు. ఏదైనా భవనం వినియోగంలోకి వచ్చిన తర్వాత కూడా అగ్నిమాపక శాఖ కీలక పాత్ర పోషిస్తుంటుంది. తరచూ తనిఖీలు, ఫైర్ మాక్ డ్రిల్స్ పక్కాగా కొనసాగుతుంటాయి.

బిల్డర్లు, నిర్వాహకుల బాధ్యతలేమిటి?

- భవనం భద్రతను బిల్డింగ్ నిర్వాహకులు, యజమానులు విధిగా పర్యవేక్షించాలి.
- సాధారణ సెక్యూరిటీ మాదిరిగా ప్రైవేటు ఫైర్ ఆఫీసర్లు, ఫైర్ గార్డులను నియమించుకోవాలి.
- బిల్డర్లు ప్రతి ఆకాశ హర్మ్యంలో విధిగా ఓ రెస్క్యూ ప్లేస్ పెట్టాలి. ఆ భవనంలో అంతస్తులను బట్టి నాలుగు ఫ్లోర్లకు ఒక రెస్క్యూ ప్రాంతాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రత్యేకంగా ఫైర్ లిఫ్ట్ ఉండాలి. అగ్నిప్రమాదాల సమయంలో ఫైర్ సిబ్బంది మాత్రమే దీన్ని వాడతారు. దీనికి పవర్ సప్లై ప్రత్యేకంగా ఉండాలి.
- నిర్వాహకులకు ఎమర్జెన్సీ ప్లాన్ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిప్రమాదం జరిగితే ఎవరు ఎలా స్పందించాలనే ప్రణాళిక ఉండాలి.
- భవనాల్లో నివాసం ఉండేవారికి, పనిచేసే సిబ్బందికి అగ్నిప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలనే దానిపై తరచూ శిక్షణ ఇవ్వాలి.
- ఫైర్ అలారమ్‌లు, స్మోక్ డిటెక్టర్లు, వాటర్ స్ప్రింక్లర్లు సరిగా పనిచేస్తున్నాయా..లేదా చూసుకోవాలి.
- అయితే చాలా భవనాల్లో.. నిర్మాణం, ఆక్యుపెన్సీ సమయంలో ఉండే ఫైర్ ఫైటింగ్ పరికరాలు...కొన్నాళ్ల తర్వాత పనిచేసే స్థితిలో ఉండడం లేదన్న విమర్శలు ఉండటం గమనార్హం.

ఫైర్ ఫైటింగ్ ఆఫీసర్లను నియమించుకోవాలి



కార్యాలయాలు, ఆసుపత్రులు ఇలా ప్రతి బహుళ అంతస్తుల భవనాల్లోనూ అగ్నిప్రమాదాల సమయంలో వెంటనే స్పందించేలా, ఫైర్ ఫైటింగ్‌కు సంబంధించిన పరికరాల మెయింటెనెన్స్ కోసం ప్రత్యేకంగా ఫైర్ సేఫ్టీ ఆఫీసర్లను పెట్టుకోవాలి. వీరందరికీ అగ్నిమాపక శాఖ ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ఈ వ్యవస్థ ప్రమాదం జరిగిన మొదటి రెండు గంటలపాటు ఫైర్ ఫైటింగ్‌కు ఉపయోగపడుతుంది. ప్రాణ నష్టం నివారించాలన్నదే దీని ముఖ్య ఉద్దేశం. ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు పూర్తిస్థాయిలో ఆర్పే పనితో ప్రజా రక్షణ చర్యలు చేపడతారు. రాష్ట్రంలో ఉన్న అగ్నిమాపక వాహనాలు, పరికరాలు ఎలాంటి పరిస్థితి అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయి.

- వై.నాగిరెడ్డి, డీజీ, అగ్నిమాపక శాఖ

తరచూ తనిఖీలు ఎంతో అవసరం



బహుళ అంతస్తుల భవనాలకు డిజైన్ చేయడంలో ఫైర్ సేఫ్టీ అంశం కూడా అత్యంత కీలకమైనది. డిజైన్‌లో ఉన్నట్టుగా నిర్మాణం జరిగిందా లేదా? ఫైర్ సేఫ్టీ నిబంధనల ప్రకారం అన్నీ సక్రమంగా ఉన్నాయా? అన్నది ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే సమయంలో అధికారులు తనిఖీ చేయాలి. ఆ తర్వాత కూడా తరచూ తనిఖీలు నిర్వహించాలి. నివాస సముదాయాల్లో కంటే హైరైజ్ కమర్షియల్ బిల్డింగ్స్‌లో అగ్ని ప్రమాదాల రిస్క్ ఎంతో ఎక్కువ. ప్రమాదం జరిగితే నష్టం కూడా చాలా ఎక్కువ ఉంటుంది. కాబట్టి వాణిజ్య భవనాల విషయంలో అదనపు జాగ్రత్తలు మరింత అవసరం.

- భిక్షపతి, మాజీ డైరెక్టర్ జనరల్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్

మెయింటెనెన్స్ పట్టించుకోకపోతే కష్టమే..



మన దగ్గర వేగంగా అభివృద్ధి జరగడం, ఆ మేరకు బహుళ అంతస్తులు వస్తుండటం ఎంతో సంతోషించదగ్గ విషయం. బిల్డింగ్ డిజైన్లలో, నిర్మాణంలో.. ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నాం. కానీ ఒకసారి నిర్మాణం పూర్తయిన తర్వాత ఫైర్‌సేఫ్టీని పట్టించుకోవడం లేదు. ఫైర్ ఫైటింగ్ పరికరాల మెయింటెనెన్స్‌పై అటు ప్రభుత్వ విభాగాలు కానీ, ఇటు భవన యజమానులు కానీ అస్సలు పట్టించుకోవడం లేదు. కాబట్టి మన హైరైజ్ భవనాలు డేంజర్‌లో ఉన్నట్టే. ఫైర్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు అవసరమైతే ఫైర్ సేఫ్టీకి సంబంధించి డెవలపర్స్ నుంచి ఫీజులు వసూలు చేసినా ఫర్వాలేదు కానీ అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఆధునీకరించాలి. ప్రతి ఆరు నెలలకు ఫైర్ ఫైటింగ్ పరికరాలు తనిఖీ చేసే వ్యవస్థ ఉండాలి. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు, భవనాల యజమానులకు బాధ్యత అప్పగించి ప్రభుత్వ విభాగాలు తప్పుకోవడం సరికాదు.

- సీఏ ప్రసాద్, ప్రెసిడెంట్, ప్రీ ఇంజనీర్డ్ స్ట్రక్చర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా

ఉమ్మడి జిల్లాకో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ

5 బాలికలు, 5 బాలుర జూనియర్ కాలేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

2025-26 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలో కొత్తగా 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)లు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం ఈ సొసైటీ పరిధిలో కేవలం రెండు సీఓఈలు రాష్ట్ర స్థాయిలో కొనసాగుతున్నాయి. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం, డిమాండ్ అధికంగా ఉండడంతో ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 10 సీఓఈలను ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఇప్పటికే ప్రభుత్వం నుంచి మౌఖికంగా గ్రీన్ సిగ్నల్ వచ్చినప్పటికీ... అధికారికంగా ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో వెలువడనున్నాయి. వీటిని 2025-26 విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సొసైటీ చర్యలు వేగవంతం చేసింది. బీసీ గురుకుల సొసైటీ కొత్తగా ఏర్పాటు చేయనున్న సీఓఈల్లో ఐదు బాలికలు, ఐదు బాలుర కాలేజీలు ఉంటాయి. ఒక్కో కాలేజీలో మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. ఈ కాలేజీల్లో ప్రవేశాలను పదోతరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా ఇస్తారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాలేజీల ఎంపిక ప్రక్రియలో సీఓఈని ఎంపిక చేసుకున్న విద్యార్థి మార్కులను పరిశీలించి అడ్మిషన్ ఖరారు చేస్తారు. ప్రస్తుతం హయత్‌నగర్, సరూర్‌నగర్‌లో కొనసాగుతున్న సీఓఈల నుంచి అత్యుత్తమ ఫలితాలు వస్తున్నాయి. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో దాదాపు వందమందికి పైగా విద్యార్థులు ఎంపికయ్యారు. సీఓఈల సంఖ్య పెంచడంతో ఎక్కువ మందికి పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

బెట్టింగ్‌కు బానిసై..

నష్టాలతో మనస్తాపం.. యువకుడి బలవన్మరణం



వేముల వసంత్ కుమార్ (ఫైల్)

బలిరామగిరి(మంథని): ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో యువకుడు బలయ్యాడు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీ కాలనీలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ చంద్రకుమార్ కథనం ప్రకారం.. సెంటినరీ కాలనీ టీ2- 185 క్వార్టర్‌లో నివసిస్తున్న వేముల విజయ, రవిశంకర్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. విజయ గృహిణి కాగా, రవిశంకర్ ఓసీపీ-2 షావెల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వీరి పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. చిన్న కుమారుడు వేముల వసంత్ కుమార్ (27) ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-2 పరిధిలోని సీ-5 కంపెనీలో వోల్వో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. బెట్టింగ్ యాప్‌లో నష్టాలు రావడంతో.. ఇకనుంచి వాటి జోలికి వెళ్లవద్దని గతేడాది డిసెంబర్‌లో తండ్రి రవిశంకర్ మందలించాడు. రూ. 4 లక్షల వరకు అప్పు తీర్చాడు. కానీ మళ్లీ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడిన వసంత్ కుమార్.. నష్టాలు రావడంతో ఎవరికీ చెప్పుకోలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల పైప్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల ఇంట్లో ఒకరు మృతి చెందడంతో.. వారిని పరామర్శించేందుకు వెళ్లి వచ్చిన దంపతులు.. కుమారుడి ఆత్మహత్యతో నిశ్చేష్టులయ్యారు. వెంటనే తేరుకుని సమీప డిస్పెన్సరీకి తరలించగా అప్పటికే వసంత్ కుమార్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ వివరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సైబర్ సిలబస్

▶ మొదటి పేజీ తరువాయి

సైబర్ మోసాలు కూడా పెరుగుతున్నాయి. జాతీయ సైబర్ నేరాల రిపోర్టింగ్ పోర్టల్‌కు ఏడాది కాలంలో 7.6 లక్షల ఫిర్యాదులు అందాయి. రూ.7,488 కోట్ల ప్రజల సొమ్మును సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. తెలంగాణలో జరిగిన సైబర్ మోసాల విలువ రూ.759 కోట్లు. అయితే, ఈ మోసాలపై విచారణలో డబ్బు రికవరీ రేటు 18 శాతానికి మించడం లేదని కేంద్రం చెబుతోంది. ఇప్పుడున్న పోలీసు వ్యవస్థకు సైబర్ క్రిమినాలజీపై సరైన పట్టు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. ఈ పరిస్థితిని మార్చేందుకు ఐఐటీలను ప్రభుత్వం రంగంలోకి దించింది. ప్రపంచవ్యాప్తంగా నేర సైకాలజీ, నేరాలను, వాటిని అడ్డుకునే సాంకేతికతలపై పోలీసులకు శిక్షణ ఇచ్చే సిలబస్‌ను రూపొందించాలని కోరింది. రెండేళ్లుగా సాగుతున్న ఈ కసరత్తు ఇప్పుడు కొలిక్కి వచ్చింది.

సిలబస్ ఇలా..

ఆన్‌లైన్ పెట్టుబడులు, షేర్ మార్కెట్లో లాభాలు వచ్చేలా చేస్తామని చెప్పే మోసాలు, ఓటీపీ ఆధారిత మోసాలు, గేమింగ్ బెట్టింగ్ యాప్‌ల పేరుతో దోచుకోవడం... ఇలా అనేక రకాల ప్రధాన డిజిటల్ మోసాలపై సమగ్ర సమాచారాన్ని విశ్లేషించారు. కాన్పూర్, మద్రాస్ ఐఐటీలు, నయారాయపూర్, కొట్టాయం ట్రిపుల్ ఐటీలు ఈ ప్రక్రియలో పాల్గొన్నాయి. చాలా కేసుల్లో దర్యాప్తు బృందాలు మేల్కొనే లోపే సైబర్ నేరగాళ్లు ప్లాట్ ఫాం మకాం మార్చేస్తున్నారు. వాడిన ఫోన్, బ్యాంక్ లావాదేవీలన్నీ మారుతున్నాయి. ఈ వేగాన్ని తట్టుకునే లాంగ్ లెర్నింగ్ మాడ్యూల్స్‌ను (ఎల్‌ఎల్‌ఎం) ఐఐటీలు రూపొందించాయి. ఒక్క కమాండ్‌తో ఫ్రోటో వాయిస్ సిస్టమ్, కమాండో సిగ్నలింగ్ వ్యవస్థను, శరవేగంగా దూసుకెళ్తూ టార్గెట్ చేరుకునే మిసైల్ లాంగ్వేజ్ సిస్టమ్‌ను సిలబస్‌లో పొందుపర్చారు. మొత్తం ఆరు చాప్టర్లతో 200 సైబర్ నేరాల కమాండో వ్యవస్థతో సిలబస్ రూపొందించినట్టు ఐఐటీ ప్రొఫెసర్ ఒకరు తెలిపారు.

శిక్షణ ఎవరికి?

ఏటా 350 మందిని కమాండ్ సిస్టమ్‌లోకి తెస్తారు. వీరికి ఆధునిక సిలబస్‌తో కూడిన విద్యను బోధిస్తారు. రాష్ట్ర పోలీసు అధికారులే నిర్వహణ బాధ్యత తీసుకున్నా.. బోధన, ప్రణాళిక మొత్తం ఐఐటీలు రూపొందిస్తాయి. ఐదేళ్లపాటు సాగే ఈ ప్రక్రియలో ఎప్పటికప్పుడు కొత్త సైబర్ నేరాలపై విశ్లేషణ ఉంటుంది. సైబర్ నేరగాడు వాడే ఐపీ అడ్రస్‌తో పాటు, దానికి అనుసంధానమైన టవర్, సిమ్ కదలికలపైనా సరికొత్త టెక్నాలజీతో దాడిచేసే విధంగా శిక్షణ ఉంటుంది. కొన్ని క్లాసులు ఆన్‌లైన్‌లో ఉంటే, మరికొన్ని ప్రయోగాత్మకంగా ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఐదేళ్లలో 5 వేల మంది నిష్ణాతులైన డిజిటల్ దర్యాప్తు అధికారులను రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆర్టీఐ కమిషనర్ల నియామకానికి బ్రేక్

▶ మొదటి పేజీ తరువాయి

ఫైల్‌ను గవర్నర్ పెండింగ్‌లో ఉంచినట్టు అధికార వర్గాలు ధ్రువీకరించాయి. ఈ విషయంలో రాజ్‌భవన్ ప్రభుత్వం నుంచి వివరణ కోరనున్నట్టు తెలిసింది.

కొన్ని పేర్లపై అభ్యంతరం

ప్రధాన సమాచార కమిషనర్, సమాచార కమిషనర్ల పోస్టుల భర్తీ కోసం 2023 జూలై 4న ఒకసారి, 2024 జూన్ 12న మరోసారి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కూడిన కమిటీ ఇటీవల సమావేశమై పలువురిని ఎంపిక చేసి రాజ్‌భవన్‌కు సిఫారసు చేసింది. ప్రధాన సమాచార కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి, సమాచార కమిషనర్లుగా జర్నలిస్టులు పీవీ శ్రీనివాస్‌రావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, కప్పర హరిప్రసాద్, న్యాయవాది పీఎల్‌ఎన్ ప్రసాద్‌తో పాటు రాములు, వైష్ణవి, మొహిసిన పర్వీన్ పేర్లను ప్రతిపాదించింది. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 12(5) ప్రకారం న్యాయశాస్త్రం, సైన్స్, టెక్నాలజీ, సామాజిక సేవ, మేనేజ్‌మెంట్, జర్నలిజం, పరిపాలన రంగాల్లో విశేష కృషిచేసినవారు ఈ పోస్టులకు అర్హులు. సెక్షన్ 12(6) ప్రకారం వారు ఎమ్మెల్యే, ఎంపీ కారాదు. ఎలాంటి లాభదాయక పోస్టులో ఉండరాదు. రాజకీయ పార్టీతో ఎలాంటి అనుబంధం కలిగి ఉండరాదు. వ్యాపారాలు, ఇతర వృత్తుల్లో ఉండరాదు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన పేర్లలో కొందరికి రాజకీయ నేపథ్యం ఉండడంతో పలువురు వ్యక్తులు రాజ్‌భవన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఫైల్‌కు ఆమోదం తెలపకుండా గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. అర్హతల విషయంలో స్పష్టత వచ్చిన తర్వాతే గవర్నర్ ఆమోదించే అవకాశం ఉంది. అవసరమైతే గవర్నర్ కొందరు అభ్యర్థుల పేర్లను మినహాయించి ఇతరుల పేర్లను ఆమోదించే అవకాశం ఉంది. వారం రోజుల్లో ఈ అంశంపై స్పష్టత రానుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని కన్నుమూత

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జడ్జి.. నేడు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు

సాక్షి, హైదరాబాద్/చందానగర్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మాటూరి గిరిజాప్రియదర్శిని (61) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు తుదిశ్వాస విడిచారు. సోమవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె హఠాన్మరణం పట్ల న్యాయవాద వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. హైకోర్టు న్యాయమూర్తులు, న్యా యవాదులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. విశాఖకు చెందిన నాగరత్నం -మారుతిఅప్పారావు గిరిజాప్రియదర్శిని తల్లిదండ్రులు. వారిది వైజాగ్ కాగా, మారుతి అప్పారావు తెలంగాణలో వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా పనిచేశారు. నాగరత్నం గృహిణి. గిరిజాప్రియదర్శిని ఇంటర్ పూర్తి కాగానే కె.విజయ్‌కుమార్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు నిఖిల్, అఖిల్. వివాహం తర్వాత కూడా ఆమె చదువును కొనసాగించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. విశాఖపట్నం ఎన్‌బీఎం న్యాయ కళాశాల నుంచి ఎల్‌ఎల్‌బీ, ఆంధ్ర వర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. ఎల్‌ఎల్‌ఎంలో అత్యధిక మార్కులతో తొలి స్థానం సాధించారు. 1995లో ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. పి.ఉమాబాల వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, లేబర్, కుటుంబ సంబంధిత కేసుల్లో వాదనలు వినిపించారు.



జస్టిస్ గిరిజా ప్రియదర్శిని భౌతిక కాయానికి నివాళులు అర్పించి బయటకు వస్తున్న హైకోర్టు ఏసీజే జస్టిస్ సుజోయ్ పాల్

పేదలకు ఉచిత న్యాయం కోసం విశేష కృషి

ఎంజీ ప్రియదర్శిని 2008లో జిల్లా న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఒంగోలు, ఆదిలాబాద్, కరీంనగర్, ప్రకాశంలో విధులు నిర్వర్తించారు. జిల్లాల్లో పనిచేసినప్పుడు పేదలకు ఉచిత న్యాయ సాయం అందించే జిల్లా న్యాయసేవాధికార సంస్థను తొలి స్థానంలో నిలపడంలో విశేష కృషి చేశారు. ఉచిత న్యాయం ప్రజల హక్కు అని ప్రచారం కల్పించారు. ఆమె సేవలను జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) ప్రశంసించింది. 2022లో తెలంగాణ న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అనారోగ్యంతో బాధపడుతున్నా ఏడాది కాలంగా ఆన్‌లైన్ ద్వారా కేసుల విచారణ కొనసాగిస్తూనే ఉన్నారు. న్యాయమూర్తిగా వేల తీర్పులు ఇచ్చారు.


ఏసీజే నివాళులు

జస్టిస్ గిరిజా ప్రియదర్శి మృతికి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ సంతాపం ప్రకటించారు. ఆమె భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, తెలంగాణ జడ్జెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.మురళీమోహన్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. న్యాయమూర్తిగా ఆమె చేసిన కృషిని కొనియాడారు.

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రూ.1,906 కోట్లు

ముగిసిన క్రమబద్ధీకరణ దరఖాస్తు గడువు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) గడువు ఆదివారంతో ముగిసింది. ఎల్‌ఆర్‌ఎస్ కింద 2020లో నాటి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్న 25.67 లక్షల మంది రూ.1,000 చొప్పున ఫీజు చెల్లించి క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోగా.. అప్పట్లో వివిధ కారణాలతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి క్రమబద్ధీకరించేందుకు ముందుకొచ్చింది. తొలుత మార్చి 31 వరకు గడువు ఇచ్చిన ప్రభుత్వం.. ఆలోగా ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ కూడా ప్రకటించింది. అయితే సాంకేతిక సమస్యలు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. అప్పటికి 5.14 లక్షల దరఖాస్తుల ద్వారా రూ.1,720 కోట్లు వసూలయ్యాయి. అనంతరం వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో పాటు సాంకేతిక కారణాల నేపథ్యంలో గడువును తాత్కాలికంగా మరోసారి ఈ నెల 4వ తేదీ వరకు తాత్కాలికంగా పొడిగించింది. దీంతో మొత్తం 5,66,400 దరఖాస్తులకు సంబంధించి రూ.1,906 కోట్లు వసూలయ్యాయి.



బావులు నిండుగా.. రైతు పండుగ

మండుటెండల్లోనూ ఊట బావుల్లో పుష్కలంగా నీరు | కామారెడ్డి జిల్లా మైసమ్మ చెరువు తండాలో 20 బావులు | బోరుబావుల జోలికి పోని గిరిజన రైతులు

మాచారెడ్డి: తెలంగాణలోని అనేకచోట్ల వందల అడుగుల లోతు బోర్లు వేసినా నీటి చుక్క కనిపించని పరిస్థితులు ఉన్నాయి. కానీ, ఒకచోట ఇప్పటికీ ఊటబావులు నిండుగా నీళ్లతో తొణికిసలాడుతున్నాయి. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని మారుమూలన ఉన్న మైసమ్మ చెరువు తండాలో ఈ బావులను చూడొచ్చు. ఇక్కడ రైతులెవ్వరూ బోరుబావులు తవ్వరు. ఊట బావులతోనే సేద్యం చేస్తున్నారు. వ్యవసాయ బావులకు దగ్గర్లో బోర్లు తవ్వించవద్దని రైతులు స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకున్నారు. దశాబ్దాల కాలంగా ఆ నిర్ణయానికి కట్టుబడి బావులతోనే వ్యవసాయం చేస్తున్నారు.

వేసవిలోనూ బావినిండా నీళ్లు

మైసమ్మ చెరువు తండాలో 126 కుటుంబాలు ఉన్నాయి. పొలాల వద్దనే వీరంతా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. తండాలో 20 వ్యవసాయ బావులు ఉన్నాయి. ఒక్కో బావి కింద నాలుగైదు ఎకరాల భూమి సాగవుతోంది. దాదాపు 120 ఎకరాల్లో పంటలు పండుతున్నాయి. రైతులు ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నారు. మండు వేసవిలోనూ ఆ బావుల్లో నీరు పుష్కలంగా ఉంటుంది. బావుల నీటితో దాదాపు ఇక్కడి రైతులంతా వరి పంటలే సాగు చేస్తున్నారు. నీటి సౌకర్యం లేని మెట్ట భూముల్లో వర్షాకాలంలో ఆరుతడి పంటలు పండిస్తారు. ఒక్కో బావి 20 గజాల నుంచి 30 గజాల లోతు వరకు తవ్వించారు. మైసమ్మ చెరువు తండాకు చుట్టుపక్కల గ్రామాల్లో బోర్లు ఎండిపోయి యాసంగి పంటలు దెబ్బతినగా, ఇక్కడ మాత్రం నీటి సమస్య రాలేదు.


నీళ్లు పుష్కలంగా ఉన్న బావి

బోర్లకన్నా బావులే మేలు..



బోర్లు తవ్వించి అప్పుల పాలయ్యేబదులు ఒకేసారి డబ్బులు ఖర్చు చేసి బావులు తవ్వుకుంటేనే పంటలకు శాశ్వతంగా నీటిని అందించవచ్చు. బోర్లు ఎప్పుడు ఎత్తిపోతాయో తెలియదు. బావుల్లో మాత్రం ఎండాకాలంలో కూడా నీరు పుష్కలంగా ఉంటుంది.

– మెగావత్ రాజు, మైసమ్మ చెరువు తండా

ఏడాదికోసారి పూడిక తీస్తాం..



బావుల్లో పూడికను ఏడాదికోసారి తీస్తాం. వర్షాకాలంలో వరదనీరు వృథాగా పోకుండా బావుల్లోకి మళ్లించి, ఆ నీటిని కాపాడుకుంటే ఎండాకాలంలో పంటలను సాగు చేయవచ్చు. ఇప్పటి వరకు నీళ్ల సమస్య అయితే రాలేదు. – మాలోత్ భాస్కర్, మైసమ్మ చెరువు తండా

ఎమ్మెల్యేకు ఫోన్‌కాల్.. వెలుగులోకి ట్రావెల్ దందా

- గల్ఫ్ ట్రావెల్ నిర్వాహకుడిపై కేసు నమోదు

జగిత్యాల క్రైం: ఓ ఎమ్మెల్యేకు వచ్చిన ఫోన్‌కాల్‌తో గల్ఫ్ ట్రావెల్ దందా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన దండుగుల నవీన్ ఓ యువతిని ఉద్యోగిగా పెట్టుకొని.. జగిత్యాలలోని జంబిగద్దె ప్రాంతంలో అనుమతి లేకుండానే లక్ష్మి గల్ఫ్ ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. ఆమె ద్వారా అమాయక ప్రజలకు ఫోన్లు చేసి విదేశాలకు పంపిస్తామని నమ్మిస్తూ.. వారి వద్ద డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలోనే సదరు యువతి ఉమ్మడి జిల్లాలోని ఓ ఎమ్మెల్యేకు ఫోన్ చేసి గల్ఫ్ పంపిస్తామంటూ నమ్మబలికింది. దీనికి సదరు ఎమ్మెల్యే తనకెందుకు ఫోన్ చేశావని అడగ్గా, ఆ యువతి ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో ఆయన జిల్లా పోలీస్ అధికారికి ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీంతో పట్టణ ఎస్సై గీత ఆధ్వర్యంలో శనివారం రాత్రి ట్రావెల్స్‌పై దాడి చేసి రికార్డులు పరిశీలించారు. అందులో ఎలాంటి అనుమతి లేదని తేలింది. దీంతో అతనిపై సుమోటో కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

మూడో రోజూ విచారణ

- హరిరామ్‌ను ప్రశ్నించిన ఏసీబీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం గజ్వేల్ ఈఎన్సీ భూక్యా హరిరామ్‌ను ఏసీబీ అధికారులు వరుసగా మూడో రోజూ ప్రశ్నించారు. గత శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఐదు రోజులపాటు హరిరామ్‌ను ఏసీబీ కస్టడీకి ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం హరిరామ్‌ను చంచల్‌గూడ జైలు నుంచి తమ కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ అధికారులు ఆయనను బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. శనివారం జరిగిన విచారణకు కొనసాగింపుగా ఆయనను మరికొన్ని ప్రశ్నలు అడిగినట్టు సమాచారం. ఆస్తుల పత్రాలను విశ్లేషిస్తున్న ఏసీబీ అధికారులు, వాటి కొనుగోళ్లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపైనా ఆరా తీస్తున్నట్టు తెలిసింది. సోదాల్లో భాగంగా గుర్తించిన బ్యాంకు లాకర్లను తెరిపించేందుకు ఏసీబీ అధికారులు చర్యలు ప్రారంభించారు. కోర్టు అనుమతితో సోమవారం బ్యాంకు లాకర్లు తెరిచే అవకాశం ఉంది. ఆ లాకర్లను ఓపెన్‌చేస్తే వాటిల్లోనూ మరికొన్ని కీలక పత్రాలు, ఇతర విలువైన వస్తువులు ఉండే అవకాశం ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. లాకర్లలో ఏవైనా ఆస్తుల పత్రాలు లభిస్తే వాటి ఆధారంగా కూడా హరిరామ్‌ను మరింత లోతుగా ప్రశ్నించే అవకాశం ఉందని అంటున్నారు.


పదిరోజుల్లో ఈఏపీ సెట్ ఫలితాలు!

- ముగిసిన ఉమ్మడి ప్రవేశ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్షల (టీజీఈఏపీసెట్) ఫలితాలు పది రోజుల్లో విడుదల కానున్నాయి. ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి ఈ నెల 4వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా జరిగాయి. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ సెట్ జరిగితే, మే 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకూ ఇంజనీరింగ్ సెట్ జరిగింది. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ ప్రవేశ పరీక్షల మూల్యాంకనం రెండు లేదా మూడు రోజుల్లో పూర్తవుతుంది. పరిశీలన అనంతరం ప్రభుత్వ అనుమతి తీసుకొని ఫలితాలు వెల్లడించనున్నట్టు అధికారులు తెలిపారు.

పరీక్షలకు రిజిస్ట్రేషన్... హాజరైన విద్యార్థుల వివరాలు

అగ్రి, ఫార్మసీ సెట్‌కు..			
తేదీ	రిజిస్ట్రేషన్	హాజరైనవారు	హాజరు శాతం
29.4.25 (ఉదయం)	28,834	26,741	92.74
29.4.25 (సాయంత్రం)	28,830	26,964	93.53
30.4.25 (ఉదయం)	29,098	27,493	94.48
ఇంజనీరింగ్			
2.5.25 (ఉదయం)	37,041	34,618	93.46
2.5.25 (సాయంత్రం)	37,164	35,040	94.28
3.5.25(ఉదయం)	36,892	34,607	92.81
3.5.25 (సాయంత్రం)	36,885	34,620	93,86
4.5.25 (ఉదయం)	36,172	34,116	94.32
4.5.25 (సాయంత్రం)	36,173	34,189	94.52



తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. - తిరుమల

ఇక సమరమే..

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పోరుబాట

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ పోరుబాట పట్టింది. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై 16 నెలలుగా చేసిన ఒత్తిడి ఫలించకపోవడం, ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడటంతో ప్రత్యక్ష కార్యాచరణకు నడుం బిగించింది. ఈ నెల 15వ తేదీ నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించింది. దశల వారీగా నిరసనలు, ఆందోళనలు చేపట్టడమే కాకుండా జూన్ 9న హైదరాబాద్‌లో మహా ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వర్క్ టు రూల్, పెన్ డౌన్, సామూహిక సెలవులు వంటి కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించింది. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ సంఘాల ఉమ్మడి కార్యాచరణ సమితి రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. జేఏసీ ఏర్పాటు తర్వాత తొలిసారిగా జరిగిన ఈ సమావేశంలో 33 జిల్లాల జేఏసీ ప్రతినిధులు, సచివాలయ జేఏసీతో పాటు 206 అనుబంధ సంఘాల నేతలు పాల్గొని ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం తీసుకున్నారు.

క్షేత్రస్థాయి నుంచి షురూ..

క్షేత్రస్థాయి నుంచి ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకున్న జేఏసీ..ఈనెల 15వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనుంది. జిల్లాల వారీగా తేదీలు ఖరారు చేసుకుని ఆయా రోజుల్లో ఆందోళనలు నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయి నాయకులు వీటిల్లో పాల్గొంటారు. ఇవి పూర్తయిన తర్వాత కొత్త జిల్లా కేంద్రాల్లో ఉమ్మడి జిల్లా నేతలతో ఆందోళన కార్యక్రమాలు చేపడతారు. ఇవి పూర్తయ్యాక జూన్ 9వ తేదీన హైదరాబాద్‌లో సుమారు 50 వేల మంది ఉద్యోగులతో మహా ధర్నా నిర్వహిస్తామని టీజేఏసీ ప్రకటించింది. ఉద్యమంలో భాగంగా వర్క్ టు రూల్ (పనివేళలో మాత్రమే విధులు), మండలాలు, తాలూకా, జిల్లా కేంద్రాల్లో మానవ హారాలు, ప్రభుత్వ కార్యాలయాల ముందు సామూహిక భోజనాలు, ఆ తర్వాత పెన్‌డౌన్ (హాజరు రిజిస్టర్‌లో సంతకం చేసి విధులకు గైర్హాజరు కావడం), అన్ని రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న 13.31 లక్షల మంది ఉద్యోగులు ఒకరోజు సామూహిక సెలవుకు దిగడం లాంటి కార్యక్రమాలు చేపడతారు. తమ సమస్యలకు సంబంధించి టీజేఏసీ 57 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచింది. ఇందులో 45 డిమాండ్లు ఆర్థికేతరమైనవే. కేవలం 12 మాత్రమే ఆర్థికపరమైనవి. ఆర్థిక ఇబ్బందులున్నప్పుడు కనీసం ఆర్థికేతర అంశాలనైనా పరిశీలించి వాటిని పరిష్కరించకపోవడంతోనే ప్రత్యక్ష పోరాటానికి దిగుతున్నట్లు ఉద్యోగ జేఏసీ స్పష్టం చేసింది. ఈ సదస్సులో ఉద్యోగ సంఘాల నేతలు జి.సదానందం గౌడ్, చావ రవి, కె. గౌతమ్‌కుమార్ పి.దామోదర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 20న జరిగే అఖిల భారత ఉద్యోగుల సార్వత్రిక సమ్మెకు టీజేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

ప్రభుత్వం పట్టించుకోనందుకే..

మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. తక్షణ పరిష్కారం కోసం ఒత్తిడి చేశాం. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిని కలిసినప్పుడు కొన్నిరోజులు వేచిచూడాలని చెప్పారు. ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులున్నందున మేము కూడా ఓపిక పట్టాం. కానీ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర కావస్తోంది. ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు. దీనిపై ప్రభుత్వ పెద్దలను కలిసేందుకు ఎన్నోసార్లు ప్రయత్నాలు చేశాం. కొందరు మంత్రులు గంటల తరబడి వెయిట్ చేయిస్తూ చివరకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. క్షేత్రస్థాయి ఉద్యోగులు మాపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు. వారిలో ఓపిక నశించింది. కొందరిలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆందోళనల బాట పట్టాం. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరిస్తే పునరాలోచన చేస్తాం.

– మారం జగదీశ్వర్, టీజేఏసీ చైర్మన్

పరిష్కారం లేదు..చర్చల్లేవు

మా సమస్యల పరిష్కారం కోసం 16 నెలలుగా ఎదురు చూశాం. మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినప్పటికీ.. ఒక్కసారి కూడా చర్చలకు పిలవలేదు. సీఎంను ఒకట్రెండుసార్లు కలిసి పరిస్థితిని వివరించినప్పుడు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చెప్పారు. ఆర్థిక పరిస్థితి ఎప్పుడు మెరుగుపడుతుంది? మా సమస్యలకు ఎప్పుడు పరిష్కారం దొరుకుతుంది?

– ఏలూరి శ్రీనివాసరావు, టీజేఏసీ సెక్రెటరీ జనరల్



తిరుగుబాటు అనేది ప్రజల హక్కు.
– జాన్ లాకి

సాక్షి
సోమవారం, 5 మే 2025

ఉమ్మడి చితిపేర్పు

'యుద్ధం' రెండక్షరాల మాటే, 'శాంతి' కూడా అంతే! విచిత్రంగా, చావుబతుకులు రెంటినీ ఇముడ్చుకున్నవి కూడా ఆ రెండే; జీవన ప్రవాహానికి రెండు వైపులా కాపుకాసే తీరాలూ, మనిషిని ఇరువైపులా మోహరించిన భిన్న ధ్రువాలూ అవే; వాటి మధ్యనే మానవ సంచారం. లియో తొలుస్తాయ్ 'వార్ అండ్ పీస్' పేరుతో, నిర్దిష్ట స్థలకాలాల నేపథ్యంతో రచించిన ఐతిహాసిక నవలలో మార్చి మార్చి జరిగే ఆ సంచారాన్ని అత్యద్భుతంగా, ఆర్ద్రంగా కళ్ళకు కట్టిస్తాడు.

యుద్ధమూ, శాంతీ మనిషితోనే పుట్టి ఉంటాయి. బహుశా మనిషి తొలి యుద్ధం సాటిమనిషితో కాదు, ప్రకృతి శక్తులతో! అది బతకడానికి మొదలైన యుద్ధం; మనుషులొకరి నొకరు చంపుకునే యుద్ధం ఆ తర్వాత వచ్చింది; నాగరికత ముదిరినకొద్దీ అది మహాయుద్ధాల స్థాయికి చేరింది. శాంతి అన్నది యుద్ధమనే రెండు క్రూర సింహాల మధ్య ఇరుక్కున్న బెదురుచూపుల లేడికూనా, మండు టెడారిలో అక్కడక్కడ మరులుగొలిపే శీతలజలచ్ఛాయా అయింది.

మనిషి ఒంటిగా ఉన్నప్పుడు బతకనిచ్చే, బతుకునిచ్చే శాంతినే కోరుకుంటాడు; పదిమందిలో ఒకడైనప్పుడే యుద్ధపిపాసి అవుతాడు. ఈ చంచలత్వం మనిషి స్వభావంలోనే ఉంది. తన శాంతియుత అస్తిత్వానికే చేటు వచ్చినప్పుడు చావో, రేవో తేల్చుకోవాలనుకోవడం సహేతుకమే; కానీ ఏదో ఒక విస్తరణ దాహంతో రక్తపుటేరులు పారించడంలోనే ఎక్కువ చరిత్ర మూటగట్టుకున్నాడు. తన లక్షల సంవత్సరాల మనుగడలో శాంతియుత సహజీవనంపై ఇంతవరకు ఏకీభావానికి రాలేకపోయాడు. అతని అనేకానేక విజయాలను నిలువునా వెక్కిరించే మహా వైఫల్యం అదే. ప్రకృతి ప్రణాళికలో లేని బలవంతపు చావును కొని తెచ్చుకునే వికటించిన తెలివి మనిషిది.

ప్రపంచ సాహిత్యంలోని అనేక శిఖరాయమాన రచనల్లో యుద్ధమే ఇతివృత్తం. దేశ కాలాలు, భాషా సంస్కృతులు వేరైనా అవి ఒక్కలానే యుద్ధభాష మాట్లాడాయి, యుద్ధ సంస్కృతిని చిత్రించాయి; యుద్ధం తెచ్చిపెట్టే అపార విధ్వంసంపై, సృష్టించే దుఃఖసముద్రాలపై ఒక్క గుండెతోనే స్పందించాయి. యుద్ధాలను గర్హించే పాత్రలకూ, ఆకాశానికెత్తే పాత్రలకూ కూడా ఒకే గౌరవాన్ని కట్టబెట్టాయి. యుద్ధాలు తగవంటూనే పోరాడి ప్రాణాలు బలిపెట్టిన వీరులకు హారతి పట్టాయి. మహాభారతాన్నే తీసుకుంటే, యుద్ధం వద్దన్నవారు కూడా యుద్ధంలోకి దిగిపోయినప్పుడు, విదురుడొక్కడే ఒంటరిగా ఒడ్డున మిగిలిపోతాడు. అంతవరకు కురుపాండవులుభయుల శ్రేయస్సునూ కోరుకున్న భీష్మ పితామహుడు యుద్ధంలో పాండవ పక్షాన్ని నిర్దాక్షిణ్యంగా నరికి పోగులుపెడతాడు. చస్తే యుద్ధంలోనే చావాలి, ఇంట్లో రోగమొచ్చి చావడం కన్నా పాపమేదీ ఉండదని ఉద్బోధిస్తాడు. అర్జునుడు తనను చంపుతానని ప్రతిజ్ఞ చేసినప్పుడు ప్రాణభయంతో వచ్చి తనను కలిసిన సైంధవునితో ఆచార్య ద్రోణుడూ అదే అంటాడు; 'మృత్యువుకెందుకు భయపడుతున్నావు, వెళ్ళి యుద్ధం చేయి, ఎవరూ భూమ్మీద శాశ్వతం కాదు, అందరూ పోయేవాళ్ళే' నంటాడు. 'వార్ అండ్ పీస్'లో మరియా దిమిత్రెవ్నా అనే పాత్ర, తన కొడుకులు నలుగురు సైన్యంలో ఉన్నారనీ, అయినా తనకు చింత లేదనీ, చావనేది ఇంట్లో పడుకుని ఉన్నా వస్తుందనీ సగర్వంగా అంటుంది. యుద్ధానికి ఎందుకు సిద్ధమవుతున్నావని పియర్ అనే పాత్ర తన మిత్రుడు ప్రిన్స్ ఆంద్రెని అడిగినప్పుడు, 'ఏమో, ఎందుకో నాకే తెలియదు, ఇప్పుడు జీవిస్తున్న జీవితం నాకు నచ్చడంలే'దని అతనంటాడు. హోమర్ కృతి 'ఇలియడ్'లో ట్రాయ్ రాకుమారుడు హెక్టర్, అర్జునుడిలానే యుద్ధాన్ని ద్వేషిస్తాడు, తన భార్య శత్రువుకి బానిసగా చిక్కి ఊడిగం చేసే దృశ్యాన్ని ఊహించుకుని కుంగిపోతాడు, అయినా సరే యుద్ధం చేసి అఖిలీస్ చేతిలో మరణిస్తాడు. అఖిలీస్ చంపడంలోనే వెర్రి ఆనందాన్ని అనుభవిస్తాడు, అదే ఉత్తమోత్తమ పుణ్యకార్యమనుకుంటాడు, ఆ రోజుకి యుద్ధమైపోయాక మళ్ళీ మనిషైపోతాడు. తను రథానికి కట్టి ఈడ్చుకొచ్చిన హెక్టర్ మృతదేహాన్ని యాచించడానికి అతని తండ్రి ప్రియామ్ వచ్చినప్పుడు, అతణ్ణి సగౌరవంగా ఆహ్వానించి శవాన్ని అప్పగించి పంపిస్తాడు.

యుద్ధవ్యతిరేకతా, యుద్ధప్రియత్వాల మధ్య; మానుష, అమానుషత్వాల మధ్య మనిషి ఊగిసలాట ఆశ్చర్యం గొలుపుతుంది; క్షతగాత్రుడై పడున్న శత్రువీరుడు ఆంద్రెని చూసి నెపోలియన్ గుండె కరుగుతుంది. తన చేతిలో మరణించిన వాలిపై పడి తారా, రావణునిపై పడి మండోదరీ హృదయ విదారకంగా రోదిస్తున్నప్పుడు రాముడు ద్రిమ్మపడి ఉండిపోతాడు. ఏ యుద్ధంలోనైనా విజేతలు, పరాజితులన్న తేడా కేవలం సాంకేతికమే; అంతిమ విజయం మృత్యు, విధ్వంసాలదే! విజేత పక్షానికి చెందిన గర్భవతి ఉత్తర, భర్త అభిమన్యుని మరణానికి కన్నీరుమున్నీరవుతుంది. ఉపపాండవులను పోగొట్టుకున్న ద్రౌపది కడుపుకోతా, నూరుగురు కొడుకులను కోల్పోయిన గాంధారి గర్భశోకమూ ఒక్కటే అవుతాయి. నివాసాలు శ్మశానాలవుతాయి, ఊళ్ళు కాలిబూడిదవుతాయి, కొంపలు కొల్లేరవుతాయి, ఖజానాలు ఖాళీ అవుతాయి, శవాల గుట్టల మధ్య బతికున్నవాళ్లు జీవచ్ఛవాలవుతారు. గాంధారి శోకం శాపమై యదువంశాన్ని పట్టి కుదుపుతుంది, యుద్ధం ఇంకో యుద్ధానికే బీజావాపమవుతుంది, విధ్వంసం మరో విధ్వంసానికే దారి తీయిస్తుంది. శాంతి, రెండు యుద్ధాల మధ్య విరామ చిహ్నమవుతుంది. ఎంతో ఎదిగామనుకునే ఈ రోజున కూడా యుద్ధానికీ, శాంతికీ మధ్య ద్వైదీభావాన్ని మనిషి జయించలేకపోతున్నాడు; ఉండి ఉండి యుద్ధోన్మాది అవుతూనే ఉన్నాడు, భేరీలు మోగిస్తున్నాడు, నినాదాలు ఎలుగెత్తుతున్నాడు! ఇందుకు ఏ ఒక్కరో బాధ్యులు కారు, ఇది సమష్టి వైఫల్యం, ఉమ్మడి చితిపేర్పు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: శు.అష్టమి ప.11.59 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: ఆశ్లేష సా.6.04 వరకు, తదుపరి మఖ, వర్జ్యం: ఉ.6.42 నుండి 8.20 వరకు, దుర్ముహూర్తం: ప.12.21 నుండి 1.13 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.48 వరకు, అమృతఘడియలు: సా.4.20 నుండి 6.02 వరకు

సూర్యోదయం : 6.37
సూర్యాస్తమయం: 6.16
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

కులగణన... చరిత్రాత్మక నిర్ణయం

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చాలామందిని ఆశ్చర్యపరిచింది. కులగణన నిర్వహించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు కేంద్రం తలొగ్గిందని కూడా కొందరు సామాజిక రాజకీయ వేత్తలు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. ఏమైనా కులగణన ప్రకటన చరిత్రాత్మక రాజకీయ ప్రకటన అని భావించవచ్చు.

అంబేడ్కర్, రామ్ మనోహర్ లోహియా భారతదేశంలో కుల గణన జరగాలని ఎంతో పోరాడారు. నిజానికి బీసీల కులగణన లేకపోవటం వల్ల బహుజనుల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో న్యాయం జరగలేదు. ఓబీసీల జీవన వ్యవస్థ ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ, పాశ్చాత్యీకరణ వలన విధ్వంసం అవుతూ... వారు జీవించే హక్కులు మృగ్యమవుతున్న తరుణంలో ఈ ప్రకటన రావడం ముదావహం.



- కేవలం అసమానతే కుల వ్యవస్థ ప్రత్యేకత కాదు. క్రమబద్ధంగా శ్రేణీకరించిన అసమానతతో అది ప్రభావితమై ఉంది.
- ఓబీసీల జీవన వ్యవస్థ ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ, పాశ్చాత్యీకరణ వలన విధ్వంసం అవుతూ... వారు జీవించే హక్కులు మృగ్యమవుతున్న తరుణంలో కులగణన ప్రకటన రావడం ముదావహం.

మారిన పార్టీల అవగాహన

ఈ ప్రకటన తర్వాత దేశంలోని రాజకీయ, సామాజిక విశ్లేషకులకు అనేక ప్రశ్నలు ముందుకొచ్చాయి. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ కులగణన ప్రస్తావన వచ్చినప్పుడల్లా వ్యతిరేకించాయి. ఇప్పుడు వాళ్లు మనస్ఫూర్తిగా అంగీకరిస్తారా లేదా అనేది చూడాలి. బిహార్, బెంగాల్, తమిళనాడుల్లో జరగబోయే ఎన్నికల కోసం ఈ ప్రకటన జరిగిందా అనే మరో ప్రశ్న అందరి ముందుకు వచ్చింది. సాక్షాత్తూ పార్లమెంటులోనే బీజేపీ ఎంపీలు కులగణనను వ్యతిరేకిస్తూ మాట్లాడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

భారతదేశ పాలకవర్గం... బ్రాహ్మణ, బనియా, భూస్వామ్య కూటమిగా ఉందనేది స్పష్టం. ఈ విషయాన్ని అనేక సందర్భాల్లో అంబేడ్కర్, లోహియా, పెరియార్ రామస్వామి చెబుతూనే వచ్చారు. 'లండన్ హౌజ్ ఆఫ్ కామన్స్'లో అంబేడ్కర్ శత జయంతి సందర్భంగా... భారత మాజీ ప్రధానమంత్రి వీపీ సింగ్ నాతో మాట్లాడుతూ బీసీల రాజకీయ, సామాజిక సంస్కరణల విషయంలో జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ వ్యతిరేకంగా వ్యవహరించారని అన్నారు. మండల్ కమిషన్ రిపోర్టును ఇందిరాగాంధీ అమలు జరపలేదు. దీనికోసం వీపీ సింగ్ చొరవ చూపారనేది సత్యం. ఈ విషయాలను వీపీ సింగ్, శరద్ యాదవ్, రామ్‌విలాస్ పాశ్వాన్ అనేక సందర్భాల్లో, ముఖ్యంగా చుండూరు పోరాటం సందర్భంలో నాతో చర్చించడం జరిగింది. బీజేపీ అధికారంలోకి రాక ముందున్న తన ప్రవర్తనను కాంగ్రెస్... బీజేపీ అధికారంలోకి వచ్చాక మార్చుకున్నట్లు అర్థమవుతోంది. నెహ్రూ, ఇందిరాగాంధీ కంటే కూడా సామాజిక, రాజకీయ విషయాల్లోనూ; దళిత బహుజన దృక్పథంలోనూ రాహుల్ గాంధీ అవగాహన భిన్నంగా ఉంది. ఆయనపై సబాల్టర్న్ స్టడీస్ ప్రభావం కనిపిస్తుంది. తమిళనాడు ప్రభుత్వం రిజర్వేషన్ల విషయంలో ఒక అడుగు ముందుకు వేసి 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమలు చేసేందుకు పూనుకున్నప్పుడు, వీపీ సింగ్ ప్రభుత్వ మండల్ నివేదికలను అమలు జరపడానికి పూనుకున్నప్పుడు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాటం నడిపినవారు ఆర్ఎస్ఎస్, బీజేపీ వారేనన్నది స్పష్టమే.

కుల నిర్మాణ చట్రం

ఒక రాజకీయ పథకంపై ఓ తీర్పు ఇవ్వడానికి ముందు దానికి సంబంధించిన ప్రాథమిక ప్రణాళికను పరిశీలించడం తప్పనిసరి. 'ప్రాథమిక ప్రణాళిక' అంటే ఏ సమాజానికైతే రాజకీయ పథకాన్ని వర్తింపజేయాలని అనుకుంటున్నారో, ఆ సమాజపు నిర్మాణమే ప్రాథమిక ప్రణాళిక అని చెప్పవచ్చు. సామాజిక నిర్మాణంపై రాజకీయ నిర్మాణం ఆధారపడి ఉందని చెప్పడానికి ఎటువంటి సమర్థనా అవసరం లేదు. వాస్తవానికి రాజకీయ నిర్మాణంపై సామాజిక నిర్మాణం ఎక్కువ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. రాజకీయ నిర్మాణం పని చేసే తీరును అది మార్చవచ్చు, నిరర్థకం చేయవచ్చు లేదా అపహాస్యం పాలు కూడా చేయవచ్చు.

భారతదేశ విషయంలో సామాజిక నిర్మాణం అనేది కుల వ్యవస్థపై నిర్మితమై ఉంది. కుల స్వభావం గురించి ఎవరికీ వివరించాల్సిన అవసరం లేదు. కానీ కులవ్యవస్థకు ఉన్న కొన్ని ప్రత్యేక లక్షణాలను గుర్తించి తీరాలి. కులాలు ఎలా పంపిణీ అయ్యాయి అంటే... ప్రతి ప్రాంతంలోనూ ఒక ప్రధాన కులమూ, కొన్ని చిన్న కులాలూ ఉన్నాయి. జనాభా రీత్యా ప్రధాన కులంతో పోల్చినప్పుడు చిన్నవి కావడం వల్లనూ, గ్రామంలో ఉన్న భూమిలో ఎక్కువ భాగం సొంతం చేసుకున్నటువంటి ప్రధాన కులంపై ఆర్థికంగా ఆధారపడి ఉండటం వల్లనూ... ఈ చిన్న కులాలు ప్రధాన కులానికి లోబడి ఉండేవిగా ఉన్నాయి. కేవలం అసమానతే కులవ్యవస్థ ప్రత్యేకత కాదు. క్రమబద్ధంగా శ్రేణీకరించిన అసమానతతో అది ప్రభావితమై ఉంది. కులాలు ఒకదానిపై మరొకటి ఉంటాయి. అదొక రకమైన ఆరోహణా క్రమపు ద్వేషమూ, అవరోహణా క్రమపు ఏవగింపూ కలిగి ఉన్నాయి. కులమనేది సామాజిక, సాంస్కృతిక, తాత్త్విక జీవన వ్యవస్థల నుండి ఆ యా కాలాలలో పరిణామం చెందుతూ వచ్చి కుల నిర్మూలనా దశకు చేరుకుంటుందని అంబేడ్కర్ భావించారు. అందుకే ఆయన కులనిర్మూలనా ప్రణాళికను రూపొందించారు. కులనిర్మూలనా సంస్కృతి కార్యక్రమ ప్రతిపాదనలు చేశారు.

ఈ నేపథ్యంలో దేశంలో కుల గణనే కాక, కుల ఆర్థిక గణన కూడా చేయగలిగితే... భారతదేశ సామాజిక, ఆర్థికపరమైన నిజ స్వరూపం బయటకు వస్తుంది. అప్పుడే ఏ కులానికి ఎంత సంపద ఉందన్నది బయటకు వస్తుంది. మొత్తం మీద నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన భారతదేశంలో తప్పక గుణాత్మకమైన మార్పు వస్తుందనీ; బీసీలు, దళితులలో... ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యం పెరుగుతుందనీ ఆశించాల్సిన చారిత్రక సందర్భం ఇది. సానుకూల దృక్పథమే భారతదేశ భవితవ్యానికీ, దళిత బహుజన రాజకీయ విప్లవానికీ దోహదం చేస్తుందన్నది వాస్తవం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు I 98497 41695

కులగణనపై మోదీ యూ–టర్న్‌తో ఎవరికి లాభం?

అభిప్రాయం



జి. శ్రీలక్ష్మి

దేశ వ్యాప్తంగా ప్రతిపక్షాలు కొన్నేళ్లుగా కుల గణన డిమాండ్లు వినిపిస్తున్నా... హిందువులంతా ఒక్కటే అని చెబుతూ వచ్చిన బీజేపీ, ఎవరూ ఊహించని విధంగా కుల గణన నిర్వహించాలని నిర్ణయించింది. కుల గణన మీదే రాజకీయాలు నడుపుతున్న ప్రతిపక్షాల నోరు మూయించడానికే బీజేపీ ఈ నిర్ణయం తీసుకుందా? లేక ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు విరుద్ధంగా తీసుకున్న ఈ నిర్ణయం ఆ పార్టీకి ప్రమాదం తెచ్చిపెట్టనున్నదా అనే చర్చ మొదలైంది.

మన దేశంలో మతం కన్నా కులమే బలమైనది. ఏ రాష్ట్రంలో చూసినా కులం చుట్టే రాజకీయాలు నడుస్తుంటాయి. స్వాతంత్ర్యం అనంతరం 2011లో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కులగణన కోసం సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టింది. కానీ, రాజకీయ ఎత్తుగడల మధ్య ఆ డేటాను విడుదల చేయలేదు. తర్వాత అధికారం కోల్పోయిన కాంగ్రెస్... సామాజిక న్యాయం కోసం కులగణన చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నా... బీజేపీ పట్టించుకోనట్టే వ్యవహరించింది.

బీజేపీ సైద్ధాంతిక గురువైన ఆర్ఎస్ఎస్, ముందు నుంచీ కులగణనను వ్యతిరేకిస్తోంది. కులాలకు అతీతంగా హిందువులను ఒకే గొడుగు కింద ఏకం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2023లో ఆర్జేడీ–జేడీ(యూ) కూటమి ప్రభుత్వం బిహార్‌లో కులగణనను చేసినప్పుడు కూడా ఆర్ఎస్ఎస్, బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కులగణన చేసినప్పుడు కూడా కుల ఆధారిత ఓటు బ్యాంకు రాజకీయాలను అవి వ్యతిరేకించాయి. ప్రతిపక్ష పార్టీలు కుల విభజనలను రెచ్చగొట్టి ఎన్నికల లబ్ధి పొందుతున్నాయని విమర్శించాయి. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో 'బటెంగే తో కటెంగే' (విడిపోతే చంపబడతాం) అనే నినాదంతో కులగణన డిమాండ్‌ను తెరమరుగు చేసే ప్రయత్నం చేశారు. ప్రధానమంత్రి మోదీ ఈ ప్రచారంలోనే 'ఏక్ హై తో సేఫ్ హై' (ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం) అనే నినాదం ఇచ్చారు. ఇప్పుడు తన యూ–టర్న్‌కు ఆయన ఏమని సంజాయిషీ చెప్పుకొంటారు?

- ఓబీసీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి, ప్రతిపక్ష సామాజిక న్యాయ ఎజెండాను నియంత్రించడానికి బీజేపీ కులగణనకు ఒప్పుకుందన్న అనుమానం ఉంది.

వ్యూహాత్మక నిర్ణయమా?

తెలంగాణ, కర్ణాటకలలో చేపట్టిన కులగణనతో దేశ వ్యాప్తంగా సామాజిక న్యాయం డిమాండ్లు పెరిగాయి. దీనికి తోడు ఈ ఏడాది జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకునేలా బీజేపీపై ఒత్తిడి పెరిగింది. బిహార్‌లో 2015లో నితీశ్ కుమార్ ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వేలో మొత్తం జనాభాలో 65 శాతం ఓబీసీలని తేలింది. ఈ నేపథ్యంలో ఓబీసీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి, ప్రతిపక్ష సామాజిక న్యాయ ఎజెండాను నియంత్రించడానికి బీజేపీ కులగణనకు ఒప్పుకుని ఈ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుందన్న అనుమానం ఉంది.

ఆర్ఎస్ఎస్ ఈ నిర్ణయంపై సంయమనంతో స్పందిస్తూ, కులగణన రాజకీయ సాధనంగా మారకూడదని, శాస్త్రీయంగా, సామాజిక అసమానతలను తొలగించేందుకు మాత్రమే జరగాలని చెప్పింది. ఈ స్పందన వారి అంతర్గత అసౌకర్యాన్ని సూచిస్తుంది. ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందు రోజే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధానమంత్రితో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి తన యూ–టర్న్ గురించి ఆయనతో చర్చించే ఉంటారు. కాబట్టి, ఈ నిర్ణయం బీజేపీ సైద్ధాంతిక మార్పు కాదనీ, ఎన్నికల ఒత్తిడి వల్ల తీసుకున్న రాజకీయ నిర్ణయం మాత్రమేననీ స్పష్టమవుతోంది.

2014 నుండి దేశంలో బీజేపీ తన బలం పెంచుకుంటూ వస్తోంది. కానీ, తన ఆధిపత్యాన్ని కొనసాగించడానికి వెనుకబడిన వర్గాల మద్దతు చాలా కీలకం. బీజేపీలో అత్యధిక శాతం నాయకులు అగ్రవర్ణాలవారే ఉన్నారు. కాబట్టి, కులగణన వల్ల ఓబీసీలు, ఇతర వెనుకబడిన వర్గాలు అధికారంలో తమ వాటాను డిమాండ్ చేస్తే, పార్టీ బలహీనపడే అవకాశం ఉంది. ఇండియా కూటమి ఎక్కువ కులాలు, సముదాయాలకు ప్రాతినిధ్యం వహిస్తుందనే అభిప్రాయం బీజేపీకి ప్రతికూలంగా మారింది. బీజేపీ రోహిణీ కమిషన్, రాఘవేంద్ర కుమార్ ప్యానెల్ వంటి ఓబీసీ ఉప–వర్గీకరణ ప్రయత్నాలు చేసినప్పటికీ, వాటి నివేదికలను విడుదల చేయలేదు. దీనికి విరుద్ధంగా, ప్రతిపక్షం కులగణనకు నిబద్ధత చూపిస్తూ... తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణన జరిపించి, బీజేపీ శిబిరంలో రాజకీయ ఒత్తిడిని పెంచింది.

ఈ నిర్ణయం బీజేపీకి స్వల్పకాలిక రాజకీయ లబ్ధిని ఇవ్వవచ్చు, కానీ దీర్ఘకాలంలో అనేక సవాళ్లను తెచ్చిపెడుతుంది. కులగణన హిందూత్వ సిద్ధాంతానికి విరుద్ధంగా, కుల ఆధారిత రాజకీయాలను మరింత బలపరుస్తుంది. ఇది మండల్ 3.0 ఆవిర్భావానికి దారి తీసే అవకాశం కూడా లేకపోలేదు. కులం మన దేశ రాజకీయాల్లో బలమైన శక్తిగా కొనసాగుతోంది. దానిని మతం పేరు చెప్పి తొలగించలేం. ఈ నిర్ణయం బీజేపీ సైద్ధాంతిక పునాదులను కదిలించి, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న ప్రతిపక్షాలకు నైతిక విజయాన్ని అందించింది. 2021లోనే నిర్వహించాల్సిన జనగణన ఇప్పటికీ జరగలేదు. ఈ నేపథ్యంలో కులగణన నిర్ణయం ఎప్పుడు అమలవుతుందో అనే సందేహాలను కొట్టిపారేయలేం!

వ్యాసకర్త రీసెర్చర్, పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ

మానవీయ మతగురువు

కామెంట్



కరణ్ థాపర్

నేను ఒకసారైనా పోప్ ఫ్రాన్సిస్‌ని కలిసి ఉండాల్సింది. ఆయన విషయంలో తప్ప, ఇతర ప్రముఖుల గురించి ఎప్పుడూ ఇలా అనుకోలేదు. పోప్ ముఖంలో ఎప్పుడూ కరుణ, ఆప్యాయత, ఆనందం ఉట్టిపడుతూ ఉండేవి. ఆయన నవ్వుతూ ఉండేవారు. నవ్విన ప్రతిసారీ ఆ కళ్ల వెలుగులు ప్రసరించేవి. అది పెదవుల మీద చిందే మామూలు మందహాసం కాదు. గుండె లోతుల్లోంచి వచ్చినట్లుంటుంది. సహజమైనది. చిన్నారుల పట్ల ఆయన ఎంతో వాత్సల్యం ప్రదర్శించేవారు. అందులోనూ నిజాయతీ కనిపించేది. పోప్ మరణం తర్వాత నేను ఆయన గురించి తెలియని ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. వాటితోనే నాకాయన ఎంతో ప్రేమాస్పదుడు అయ్యారు.

క్యాథలిక్ చరిత్రలో పరమ పూజ్యుడిగా గుర్తింపు పొందిన సెయింట్ ఫ్రాన్సిస్ పేరును పోప్ తన 'పాపల్ నేమ్'గా స్వీకరించారు. ఆ ఇటాలియన్ మార్మికుడి మాదిరిగానే పోప్ అతి నిరాడంబరంగా జీవించారు. పోప్ అధికారిక నివాసమైన వ్యాటికన్ ప్యాలెస్‌ను (దీన్నే గ్రాండ్ పాపల్ హోమ్ అంటారు) కాదని అక్కడి అతిథి గృహంలోని ఓ చిన్న రెండు గదుల అపార్టుమెంటులో ఉన్నారు. ఆయన ఎంత సాదాసీదాగా ఉండేవారంటే, తను వేసుకునే బ్రౌన్ కలర్ షూస్ బాగా నలిగిపోయి ఉండేవి. గార్డులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేయడం ఆయనకు పరిపాటి. కార్మికులు తినే క్యాంటిన్‌లోనే తరచూ భోజనం చేసేవారు.

ప్రీస్ట్ కావటానికి ముందు బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా)లో ఫ్రాన్సిస్ ఒక బౌన్సర్ ఉద్యోగం చేశాడంటే నమ్మగలరా? ఇతర ప్రీస్టుల కంటే భిన్నంగా ఉండటానికి బహుశా అదొక కారణం అయ్యుంటుంది. పేదల పక్షం ఉండటమే ఈ పోప్ తత్వం. వారి కళ్లలో ఆయనకు చర్చి కనబడేది. కాబట్టే ఆయన్ను మురికివాడల బిషప్పు అని పిలుచుకునేవారు.



- గాజాలోని హోలీ ఫెయిత్ చర్చిలో తలదాచుకున్న క్రైస్తవులు, ముస్లిముల కోసం ప్రార్థించడానికి, వారికి ఊరడింపుగా ఉండటానికి పోప్ రాత్రి సమయాల్లో వాటికన్ నుంచి ఫోన్ చేసేవారు.

2023 అక్టోబరులో ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మొదలైనప్పటి ఉదంతమిది: గాజాలో హోలీ ఫెయిత్ చర్చి ఉంది. ఆ ఏకైక క్యాథలిక్ చర్చిలోనే క్రైస్తవులు, ముస్లిములు తల దాచుకున్నారు. వారి కోసం ప్రార్థించడానికి, వారికి ఊరడింపుగా ఉండటానికి పోప్ రాత్రి సమయాల్లో వాటికన్ నుంచి ఫోన్ చేసేవారు. ప్రపంచానికి తెలియని ఇలాంటి ఎన్నో అద్భుతమైన పనులు ఆయన చేశారు. వాటిలో ఇదొకటి. ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా తాను అనుకున్నది చేయడం సెయింట్ ఫ్రాన్సిస్ స్వభావం. అలా ఉండటానికే పోప్ ఫ్రాన్సిస్ కూడా ఇష్టపడేవారు. ఈ విషయాలు తెలిసిన ఆయన సన్నిహితులు సైతం వాటిని అందరి దృష్టికీ తెచ్చేందుకు ప్రయత్నించకపోవడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

స్వలింగ సంపర్కం పట్ల క్యాథలిక్ చర్చి వైఖరి కఠినంగా ఉంటుంది. ఈ కాఠిన్యాన్ని సడలించిన మొట్టమొదటి పోప్... ఫ్రాన్సిస్సే! తన విమర్శకులను ఉద్దేశించి, మంచో చెడో ''తీర్పు చెప్పడానికి నేనెవరిని?'' అని ప్రశ్నించారు. విడాకులు తీసుకున్నవారు, పునర్వివాహం చేసుకున్నవారు 'సాక్రమెంటు' స్వీకరించడంలో తప్పు లేదని చెప్పిన మొదటి పోప్ కూడా ఆయనే. నలుగురు మితవాద కార్డినల్స్ బాహాటంగా వ్యతిరేకించినప్పటికీ పోప్ తన అభిమతం మార్చుకోలేదు.

గర్భనిరోధం, గర్భస్రావం, స్వలింగ వివాహాలు, ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు వంటి అంశాల్లో ఆయన సంప్రదాయానికి లోబడి వ్యవహరించారు. ఏదేమైనా, ఆనవాయితీలను అధిగమించి నూతన భావనలు ప్రవేశపెట్టడాన్నే ఆయన ఇష్టపడేవారు.

ఎంత తిరిగినా మళ్లీ అక్కడకే వస్తాం... పోప్ ఫ్రాన్సిస్ సామాన్య జనం గురించి తపన పడేవాడు. వలసదారులు, శరణార్థుల సమస్యపై ఆయన తీసుకున్న వైఖరి దీన్ని రుజువు చేస్తుంది. పోప్ హోదాలో తన తొలి పర్యటనకు ల్యాంపెడుజా అనే ఇటలీ ద్వీపాన్ని ఎంచుకున్నారు. ఉత్తర అమెరికా అక్రమ వలసదారులను కలిసి వారి సమస్య పరిష్కరించడమే ఈ పర్యటన ఉద్దేశం. తాను జబ్బు పడటానికి కొన్ని వారాల ముందు కూడా, అక్రమ వలసదారులను నేరస్థులుగా పరిగణిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేపట్టిన విధానాలను పోప్ విమర్శించారు. మరే ఇతర దేశాధిపతీ ఇంతగా తెగించి ఉండడని వ్యాఖ్యానించారు.

ఇస్లాంతో అధికారికంగా చర్చ జరిపిన మొట్టమొదటి పోప్ కూడా ఆయనే. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఆయన బహిరంగ 'మాస్' నిర్వహించారు. అరబ్ ద్వీపకల్పంలో ఇలా చేయడం ఇదే ప్రథమం. ఈ మతాంతర సౌభ్రాతృత్వ చర్యల మీద మితవాదులు దాడి చేశారు. వారిని ఆయన అసలు పట్టించుకోలేదు.

పోప్ జీవితంలో వైఫల్యాలు లేవని చెప్పలేం. ముఖ్యంగా వాటికన్ మీద అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు ఆ వ్యవహారంలో సమర్థంగా వ్యవహరించలేకపోయారు. ఈ కేసులో కార్డినల్ ఏంజెలో బెచూ మీద ఆరోపణలు రుజువు అయ్యాయి. 2023లో జైలు శిక్ష కూడా పడింది. అంతిమంగా, పోప్ ఈ సమస్యను విస్తృత స్థాయిలో ఎదుర్కోలేక పోయారనే చెప్పాలి. ఒకటి మాత్రం వాస్తవం, ఆయన ముందున్న వారెవరూ ఆయన కంటే సమర్థులు కారు.

ఏమైనప్పటికీ, ఫ్రాన్సిస్ తన తర్వాత కూడా క్యాథలిక్ చర్చ్ తన ఆకాంక్షలకు అనుగుణంగా నడిచేలా జాగ్రత్తపడ్డారు. ఆయన వారసుడిని ఎన్నుకునే అర్హత 135 మంది కార్డినల్స్‌కు ఉంటుంది. వారిలో 108 మందిని తనే నియమించారు. అందులో యూరోపియన్లు 53 మంది కాగా, 82 మంది ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, నార్త్ అమెరికా, ఓసియానియా (ఆస్ట్రేలియా సహా అనేక ఇతర పసిఫిక్ దీవులు) ప్రాంతాల వారే! అంటే, ఆయన వారసుడు మరో యూరపేతరుడు అవుతాడా? అవకాశాలు అలానే ఉన్నాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

దశరథుడి మంత్రి మండలి

రాచరికాలు నడిచిన ప్రాచీన కాలంలో కూడా సమర్థులైన పాలకులెవరూ నిరంకుశులుగా, నియంతలుగా, కేవలం తమ ఇచ్ఛ వచ్చినట్టు పరిపాలించటం ఉండేది కాదు. మన పురాణేతిహాసాలలో ప్రసిద్ధులైన రాజులందరూ, రాజ్య పాలనకు సంబంధించిన కీలక నిర్ణయాలను, మేధావులయిన తమ మంత్రుల బృందాలతోనూ, ఇతర నిపుణులతోనూ, అవసరమయితే పౌర ప్రముఖులతోనూ, సామంతులతోనూ, జానపదులతోనూ విస్తృతంగా చర్చించిన తరవాతే తీసుకొనేవాళ్ళని కనిపిస్తుంది. అల్పబుద్ధులూ, ఆసురీ స్వభావులు మాత్రమే అధికార మదాంధకారంతో ధర్మాధర్మ విచక్షణ లేకుండా, నిరంకుశంగా, ఇష్టారాజ్యంగా పాలించి, అందరినీ అవస్థలు పెట్టి, అపయశస్సు కూడగట్టుకొని, ఆయువు తీరగానే కాలగర్భంలో కలిసిపోయేవాళ్ళు.

జ్యోతిర్మయం

దశరథుడు అరవయి వేల సంవత్సరాలపాటు ధర్మబద్ధంగా, ప్రజారంజకంగా పాలన చేశాడని రామాయణం చెబుతుంది. ఏ కీలక నిర్ణయమైనా, ఆయన సంబంధితులందరితో విస్తృతంగా చర్చించిగానీ తీసుకొనేవాడు కాదు అని వాల్మీకి వక్కాణించాడు.

దశరథుడికి ఒక సమర్థమైన మంత్రిమండలి ఉండేది. వాళ్ళలో ప్రధానమైన మంత్రులు ఎనిమిది మంది: ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడు. వీళ్ళుగాక, దశరథుడికి వసిష్ఠుడు, వామదేవుడు ముఖ్య పురోహితులుగా, ధర్మ నిర్దేశకులుగా, గురువులుగా ఉండేవాళ్ళు.

వాళ్ళ వాళ్ళ నేపథ్యం గురించి ఎంతో పరిశోధన జరిపించిన తరవాతే, దశరథుడు తన మంత్రులను నియమించుకొనేవాడు. వాళ్ళు ఎన్నో పరీక్షలు నెగ్గవలసి ఉండేది. అందుకే ఆ మంత్రులందరూ పరువు ప్రతిష్ఠలు కలవారుగా, సంస్కారులుగా, శాస్త్ర జ్ఞాన నిష్ణాతులుగా ఉండేవారు. వాళ్ళు కుశాగ్ర బుద్ధులు, విద్యావంతులు, లోకజ్ఞులు, నీతి వేత్తలు. ఎప్పుడూ రాజు శ్రేయస్సునూ, రాజ్య శ్రేయస్సునూ కాంక్షించే నిస్వార్థపరులు, నిజాయతీపరులు. అపరాధులయితే, సొంత పుత్రులనయినా నియమానుసారం దండించే నిష్పక్షపాతులు.

ఇంతటి నిపుణులతో, నీతిమంతులతో, ధర్మజ్ఞులతో అన్ని విషయాలూ కూలంకషంగా చర్చించిన తరవాతే అన్ని ముఖ్యమైన నిర్ణయాలూ తీసుకోవటం జరిగేది. కనకనే దశరథుడి సుదీర్ఘ పాలనలో ప్రజలంతా ధర్మమార్గంలో తృప్తిగా, సుఖశాంతులతో జీవించారు అని వాల్మీకి రామాయణం వర్ణిస్తుంది.

– ఎం. మారుతి శాస్త్రి

सड़क परिवहन एवं राजमार्ग मंत्रालय, भारत सरकार | भारतीय राष्ट्रीय राजमार्ग प्राधिकरण

₹6100 కోట్ల విలువైన ప్రాజెక్టులతో తెలంగాణ సాధికారత



శంఖుస్థాపన మరియు జాతికి అంకితం

ఆసిఫాబాద్

జాతికి అంకితం

NH-363 మంచిర్యాల - తెలంగాణ/మహారాష్ట్ర సరిహద్దు వరకు 4 వరుసల రహదారి నిర్మాణం
పొడవు : 94.6 కి.మీ., వ్యయం: ₹3526 కోట్లు

NH-61 నిర్మల్ - ఖానాపూర్ సెక్షన్‌లో 2 వరుసల పేవ్డ్‌షోల్డర్‌తో రహదారి నిర్మాణం
పొడవు : 17.79 కి.మీ., వ్యయం: ₹127 కోట్లు

NH-44 నాగ్‌పూర్ - హైదరాబాద్ సెక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణం
పొడవు : 1 కి.మీ., వ్యయం: ₹29 కోట్లు

NH-44 నాగ్‌పూర్ - హైదరాబాద్ సెక్షన్‌లో సర్వీస్‌రోడ్లు మరియు జంక్షన్‌ల అభివృద్ధి
పొడవు : 2 కి.మీ., వ్యయం: ₹18 కోట్లు

శంఖుస్థాపన

NH-44 నాగపూర్ - హైదరాబాద్ సెక్షన్‌లో 4 అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు మరియు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం
పొడవు : 8 కి.మీ., వ్యయం: ₹173 కోట్లు

NH-63 ఆర్మూర్ - జగిత్యాల - మంచిర్యాల సెక్షన్‌లో 4 వరుసల రహదారి విస్తరణ
పొడవు : 3 కి.మీ., వ్యయం: ₹29 కోట్లు

హైదరాబాద్

జాతికి అంకితం

NH-44 ఆరాంఘర్ - శంషాబాద్ సెక్షన్లో 6 వరుసల రహదారి విస్తరణ
పొడవు : 10 కి.మీ., వ్యయం: ₹301 కోట్లు

NH-202 అంబర్‌పేట్ x రోడ్డు వద్ద 4 వరుసల ఫ్లై ఓవర్ నిర్మాణం
పొడవు : 1.66 కి.మీ., వ్యయం: ₹266 కోట్లు

NH-65 పూణే - హైదరాబాద్ సెక్షన్‌లో BHEL జంక్షన్ వద్ద 6 వరుసల ఫ్లై ఓవర్ నిర్మాణం
పొడవు : 1.65 కి.మీ., వ్యయం: ₹173 కోట్లు

NH-44 నాగ్‌పూర్ - హైదరాబాద్ సెక్షన్‌లో 5 అండర్‌పాస్‌లు నిర్మాణం
పొడవు : 7.8 కి.మీ., వ్యయం: ₹148 కోట్లు

NH-163 హైదరాబాద్ - వరంగల్ సెక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణం
పొడవు : 1.7 కి.మీ., వ్యయం: ₹36 కోట్లు

శంఖుస్థాపన

NH-930P గౌరెల్లి - వలిగొండ సెక్షన్‌లో రెండు వరుసల పేవ్డ్‌షోల్డర్ రహదారి విస్తరణ
పొడవు : 42 కి.మీ., వ్యయం: ₹683 కోట్లు

NH-65 హైదరాబాద్ - విజయవాడ సెక్షన్‌లో ఫ్లైఓవర్, 12 అండర్‌పాస్‌లు మరియు సర్వీస్ రోడ్ల నిర్మాణం
పొడవు : 12 కి.మీ., వ్యయం: ₹397 కోట్లు

NH-163 హైదరాబాద్ - యాదగిరి సెక్షన్‌లో ఫ్లైఓవర్ మరియు 3 అండర్‌పాస్‌లు నిర్మాణం
పొడవు : 5 కి.మీ., వ్యయం: ₹125 కోట్లు

NH-44 నాగపూర్ - హైదరాబాద్ సెక్షన్‌లో అండర్‌పాస్ మరియు సర్వీస్ రోడ్ల నిర్మాణం
పొడవు : 3 కి.మీ., వ్యయం: ₹41 కోట్లు

ప్రయోజనాలు

- తెలంగాణ, మహారాష్ట్ర మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అవాంతరం లేని, సురక్షితమైన మరియు వేగవంతమైన ప్రయాణం.
- రామగుండంలోని NTPC ప్లాంట్, సింగరేణి బొగ్గు గనులు, కాళేశ్వరం దేవాలయం (దక్షిణ కాశి) లకు మెరుగైన అనుసంధానం.

- ప్రయాణికులకు ఇబ్బంది లేని రాకపోకలు, సరుకు రవాణా సులువు మరియు వేగవంతం.
- ఆరాంఘర్ - శంషాబాద్ ప్రాంతంలో వాణిజ్య/పారిశ్రామిక ఆర్థికాభివృద్ధి వేగవంతం.

- నిర్మల్-జగిత్యాల్ సెక్షన్ మధ్య ప్రయాణ సమయం మరియు వ్యయం తగ్గింపు
- శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయం & వారసత్వ ప్రదేశాలను అనుసంధానించడం ద్వారా పర్యాటక రంగానికి ప్రోత్సాహం.

- అంబర్‌పేట & BHEL జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, పారిశ్రామిక కారిడార్ మరియు ఆర్థిక మండలాలకు సులభమైన మరియు వేగవంతమైన అనుసంధానం

- మహబూబాబాద్, కొత్తగూడెం యొక్క ఆకాంక్షిత మరియు గిరిజన జిల్లాల్లో సామాజిక-ఆర్థిక అభివృద్ధి.
- భద్రాచలం దేవాలయము, పోచంపల్లి మొదలైన పర్యాటక ప్రదేశాలు అనుసంధానం ద్వారా ప్రయాణం వేగవంతం.

- అండర్‌పాస్‌ల నిర్మాణం ద్వారా మెరుగైన రహదారి భద్రత మరియు వివిధ పట్టణాలలో ట్రాఫిక్ రద్దీ తగ్గింపు.
- ఇంధనం ఆదా, కాలుష్యం మరియు వాహన నిర్వహణ వ్యయం తగ్గింపు.

నితిన్ గడ్కరి

కేంద్ర రోడ్డు రవాణా & రహదారుల శాఖ మంత్రి

వారి అమృత హస్తాల మీదుగా

సోమవారం 05 మే, 2025
ఉదయం 10:00 గంటలకు, కాగజ్‌నగర్ X రోడ్, (ఆసిఫాబాద్) | సాయంత్రం 05:00 గంటలకు, అంబర్‌పేట GHMC గ్రౌండ్స్ (హైదరాబాద్)

వీరి ఘనమైన సమక్షంలో

జి. కిషన్ రెడ్డి

కేంద్ర బొగ్గు & గనుల శాఖ మంత్రి, భారత ప్రభుత్వం

అజయ్ టమ్టా — కేంద్ర సహాయ మంత్రి, రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం

హర్ష్ మల్హోత్ర — కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు రహదారి రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి, భారత ప్రభుత్వం

బండి సంజయ్ కుమార్ — హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి, భారత ప్రభుత్వం

కోమటిరెడ్డి వెంకటరెడ్డి — రోడ్లు & భవనాల శాఖ మంత్రి, సినిమాటోగ్రఫీ, తెలంగాణ ప్రభుత్వం

పార్లమెంట్ సభ్యులు

గోదం నగేశ్ | ధర్మపురి అరవింద్ | సురేష్ కుమార్ షెట్కర్ | వంశీ కృష్ణ గడ్డం | చామల కిరణ్ కుమార్ రెడ్డి

కుందూరు రఘువీరారెడ్డి | ఎం. రఘునందన్ రావు | కొండా విశ్వేశ్వర్ రెడ్డి | అనిల్ కుమార్ యాదవ్ | కేశినేని శివనాథ్

CBC 37107/15/0003/2526

सड़कें ही नहीं, राष्ट्र का निर्माण भी

FOR LIVE STREAMING : www.facebook.com/nitingadkary | https://twitter.com/nitin_gadkari | www.youtube.com/c/NitinGadkariOfficial

అవే ఉద్రిక్తతలు

పదో రోజూ కొనసాగిన పాక్ కాల్పులు

- మోదీతో ఎయిర్‌ఫోర్స్ చీఫ్ కీలక భేటీ
- త్వరలో తగిన సమాధానం: రాజ్‌నాథ్
- ప్రజలు కోరేదే జరుగుతుందన్న మంత్రి
- 'ఆర్డినెన్స్' సిబ్బంది సెలవులు రద్దు
- కరాచీ తీరానికి తుర్కియే యుద్ధనౌక
- త్వరలో వైమానిక ఘర్షణ: పాక్ మంత్రి
- అవసరమైతే భారత్‌పైకి అణుబాంబు
- రష్యాలో పాక్ దౌత్యవేత్త ప్రేలాపనలు



ఆదివారం పూంచ్‌లో నియంత్రణ రేఖ వద్ద బీఎస్ఎఫ్ జవాను పహారా

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: అవే ఉద్రిక్తతలు. అదే ఉత్కంఠ. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్, పాక్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు ఏమాత్రం చల్లారడం లేదు. దాయాది కవ్వింపు చర్యలు ఆగడం లేదు. నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం వరుసగా పదో రోజూ కాల్పులకు తెగబడింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం దాకా జమ్మూ కశ్మీర్‌లో కుప్వారా, పూంచ్, రాజౌరీ, మేంధార్, నౌషేరా, సుందర్బనీ, అఖ్నూర్ తదితర 8 ప్రాంతాల్లో కాల్పులు చోటుచేసుకున్నాయి. వాటిని సైన్యం గట్టిగా తిప్పికొట్టింది. వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాలు, భారత్–పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై చర్చించారు. నావికా దళాధిపతి చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠితో సమావేశమైన 24 గంటల్లోపే ఎయిర్ చీఫ్ మార్షల్‌తో మోదీ మాట్లాడడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉగ్రదాడులపై ప్రతీకారం విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, భారత వాయుసేనతో త్వరలో ఘర్షణ జరగవచ్చంటూ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కొత్త పల్లవి అందుకున్నారు. తమ గగనతలంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన భారత రఫేల్ యుద్ధ విమానాలను అడ్డుకున్నట్టు చెప్పుకున్నారు. మరోవైపు మిత్ర దేశాల మద్దతు కూడగట్టేందుకు పాక్ ప్రయతిస్తోంది. తుర్కియేకు చెందిన భారీ యుద్ధనౌక ఆదివారం కరాచీ తీరం చేరుకుంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై దాడికి తెగబడ్డ వారికి త్వరలో మర్చిపోలేని రీతిలో సమాధానం చెప్పి తీరతామని పునరుద్ఘాటించారు. ''సైనికులను కాపాడటం నా బాధ్యత. ప్రధాని మోదీ పట్టుదల అందరికీ తెలుసు. ప్రజలు కోరుతున్నది ఆయన నాయకత్వంలో జరిగి తీరుతుంది'' అని ప్రకటించారు.

దీర్ఘకాల సెలవులు రద్దు

ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల సిబ్బందికి దీర్ఘకాల సెలవులు రద్దు చేస్తూ మ్యునీషియన్స్ ఇండియా లిమిటెడ్ (ఎంఐఎల్) ఆదేశాలు జారీ చేసింది. ఎంఐఎల్ పరిధిలో 12 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలున్నాయి. సైన్యానికి అవసరమైన ఆయుధాలు వాటిలో తయారవుతాయి. ఆయుధ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికే సెలవులు రద్దు చేసినట్లు ఎంఐఎల్ అధికారి ఒకరు చెప్పారు.

భద్రతా మండలికి పాక్

పహల్గాం దాడిని అడ్డు పెట్టుకొని భారత్ తమను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తోందని పాక్ వాపోయింది. దీనిపై ఐరాస భద్రతా మండలిని ఆశ్రయిస్తామని పాక్ ప్రకటించింది. వీలైనంత త్వరగా భద్రతామండలి భేటీ జరిగేలా చూడాలని ఐరాసలోని తమ శాశ్వత ప్రతినిధి, రాయబారి అసీం ఇఫ్తికార్‌ను పాక్ విదేశాంగ శాఖ ఆదేశించింది. ''సింధూ జల ఒప్పందం నిలిపివేత ప్రాంతీయ శాంతిభద్రతలకు దెబ్బ. భారత్ వైఖరిని అంతర్జాతీయ సమాజానికి వివరిస్తాం'' అని చెప్పుకొచ్చింది. భద్రతా మండలిలో పాక్ తాత్కాలిక సభ్యదేశం.

నేడు పాక్ పార్లమెంట్ ప్రత్యేక భేటీ

భారత్‌తో ఉద్రిక్తతలపై చర్చించేందుకు పాక్ పార్లమెంట్ సోమవారం సాయంత్రం ప్రత్యేకంగా సమావేశం కానుంది. సింధూ ఒప్పందం నిలిపివేత వంటి అంశాలపైనా చర్చిస్తామని ఎంపీలు తెలిపారు.

మళ్లీ 'అణు' ప్రేలాపనలు

పాక్ మరోసారి అణు ప్రేలాపనలకు దిగింది. పాక్‌లోని కొన్ని భూభాగాలపై భారత్ త్వరలో దాడి చేయనున్నట్లు తమకు సమాచారముందని రష్యాలో ఆ దేశ రాయబారి మొహమ్మద్ ఖలీద్ జమాలీ చెప్పుకొచ్చారు. ''దాడికి దిగితే భారత్‌కు గట్టిగా బదులిస్తాం. అణ్వాయుధాలు సహా సర్వశక్తులూ ప్రయోగిస్తాం'' అని హెచ్చరించారు. యుద్ధం జరిగితే పాక్ కచ్చితంగా అణ్వాయుధాలు ప్రయోగిస్తుందన్నారు. భారత్‌పై అణు బాంబులు ప్రయోగిస్తామని పాకిస్తాన్‌మంత్రి హనీఫ్ అబ్బాసీ కొన్ని రోజుల క్రితం హెచ్చరించిన సంగతి తెలిసిందే.

కేవలం 4 రోజుల్లో చేతులెత్తేయడమే!

అత్యంత దుస్థితిలో పాక్ ● మందుగుండుకూ దిక్కు లేదు



పహల్గాం ఉగ్రదాడిపై భారత్ ప్రతీకార చర్యలతో పాకిస్తాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఏ క్షణాన ఎలా విరుచుకుపడుతుందోనని బిక్కుబిక్కుమంటోంది. దీటైన ప్రతిస్పందన, అవసరమైతే అణుబాంబులు అంటూ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల మాత్రం వణికిపోతోంది. భారత్‌ను ఎలాగోలా నిలువరించండంటూ అరబ్ దేశాలను బామాలుతోంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. పాక్ సాయుధ సన్నద్ధత, ఆయుధ సంపత్తి అత్యంత దారుణంగా ఉన్నట్టు అక్కడి మీడియానే చెబుతోంది. ఇప్పటికిప్పుడు భారత్‌తో యుద్ధానికి తలపడాల్సి వస్తే పాక్ కేవలం నాలుగు రోజులు మాత్రమే ఎంతో కొంత పోరాడగలదని, తర్వాత చేతులెత్తేయడం మినహా మరో మార్గం లేదని తెలుస్తోంది.

నిండుకున్న మందుగుండు

భూతల యుద్ధంలో కీలకమైన శతఘ్నులు, మోర్టార్లు, తుపాకుల్లో వాడే అన్నిరకాల మందుగుండూ పాక్ వద్ద దాదాపు ఖాళీ అయినట్టు తెలుస్తోంది. సైన్యం వద్ద కేవలం నాలుగు రోజులకు సరిపడే నిల్వలు మాత్రమే ఉన్నాయి. పాక్‌కు ప్రధానంగా మందుగుండు సరఫరా చేసే సంస్థలు ఇప్పుడు గాజా, ఇజ్రాయెల్ యుద్ధం, ఉక్రెయిన్ యుద్ధాలకు మందుగుండు సరఫరాలో బిజీగా ఉన్నాయి. దాంతో పాక్ అవసరాలను తీర్చే నాథుడే లేకుండా పోయాడు. అంతర్జాతీయంగా మందుగుండుకు ఇప్పుడున్న డిమాండ్ నేపథ్యంలో వాటిని కొనే స్తోమత, ఆర్థిక బలం కూడా పాక్‌కు లేవు. దీనికితోడు దేశీయంగా మందుగుండు, ఆయుధాలను తయారు చేసే పాక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తీవ్ర ముడిసరుకుల కొరతను ఎదుర్కొంటోంది. పైగా దాని సాంకేతికత పాత తరానిది కావడంతో పెద్దగా పనికొచ్చే పరిస్థితి కూడా లేదు. ఉక్రెయిన్‌తో గత ఒప్పందం మేరకు ఆ దేశానికి పాక్ ఇటీవలి దాకా భారీగా మందుగుండు సరఫరా చేసింది. తీరా ఇప్పుడు సొంత అవసరాలకు సరిపడా నిల్వ ల్లేక తెగ తిప్పలు పడుతోంది. యుద్ధమే వస్తే ప్రస్తుత మందుగుండు నిల్వలు 96 గంటల్లోపే ఖాళీ అవుతాయని పాక్‌లోని విశ్వసనీయ సైనిక వర్గాలు వెల్లడించాయి.

హోవిట్జర్లకూ మందుగుండు కొరతే

పాక్ ఎం109 హోవిట్జర్లలో ఉపయోగించే 155 ఎంఎం షెల్స్, బీఎం–21 మల్టిపుల్ రాకెట్ లాంచింగ్ వాహనాల్లో వాడే 122 ఎంఎం రాకెట్లకు కూడా తీవ్ర కొరత ఏర్పడింది. ఉక్రెయిన్ యుద్ధం మొదట్లో ఆ దేశానికి పాక్ 155 ఎంఎం షెల్ మందుగుండు ఎడాపెడా ఎగుమతి చేసింది. దాంతో వాటి నిల్వలు భారీగా తగ్గిపోయాయి. మౌంటెడ్ గన్ సిస్టమ్(ఎంజీఎస్) వ్యవస్థలో వాడే మందుగుండునూ ఉక్రెయిన్‌కు భారీగా ఇచ్చేసింది. అవీ తగ్గిపోవడంతో గాబరా పడుతోంది. ఈ పరిస్థితుల్లో భారత్ గనుక అధునాతన ఆయుధాలతో సరిహద్దు దాటి వస్తే నిలువరించేందుకు శతఘ్నులు మందుగుండుతో సిద్ధంగా లేవని మే 2న జరిగిన పాక్ స్పెషల్ కోర్ కమాండర్స్ భేటీలో సైన్యాధికారులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

కాలూచేయీ కూడదీసుకుంటూ...

అందుబాటులో ఉన్న కొద్దిపాటి మందుగుండును వీలైనంతగా భారత సరిహద్దులకు పాక్ తరలిస్తోంది. అక్కడ ఇప్పటికే మందుగుండు నిల్వ చేసి పెట్టుకుందని విశ్వసనీయ సమాచారం. మందుగుండు కొరతను గతంలో కూడా పాక్ ప్రభుత్వ వర్గాలే ఒప్పుకున్నాయి. యుద్ధం వస్తే ఎదుర్కోవడానికి సరిపడా ఆయుధాలు కూడా లేవని నాటి పాక్ ఆర్మీ చీఫ్ ఖమర్ జావేద్ బజ్వా వాపోయారు. దీర్ఘకాలం పాటు యుద్ధం చేయడం పాక్ దళాలకు అసాధ్యమని కుండబద్దలు కొట్టారు. గగనతలంలో యుద్ధ విమానాలు, డ్రోన్లతో ఎంతగా పోరాడినా భూభాగాన్ని కాపాడుకోవడమే యుద్ధాల్లో కీలకం. కానీ నేవీ, ఎయిర్‌ఫోర్స్‌తో పోలిస్తే పాక్ ఆర్మీ పాటవం, సన్నద్ధత అత్యంత అధ్వానమని తెలుస్తోంది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

సరిహద్దుల్లో మరింత సైన్యం

16 అదనపు బెటాలియన్లు

న్యూఢిల్లీ: పాకిస్తాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల వెంట భారత సైనికుల మొహరింపును మరింత బలోపేతం, విస్తృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. సరిహద్దుల వెంట కొత్తగా 16 బెటాలియన్లు, రెండు ఫీల్డ్ ప్రధాన కార్యాలయాల ఏర్పాటుకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారం తెలిపినట్లు బీఎస్ఎఫ్‌లోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వం కూలిపోయాక మారిన పరిస్థితులు, పహల్గాం ఉదంతం తర్వాత పాకిస్తాన్ సరిహద్దు వెంట ఉద్రిక్తతలు నెలకొన్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకోనుందని ఆయా వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఇరు దేశాల సరిహద్దుల వెంట 193 బెటాలియన్లు మొహరించాయి. ఒక్కో బెటాలియన్‌లో సైన్యాధికారులుసహా వేయి మందికిపైగా సైనికులుంటారు. కొత్తగా 16 బెటాలియన్లు అందుబాటులోకి వస్తే ఏకంగా 17,000 మంది సైనికులు విధుల్లోకి వస్తారు.

యుద్ధమొస్తే ఇంగ్లండ్ వెళ్లిపోతా

పాకిస్తాన్ ఎంపీ షేర్‌ఖాన్ వ్యాఖ్యలు



ఇస్లామాబాద్: పాక్‌తో యుద్ధం వస్తే దేశం కోసం పోరాడతామని భారత్‌లోని రాజకీయ నేతలు ప్రకటిస్తుంటే పాకిస్తాన్‌లోని ఒక ఎంపీ మాత్రం పారిపోతానని సెలవిచ్చారు. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి, ఎంపీ షేర్ అఫ్జల్ ఖాన్‌ను పహల్గాం తదనంతర పరిణామాలపై మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. ''భారత్‌తో సంబంధాలు పూర్తిగా చెడిపోయి యుద్ధం వస్తే పాక్ పౌరునిగా తుపాకీ పట్టుకొని సరిహద్దుకు వెళ్లి దేశం కోసం పోరాడతారా?' అని అడిగారు. ''లేదు. నిజంగా యుద్ధమే వస్తే వెంటనే ఇంగ్లండ్‌కు వెళ్లిపోతా'' అని షేర్‌ఖాన్ ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'భారత ప్రధాని మోదీ శాంతించి ఒక అడుగు వెనక్కి వేస్తే ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయని భావిస్తున్నారా?' అని ప్రశ్నించగా.. ''నేను చెప్పగానే వెనకడుగు వేయడానికి మోదీ ఏమైనా నా అత్త కొడుకా?'' అంటూ షేర్‌ఖాన్ ఎదురు ప్రశ్నించారు. ఆయన ఇమ్రాన్ తరఫున పాక్ సుప్రీంకోర్టులో పలు కేసులు వాదించారు. మానవ హక్కుల కార్యకర్త కూడా. షేర్‌ఖాన్ వ్యాఖ్యలపై నెటిజన్లు వ్యంగ్య వ్యాఖ్యలు మొదలెట్టారు. ''షేర్ (సింహం) పేరు పెట్టుకుని పిల్లిలా పారిపోతానంటున్నాడు. పైగా ఇతను ఎంపీ కూడా. ఎంపీ హోదాలో పాక్ ప్రజలకు ఇచ్చే సందేశం ఇదేనా?'' అంటూ ట్రోల్ చేస్తున్నారు.

లోయలో పడ్డ వాహనం.. ముగ్గురు జవాన్ల దుర్మరణం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో జేసీవో సహా ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. జమ్మూ–శ్రీనగర్ 44వ జాతీయ రహదారిపై వెళ్తున్న కాన్వాయ్‌లోని ఒక ట్రక్కు చష్మా సమీపంలో 500 అడుగుల లోతైన లోయలోకి జారి పడిపోయింది. ఆర్మీ, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసు బృందాలు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. వాహనంలోని ముగ్గురు సైనికులు వీరమరణం పొందారని అధికారులు తెలిపారు. మృతులను జేసీవో సుజీత్ కుమార్, డ్రైవర్ అమిత్ కుమార్, సిపాయి మన్ బహదూర్‌గా గుర్తించారు. ప్రమాద తీవ్రతకు వాహనం గుర్తు పట్టలేనంతగా నుజ్జయింది. వాహనంలో సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తేలినట్టు రాంబన్ సీనియర్ ఎస్పీ కుల్బీర్ సింగ్ చెప్పారు. ప్రమాదంపై కాంగ్రెస్ పార్టీ విచారం వ్యక్తం చేసింది.

ఎయిర్‌హోస్టెస్‌పై లైంగిక వేధింపులు

ముంబై: మద్యం మత్తులో ఎయిర్‌హోస్టెస్‌ను ప్రయాణికుడు లైంగికంగా వేధించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం ఇండిగో విమానం ఢిల్లీ నుంచి షిర్డీ వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. విమానంలోని టాయిలెట్ సమీపంలో ఎయిర్‌హోస్టెస్‌ను ప్రయాణికుడు అనుచితంగా తాకాడు. ఈ అసభ్యకర చర్యతో విసిగిపోయిన ఎయిర్ హోస్టెస్ తన క్రూ మేనేజర్‌కు సమాచారం అందించింది. దీంతో షిర్డీ విమానాశ్రయంలో ఇండిగో విమానం ల్యాండ్ కాగానే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

అణ్వాయుధాల అవసరం రాదేమో: పుతిన్

మాస్కో: ఉక్రెయిన్ సంక్షోభానికి ఆశించిన విధంగానే ఒక తార్కికమైన ముగింపు తీసుకువచ్చే సత్తా, సామర్థ్యం రష్యాకు ఉన్నాయని అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పైకి అణ్వాయుధాలను ప్రయోగించాల్సిన అవసరం రాలేదని, ముందు కూడా రాదని భావిస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ టీవీకిచ్చిన ఇంటర్వ్యూలో విశేషాలు టెలిగ్రామ్‌లో వెల్లడయ్యాయి. ప్రపంచంలోనే అత్యధిక అణ్వాయుధాలను కలిగిన రష్యా ప్రభుత్వం 2024లో సవరించిన అణు విధానం ప్రకారం..అవసరమనిపిస్తే వాటిని ప్రయోగించే అధికారాలను అధ్యక్షుడు పుతిన్‌కు కట్టబెట్టింది.

సంస్కృతమే మాతృక: అమిత్ షా

న్యూఢిల్లీ: సంస్కృతం దాదాపుగా అన్ని భారతీయ భాషలకు తల్లి వంటిదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రభుత్వానికి ఏ భాషపైనా వ్యతిరేకత లేదని, మాతృభాషకు ఎవరినీ దూరం చేయబోమని స్పష్టం చేశారు. ఆదివారం 1008 సంస్కృత సంభాషణ్ శిబిర్స్ ముగింపు కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ప్రపంచంలోని అత్యంత శాస్త్రీయమైన ఏకైక భాష సంస్కృతమని, వ్యాకరణపరంగా తిరుగులేని నిర్మాణం దాని సొంతమని అన్నారు. దాని పునరుజ్జీవనానికి సమయం, ప్రయత్నం కావాలన్నారు.

సిక్కు అల్లర్లకు బాధ్యత తీసుకుంటా

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

వాషింగ్టన్: 1984లో ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో కాంగ్రెస్ పాత్ర ఉందని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ అంగీకరించారు. ''కాంగ్రెస్ పార్టీ చరిత్రలో పాల్పడిన అన్ని తప్పులకు, నా రాజకీయ జీవితం ప్రారంభం కావడానికి ముందు జరిగిన వాటికి సైతం బాధ్యత వహించేందుకు సిద్ధంగా ఉన్నా'' అన్నారు. ఇటీవల అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో జరిగిన ముఖాముఖి ఇందుకు వేదికైంది. ఆనంద్‌పూర్ సాహిబ్ తీర్మానంపై వేర్పాటువాద ముద్ర వేయడం, ఢిల్లీ సిక్కు వ్యతిరేక అల్లర్లలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సజ్జన్ కుమార్, గిల్ వంటి వారికి కాంగ్రెస్ బాసటగా నిలవడం తదితరాలపై ఓ సిక్కు వ్యక్తి రాహుల్‌ను సూటి ప్రశ్నలడిగారు. వీటికి రాహుల్ పై విధంగా సమాధానమిచ్చారు. ''1980ల్లో జరిగింది తప్పని బహిరంగంగానే ప్రకటించా. రాముడు సహా మన పురాణ పురుషులంతా క్షమాగుణం కలవారు, కరుణామయులు'' అన్నారు. రాముడిని పురాణ పురుషుడని రాహుల్ పేర్కొనడాన్ని బీజేపీ తప్పుబట్టింది.

40 మొబైల్, వెబ్ యాప్స్‌కు ఒకటే వేదిక

ఈసీఐఎన్ఈటీ పేరిట ప్లాట్‌ఫాం: ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికల సంబంధ అన్ని కార్యకలాపాలను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. వేర్వేరు సేవలకు వేర్వేరు పేర్లతో అందుబాటులో ఉన్న ఓటర్ హెల్ప్‌లైన్, ఓటర్ టర్న్‌ఔట్, సీవిజిల్, సువిధ, సాక్ష్యం వంటి 40కిపైగా మొబైల్ యాప్‌లు, వెబ్ అప్లికేషన్లను విలీనం చేసే ఒకే వేదికను ముందుకు తీసుకొస్తామని ఈసీ ఆదివారం ప్రకటించింది. ఇందుకోసం ఈసీఐఎన్ఈటీ పేరుతో కొత్త ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించబోతున్నట్లు పేర్కొంది. ఇన్నాళ్లు ఎన్నికల సంబంధ దరఖాస్తులు, సేవలకు వేర్వేరు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం, పాస్‌వర్డ్ వంటి క్రెడెన్షియల్స్‌ను గుర్తుంచుకోవడం యూజర్లకు తలకు మించిన భారమయ్యేది. వాటికి ఇకపై ఒకే ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు.

నిరాఘాటంగా 15 గంటలు విలేకరుల సమావేశం

ముయిజ్జు ప్రపంచ రికార్డు ● జెలెన్‌స్కీని అధిగమించిన మాల్దీవ్స్ అధ్యక్షుడు



మాలే: మాల్దీవ్స్ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు (46) సరికొత్త రికార్డు సృష్టించారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 15 గంటలపాటు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు! ఈ విషయంలో ఇప్పటిదాకా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేరిట ఉన్న రికార్డును తిరగరాశారు. ముయిజ్జు విలేకరుల సమావేశం శనివారం ఉదయం పదింటికి ప్రారంభమైంది. 14 గంటల 54 నిమిషాలపాటు కొనసాగింది. కేవలం ప్రార్థనల కోసం మధ్యలో కాసేపు విరామం ఇచ్చారు. ''దాదాపు 25 మంది విలేకరుల ప్రశ్నలకు ముయిజ్జు విరామం లేకుండా సమాధానాలిచ్చారు. 15 గంటల పాటు మాట్లాడి ప్రపంచ రికార్డు నెలకొల్పారు'' అని మాల్దీవ్స్ ప్రభుత్వం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 2019 అక్టోబర్‌లో ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ 14 గంటల పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అదొక రికార్డుగా నిలిచిపోయింది. అంతకుముందు రికార్డు బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో పేరిట ఉండేది. ఆయన ఏడు గంటలపాటు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ముయిజ్జుకు ముందు మాల్దీవ్స్ అధ్యక్షుడిగా చేసిన మొహమ్మద్ నషీద్ కూడా ఒక రికార్డు సృష్టించారు. 2009లో ఆయన ప్రపంచంలోనే తొలిసారి సముద్రం అడుగు భాగాన కేబినెట్ సమావేశం నిర్వహించారు! వాతావరణ మార్పులతో సముద్ర మట్టం పెరిగిపోతోందని, ఫలితంగా తమ దేశం మునిగిపోయే ప్రమాదముందని ప్రపంచ దేశాల దృష్టికి తీసుకురావడానికే ఈ సాహసానికి పూనుకున్నారు.

అంతరిక్షంలో 'డాగ్‌ఫైట్'


ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలతో ఇస్రో విన్యాసాలు



సూళ్లూరుపేట: ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలతో అంతరిక్షంలో డాకింగ్ (అనుసంధానం), అన్‌డాకింగ్ (విడతీత) ప్రయోగాలను విజయవంతం చేసి సత్తా చాటిన ఇస్రో మరో ఘనత సాధించింది. అంతరిక్షంలో తొలిసారిగా డాగ్‌ఫైట్ విన్యాసాన్ని కూడా విజయవంతంగా పూర్తి చేసింది. యుద్ధవిమానాలు శత్రు ఫైటర్ జెట్‌ను కూల్చేందుకు వాటిని వెంబడించే విన్యాసాలను డాగ్‌ఫైట్ అంటారు. శత్రు విమానం నుంచి దూసుకొచ్చే క్షిపణి నుంచి తప్పించుకునేందుకు గింగిరాలు తిరగడం వంటివన్నీ దాని కోవలోకే వస్తాయి. ఇస్రో తొలిసారిగా ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలతో ఈ ఫీట్ చేసింది. అవిప్పుడు భూమి నుంచి 500 కి.మీ. ఎత్తులో గంటకు 28,800 కిలోమీటర్ల వేగంతో తిరుగుతున్నాయి. అంటే సాధారణ పౌరవిమానం కంటే 28 రెట్లు ఎక్కువ. తూటా కంటే 10 రెట్లు ఎక్కువ. అంత వేగంగా తిరుగుతున్న ఉపగ్రహాలను అత్యంత సమన్వయంతో పని చేయించి డాగ్‌ఫైట్ విన్యాసాన్ని పూర్తి చేసినట్టు ఇస్రో ప్రకటించింది. కొన్ని వారాల క్రితం ఇదే విన్యాసం చేసిన చైనాపై అమెరికా గుర్రుగా ఉన్నవేళ భారత్ కూడా అదే ప్రక్రియ చేపట్టడం విశేషం. డాగ్‌ఫైట్ విజయవంతమవడంపై ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ఆనందం వ్యక్తం చేశారు. ''కీలక ప్రక్రియల తర్వాత కూడా ఉపగ్రహాల్లో సగం దాకా ఇంధనం మిగిలే ఉంది. 2.5 కేజీల ఇంధనంతో ఇలాంటి కీలక మిషన్‌ను పొడిగించవచ్చు'' అని ఆయన చెప్పారు. ''అంతరిక్షంలో డాగ్‌ఫైట్‌తో భారత్ సమయంలో సరైన సాంకేతికతను ప్రదర్శించింది. తన శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటింది. అధునాతన స్వదేశీ పరిజ్ఞానంతో శాంతియుత రోబోటైజేషన్‌ను భారత్ ప్రదర్శించింది. స్పేస్ టెక్నాలజీలో అందుబాటులోకి వస్తున్న ఇలాంటి ఆధునికత, స్వయంచాలిత వ్యవస్థలనే ఆత్మనిర్భరత భారత్‌లో భాగంగా దేశం కోరుకుంటోంది'' అని అంతరిక్ష సంబంధ స్వతంత్ర మేధో సంస్థ ఆత్మ నిర్భర్ సోచ్ వ్యవస్థాపక డైరెక్టర్, మాజీ బ్రిగేడియర్ అన్షుమన్ నారంగ్ అన్నారు. ఒక ఉపగ్రహం చుట్టూ మరో ఉపగ్రహం తిరిగేలా (పరిక్రమ) చూసే ప్రక్రియను కూడా డాగ్‌ఫైట్‌కు కొద్దిరోజుల ముందే ఇస్రో పూర్తి చేసింది.

కాస్మిక్ బోన్‌కు పగుళ్లు

న్యూట్రాన్ స్టార్ ఢీకొట్టడమే కారణం



భూగోళంతో పాటు ఇతర గ్రహాలు, సూర్యుడు, అసంఖ్యాకమైన నక్షత్రాలున్న మన పాలపుంతలో అంతరిక్ష ఎముకలు (కాస్మిక్ బోన్సు) కూడా ఉంటాయని మీకు తెలుసా? నిలువుగా, సన్నగా ఉండే వీటిని ఆకారం వల్ల ఎముకలుగా పిలుస్తుంటారు. వ్యోమగాములకు అంతరిక్షం నుంచి ఇవి సర్పాకృతిలో కనిపిస్తుంటాయి. ఇవీ ఒకరకంగా నక్షత్రాల్లాంటివే. వీటి నుంచి రేడియో తరంగాలు వెలువడుతాయి. భూమి నుంచి 26 వేల కాంతి సంవత్సరాల దూరంలో పాలపుంత మధ్యభాగానికి సమీపంలో ఉన్న జీ359.13 అనే ఇలాంటి కాస్మిక్ బోన్‌కు పగుళ్లు వచ్చినట్లు సైంటిస్టులు తాజాగా గుర్తించారు. ఇది మన పాలపుంతలో అత్యంత పొడవైన, ప్రకాశవంతమైన ఎముకల్లో ఒకటి. పల్సర్ అనే న్యూట్రాన్ స్టార్ గంటకు ఏకంగా 20 లక్షల మైళ్ల వేగంతో ఢీకొట్టడం వల్లే ఈ పగుళ్లు ఏర్పడినట్లు చంద్ర ఎక్స్–రే అబ్జర్వేటరీతో పాటు ఇతర రేడియో టెలిస్కోప్‌ల ద్వారా కనిపెట్టారు. ఈ చిత్రాలను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా విడుదల చేసింది. భారీ నక్షత్రాలు పేలిపోవడం వల్ల న్యూట్రాన్ నక్షత్రాలు ఏర్పడుతుంటాయి. అవి అత్యధిక ఆయస్కాంత శక్తిని కలిగి ఉండి ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ రేడియేషన్‌ను వెలువరిస్తాయి. సెకనుకు కొన్ని వందలసార్లు తమ చుట్టూ తాము తిరుగుతూ అంతరిక్షంలోకి వేగంగా దూసుకెళ్తాయి. దారికి అడ్డొచ్చినవాటినీ అడ్డంగా ఢీకొంటాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

హౌతీల క్షిపణి ప్రయోగం.. ఇజ్రాయెల్‌లో ఆగిన విమాన సర్వీసులు

టెల్ అవీవ్: యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు ప్రయోగించిన క్షిపణి కారణంగా ఇజ్రాయెల్‌లోని ప్రధానమైన బెన్‌గ్యురియన్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. విమానాశ్రయంలోని పార్కింగ్ ప్రదేశానికి సమీపంలో క్షిపణి పడటంతో భారీ గుంత ఏర్పడింది. జనం భయంతో పరుగులు తీశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను ఇజ్రాయెల్ ఆర్మీ విడుదల చేసింది. రహదారిపై వాహనాలను, రైళ్లను నిలిపివేశామని పోలీసులు తెలిపారు. ఇది తమపనేనని హౌతీలు ప్రకటించారు. హౌతీలపై ఇక తీవ్ర దాడులు ఖాయమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తీవ్ర హెచ్చరికలు చేశారు.

ఎయిరిండియా విమానం దారి మళ్లింపు

క్షిపణి దాడితో టెల్‌అవీవ్‌లోని బెన్‌గ్యురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో లాండవ్వాల్సిన ఎయిరిండియా విమానాన్ని ఆదివారం అబూదాబి ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. ''విమానం అబూదాబి నుంచి ఢిల్లీ వస్తోంది. దాడి గురించి తెలిసిన సమయంలో జోర్డాన్ గగనతలంపై ఉంది'' అని ఎయిరిండియా వివరించింది. ముందు జాగ్రత్తగా టెల్ అవీవ్ సర్వీసులను 6వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

అనారోగ్య మృతుల్లో... పురుషులే ఎక్కువ!



న్యూఢిల్లీ: పురుషులతో పోలిస్తే మహిళల ఆయుర్దాయం ఎక్కువగా ఉంటోంది. అనారోగ్యంతో మరణిస్తున్న వారిలో పురుషులే అధికంగా ఉంటున్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇదే పరిస్థితి ఉంది. అధిక రక్తపోటు, మధుమేహం, ఎయిడ్స్ వంటివాటితో అస్వస్థతకు గురై మరణిస్తున్న వారిలో మహిళలతో పోలిస్తే పురుషులే ఎక్కువని గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ (జీబీడీ) తాజా అధ్యయనం తెలిపింది. ఆధిపత్య ధోరణి, ఆరోగ్య సంరక్షణకు అంతగా సుముఖత చూపించకపోవడం, వైద్యానికి ఎక్కువగా ఖర్చు చేయకపోవడం ఇందుకు ప్రధాన కారణాలుగా వెల్లడైంది. పురుషుల్లో అధిక ధూమపానం, మహిళల్లో ఊబకాయం, అరక్షిత శృంగారం ప్రధాన అనారోగ్య హేతువులని తెలిపింది. హెచ్ఐవీతో పాటు కరోనా సమయాల్లోనూ కూడా నివారణ చర్యలు మొదలుకుని రోగ నిర్ధారణ, చికిత్స వంటి అన్ని విషయాల్లోనూ మహిళలతో పోలిస్తే పురుషులు బాగా వెనుకబడి ఉన్నారని అధ్యయనం వెల్లడించింది. 200 దేశాల్లో అధిక రక్తపోటుకు తీసుకునే చికిత్సలో కూడా పురుషులు, మహిళల్లో చాలా వ్యత్యాసముంది. 56 శాతం దేశాల్లో ఎయిడ్స్, 30 శాతం దేశాల్లో మధుమేహం, 4 శాతం దేశాల్లో హై బీపీ రేటు పురుషుల్లోనే ఎక్కువగా ఉంది. 14 శాతం దేశాల్లో ఎయిడ్స్, ఐదు శాతం దేశాల్లో మధుమేహం, భారత్‌లో హై బీపీ పురుషులతో పోలిస్తే మహిళల్లో ఎక్కువగా ఉన్నాయి. 131 దేశాల్లో ఎయిడ్స్, 107 దేశాల్లో హై బీపీ, 100 దేశాల్లో మధుమేహ మృతుల్లో మహిళలతో పోలిస్తే పురుషులే ఎక్కువ. ఎయిడ్స్‌తో 25 దేశాల్లో, డయాబెటిస్‌తో 9 దేశాల్లో, హై బీపీతో యూఏఈలో పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువగా మరణిస్తున్నారని అధ్యయనం తేల్చింది. వ్యాధి నివారణ, నిర్ధారణ, చికిత్స దిశగా పురుషులను ప్రోత్సహించడం, అందరికీ సమానంగా ఆరోగ్యం అందించే వ్యవస్థలను రూపొందించడం చాలా అవసరమని బ్రిటన్‌కు చెందిన గ్లోబల్ 50/50 సహవ్యవస్థాపకుడు కెంట్ బస్ తెలిపారు.

గిట్టని వారు ఉంటే..?

- మిస్ వరల్డ్ పోటీల ముందు పోలీసులకు కొత్త తలనొప్పి
- ఆయా దేశాల వారీగా వివరాల సేకరణ
- భద్రతా ఏర్పాట్లపై మరింత దృష్టి సారించిన పోలీస్ ఉన్నతాధికారులు



సాక్షి, హైదరాబాద్ : మిస్ వరల్డ్–2025 పోటీల్లో పాల్గొనే అతిథుల రాక మొదలైంది. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ వేడుకలకు రాష్ట్ర పోలీస్‌శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈ పోటీలను వ్యతిరేకించే వారితో పోలీసులకు కొత్త తలనొప్పులు మొదలయ్యాయి. ఇప్పటికే ఈ పోటీలను రద్దు చేయాలని 'మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక పోరాట వేదిక'డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. మహిళల శరీరాలకు కొలతలు విధించి, అశ్లీల ప్రదర్శనల ద్వారా సౌందర్య ఉత్పత్తులను అమ్ముకునే సాధనంగా ఈ పోటీలు ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఇవి మహిళలను వినియోగ వస్తువుగా మారుస్తూ, సామ్రాజ్యవాద విష సంస్కృతిని ప్రోత్సహిస్తాయంటున్నారు. ఇదే తరహాలో మరికొన్ని సంఘాల నుంచి సైతం వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముందని పోలీసులు అంచనా వేస్తున్నారు. మిస్ వరల్డ్–2025 పోటీల్లో దాదాపు 120 దేశాల నుంచి అందగత్తెలు, ఆయా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. అయితే.. ఆయా దేశాల ప్రతినిధుల్లో ఎవరెవరికీ వైరం ఉండే అవకాశం ఉంది.. ఏయే దేశాల ప్రతినిధులంటే.. ఇంకెవరికి గిట్టదు అన్న కీలక విషయాలు సేకరిస్తున్నట్టు తెలిసింది. అలాంటి వారు ఒకే ప్రాంతంలో ఉండాల్సిన సమయంలో అనుకోని ఘటనలు, అవమానకరమైన ఘటనలకు తావులేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. కొన్ని దేశాల మధ్య ఉండే పొరపొచ్చాల కారణంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగబోయే ఈ వేడుకల్లో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిసింది. వీరంతా బస చేసే హోటళ్లు, వేడుక జరిగే ప్రాంతం, ఈ బృందాలు రాష్ట్రంలో పర్యటించే పర్యాటక ప్రాంతాల్లో భద్రతపై పోలీస్ ఉన్నతాధికారులు ఇప్పటికే పలు దఫాలుగా సమీక్షించారు. అదే సమయంలో మిస్‌వరల్డ్ పోటీలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేసే మహిళా సంఘాల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌హెచ్‌ఓలతో డీజీపీ జితేందర్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ నిర్వహించిన సమీక్ష సందర్భంగా కూడా ఈ అంశాన్ని అధికారులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మహేశ్ భగవత్ మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీలను వ్యతిరేకిస్తూ కొన్ని మహిళా సంఘాలు ప్రకటనలు ఇస్తున్నాయని, వాటిని గమనించి కంటెస్టెంట్లకు భద్రత కల్పించాలని ప్రత్యేకంగా సూచించడం గమనార్హం.

బయాలజీ ఈజీ.. ఫిజిక్స్ టఫ్

▶ మొదటి పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే... 190 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరిగింది. 72,507 మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 90 శాతానికి పైగా హాజరైనట్టు అధికారులు చెబుతున్నారు. 2024లో 77,849 మంది పరీక్ష రాయగా, 47,371 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. ఈ ఏడాది జరిగిన పరీక్షకు హాజరైన విద్యార్థులు బయాలజీ నుంచి అడిగిన ప్రశ్నలు తేలిగ్గా ఉన్నాయని, ఫిజిక్స్ అత్యంత కఠినంగా ఉందని పేర్కొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ నుంచి ఎక్కువ ప్రశ్నలు

నీట్ యూజీ పరీక్షలో ఫిజిక్స్ అత్యంత కఠినంగా, కెమిస్ట్రీ మధ్యస్తంగా, బయాలజీ తేలిగ్గా ఉన్నట్టు పరీక్షకు హాజరైన విద్యార్థులతోపాటు నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు. కెమిస్ట్రీ, బయాలజీతో పోల్చుకుంటే ఫిజిక్స్ కఠినంగా ఉంది. బయాలజీ, కెమిస్ట్రీల్లో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచి బేసిక్ కాన్సెప్ట్‌లపై ప్రశ్నలు అడిగారు. 11వ తరగతితో పోలిస్తే.. 12వ తరగతి సిలబస్ నుంచి ఎక్కువ ప్రశ్నలు కనిపించాయి. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ మూడు సబ్జెక్టుల్లోనూ థియరీ ఆధారిత ప్రశ్నల సంఖ్య ఎక్కువగా ఉంది. రీజన్, అసెర్షన్ ఆధారిత ప్రశ్నలు సైతం అడిగారు. మెమరీ ఆధారిత ప్రశ్నలు కూడా ఎదురయ్యాయి. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ బేసిక్స్, కాన్సెప్ట్‌లు, ఫార్ములాలపై పట్టుతోపాటు అప్లికేషన్ ఆధారిత ప్రిపరేషన్ సాగించిన విద్యార్థులు పరీక్షలో ఎక్కువ స్కోర్ చేసేందుకు అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు.



పుస్తెలు అమ్మి చదివిస్తే...

ఆదివారం కరీంనగర్‌లోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల నీట్ పరీక్ష కేంద్రానికి వేములవాడకు చెందిన కుమ్మరి వైష్ణవి అనే విద్యార్థిని మూడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు లోపలికి అనుమతించలేదు. దీంతో విద్యార్థిని తల్లి కన్నీటి పర్యంతమైంది. 'నేను కూలీ పని చేసుకుంటాను. పుస్తెలు అమ్మి నా కూతురికి సంవత్సరం నుంచి లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించాను. ఇప్పుడు మూడు నిమిషాలు ఆలస్యమైనందుకు కేంద్రంలోకి అనుమతి ఇవ్వలేదని' రోదిస్తూ ఆవేదనను వ్యక్తం చేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

బయాలజీ సులభం

బయాలజీ విభాగంలో బోటనీ నుంచి 45 ప్రశ్నల, జువాలజీ నుంచి 45 ప్రశ్నలు చొప్పున మొత్తం 90 ప్రశ్నలు అడిగారు. బోటనీ, జువాలజీ నుంచి అడిగిన ప్రశ్నలు సులభంగా ఉన్నాయని పరీక్ష రాసిన అభ్యర్థులు పేర్కొన్నారు. ఇందులో ఎక్కువగా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచి బేసిక్ కాన్సెప్ట్‌లపై ప్రశ్నలు అడిగారు. అంతేకాకుండా బయాలజీలో డైరెక్ట్ ప్రశ్నలు ఎక్కువగా కనిపించాయి. జెనెటిక్స్, హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. థియరీ ఆధారిత, డయాగ్రమ్ ఆధారిత ప్రశ్నలు ఎదురయ్యాయి. బోటనీ, జువాలజీ నుంచి పలు ప్రశ్నలు సుదీర్ఘంగా ఉన్నాయి. దీంతో ఈ విభాగంలోని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేందుకు కొంత ఎక్కువ సమయం కేటాయించాల్సి వచ్చినట్టు విద్యార్థులు పేర్కొంటున్నారు. గతంతో పోల్చినప్పుడు ఈసారి బయాలజీ నుంచి ప్రామాణిక ప్రశ్నలు అడిగారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కెమిస్ట్రీ మధ్యస్తం

కెమిస్ట్రీ నుంచి అడిగిన 45 ప్రశ్నల్లో కొన్ని ప్రశ్నలు కఠినంగా ఉండగా.. మొత్తమ్మీద ఈ విభాగం మధ్యస్తంగా ఉన్నట్టు చెబుతున్నారు. అయితే గతేడాది అడిగిన ప్రశ్నలతో పోలిస్తే మాత్రం ఈసారి కెమిస్ట్రీ విభాగంగా కొంత కఠినంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి అడిగిన ప్రశ్నలు సుదీర్ఘంగా ఉన్నాయి. ఫిజికల్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీల కాన్సెప్ట్‌ల నుంచి ప్రశ్నలు అడిగారు. కోఆర్డినేషన్ కాంపౌండ్స్ నుంచి 2 ప్రశ్నలు, కెమికల్ బాండింగ్, కెమికల్ ఈక్వలిబ్రియంల నుంచి 1 ప్రశ్న చొప్పున అడిగారు. కెమిస్ట్రీలోనూ అధికంగా ఎన్‌సీఈఆర్‌టీ నుంచి ప్రశ్నలు అడిగారు. కొన్ని ప్రశ్నలు మాత్రమే అప్లికేషన్ ఆధారితంగా, లోతుగా ఆలోచించి సమాధానాలు గుర్తించాల్సినవి ఉన్నాయి.

ఫిజిక్స్ క్లిష్టం

ఫిజిక్స్ క్లిష్టంగా, ట్రిక్కీగా ఉందని అభ్యర్థులు, నిపుణులు పేర్కొంటున్నారు. ఈ విభాగం నుంచి అడిగిన ప్రశ్నలు సుదీర్ఘంగా ఉండటంతో వీటికి సమాధానాలు సాధించడంలో సమయాభావం ఎదురైనట్టు చెప్పారు. ఫిజిక్స్ నుంచి అడిగిన 45 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేందుకు దాదాపు గంటన్నర సమయం పట్టినట్టు కొంతమంది విద్యార్థులు వెల్లడించారు. గతేడాది ఎక్కువగా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచి ప్రశ్నలు అడిగితే.. ఈ ఏడాది 'అవుట్ ఆఫ్ ది బాక్స్' ప్రశ్నలు ఎదురైనట్టు పేర్కొంటున్నారు. బయాలజీ, కెమిస్ట్రీతో పోల్చినప్పుడు ఫిజిక్స్ అత్యంత కఠినంగా ఉన్నట్టు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది ఫిజిక్స్‌లో కాన్సెప్ట్‌లతోపాటు ఫార్ములా ఆధారిత ప్రశ్నలు ఎదురయ్యాయి. ఈ విభాగంలో ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేందుకు కాన్సెప్ట్‌లపై స్పష్టత తప్పనిసరిగా మారింది. ఎలక్ట్రోస్టాటిక్, మ్యాగ్నటిక్ ఎఫెక్ట్, కైనమేటిక్స్, థర్మోడైనమిక్స్‌ల నుంచి ఒక్కో ప్రశ్న చొప్పున; మోడ్రన్ ఫిజిక్స్, రే ఆప్టిక్స్, యూనిట్ అండ్ డైమెన్షన్, రొటేషనల్ నుంచి 2 ప్రశ్నల చొప్పున అడిగారు.

రోజూ వైఎస్‌ను గుర్తు చేసుకుంటాం

- విశ్వసనీయత వైఎస్సార్ బలం..
- మేమంతా ఆయన శిష్యులమే
- మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డిని రోజుకు ఒక్కసారైనా గుర్తు చేసుకుంటామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతల సమావేశం ఆదివారం సంగారెడ్డిలోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడారు. 'రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పథకాలు తీసుకొచ్చినా..రోజుకు ఒకసారైనా వైఎస్.రాజశేఖరరెడ్డిని గుర్తు చేసుకుంటున్నాం. మేమంతా ఆయన శిష్యులం. తల్లిదండ్రులు కొంత నేర్పిస్తారు. నాయకుడి నుంచి నేర్చుకుంటాం. రాజకీయాల్లో గురువు కూడా నేర్పిస్తారు. విశ్వసనీయత అనేది వైఎస్ఆర్ బలం. ఎదిగే కొద్దీ ఒదిగే మనస్తత్వం ఆయనది'అని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కూడా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నాయకులదే పెత్తనం కొనసాగుతుందని కొందరు నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా పరిశీలకుడిగా వచ్చిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీల్లో బీఆర్ఎస్ నాయకులే ఉన్నారని, వారు సూచించిన వారికే ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని, పటాన్‌చెరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వేదిక వద్దకు దూసుకొచ్చిన ఈ నాయకులను ఎంపీ షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్‌లు సముదాయించారు.

వైఎస్సార్ చలవతోనే బీడు భూములకు నీళ్లు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- మల్కపేట రిజర్వాయర్ కుడికాల్వ ద్వారా నీరు విడుదల



మల్కపేట వద్ద కుడికాల్వలో గోదావరి జలాలకు పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బీడు భూములకు గోదావరి జలాలు చేరాయంటే.. అది దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి చలవేనని, 2008లోనే గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ప్రాణహిత–చేవెళ్ల పథకానికి శంకుస్థాపన చేశారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. జిల్లాలోని కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ పరిధిలోని కుడికాల్వ ద్వారా 12 గ్రామాలకు 350 క్యూసెక్కుల నీటిని ఆదివారం ఆయన విడుదల చేశారు. కుడికాల్వలో ప్రవహించే గోదావరి జలాలకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 2003లో పాదయాత్రలో భాగంగా వైఎస్సార్ కామారెడ్డి నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోకి ప్రవేశించి నర్మాల వద్ద బస చేశారన్నారు. జిల్లాలో కరువు పరిస్థితులను చూసిన ఆయన ప్రాణహిత–చేవెళ్ల పథకానికి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. తొమ్మిదేళ్లుగా పడావు పడిన భూములను బీఆర్ఎస్ పట్టించుకోలేదని ఆది శ్రీనివాస్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ–9 కాంట్రాక్టర్‌తో మాట్లాడి పెండింగ్ బిల్లులు ఇప్పించి, కాల్వలను శుభ్రం చేయించి నీటి విడుదల చేయించామన్నారు.

మిస్ వరల్డ్‌లో మన హస్తకళలు!

▶ మొదటి పేజీ తరువాయి

సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని డిజైన్ చేసింది. ఇదే సందర్భంలో జూలియా మోర్లే రాష్ట్ర ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి చేసింది. తెలంగాణ సంప్రదాయ హస్తకళలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయని, వాటిని పోటీల్లో భాగంగా చేర్చాలనుకుంటున్నట్లు తెలిపారు. ఆయా హస్తకళలపై పోటీదారులకు అవగాహన కల్పించాలని కోరారు. దీంతో రాష్ట్రప్రభుత్వం శిల్పారామంలో ప్రత్యేకంగా వారికి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోంది. 22 రకాల హస్తకళల లైవ్ డెమాన్‌స్ట్రేషన్ ఇక్కడ ఉండనుంది. ఈ నెల 21న వివిధ దేశాల పోటీదారులు అక్కడికి రానున్నారు. వారి ముందే నిపుణులైన కళాకారులు ఆయా కళాకృతులను తీర్చిదిద్ది, వాటి ప్రత్యేకతలను వివరించనున్నారు. వాటి తయారీలో పోటీదారులు కూడా స్వయంగా పాల్గొంటారు. శిల్పారామం ప్రత్యేకాధికారి కిషన్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉంటుంది.

పెద్ద ప్రాజెక్టులలో పూడిక తీస్తాం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



బిక్కేరుపై బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో తుమ్మల, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మందుల సామేల్

కోదాడ: నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ వంటి ప్రాజెక్టులతో సహా ఇతర మేజర్ ప్రాజెక్టుల్లో పూడిక తీయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నీటిపారుదలశాఖ సమీక్షా సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు దశాబ్దాలుగా ప్రాజెక్టుల్లో పూడిక, ఇసుక పేరుకుపోయిందని జాతీయ కార్యక్రమంగా ఈ ప్రాజెక్టుల్లో పూడికతీత పనులను చేపట్టి నీటి నిల్వసామర్థ్యం పెంచడానికి కృషి చేస్తామన్నారు. మున్నేరు నుంచి వరద కాల్వ ద్వారా 10 టీఎంసీల నీటిని పాలేరు రిజర్వాయర్‌లోకి మళ్లించి అక్కడి నుంచి మోతె మండలానికి సాగునీటిని అందిస్తామని చెప్పారు. అంతకు ముందు కోదాడ బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఒడ్డెర ఓబన్న విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం కోదాడలో నిర్మిస్తున్న వంద పడకల వైద్యశాల స్థలాన్ని పరిశీలించారు. కోదాడ నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న నూతన ఎత్తిపోతల పథకాలపై కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్షించారు.

- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా సాగునీటి, పౌరసరఫరాల శాఖ (ధాన్యం సేకరణ, సన్న బియ్యం పంపిణీ) పనుల పురోగతిపై సమీక్షించారు.
- మంత్రి ఉత్తమ్ స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని తాటిపాములలో రూ.16 కోట్లతో చేపట్టే బ్రిడ్జి నిర్మాణం, రూ.7.14 కోట్లతో చేపట్టే చెక్‌డ్యామ్ నిర్మాణం, రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి శంకుస్థాపన చేశారు.

అవగాహన కల్పించేందుకే 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: రైతులకు సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సోమవారం నుంచి ఆరు వారాల పాటు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం సుమారు 200 మందికి పైగా శాస్త్రవేత్తల బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. పంటల్లో యూరియా వాడకం తగ్గించడం, రసాయనాలను జాగ్రత్తగా వాడటం, చెల్లింపు రశీదులను భద్రపరచడం, సాగునీటి ఆదా, పంటల మార్పిడి, చెట్లను పెంచటం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తారని తెలిపారు. ఈ అంశాలతోపాటు రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు సూచనలు, సలహాలు అందజేస్తారని తెలిపారు. ఒక్కో బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలతోపాటు వ్యవసాయ విద్యార్థులు, వ్యవసాయశాఖ అధికారులు, ఇతర స్థానిక ప్రభుత్వ అధికారులు, అభ్యుదయ రైతులు, సంఘాలు పాల్గొంటాయని తెలిపారు.

మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదు

- కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నేతలు సహా ఎంతోమందిని చంపారు
- రేవంత్‌రెడ్డి సర్కార్‌కు మావోలపై నిషేధం ఎత్తేసే దమ్ముందా?
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కొత్తపల్లి (కరీంనగర్): 'మావోయిస్టులతో మాటల్లేవు.. మాట్లాడుకోవడాల్లేవ్. నిషేధిత సంస్థతో చర్చల ప్రసక్తే లేదు. వారు తుపాకీ వీడాల్సిందే.. పోలీసులకు లొంగిపోవాల్సిందే'అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని కొత్తపల్లిలో ఆదివారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు సమస్యను సామాజిక కోణంతో చూడాలన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆపరేషన్ కగార్ ఆపాలన్న కేసీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు. రాష్ట్రంలో మావోయిస్టులపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి పోటీ పడి నక్సల్స్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మహాముత్తారంలో ఎస్సై భార్య సీమంతం సమయంలో బాంబులు పెట్టి ఎస్సై, కానిస్టేబుల్‌ను చంపారని, దూరదర్శన్ జర్నలిస్టు, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సామ జగన్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, రామన్న, గోపన్న, శ్రీపాదరావును కూడా చంపారని గుర్తు చేశారు. కేసీఆర్, రేవంత్ టీడీపీలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులను చంపితే ఎందుకు మాట్లాడలేదన్నారు.

రోహింగ్యాలపై కాంగ్రెస్ వైఖరేంటి?

'పాకిస్తాన్ పౌరులను తిరిగి పంపే అంశంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ఆదేశాలిచ్చింది. దేశమంతా ఈ విషయంపై సీరియస్‌గా చర్యలు తీసుకుంటే.. తెలంగాణ ప్రభుత్వం నామమాత్రపు చర్యలు తీసుకోవడం సరికాదు'అని సంజయ్ అన్నారు. ఇప్పటికీ చాలామంది పాస్‌పోర్టు, వీసాల్లేకుండా ఇక్కడ నివసిస్తున్నట్టు సమాచారముందని, రోహింగ్యాలూ నివసిస్తున్నారని, వారిపై కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరంపై చర్యలేవీ ?

కాళేశ్వరంపై ఎన్డీఎస్‌ఏ నివేదిక ఇచ్చి వారం రోజులైందని, ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే కనుక చర్యలు తీసుకోకుండా అవినీతి బీఆర్ఎస్ నాయకులను కాపాడుతూ ప్రజలను మభ్యపెట్టడానికి డ్రామాలాడుతున్నారని విమర్శించారు.

బడా కాంట్రాక్టర్లకు రూ. వేల కోట్ల బిల్లులిస్తున్నారు

- విద్యార్థుల ఫీజు డబ్బులు ఎందుకు ఇవ్వరు?
- మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం బడా కాంట్రాక్టర్లకు రూ.వేల కోట్ల బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఎందుకు ఇవ్వడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలు ఇవ్వకపోవడంతో కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని, కొందరిని పరీక్షలకు సైతం అనుమతించడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, వారి చదువును, జీవితాలను ప్రశ్నార్థకం చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో సుమారు 6 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని, సకాలంలో పరీక్షలు నిర్వహించకపోవడంతో పీజీసెట్, లాసెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారని అన్నారు. ఏప్రిల్ నెలలో జరగాల్సిన డిగ్రీ పరీక్షలను కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికీ నిర్వహించకపోవడం ప్రభుత్వ చేతగానితనమే అని ఆయన మండిపడ్డారు.

జనగణన చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమే

- కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది కులగణన మాత్రమే
- కిషన్‌రెడ్డి అవగాహన లేక మాట్లాడుతున్నారు
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ములుగు: 'కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది కేవలం కులగణన మాత్రమే. జనగణను చేపట్టే అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది'అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో రూ.4.81 కోట్ల నిధులతో నిర్మించనున్న మోడల్ బస్టాండ్ పనులకు ఆదివారం మంత్రి సీతక్కతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కులగణన, జనగణన మధ్య తేడా తెలియకుండా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అవగాహనా రాహిత్యంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా జనగణను చేపట్టాలన్న రాహుల్ గాంధీ డిమాండ్ నెరవేరబోతున్నదని, ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేసి తీరుతుందని పేర్కొన్నారు. అంతకు ముందు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క మహర్షి భగీరథ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్‌బీఐ భవనంలో అగ్నిప్రమాదం

- కీలక ఫైళ్లు, ఫర్నిచర్ దగ్ధం..
- మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చిన అగ్ని మాపక సిబ్బంది



సనత్‌నగర్ (హైదరాబాద్): సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ వద్ద ఎస్‌బీఐ బ్యాంక్ అడ్మినిస్ట్రేషన్ భవనం నాలుగో అంతస్తులో ఆదివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుదాఘాతం వల్లే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని అగ్నిమాపకశాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కొన్నిసార్లు ఆదివారం కూడా కొందరు సిబ్బంది కార్యాలయానికి వచ్చి కార్యకలాపాలు సాగిస్తుంటారు. ఈ క్రమంలోనే ఆదివారం ఇద్దరు ఉద్యోగులు నాలుగో అంతస్తులోకి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో ఒకరు అగ్ని ప్రమాదం జరగక మునుపే బయటకు వెళ్లిపోగా, మరొకరు అంతస్తులో దట్టమైన పొగలు వ్యాపించడంతో భయంతో బయటకు వచ్చేసినట్టు సమాచారం.

ఎగసిన మంటలతో భయాందోళన

ప్యాట్నీ సెంటర్ ప్రధాన రహదారిలో నగరానికి సంబంధించి ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేషన్ కార్యకలాపాలు ఇక్కడి నాలుగు అంతస్తుల భవనంలో కొనసాగుతాయి. నాలుగో అంతస్తులో లోన్ల విభాగం ఉంది. ఆ విభాగంలో ఆదివారం సాయంత్రం 7.30 గంటల సమయంలో ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించడంతో.. స్థానికులతో అటు ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. క్షణాల్లో అగ్నికీలలు అంతస్తు మొత్తం వ్యాపించాయి. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మంటల తీవ్రత అధికంగా ఉండడంతో.. మల్కాజిగిరి, మౌలాలి ప్రాంతాల నుంచి మరో రెండు అగ్నిమాపక శకటాలను రప్పించారు. కాగా, ప్రమాదం జరిగింది నాలుగో అంతస్తులో కావడంతో.. భారీ క్రేన్లతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది. దాదాపు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో కీలక ఫైళ్లు, పెద్ద ఎత్తున ఫర్నిచర్ దగ్ధమైనట్లు తెలుస్తోంది. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉండే ఈ కార్యాలయంలో.. ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద ప్రాణనష్టమే తప్పింది. ప్రమాదానికి విద్యుదాఘాతమే కారణమై ఉండవచ్చని సికింద్రాబాద్ ఫైర్ అధికారి శ్రీనివాస్ వెల్లడించారు.

కులగణనపై విస్తృత ప్రచారం

రాష్ట్ర పదాధికారుల సమావేశంలో బీజేపీ నిర్ణయం



పదాధికారుల సమావేశంలో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య తదితరులు

సాక్షి, హైదరాబాద్: దేశంలో జనగణనతో పాటే కులగణన చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర విభాగం నిర్ణయించింది. కేంద్రం నిర్ణయాన్ని తమ విజయంగా మలచుకునేలా.. ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని బీజేపీ భావిస్తోంది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పదాధికారుల సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్.కృష్ణయ్య, పార్టీ నేతలు పొంగులేటి సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్ తివారి, జి.ప్రేమిందర్ రెడ్డి, బంగారు శ్రుతి, కాసం వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు అవకాశం వచ్చినా కులగణన చేయలేదని.. బీసీలను ఓటు బ్యాంకుగా మార్చుకునే ప్రయత్నమే ఆ పార్టీ చేసిందని విమర్శించారు. యూపీఏ పాలనలో బీసీలకు చేసిందేమీ లేదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అర్వై ఏళ్లు అధికారంలో ఉండి చేయలేకపోయిందని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చాక మొదటిసారి జనగణన జరుగుతుందని, అందులో కులగణన కూడా చేయాలని ఆయన నిర్ణయించారని ప్రశంసించారు. సాహసోపేతమైన ఈ నిర్ణయాన్ని.. ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేసింది సర్వే అని.. కేంద్రం చేయబోయేది కులగణన అని, దానికి చట్టబద్ధత ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి బీసీల మీద ప్రేమ ఉంటే.. వారికి మంత్రి పదవులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎవరి ఒత్తిడితోనో మోదీ ఈ నిర్ణయం తీసుకోలేదని.. రేవంత్ చేసిన సర్వే ఎంత నిజమో.. కేంద్రం చేపట్టే కులగణనతో తేలిపోతుందన్న విషయాన్ని కూడా ప్రజలకు చెప్పాలన్నారు. ఈ మేరకు కుల సంఘాలతో ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకాలు, కుల సంఘాలతో ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ లేఖలు రాయించాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లో బీసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని, జిల్లాల్లో జరిగే సమావేశాలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకావాలని కూడా నిర్ణయించారు. సమావేశంలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్యను సన్మానించారు.

'యాక్సిస్'తో అడ్డగోలు ఒప్పందం..

ప్రజలకు పాతికేళ్ల 'షాక్'

రూ.2.49కి నాడు గగ్గోలు.. రూ.4.60కి నేడు అడ్డగోలు

- కరెంట్ భారీ 'కొనుగోల్' మాల్
- కుంభకోణానికి బాబు 'యాక్సిస్'
- కారుచౌక ఒప్పందంపై అప్పుడు విషం..
- పాతికేళ్లకు అధిక రేట్ల 'ఫిక్సింగ్' ఇప్పుడు

సాక్షి, అమరావతి: వ్యవసాయ విద్యుత్తు అవసరాలకు దాదాపు 30 ఏళ్ల పాటు ఢోకా లేకుండా రైతులకు పగటి పూటే 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు అందించేలా కేంద్ర ప్రభుత్వ సంస్థ 'సెకీ'తో ఏడువేల మెగావాట్ల విద్యుత్తు ఒప్పందాన్ని కారుచౌకగా యూనిట్ రూ.2.49కే అందించేలా కుదుర్చుకోవడం ద్వారా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.లక్ష కోట్లకుపైగా ఆదా చేస్తే అభినందించాల్సింది పోయి.. కుంభకోణంగా వర్ణించిన కూటమి సర్కారు ఇప్పుడు యూనిట్ ఏకంగా రూ.4.60 చొప్పున కొనుగోలుకు సిద్ధమై దేశ విద్యుత్తు రంగ చరిత్రలో కనీవిని ఎరుగని స్కామ్‌కు తెర తీసింది! ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలిని సెక్షన్ 108 పేరుతో బెదిరించి మరీ ఈ ఒప్పందానికి ఆమోద ముద్ర వేయించుకోవడం, ఇలా బరి తెగించి భారీ ధరకు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం ఎన్నడూ చూడలేదని విద్యుత్తు రంగ నిపుణులు, అధికారులు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు ఒప్పందాల్లో దీన్ని అతిపెద్ద స్కామ్‌గా అభివర్ణిస్తున్నారు. గత ప్రభుత్వం అత్యంత చౌకగా, ఐఎస్‌టీఎస్ చార్జీలు లేకుండా కేంద్ర సంస్థ సెకీ నుంచి సోలార్ కొనుగోలు ఒప్పందాన్ని చేసుకుంటే బురద జల్లి దేశమంతా రాద్ధాంతం చేసిన కూటమి సర్కారు ఇప్పుడు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సెకీతో చేసుకున్న ఒప్పందం సహేతుకమేనని ఇప్పటికే విద్యుత్తు నియంత్రణ మండలి నిర్ధారించిందని, తద్వారా పెద్ద ఎత్తున ప్రజాధనం ఆదా అయిందని గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు ఒప్పందాల్లో నిజానిజాలను ఒకసారి పరిశీలిద్దాం..

ఏడాదిగా హామీల అమలు ఊసు లేకుండా..

టీడీపీ కూటమి సర్కారు ఏడాది పాలన పూర్తి కావస్తోంది. ఈ తరుణంలో కనీసం ఇప్పుడైనా ఓ అమ్మ ఒడి, అన్నదాతా సుఖీభవ గురించో.. సూపర్ సిక్స్ హామీల అమలుపై సీఎం చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేస్తారని రాష్ట్ర ప్రజలంతా ఆశగా ఎదురు చూస్తుంటే మరో పిడుగు పడింది! ఇప్పటికే రూ.15 వేల కోట్లకుపైగా బిల్లుల బాదుడుతో చుక్కలు చూపిస్తుండగా ఈసారి అడ్డగోలు విద్యుత్తు ఒప్పందాలతో బాదేశారు! 25 ఏళ్ల పాటు ప్రజలను పీల్చి పిప్పి చేసే ఖరీదైన విద్యుత్తు ఒప్పందానికి పచ్చ జెండా ఊపారు. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా గతంలో ఏపీఈఆర్సీ తిరస్కరించిన ఈ అడ్డగోలు ఒప్పందాన్ని మెడపై కత్తి పెట్టి ఆమోదించుకోవడం ద్వారా సర్కారు లాలూచీ వ్యవహారాలు మరోసారి నిరూపితమయ్యాయని, ఇదో పెద్ద కుంభకోణమని విద్యుత్తు రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు సోలార్, రాత్రి పూట అంతా పవన విద్యుత్తు అందుబాటులో ఉంటుందని.. ఎప్పుడో కొద్ది రోజులు డిమాండ్ ఉంటుందంటూ ఆ పేరుతో యూనిట్ రూ.4.60 చొప్పున పాతికేళ్ల పాటు చెల్లించేందుకు సిద్ధం కావటాన్ని తప్పుబడుతున్నారు. పీక్ అవర్స్‌లో డిమాండ్ 3 – 4 గంటలు మాత్రమే ఉంటుందని.. అలాంటప్పుడు అన్ని గంటలకూ ఒకే ధర చెల్లించడం ఏమిటని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆలస్యం ఉచిత ఇసుక పేరుతో పచ్చముఠాల దోపిడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. వర్షాకాల అవసరాల కోసం గత ప్రభుత్వం నిల్వ చేసిన 80 లక్షల టన్నుల ఇసుకను టీడీపీ నేతలు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఇక నూతన మద్యం విధానం పేరుతో టీడీపీ నేతలు సిండికేట్‌గా మారి పోలీసుల అండతో దౌర్జన్యంగా షాపులు దక్కించుకున్నారు. ఊరూరా బెల్టు షాపులు ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వ పెద్దల అండతో గనుల యజమానులను బెదిరిస్తూ కప్పం వసూలు చేస్తున్నారు. ఇక రాజధాని అమరావతి పనుల్లో టెండర్లలో ముఖ్యనేతలు అంచనాలను ఎడాపెడా పెంచేశారు. ఐకానిక్ టవర్లు పేరుతో అవినీతికి గేట్లు తెరిచారు. అంచనాలు పెంచేసి కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సుల ముసుగులో పనుల విలువలో పది శాతం చెల్లించి తిరిగి 8 శాతం కమీషన్ల రూపంలో వసూలు చేసుకుంటున్నారు. విశాఖలో లూలూకు భూ పందేరంతోపాటు రూ.3,000 కోట్ల అత్యంత ఖరీదైన భూమిని ఊరూ పేరు లేని అనామక సంస్థ ఉర్సాకు ఎకరం 99 పైసలకే కేటాయిస్తూ క్యాబినెట్‌లో ఆమోద ముద్ర వేయించారు. గత 11 నెలలుగా ఇలా విచ్చలవిడి అవినీతి వ్యవహారాలతో చంద్రబాబు సర్కారు ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ''మేం వస్తే విద్యుత్తు చార్జీలను పెంచం.. ఇంకా తగ్గిస్తాం..! గత ప్రభుత్వం విద్యుత్తు రంగాన్ని నాశనం చేసింది. ఐదేళ్లలో రూ.1.29 లక్షల కోట్లకుపైగా నష్టం జరిగింది..'' అంటూ ఎన్నికల ముందు, ఆ తరువాత శ్వేతపత్రంలో విమర్శలు చేసిన సీఎం చంద్రబాబు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు.

పాతికేళ్ల పిడుగు..

యాక్సిస్ ఎనర్జీ వెంచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో చంద్రబాబు ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) దాఖలు చేసిన పిటిషన్‌ను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) శనివారం ఆమోదించింది. యాక్సిస్ రెన్యూవబుల్ ఎనర్జీ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ వెంచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (పవన–సౌర హైబ్రీడ్) 400 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను స్థాపించి వాటి నుంచి ఏపీఎస్పీడీసీఎల్ పాతికేళ్ల పాటు యూనిట్ కు రూ.4.60 చొప్పున చెల్లించి కొనుగోలు చేసేందుకు అంగీకారం తెలిపింది. 25 ఏళ్ల పాటు ఈ ధర తగ్గించటానికి వీల్లేకుండా ఒప్పందంలో 'సీలింగ్' షరతు విధించడం గమనార్హం. అంటే భవిష్యత్తులో పవన, సౌర విద్యుత్తు రేట్లు తగ్గినా ఒప్పందంలో చెప్పిన ధర తగ్గించకుండా మెలిక పెట్టారు. ఒకపక్క మార్కెట్‌లో సగానికిపైగా తక్కువ ధరకు దొరుకుతున్నప్పటికీ రెట్టింపు ధర ఇచ్చి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడంపై అంతా విస్తుపోతున్నారు.

సెక్షన్ 108తో మండలిని బెదిరించి..

చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా గతంలో ఏపీఈఆర్సీ తిరస్కరించిన ఈ అడ్డగోలు ఒప్పందాన్ని మెడపై కత్తి పెట్టి కూటమి ప్రభుత్వం ఆమోదించేలా చేసింది. విద్యుత్ చట్టం 2003 సెక్షన్ 108 ప్రకారం యాక్సిస్‌తో పీపీఏలను అంగీకరించాలంటూ గతేడాది సెప్టెంబర్ 24న ప్రభుత్వం లేఖ రాసిందని ఏపీఈఆర్సీ తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. అంటే దీన్ని తిరస్కరించడానికి వీల్లేదని, ఒకవేళ ఏపీఈఆర్సీ తిరస్కరిస్తే ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం ఒప్పందంపై ముందుకు వెళుతుందని పరోక్షంగా బెదిరించినట్లు తేటతెల్లమవుతోంది. 400 మెగావాట్ల విద్యుత్తు కోసం ఈ చట్టాన్ని ప్రయోగిస్తామంటూ బెదిరించాల్సిన అవసరం చంద్రబాబు సర్కారుకు ఎందుకు వచ్చింది? ఈ ఒప్పందం వెనుక కేవలం కుంభకోణం మినహా రాష్ట్ర ప్రజల ప్రయోజనం ఎక్కడుందని విద్యుత్తు రంగ నిపుణులు నిలదీస్తున్నారు.

ANDHRA PRADESH ELECTRICITY REGULATORY COMMISSION
Vidyut Niyantrana Bhavan,
Adjacent to 220/132/33/11 KV AP Carbides Sub-Station,
Dinnedevarapadu Road, Kurnool-518002, Andhra Pradesh
***
FRIDAY, THE 2nd DAY OF MAY
TWO THOUSAND AND TWENTY FIVE
***
Present
Sri P.V.R.Reddy, Member & Chairman(i/c)
***
O.P.No.91 of 2024

In the matter of granting consent under Section 86(1)(b) of the Electricity Act, 2003 read with Section 21 of the Andhra Pradesh Electricity Reform Act, 1998 to the amended Power Purchase Agreements (4 Nos) dated 12.03.2025 entered into by Southern Power Distribution Company of Andhra Pradesh Limited (APSPDCL) with the following entities: 1. Axis Renewable Energy Park (Penna) Private Limited, 2. Axis Renewable Energy Park (Krishna) Private Limited, 3. Axis Renewable Energy Park (Andhra Pradesh) Private Limited, and 4. Axis Renewable Energy Park (Tungabadhra) Private Limited, for procuring 100 MW of power each from their Wind-Solar Hybrid Pilot Projects.

Between:
Southern Power Distribution Company of Andhra Pradesh Limited,
Srinivasapuram, Tiruchanoor Road, Tirupati-517503, Andhra Pradesh. ...Petitioner

యాక్సిస్ నుంచి విద్యుత్ కొనుగోలుకు అనుమతిస్తూ ఏపీఈఆర్సీ జారీ చేసిన ఆదేశాలు

सोलर एनर्जी कॉर्पोरेशन ऑफ इंडिया लिमिटेड
(भारत सरकार का उपक्रम)
Solar Energy Corporation of India Ltd.
(A Government of India Enterprise)
स्वच्छ भारत - स्वच्छ ऊर्जा

No. SECI/PT/Manufacturing/Solar/2021/ September 15, 2021

3. The developers, who have been issued Letter of Award (LoA) have suo-moto offered 9GW under Tranche-II, III & IV under this scheme at a tariff of Rs. 2.49 / kWh including SECI's trading margin, considering reduction of solar tariff in the recent tenders for solar projects conducted nationwide and considering bulk capacity being offered. Accordingly, offer is being made to Andhra Pradesh for the above bulk quantity that has been offered by these developers.

Page 1 of 2

వైఎస్ జగన్ కొన్నది.. యూనిట్ రూ.2.49

A. The proposed tariff of Rs. 4.60/kWh for these projects is lower than the rate of Rs. 5.12/kWh originally proposed. It is also anticipated to be considerably lower than the APPC rate that will be in effect when these projects are commissioned.

చంద్రబాబు కొంటున్నది.. యూనిట్ రూ.4.60

ఎక్కువ ధరకు ఎందుకు కొనాలి?

డిస్కమ్‌ల పిటిషన్‌పై కర్నూలులో ఇటీవల జరిగిన బహిరంగ విచారణలో నేరుగా, ఆన్‌లైన్ ద్వారా వివిధ వర్గాల ప్రజలు, పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని యాక్సిస్‌తో ఒప్పందాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేయడం వల్ల అంతిమంగా ఆ భారం ప్రజలపైనే ట్రూఅప్ చార్జీల రూపంలో వేస్తున్నారని.. ఇప్పటికే రూ.15,485 కోట్ల భారం మోపి వసూలు చేస్తున్నారని ఈ విచారణలో వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా మార్కెట్‌లో ఇప్పుడు పునరుత్పాదక విద్యుత్ తక్కువ ధరకే లభిస్తున్నందున యాక్సిస్ నుంచి అంత రేటు పెట్టి విద్యుత్ కొనాల్సిన అవసరం లేదంటూ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయినప్పటికీ వారి వాదనలను ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. తాననుకున్నదే చేసింది.

మంచి చేస్తే అభినందించాల్సింది పోయి.

గాడి తప్పిన విద్యుత్ రంగాన్ని అభివృద్ధి పథం పట్టించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టింది. వ్యవసాయానికి ఉచితంగా, వివిధ వర్గాలకు రాయితీతో విద్యుత్ అందించింది. డిస్కంలకు 2019–24 మధ్య ఏకంగా రూ.47,800.92 కోట్లను అందించింది. 2014–19 వరకు టీడీపీ సర్కారు రూ.13,255.76 కోట్లు మాత్రమే చెల్లించడం గమనార్హం. రైతులకు ఉచిత విద్యుత్ బకాయిలు రూ.8,845 కోట్లు ఇవ్వకుండా ఎగవేసింది.

ORDER

1. Vide letter dated 24.09.2024, the GoAP issued a directive to the Andhra Pradesh Electricity Regulatory Commission (APERC) under Section 108 of the Electricity Act, 2003, to give consent to the four 100 MW Power Purchase Agreements (PPAs) signed by the Southern Power Distribution Company of Andhra Pradesh Limited (APSPDCL) with the Special Purpose Vehicles (SPVs) of Axis Energy Ventures India Private Limited (AEVIPL)

Page 2 of 48

Order in OP No.91 of 2024

for the 400 MW wind-solar hybrid pilot project under the Bundling, Balancing, and Banking (BBB) scheme, aligning with the state's commitment to generate 72.30 GW of renewable energy by 2030, as part of India's 500 GW target. The PPAs execution is in pursuance of the 2018 MoU and a 2019 Scheme Implementation Agreement(SIA), and offer a high Capacity Utilisation Factor(CUF) (over 60%), stable APPC tariffs, 50:50 RBC benefit sharing, and local economic benefits. The directive reinforces the commitments made by the GoAP in an affidavit before the High Court of AP to honour agreements and also to attract investments, while utilising state infrastructure and meeting Renewable Purchase Obligations (RPO).

సెక్షన్ 108 ప్రకారం.. యాక్సిస్ పీపీఏలను ఆమోదించాలంటూ ప్రభుత్వం చెప్పిందని ఏపీఈఆర్సీ ఆదేశాల్లో పేర్కొన్న భాగం

వాటిని కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించింది. 2019–2023 మధ్య గత ప్రభుత్వం రెండు లక్షలకు పైగా అగ్రికల్చరల్ డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసింది. గతంలో చంద్రబాబు పాలనలో 3.5 లక్షల వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయగా వైఎస్ జగన్ ప్రభుత్వం సుమారు 5 లక్షల వ్యవసాయ పంపుసెట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలో 6,663 ఫీడర్లను 9 గంటలు వ్యవసాయానికి పగటి పూట విద్యుత్ సరఫరా చేసేలా రూ.1,700 కోట్లతో వాటి సామర్థ్యాన్ని వైఎస్ జగన్ పెంచారు. విద్యుత్ రంగానికి ఆయన ఇంత మంచి చేస్తే.. సెకీ విద్యుత్ ఒప్పందంలో లంచాలు తీసుకున్నారని, ధర ఎక్కువని, ఐఎస్‌టీఎస్ చార్జీలు కట్టాల్సి వస్తుందంటూ కూటమి నేతలు, కరపత్రికలు తప్పుడు ఆరోపణలు చేశాయి. అదే కూటమి సర్కారు ఇప్పుడు యాక్సిస్‌తో అధిక ధరకు ఒప్పందం చేసుకుని అసలు సిసలైన అవినీతికి గేట్లు తెరిచింది.

నాడు స్వయంగా ప్రతిపాదించిన 'సెకీ'

రైతులకు పగటి పూట 9 గంటలపాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ పథకాన్ని దీర్ఘకాలికంగా అమలు చేసేందుకు సెకీ నుంచి 17 వేల మిలియన్ యూనిట్ల (7 వేల మెగావాట్లు) సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం గత ప్రభుత్వంలో జరిగింది. అది కూడా అత్యంత చౌక ధరతో.. యూనిట్ కేవలం రూ.2.49కే అందించేలా ఒప్పందం కుదుర్చుకుంది. 2022–23లో యూనిట్ రూ.5.13గా ఉన్న సగటు విద్యుత్ సేకరణ ఖర్చుతో పోల్చితే ఇది రూ.2.64 తక్కువ. అదీగాక ఏపీకి సౌర విద్యుత్‌ను అతి తక్కువ ధరకే సరఫరా చేస్తామన్న ప్రతిపాదన స్వయంగా సెకీ నుంచే వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా యూనిట్ ధర రూ.2.80కి పెరిగినప్పటికీ మనకు మాత్రం ఒప్పందం మేరకు యూనిట్ రూ.2.49కే ఇచ్చేందుకు నాడు సెకీ అంగీకరించింది. అంతేకాకుండా ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) చార్జీల నుంచి పూర్తి మినహాయింపు కల్పించారు. ఇదే విషయం కేంద్ర విద్యుత్‌శాఖ, సెకీ లేఖ, ఒప్పందంలోనూ స్పష్టంగా ఉంది. ఇంత మంచి ఒప్పందాన్ని చేసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌ను అభినందించాల్సిందిపోయి చంద్రబాబు, టీడీపీ అనుబంధ కరపత్రికలు బురద చల్లేందుకు యత్నించారు. అయితే సెకీతో ఒప్పందం సక్రమమేనని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) తేల్చి చెప్పడంతో ఈ కుట్రలన్నీ పటాపంచలయ్యాయి. ఇప్పుడు పవన, సౌర హైబ్రీడ్ విద్యుత్ మార్కెట్‌లో యూనిట్ రూ.2.90కి అంతకన్నా తక్కువకే దొరుకుతోంది. అలాంటప్పుడు ఓ ప్రైవేట్ డెవలపర్ నుంచి యూనిట్ రూ.4.60 చెల్లించి కొనాల్సిన అవసరం ఏమిటో, దాని వెనుక అసలు కారణాలేమిటో చెప్పే ధైర్యం చంద్రబాబు సర్కారుకు, ఈ కుంభకోణాలపై నిలదీసే ధైర్యం ఎల్లో మీడియాకు ఉందా?

శ్రీవారి సన్నిధిలో కల్యాణం

- ఇప్పటివరకు 26,214 వివాహాలు జరిపించినట్లు టీటీడీ వెల్లడి
- వివాహం జరిపించడంతో పాటు శ్రీవారి దర్శన అవకాశం, ప్రసాదాలు అందజేత
- ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని టీటీడీ సూచన



తిరుమల: శ్రీవారి సన్నిధిలో నిర్వహిస్తున్న ఉచిత వివాహాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) సూచించింది. తిరుమల పాపావినాశనం రోడ్డులోని కల్యాణ వేదికలో ఉచితంగా వివాహాలు జరిపిస్తున్నామని.. 2016 నుంచి ఇప్పటివరకు 26,214 వివాహాలు జరిపించినట్లు టీటీడీ తెలిపింది. పురోహితుడు, మంగళవాయిద్యాలతో పాటు పసుపు, కుంకుమ, కంకణాన్ని ఉచితంగా అందిస్తామని పేర్కొంది. వివాహానికి కావాల్సిన ఇతర సామగ్రిని వధూవరులే తెచ్చుకోవాలని స్పష్టం చేసింది. వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపింది. వారు రాలేని పక్షంలో అందుకు సంబంధించిన ఆధార పత్రాలను సమర్పించాలని సూచించింది. వివాహం అనంతరం రూ.300 ప్రత్యేక ప్రవేశం ద్వారా వధూవరులతో పాటు ఇరువురి తల్లిదండ్రులను కలిపి.. మొత్తం ఆరుగురిని ఉచితంగా శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని వెల్లడించింది. అనంతరం ఆరు లడ్డూలను ఉచితంగా కౌంటర్లలో అందిస్తామని తెలిపింది. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తప్పనిసరిగా హిందువులై ఉండాలని.. వధువుకు 18 ఏళ్లు, వరుడికి 21 ఏళ్లు నిండి ఉండాలని స్పష్టం చేసింది. ద్వితీయ వివాహాలు, ప్రేమ వివాహాలు నిర్వహించబోమని.. ఇతర వివరాలకు 0877–2263433 నంబర్‌ను సంప్రదించాలని టీటీడీ సూచించింది.

ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుకింగ్..

వివాహం కోసం https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా స్లాట్ నమోదు చేసుకోవాలని టీటీడీ సూచించింది. వధూవరులు తమ తల్లిదండ్రుల వివరాలతో పాటు ఆధార్ కార్డులను అప్‌లోడ్ చేయాలని పేర్కొంది. బర్త్ సర్టిఫికెట్ లేదా పదో తరగతి మార్కుల జాబితా/టీసీ జతచేయాలని.. వివాహ తేదీ, సమయాన్ని నిర్ణయించుకుని అప్‌లోడ్ చేస్తే ధ్రువీకరణ పత్రం జారీ అవుతుందని తెలిపింది. ఆ పత్రాన్ని తీసుకుని వివాహ సమయానికి 6 గంటల ముందు తిరుమల కల్యాణ వేదిక వద్ద ఉన్న కార్యాలయంలో వివరాలను పరిశీలించుకోవాలని సూచించింది. కల్యాణ వేదిక వద్ద హిందూ వివాహ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపింది. వధూవరుల వయసు ధ్రువ పత్రాలు, నివాస ధ్రువ పత్రం, పెళ్లి ఫొటో, పెళ్లి పత్రిక, కల్యాణ మండపం రశీదుతో పాటు అవివాహితులుగా(అన్ మ్యారీడ్) ఉన్నట్లు స్థానిక ఎమ్మార్వో నుంచి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

నర్సింగ్ విద్యార్థినులకు మధుయాష్కీ చేయూత

- గుర్తింపు లేని కళాశాలలో చేరి మోసపోయిన వారికి గాంధీ, ఉస్మానియా కళాశాలల్లో అడ్మిషన్లు



సాక్షి, హైదరాబాద్: గుర్తింపు లేని నైటింగేల్ అనే నర్సింగ్ కళాశాలలో చేరి మోసపోయిన 51 మంది విద్యార్థినులకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ భరోసా కల్పించారు. విద్యార్థినులు విద్యా సంవత్సరం నష్టపోకుండా వారికి ఉస్మానియా, గాంధీ ఆస్పత్రి కళాశాలల్లో అడ్మిషన్లు ఇప్పించారు. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త లుబ్నా సర్వత్, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఆంగోతు వెంకటేశ్‌ల సహకారంతో, తమ భవిష్యత్తును నిలబెట్టిన మధుయాష్కీగౌడ్‌ను ఆదివారం ఆ విద్యార్థినులు గాంధీభవన్‌లో కలసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ విద్యార్థినులను మోసం చేసిన కళాశాల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య మంత్రి దామోదర రాజనర్సింహలతో మాట్లాడి విద్యార్థినుల సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని చెప్పారు. అందరూ శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని మధుయాష్కీ అభిలషించారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

మరో ఘటనలో పూరిల్లు దగ్ధం



రాధమ్మ

ఎర్రుపాలెం/ములకలపల్లి: పిడుగుపాటుతో ఒక మహిళ మృతి చెందింది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెంలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన తల్లపురెడ్డి రాధమ్మ (58) గేదెలను మేత కోసం పొలానికి తోలుకెళ్తుండగా.. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు రాధమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చలమన్ననగర్ గ్రామానికి చెందిన పర్సిక సీతయ్య ఇటీవలే పూరిల్లు నిర్మించుకున్నాడు. మరో రెండు రోజుల్లో గృహప్రవేశం కావలసి ఉండగా.. ఆదివారం ఆ ఇంటిపై పిడుగు పడటంతో పూర్తిగా దగ్ధమైంది.

పెళ్లి చేస్తామని చెప్పినా.. వినలేదు

చిన్నరేవల్లిలో ప్రేమ జంట ఆత్మహత్య

రాజాపూర్ (బాలానగర్): మైనారిటీ తీరలేదని, మేజర్ అయ్యాక పెళ్లి చేస్తామని కుటుంబసభ్యులు చెప్పినా వినకుండా మనస్తాపంతో ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. చిన్నరేవల్లి గ్రామానికి చెందిన ఎట్టి శివప్రసాద్ (17) అదే గ్రామానికి చెందిన వర్షిత (18) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్న శివప్రసాద్.. వర్షితను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని తండ్రి జంగయ్యకు తెలిపారు. ఇంత చిన్నవయసులో పెళ్లి ఎందుకు.. మైనారిటీ తీరలేదని, మేజర్ అయ్యాక ప్రేమించిన అమ్మాయికే ఇచ్చి పెళ్లి చేస్తానని జంగయ్య చెప్పాడు. ఈ విషయం తెలిసిన వర్షిత ఆదివారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వర్షిత చనిపోయిన విషయం తెలిసిన శివప్రసాద్ తీవ్ర మనస్తాపానికి గురై తానూ ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల రైతులు గమనించి మృతుడి తండ్రికి సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం శివప్రసాద్ మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి, వర్షిత మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుంటే ఆత్మహత్యే

ఖమ్మం జిల్లా భాగ్యనగర్ తండాలో మహిళల ఆందోళన



పురుగు మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న మహిళలు

కారేపల్లి: ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోతే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటామంటూ పేద మహిళలు ఆందోళనకు దిగారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాలో ఆదివారం చోటుచేసుకుంది. కూలీ పనులు చేస్తూ జీవనం సాగించే తాము పూరిగుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్నామని, అలాంటి తమకు ఇందిరమ్మ ఇళ్లు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఇల్లు కేటాయించాలంటే ఇందిరమ్మ కమిటీ సభ్యులు రూ.50 వేలు అడుగుతున్నారని, తమలాంటి పేదలు అంత డబ్బు ఎలా ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమకు న్యాయం చేయాలని లేదంటే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి మరో 28 మండలాల్లో భూభారతి

- 28 జిల్లాల్లో పైలట్ పద్ధతిలో అమలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టాన్ని సోమవారం నుంచి మరో 28 మండలాల్లో పైలట్ పద్ధతిలో చేపట్టనున్నారు. మొదట పైలట్ పద్ధతిలో నారాయణపేట, ములుగు, ఖమ్మం, కామారెడ్డి జిల్లాల్లోని నాలుగు మండలాల్లో ఈ చట్టాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ నాలుగు జిల్లాలతోపాటు హైదరాబాద్‌ను మినహాయించి మిగిలిన 28 జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు చేయనున్నారు. ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల్లో రైతులకు చట్టంపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించి వ్యవసాయ భూముల సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా భూభారతిపై అవగాహన సదస్సులు జరుగుతున్నాయి. 590 మండలాల్లో ఇప్పటికే సదస్సులు నిర్వహించారు.

28 మండలాలు ఇవే: ప్రస్తుతం వెంకటాపురం (ములుగు), నేలకొండపల్లి (ఖమ్మం), మద్దూరు (నారాయణపేట), లింగంపేట (కామారెడ్డి) మండలాల్లో భూభారతి పైలట్‌గా అమలవుతోంది. సోమవారం నుంచి బొరాజ్ (ఆదిలాబాద్), సుజాతానగర్ (భద్రాద్రి కొత్తగూడెం), నడికుడ (హనుమకొండ), బుగ్గారం (జగిత్యాల), స్టేషన్ ఘన్‌పూర్ (జనగామ), రేగొండ (భూపాలపల్లి), ఇటిక్యాల్ (జోగుళాంబ గద్వాల), సైదాపూర్ (కరీంనగర్), పెంచికల్‌పేట్ (ఆసిఫాబాద్), దంతాలపల్లి (మహబూబాబాద్), మూసాపేట (మహబూబ్‌నగర్), బీమారం (మంచిర్యాల), చిల్పిచిడ్ (మెదక్), కీసర (మేడ్చల్), పెంట్లవల్లి (నాగర్‌కర్నూల్), నకిరేకల్ (నల్లగొండ), కుంతాల (నిర్మల్), మెండోరా (నిజామాబాద్), ఎలిగేడ్ (పెద్దపల్లి), రుద్రంగి (రాజన్న సిరిసిల్ల), కుందుర్గ్ (రంగారెడ్డి), కొండాపూర్ (సంగారెడ్డి), అక్కన్నపేట (సిద్దిపేట), గరిడేపల్లి (సూర్యాపేట), ధరూర్ (వికారాబాద్), గోపాలపేట (వనపర్తి), వర్ధన్నపేట (వరంగల్), ఆత్మకూర్–ఎం (యాదాద్రి భువనగిరి) మండలాల్లో ఈ చట్టాన్ని అమలు చేయనున్నారు.

విస్తృత అవగాహన కల్పించాలి: మంత్రి పొంగులేటి



భూభారతి చట్టంపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను పరిష్కరించడమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు జరగాలని, ప్రజలకు అర్థమయ్యే భాషలో చట్టాన్ని వివరించాలని సూచించారు. ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలుచేసే బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన స్పష్టంచేశారు.

భూభారతిపై లా విద్యార్థులు అవగాహన కల్పించాలి: భూమి సునీల్



భూభారతి చట్టంపై రైతాంగానికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత న్యాయ శాస్త్ర విద్యార్థులపై ఉందని లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు, భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం న్యాయవిద్య అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి పదిమంది రైతులకు ఈ చట్టం గురించి వివరిస్తే.. కనీసం రాష్ట్రంలోని రెండు లక్షల మంది రైతులకు అవగాహన కలుగుతుందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి న్యాయ విద్యార్థి ఒక గ్రామానికి వెళ్లి.. అక్కడ పది మంది రైతులకు చట్టం గురించి వివరించాలని సూచించారు. వారితో ఫొటో దిగి సోషల్ మీడియాలో పోస్టు చేయాలని కోరారు.

గాలివాన బీభత్సం



కామారెడ్డి జిల్లా టేక్రియాల్‌లో తడిసిన ధాన్యాన్ని కుప్పగా వేస్తున్న రైతులు



సిద్దిపేట జిల్లా దుబ్బాక మార్కెట్ యార్డులో వర్షపు నీటిలో ధాన్యం

సాక్షి, సిద్దిపేట/సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో ఆదివారం ఈదురుగాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షం రైతులకు అపారనష్టం మిగిల్చింది. సాయంత్రం కురిసిన వానకు సిద్దిపేట జిల్లాలోని మార్కెట్ యార్డులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు అందుబాటులో లేకపోవడంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయింది. వర్షాల దృష్ట్యా త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వర్షం కారణంగా చేతికి వచ్చిన వరి పంట కళ్లెదుటనే నేలకు ఒరిగిపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. కొండపాక మండలంలో దుద్దెడ టోల్‌గేట్ పైకప్పు, క్యాబిన్‌లు ఈదురుగాలికి కొట్టుకుపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. జిల్లావ్యాప్తంగా 50కి పైగా విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చిన్నకోడూరు మండలం కిష్టాపూర్‌లో పిడుగుపాటుకు రెండు ఎడ్లు మృతి చెందాయి. ఇంకా పలుచోట్ల పిడుగులు పడ్డాయి. వర్షం కారణంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కామారెడ్డి జిల్లాలో దెబ్బతిన్న పంటలు

అకాల వర్షం కారణంగా కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఆదివారం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోయింది. కొన్ని చోట్ల వడ్లు వాననీటిలో కొట్టుకుపోయాయి. జిల్లాలోని కామారెడ్డి, గాంధారి, లింగంపేట, తాడ్వాయి, బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి, రాజంపేట తదితర మండలాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు వర్షం కురిసింది. కొన్ని చోట్ల ఈదురుగాలుల కారణంగా పంటలు నేలకొరిగాయి. మామిడి కాయలు రాలిపోయాయి. బీబీపేట మండలం తుజాల్‌పూర్‌లో పిడుగుపడి ఐదుగురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. అకాల వర్షంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వరితో పాటు ఇతర పంటలకూ నష్టం జరిగినట్టు తెలుస్తోంది.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 5 । మే । 2025



మేనకోడలే సూత్రధారి

ఒంటరిగా ఉన్న మేనత్త ఇంట్లో దోపిడీ చేయించింది ఓ మేనకోడలు. ఇల్లు అద్దెకు కావాలన్న నెపంతో బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన కేసులో మిస్టరీ వీడింది. -10లో



అందాల తారల ఆగమనం..

మిస్ వరల్డ్ పోటీలకు నగరం ముస్తాబవుతోంది. దాదాపు 120 దేశాలకు చెందిన అందాల భామలు ఒక్కొక్కరుగా నగరానికి చేరుకుంటున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.0/25.0

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 37, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

విమాన టికెట్‌కు డబ్బుల్లేక.. వ్యభిచార కూపంలోకి..

- స్నేహితుడిని నమ్మి వస్తే నట్టేట ముంచాడు
- పోలీసులకు పట్టుబడిన థాయ్‌లాండ్ యువతి

బంజారాహిల్స్: స్నేహితుడిని నమ్ముకుని భారత్‌కు వచ్చిన థాయ్‌లాండ్ యువతి మోసానికి గురైంది. తిరిగి తన స్వదేశం వెళ్లేందుకు విమాన టికెట్‌కు డబ్బులు లేక వ్యభిచారంలోకి దిగి పోలీసులకు పట్టుబడింది. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. థాయ్‌లాండ్‌కు చెందిన యువతి (30)కి, చెన్నైకి చెందిన యువకుడికి ఇన్‌స్టాలో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. అతడు రమ్మనడంతో గత మార్చిలో యువతి చెన్నైకి వచ్చేసింది. ఆమెను చెన్నైలోని ఓ హోటల్‌లో ఉంచి అతడు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ముఖం చాటేయడంతో యువతి హోటల్ బిల్లు చెల్లించలేక.. థాయలాండ్ వెళ్లలేక ఇబ్బందుల పాలయ్యింది. థాయ్‌లాండ్‌కు చెందిన స్నేహితురాలిని సంప్రదించింది. థాయ్‌లాండ్ నుంచి పలువురు మహిళలను వ్యభిచార వృత్తి కోసం భారత్‌కు పంపించే ఓ స్నేహితురాలు నగరంలోని యువతితో మాట్లాడించడంతో గత నెల 30న బాధితురాలు నగరానికి చేరుకుంది. శ్రీనగర్ కాలనీలో ఓ ఫ్లాట్‌లో మరో యువతితో కలిసి వ్యభిచారానికి పాల్పడింది. విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు చేయగా బాధిత యువతి పట్టుబడింది. తనను బాయ్‌ఫ్రెండ్ మోసం చేశాడని, హోటల్ బిల్లు చెల్లించేందుకు, తిరిగి స్వదేశం వెళ్లిపోవడానికి విమాన చార్జీల కోసం తప్పనిసరి పరిస్థితుల్లోనే వ్యభిచార వృత్తిలోకి దిగినట్లు ఆమె తెలిపింది. పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి ఆదివారం పునరావాస కేంద్రానికి తరలించారు.



నేడు హైదరాబాద్ X ఢిల్లీ



ఐపీఎల్ సీజన్‌లో భాగంగా సోమవారం ఆరో మ్యాచ్‌కు ఉప్పల్ స్టేడియం సిద్ధమైంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. ఆదివారం ఇరు జట్ల క్రికెటర్లు కసరత్తు చేశారు. కాగా.. 10 మ్యాచ్‌ల్లో 3 మాత్రమే గెలిచిన హైదరాబాద్ ఈ మ్యాచ్‌లో ఓడిపోతే 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి అధికారికంగా నిష్క్రమిస్తుంది.

– సాక్షి, హైదరాబాద్



పెంపుడు శునకమే యమపాశమైంది!

వెంగళరావునగర్: తాను పెంచుకుంటున్న శునకమే ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొన్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన డి.పవన్‌కుమార్ (37) తన స్నేహితుడు సందీప్‌తో కలిసి పదేళ్లుగా మధురానగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో గదిలో నిద్రపోయాడు. పక్కనే అతని పెంపుడు కుక్క కూడా ఉంది. ఉదయం సందీప్ తలుపు తట్టగా పవన్ లేవలేదు. అనుమానం వచ్చి చుట్టుపక్కల వారితో తలుపు పగులకొట్టి లోనికి వెళ్లి చూడగా పవన్ విగతజీవిగా కనిపించాడు. అతని మర్మాంగాలు రక్తంతో ఉన్నాయి. అతని పెంపుడు కుక్క నోటి నిండా రక్తం ఉంది. కుక్క అతడి మర్మాంగాలను గాయపర్చడం వల్లే మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు. పవన్‌కుమార్‌కు గతంలో వివాహమైంది. భార్యతో విడాకులు కావడంతో నగరంలో ఉంటున్నాడు. స్నేహితుడు సందీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నిజాం కాలేజ్ పరీక్ష కేంద్రం వద్ద..





ఎల్‌బీ నగర్ హైస్కూల్ వద్ద..

'నీట్'గా ముగిసింది..

నగరంలో 'నీట్' పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 62 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 26,609 విద్యార్థులకు గాను 25,929 మంది హాజరయ్యారు. మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు.

–సాక్షి, సిటీబ్యూరో



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

అక్రమాల త్రాసు.. అవినీతికి వత్తాసు!

తూ.కొ. శాఖలో ఆమ్యామ్యాల పర్వం

- దిద్దుబాటు సరే.. చర్యలు శూన్యం
- తిలా పాపం తలా పిడికెడు చందం
- ఏమీ పట్టని పౌర సరఫరాల మంత్రి

సాక్షి, సిటీబ్యూరో: 'నవ్విపోదురుగాక మాకేటి సిగ్గు.. మా ఇచ్ఛయే గాక మాకేటి వెరపు' అన్న చందంగా తయారైంది రాష్ట్ర తూనికలు, కొలతల శాఖ యంత్రాంగం తీరు. తూనికలు, కొలతల మోసాలపై పర్యవేక్షణ, కట్టడి ఏమోగాని, ప్రతి సేవకు నిర్బంధ వసూళ్ల ప్రక్రియ మాత్రం రాజ్యమేలుతోంది. డిపార్ట్‌మెంట్ రుసుంతో పాటు అనధికారికంగా నగదు ముట్టచెబితే కానీ వివిధ కేటగిరీ తూకం, కొలతల యంత్రాలకు స్టాంపింగ్, ధ్రువీకరణ పత్రాల రెన్యువల్స్ ప్రక్రియ ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. తూనికలు, కొలత శాఖకు రెగ్యులర్ రథసారథి లేకపోవడం, సాక్షాత్తూ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా పెద్దగా దృష్టి సారించకపోవడంతో పరిస్థితి ఇష్టారాజ్యంగా మారింది. కొందరు అధికారుల అవినీతి, అక్రమాలపై సమగ్ర ఆధారాలతో సహా ఫిర్యాదులు వస్తున్నా... వాటిని తొక్కి పెట్టడం, ఒత్తిడి వస్తే అక్రమార్కులకు వత్తాసు పలికే విధంగా చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకొని తిమ్మిని బమ్మి చేయడం వంటి ఘటనలు క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు తిలా పాపం తలా పిడికెడు అన్నచందంగా మారింది.

ఇదీ సంగతి..

ఇటీవల గద్వాల్ జిల్లా అలంపూర్‌లోని పుష్ప నాయుడు ఫిల్లింగ్ స్టేషన్ డిస్పెన్సర్ మిషిన్ల స్టాంపింగ్ రెన్యువల్ సందర్భంగా తూనికలు,కొలతల జిల్లా ఇన్‌స్పెక్టర్ డీఎస్ఎస్ఆర్ పుస్తకంపై ఆరా తీసి నిర్వహణ సరిగా చేయడం లేదన్న సాకుతో జరిమానా పేరిట రూ.25 వేలు ఆఫ్‌లైన్‌లో నగదు చెల్లించాలని సూచించారు. బంకు యాజమాని తన సూపర్‌వైజర్‌తో ఇన్‌స్పెక్టర్‌కు నగదు ఇవ్వడానికి ప్రయత్నించగా.. ఆ నగదును తన వాహన డ్రైవర్‌కు ఇవ్వాలని అతడు సైగ చేశాడు. డ్రైవర్ ఆ నగదును లెక్కించి మరీ తీసుకున్నాడు. ఆ తర్వాత కేవలం రూ.5 వేలు చెల్లించినట్లు సదరు ఇన్‌స్పెక్టర్ రసీదును బంకు యజమాని చేతిలో పెట్టాడు. ఇదేంటని ప్రశ్నిస్తే.. వాస్తవానికి రూ.30 వేలు జరిమానా విధించాలి కానీ అందులో రూ.5 వేలు తగ్గించాను కదా అంటూ స్టాంపింగ్ ప్రక్రియ పూర్తి చేసి వెళ్లి పోయారు. ఈ తతంగమంతా సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డు అయింది.



రంగంలోకి సివిల్ సప్లయ్ విజిలెన్స్

ఆఖరికి పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది. తూనికలు, కొలతల శాఖ విజిలెన్స్ విభాగం సమర్పించిన విచారణ నివేదికపై సంతృప్తి చెందని రాష్ట్ర కంట్రోలర్ ఏకంగా పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ విభాగానికి విచారణకు ఆదేశించారు. దీంతో గత నెల 23న పెట్రోల్ బంక్‌కు సందర్శించిన విజిలెన్స్ బృందం విచారణ నిర్వహించి సీసీ ఫుటేజీ, పలు ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. కాగా.. సంబంధిత అధికారి సెలవులో ఉండటంతో విచారణ నివేదిక సమర్పించలేదని తెలుస్తోంది.

ఫిర్యాదు చేసినా.. తొక్కిపెట్టారు..

బంక్ నాజిల్ స్టాంపింగ్‌కు అదనంగా డబ్బులు ఇవ్వలేదని కారణంతో డీఎస్ఎస్ఆర్ బుక్ మెయింటెనెన్స్‌లో నిర్లక్ష్యంపై జరిమానా విధించిన తూ.కొ. శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ నాలుగింతల సొమ్మును తన జేబులో వేసుకున్నారని పెట్రోల్ బంక్ యాజమాని రాష్ట్ర కంట్రోలర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శాఖాపరమైన విజిలెన్స్‌కు విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ విభాగం రెండు నెలల పాటు విచారణను తొక్కిపెట్టింది. వాస్తవంగా పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ యజమాని సీసీ కెమెరా ఫుటేజీ తదితర ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ విచారణ సక్రమంగా ముందుకు సాగలేదు. చివరికి రాష్ట్ర కంట్రోలర్ సీరియస్ కావడంతో సదరు విజిలెన్స్ విభాగం హడావుడిగా విచారణ నిర్వహించి నివేదిక సమర్పించినట్లు సమాచారం.

సిటీలో సీఎస్ పర్యటన

ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్టీపీల పురోగతిపై పరిశీలన

- మెట్రో రెండో దశ కోసం రోడ్డు విస్తరణ పనులపై ఆరా
- వాటర్ బోర్డు, జీహెచ్ఎంసీ, మెట్రో అధికారుల ఉరుకులు పరుగులు

సాక్షి, సిటీబ్యూరో/చార్మినార్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన కె.రామకృష్ణారావు ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. జీహెచ్ఎంసీ ఎస్ఆర్‌డీపీ, మెట్రో, వాటర్ వర్క్స్, హెరిటేజ్ తదితర పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కొత్త సీఎస్ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తుండటంతో సెలవు రోజు అయినప్పటికీ.. సంబంధిత ఉన్నతాధికారులు, సిబ్బంది ఆయన వెంట ఉరుకులు పరుగులు తీశారు. తొలుత సీఎస్.. బంజారాహిల్స్‌లోని జీవీకే మాల్ వద్ద సుమారు రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. పిదప దారుషిఫా వద్ద మెట్రో లైన్ అలైన్‌మెంట్ (ఓల్డ్ సిటీ కారిడార్) పరిశీలించారు. ఓల్డ్ సిటీ కారిడార్ ఎంజీబీఎస్ బస్ స్టేషన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపట్టే మెట్రో లైన్ పనులపై ఆరా తీశారు. అక్కడి నుంచి హుస్సేన్ ఆలమ్‌లోని ఖుర్షీద్ ఝూ దేవిడీ హెరిటేజ్ భవనం, హెచ్ఎండీఏ నిధులతో చేపట్టిన కన్జర్వేషన్ రెస్టోరేషన్ మరమ్మతు పనులను సీఎస్ పరిశీలించారు. అనంతరం ఫలక్‌నుమా ఫ్లై ఓవర్ నుంచి నల్లగొండ ఫ్లైఓవర్ పనులు, మూసీ నదిపై మూసారంబాగ్ వద్ద చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆ తర్వాత వాటర్ వర్క్స్ ద్వారా చేపట్టిన ఎస్టీపీలను రామకృష్ణారావు పరిశీలించారు.



పాతబస్తీలో పర్యటిస్తున్న సీఎస్, ఇతర ఉన్నతాధికారులు

ఓల్డ్‌సిటీ మెట్రోకు నిధుల కొరత లేదు..



మెట్రో ఎలైన్‌మెంట్‌పై సీఎస్‌కు వివరిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి

మహా నగర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీఎస్ రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓల్డ్ సిటీ మెట్రోకు నిధుల కొరత లేదన్నారు. ఆస్తుల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఎస్ఆర్‌డీపీ ద్వారా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ ఇతర మౌలిక సదుపాయాల పనుల్లో వేగం పెంచాలన్నారు. జలమండలి ఎస్టీపీలను త్వరిత గతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సీఎస్ వెంట మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి..



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

- ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో నలుగురికి గాయాలు



చార్లెస్ (ఫైల్)



యశ్వంత్ (ఫైల్)


కీసర: కొద్దిసేపట్లో ఇంటికి చేరుకోవాల్సిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. దైవ దర్శనం చేసుకుని వెళ్లి వస్తుండగా మృత్యువు కబళించింది. కీసరలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఆదివారం జరిగిన ఘోర ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా మేడిపల్లికి చెందిన యశ్వంత్ (25), పీర్జాదిగూడకు చెందిన చార్లెస్ (25), ఎల్‌బీనగర్‌కు చెందిన చెన్నకేశవ గౌడ్ (23), వివేక్, సురేష్, యశ్వంత్ నాయక్ శనివారం ఉదయం కారులో కర్ణాటక బీదర్‌లోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి వెళ్లారు. అనంతరం ఆదివారం ఉదయం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. యశ్వంత్ కారు నడుపుతుండగా, చార్లెస్ ముందు సీట్లో కూర్చున్నాడు. మిగతవారు వెనక సీటులో ఉన్నారు. ఉదయం 11:15 గంటల సమయంలో ఔటర్ రింగ్ రోడ్డుపై కీసర ఎగ్జిట్ దాటిన తర్వాత ముందున్న గ్యాస్ కంటెయినర్ లారీని కారు ఢీకొట్టి, డివైడర్‌కు తగిలింది. ఈ ఘటనలో యశ్వంత్‌తో పాటు చార్లెస్ అక్కడికక్కడే మృతి చెందారు. చెన్నకేశవ గౌడ్ తీవ్రంగా గాయపడటంతో వైద్యం కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో చేర్పించారు. మిగతా ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారిని చికిత్స కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రిలో చేర్పించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బడి బస్.. ఫిట్‌లెస్!

ఏడాదికోసారి ప్రహసనంలా ఫిట్‌నెస్ పరీక్షలు

బడి బస్సుల సామర్థ్య పరీక్షల నిర్వహణ ఏటా ఒక తంతుగా మారింది. ఇటు విద్యాసంస్థలు, అటు రవాణా శాఖ ఈ ప్రక్రియను ప్రహసనంగా మార్చాయి. వేసవి సెలవులు ముగిసి తిరిగి విద్యాసంస్థలు తెరుచుకొనేవరకు బస్సుల సామర్థ్యంపై దృష్టి సారించడం లేదు. అప్పటికప్పుడు హడావుడిగా ఆ ప్రక్రియను చేపట్టి ముగిస్తున్నారు. దీంతో బస్సుల సామర్థ్యం నిర్ధారణలో పారదర్శకత లోపిస్తోంది. కాగా.. ఫిట్‌నెస్ నిర్ధారణ కోసం ప్రతి బస్సు నుంచి రూ.వేలల్లో వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఫలితంగా స్కూల్ బస్సుల నిర్వహణ లోపభూయిష్టంగా మారుతోంది. ఈ బస్సులను నడిపేందుకు కనీసం ఐదేళ్ల అనుభవం కలిగిన డ్రైవర్లను ఏర్పాటు చేయాలనే నిబంధన సైతం అమలు కావడం లేదు.

–సాక్షి, సిటీబ్యూరో



నిర్లక్ష్యంతో ప్రమాదాలు..

ప్రతియేటా మే నెలలోనే బడి బస్సులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్‌ను ధ్రువీకరించాలి. ఇంచుమించు అన్ని పాఠశాలలు జూన్ మొదటి వారంలోనే తిరిగి తెరుచుకుంటాయి. ఆ సమయానికి వాహనాలు సిద్ధంగా ఉండాలి. ఆ దిశగా ఇప్పటికే ముందస్తుగా సన్నద్ధత కావాల్సి ఉంది. వాహనాల కండిషన్‌ను పరీక్షించడంతో పాటు బస్సుల నిర్వహణ, రోడ్డు భద్రత నిబంధనలపై, ముఖ్యంగా పిల్లల భద్రత కోసం తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తలపై విద్యా సంస్థలు, తల్లిదండ్రులు, డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు ఆర్టీఏ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. బస్సుల నిర్వహణలో విద్యాసంస్థల నిర్లక్ష్యం, డ్రైవర్ల అజాగ్రత్త, అటెండర్లు లేకపోవడం వంటి కారణాలతో తరచూ ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. ప్రతి బస్సులో అటెండర్ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన కొన్ని చోట్ల అమలుకు నోచడం లేదు. బస్సు ముందూ వెనకా ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాతే ముందుకు కదిలించాల్సి ఉండగా కొందరు డ్రైవర్లు ఈ చిన్నపాటి జాగ్రత్తను కూడా పాటించకుండా వాహనాలను ఆకస్మాత్తుగా ముందుకు దూకిస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రమాదాలకు దారితీస్తోంది.

- మొక్కుబడి తనిఖీలతో ధ్రువీకరణ పత్రాలు
- గ్రేటర్‌లో కాలం చెల్లిన స్కూల్ బస్సులు 2,500
- సామర్థ్య పరీక్షలపై కనిపించని ముందస్తు సన్నద్ధత

కాల పరిమితి ముగిసినా..

రవాణా శాఖ లెక్కల ప్రకారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సుమారు 11,500 స్కూల్ బస్సులు ఉన్నట్లు అంచనా. నిబంధనల మేరకు 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాలను కాలం చెల్లినవిగా పరిగణిస్తారు. ఆ లెక్కన సుమారు 2,500కుపైగా కాలం చెల్లిన స్కూల్ బస్సులు నగరంలో తిరుగుతున్నాయి. మోటారు వాహన తనిఖీ అధికారుల నిర్లక్ష్యంతో.. కాల పరిమితి ముగిసిన వాహనాలు యథేచ్ఛగా రోడ్డెక్కుతున్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి పలు రాష్ట్రాల్లో తక్కువ ధరల్లో పాత బస్సులను కొనుగోలు చేసి వాటిని హైదరాబాద్‌లో స్కూల్ బస్సులుగా మారుస్తున్నారు.

డ్రైవర్ల ఎంపిక ఎంతో కీలకం..

- ఇటీవల కాలంలో స్కూల్ బస్సులే కాకుండా రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లలో దూకుడు పెరిగింది. మొబైల్ ఫోన్లలో మాట్లాడుతూ పెద్ద బండ్లను నడుపుతున్నారు. స్కూల్ బస్సుల్లోనూ ఈ జాడ్యం కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని కీలకమైన బస్సుల కండిషన్‌తో పాటు అంతకంటే కీలకమైన డ్రైవర్లను కూడా జాగ్రత్తగా ఎంపిక చేయాలి.
- డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించొద్దు. పాఠశాల యాజమాన్యం ప్రతి డ్రైవర్ ఆరోగ్య పట్టికను విధిగా నిర్వహించాలి. యాజమాన్యం తమ సొంత ఖర్చుతో డ్రైవర్లకు ప్రతి 3 నెలలకోసారి రక్తపోటు, షుగర్, కంటి చూపు వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి.
- డ్రైవర్‌ను నియమించేందుకు ముందు అతని అర్హతలు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర అంశాలపై సంబంధిత ఆర్టీఏ అధికారులను సంప్రదించాలి. డ్రైవర్‌కు బస్సు డ్రైవింగ్‌లో కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలి.
- డ్రైవర్, అటెండర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలి.

వృద్ధ దంపతుల దారుణ హత్య

బంగారం, నగదు చోరీ



కనకయ్య, రాజమ్మ (ఫైల్)

అల్వాల్: వృద్ధ దంపతులను దారుణంగా హత్య చేసి ఒంటిపై ఉన్న బంగారు నగలతో పాటు, ఇంట్లో ఉన్న నగదు ఎత్తుకెళ్లిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సూర్యనగర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, మాణిక్యారం గ్రామానికి చెందిన కనకయ్య (70), రాజమ్మ (65) దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారికి పెళ్లిళ్లు కావడంతో బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి స్థిరపడ్డారు. ఊరిలో వ్యవసాయం చేసుకునే కనకయ్య, రాజమ్మ వయసు మీద పడడంతో పిల్లల వద్ద ఉందామనే ఆలోచనతో మూడేళ్ల క్రితం నగరానికి వచ్చారు. కనకయ్య అల్వాల్, సూర్యనగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. కొన్నాళ్ల క్రితం అతను అనారోగ్యానికి గురి కావడంతో ఊరికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి సమీపంలో ఉంటున్న కూతురు లత ఇంటికి వెళ్లి సామన్లు సర్దుకునేందుకు అవసరమైన సంచులు కూడా తెచ్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున వారి కుమార్తె లత ఇంటికి వచ్చి చూడగా తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో మంచంపై విగతజీవులై పడి ఉన్నారు. ఇద్దరి తలలపై గాయాలు ఉన్నాయి. సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. లత కేకలు విన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జాగిలాలను రప్పించి పరిసరాల్లో తనిఖీలు చేశారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి ఇంట్లో చొరబడి దొంగతనాలు పాల్పడి ఉంటారని, ఈ క్రమంలోనే వారిపై దాడి చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. రాజమ్మ మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, వెండి పట్టీలు, రూ. లక్ష నగదు చోరీకి గురైనట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. కనకయ్య తమ వద్ద ఉన్న నగదు అవసరమైన వారికి వడ్డీకి ఇచ్చే వాడని తాను ఊరికి వెళ్లి రూ. లక్ష తీసుకువచ్చానని, అవసరం ఉన్న వారికి వడ్డీకి ఇస్తానని చెప్పినట్లు స్థానికులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న బాలానగర్ డీసీపీ సుధీర్ కుమార్, ఏసీపీ రాములు, సీఐ రాహుల్‌దేవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు సంబంధించిన కొన్ని ఆధారాలు లభించాయని త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

మేనకోడలే సూత్రధారి

- మేనత్త ఇంట్లో దోపిడీ చేయించిన వైనం
- అద్దె పేరుతో ఇంట్లోకి చొరబడి చోరీ
- ప్రధాన నిందితురాలి పాటు మరో ఇద్దరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

సికింద్రాబాద్: ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలైన మేనత్తను టార్గెట్ చేసి ఆమె ఇంట్లో దోపిడీ చేయించిన మేనకోడలి ఉదంతమిదీ. ఇల్లు అద్దెకు కావాలన్న నెపంతో వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించిన ఇద్దరు ఆగంతకులు ఆమెను బంధించి నగలు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన కేసులో మిస్టరీ వీడింది. ఈ దారుణానికి పాల్పడిన ఇద్దరు ఆగంతకులతో పాటు సూత్రధారిగా వ్యవహరించిన బాధితురాలి మేనకోడలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ముగ్గురినీ రిమాండ్‌కు తరలించారు. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ పార్సిగుట్టలో పారిజాతం (60) అనే మహిళ ఒంటరిగా నివసిస్తోంది. ఈనెల 2న మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు ఇల్లు అద్దెకు కావాలంటూ పారిజాతం ఉంటున్న మొదటి అంతస్తుకు వచ్చారు. ఆమె తేరుకునే లోపే ఇంట్లోకి చొరబడి తలుపులు గడియపెట్టి ఆమెను కుర్చీలో కూర్చోబెట్టి తాడుతో కట్టేశారు. నోటికి ప్లాస్టర్ వేసి సెల్‌ఫోన్, రూ.6వేల నగలు, 30 గ్రాముల బంగారు ఆభరణాలను లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. దొంగలు వెళ్లిపోయిన తర్వాత కట్లు విప్పుకుని బయటికి వచ్చిన పారిజాతం స్థానికుల సహాయంతో వారాసీగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా...

బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. ముషీరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో స్వీపర్‌గా పని చేస్తున్న శ్రీకాంత్, బన్సీలాల్‌పేట్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ ఈశ్వర్‌లను నిందితులుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తమ బంధువు పార్సిగుట్టకు చెందిన క్యాటరింగ్ వర్కర్ ఆళ్ల జ్యోతి సూచన మేరకే తాము పారిజాతం ఇంట్లో దోపిడీకి పాల్పడినట్లు నిందితులు వెల్లడించారు. దీంతో జ్యోతిని అదుపులోకి తీసుకుని విచారించగా తన మేనత్త ఒంటరిగా ఉంటున్న విషయం తనకు తెలుసునని డబ్బు కోసమే శ్రీకాంత్‌ను దోపిడీకి పురమాయించినట్లు తెలిపింది. నిందితుల నుంచి సెల్‌ఫోన్, నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేవలం డబ్బు కోసం మాత్రమే వీరు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వారికి ఎలాంటి నేర చరిత్ర లేదన్నారు. రెండు రోజుల్లోనే కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్ఐలు సుధాకర్, ప్రకాశ్‌రెడ్డి, కానిస్టేబుళ్లు గాలేబ్, దస్తగిరి, వేణు, రామకృష్ణ తదితరులకు డీసీపీ అవార్డులు అందజేశారు.

గన్‌తో తిరుగుతున్న వ్యక్తి అరెస్టు

అమీర్‌పేట: గన్ పట్టుకుని తిరుగుతున్న వ్యక్తిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలోని ఎక్సైడ్ బ్యాటరీ షోరూమ్ వద్ద ఓ వక్యక్తి తుపాకీతో తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌కు చెందిన అశోక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి తుపాకీతో పాటు బ్యాగులో ఉన్న రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కాగా అతడి వద్ద ఉన్న తుపాకీని పరిశీలించి ఎయిర్ గన్‌గా నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసుకత్తున్నామని, పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి



గాయపడిన అవదేశ్ కుమార్ వర్మ

మల్లాపూర్: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అవదేశ్ కుమార్ వర్మ(50), బాబు రామ్ వర్మ(55) నగరానికి వలస వచ్చి మల్లాపూర్ వీఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వారిద్దరి మధ్య గొడవ జరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకున్న బాబురామ్ వర్మ అదను కోసం ఎదురు చూస్తున్నాడు. ఇందుకుగాను కొబ్బరి కాయలు కొట్టే కత్తిని కొనుగోలు చేసి ఇంట్లో పెట్టుకున్నాడు. ఆదివారం ఉదయం అతను అవదేశ్ కుమార్ వర్మపై కత్తితో దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని నాచారం ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. ప్రసుత్తం అవదేశ్ కుమార్ వర్మ ఆరోగ్య నిలకడగానే ఉందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



లక్ష్మి (ఫైల్)

జీడిమెట్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ అపార్ట్‌మెంట్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మి(25)కి గత డిసెంబర్‌లో హరికృష్ణతో వివాహం జరిగింది. భార్యాభర్తలు సుభాష్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. హరికృష్ణ ఓ ప్రైవేట్ పరిశ్రమలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం లక్ష్మి తాము ఉంటున్న అపార్ట్‌మెంట్ 5వ అంతస్తు నుంచి కిందకు దూకింది. దీనిని గుర్తించిన అపార్ట్‌మెంట్ వాసులు అక్కడకు వెళ్లి చూడగా తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా లక్ష్మికి పెళ్లి ఇష్టం లేని కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని సమాచారం. మృతురాలి తల్లిదండ్రుల వచ్చిన తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఉప్పల్ రింగ్ రోడ్డులో కారు దగ్ధం



ఉప్పల్: ఉప్పల్ రింగ్ రోడ్డులోని వరంగల్ బస్టాప్‌లో కారు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ కుమారుడు ప్రవీణ్ గౌడ్, తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఆదివారం ఉప్పల్‌లోని డీఎస్ఎల్ మాల్‌లో షాపింగ్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఉప్పల్ రింగ్ రోడ్డు వరంగల్ బస్టాప్ వద్దకు చేరుకోగానే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన వారు కారు లోంచి దిగి బయటికి పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసినా వారు సకాలంలో స్పందించకపోవడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ కారణంగా ఉప్పల్‌లో భారాగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సహాయంతో వాహనాన్ని అక్కడి నుంచి తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మోతి బాయ్(102)

శంకర్‌పల్లి: శతాధిక వృద్ధురాలు మృతి చెందారు. మండలంలోని పర్వేద గ్రామానికి చెందిన కటికె మోతి బాయ్(102) ఆదివారం అనారోగ్యంతో తుదిశ్వాస వీడారు. వంద సంవత్సరాలు జీవించిన బామ్మను కడసారిగా చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు. ఆమె మనుమడు సతీశ్ మాట్లాడుతూ.. వందేళ్ల వయస్సులోనూ అమ్మమ్మ ఎంతో హుషారుగా ఉండేదని, చిరుతిండికి అయిష్టత చూపేదని పేర్కొన్నారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

నాంపల్లి: కారు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మణికంఠ(24) అనే యువకుడు జొమోటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున అతను అమీర్‌పేట నుండి మెహిదీపట్నం వైపు వెళుతుండగా మాసబ్‌ట్యాంక్‌లోని ఖాజా మెన్షన్ హాల్ సమీపంలో గుర్తు తెలియని కారు అతడిని ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ ఫోన్ దుకాణంలో చోరీ

తాండూరు: సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకొనేందుకు వచ్చిన యువకుడు కౌంటర్‌పై ఉంచిన రూ.35వేలు తీసుకొని ఉడాయించిన సంఘటన తాండూరు పట్టణంలో ఆదివారం చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు పట్టణంలోని కొడంగల్ రోడ్డు మార్గంలో తాండూరుకు చెందిన ఓ వ్యాపారి ఒప్పో స్టోర్‌ను నిర్వహిస్తున్నాడు. షాప్ చూసుకోవాలని దుకాణంలో పని చేసే యువకుడికి చెప్పి బయటకు వెళ్లాడు. అప్పుడే ఓ వ్యక్తి ఫోన్ కొనేందుకు వచ్చాడు. వచ్చిన వ్యక్తికి రూ.35వేల ఫోన్‌ను విక్రయించాడు. వచ్చిన డబ్బులను క్యాష్ కౌంటర్‌లో పెడదామంటే తాళం వేసి ఉంది. దీంతో అతను కౌంటర్‌పైనే ఒక అరలో డబ్బులను పెట్టి వ్యాపారంపై దృష్టి పెట్టాడు. అప్పుడే ఓ యువకుడు సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకొనేందుకు వచ్చాడు. చార్జింగ్ పెట్టి ఫోన్ మాట్లాడుతూ.. ఎవరు లేని సమయం చూసి కౌంటర్‌పై ఉన్న రూ.35వేలను తీసుకొని మెల్లగా షాపులో నుంచి వెళ్లిపోయాడు. కొంత సేపటి తర్వాత షాపులో పని చేస్తున్న వ్యక్తి డబ్బులను చూసుకోగా కనిపించలేదు. దీంతో అతను యజమానితో కలిసి వెళ్లి పట్టణ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిపై లైంగిక దాడి కేసులో యువతి రిమాండ్

బంజారాహిల్స్: ఆ బాలుడికి 16 ఏళ్లు. అతడి తల్లిదండ్రులు జూబ్లీహిల్స్‌లోని ఓ బడా పారిశ్రామికవేత్త ఇంట్లో పని చేస్తూ అక్కడే ఉన్న సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. సదరు బాలుడు పదో తరగతి పరీక్షల కోసం గత జనవరిలో తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అదే ఇంట్లో పని మనిషిగా పనిచేస్తున్న మరో యువతి (28) వారు ఉంటున్న క్వార్టర్ పక్కనే మరో క్వార్టర్‌లో ఉంటోంది. ఆ బాలుడితో పరిచయం పెంచుకున్న ఆమె తరచూ అతడిని తన క్వార్టర్‌లోకి పిలిపించుకుని అతడిపై లైంగిక దాడికి పాల్పడేది. ఈ విషయం ఎవరికైనా చెబితే నీ తల్లి మీద దొంగతనం కేసు పెట్టించి ఉద్యోగం నుంచి తీసివేయిస్తానని బాలుడిని బెదిరించేది. తన తల్లి ఉద్యోగం పోతుందనే భయంతోనే అతను ఈ విషయం ఎక్కడా చెప్పలేదు. ఐదు రోజుల క్రితం సదరు యువతి గదిలో తన కుమారుడు ఉండడాన్ని గుర్తించిన అతడి తల్లి అక్కడికి వెళ్లి చూడగా సదరు యువతి తన కొడుకును బలవంతంగా ముద్దు పెట్టుకుంటుండగా చూసింది.ఈ విషయమై తన కుమారుడిని నిలదీయగా అతను తల్లికి పూర్తి వివరాలు చెప్పాడు. దీంతో బాధితుడి తల్లి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు లైంగిక దాడికి పాల్పడిన యువతిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

లారీ ఢీకొని, వ్యక్తి మృతి


అబ్దుల్లాపూర్‌మెట్: లారీ ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా ఝరాసంగం మండలం ఈదులపల్లి గ్రామానికి చెందిన బండి వినేష్‌కుమార్(30) ఆదివారం ఉదయం 11.45 గంటలకు పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు కూడలి సమీపంలో విజయవాడ జాతీయ రహదారి దాటుతున్నాడు. ఈ సమయంలో పుణే నుంచి ఒడిస్సా వైపునకు వెళ్తున్న ఓ లారీ వినేష్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలై.. అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

'ఫోన్ ట్యాపింగ్' శ్రవణ్‌రావుపై మరో కేసు

- ఇనుప ఖనిజం ఇప్పిస్తానంటూ మోసం
- అఖండ సంస్థ ఫిర్యాదు మేరకు రిజిస్టర్
- నిందితుల్లో శ్రవణ్ భార్య మరికొందరు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడిగా ఉన్న ఓ మీడియా సంస్థ యజమాని శ్రవణ్ కుమార్ రావుపై హైదరాబాద్‌లో మరో కేసు నమోదైంది. ఇనుప ఖనిజం వ్యాపారం డీల్ ఇప్పిస్తానంటూ మోసం చేశారని అఖండ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా సంస్థ ఎండీ ఎ.ఆకర్ష్ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసులు దీనిని రిజిస్టర్ చేశారు. రూ.6.5 కోట్ల గోల్‌మాల్‌తో ముడిపడి ఉన్న ఈ కేసులో శ్రవణ్‌రావుతో పాటు ఆయన భార్య స్వాతి రావు, వ్యాపార భాగస్వామి కేబీ వేదమూర్తి, ఎకోర్ ఇండస్ట్రీస్ హోల్‌టైమ్ డైరెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి నిందితులుగా ఉన్నారు. గత నెల 25నే ఈ కేసు నమోదైనప్పటికీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్నిధమ్ ఎనర్జీ సంస్థ డైరెక్టర్‌గా ఉన్న శ్రవణ్‌రావు 2022 జూన్‌లో ఆకర్ష్‌ను సంప్రదించాడు. కర్ణాటక, సాండూర్‌లో ఉన్న ఎకోర్ ఇండస్ట్రీస్ బాధ్యతల్ని తాను స్వీకరించినట్లు చెప్పాడు. ఇనుప ఖనిజం వ్యాపారంలో ఉన్న తమకు నిధులు సమకూరిస్తే ప్రతి టన్నుకు రూ.300 చొప్పున లాభం ఇస్తానంటూ నమ్మబలికాడు. దీంతో అఖండ సంస్థ 2022 నవంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు వివిధ దఫాలుగా ఎకోర్ సంస్థ ఖాతాల్లోకి రూ.6.5 కోట్లు బదిలీ చేసింది. ఈ చెల్లింపులకు సంబంధించి ఎకోర్ సంస్థ నుంచి తమకు ఎలాంటి ఇన్వాయిస్‌లు అందలేదని ఆకర్ష్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. 2023 నాటికి సంబంధిత వ్యక్తులకు రూ.7 కోట్ల విలువైన ఇనుప ఖనిజం సరఫరా జరగాల్సి ఉండగా... అలా చేయకపోవడంతో ఆకర్ష్‌కు అనుమానం వచ్చింది. దీంతో ఆరా తీసిన ఆయన తమ సంస్థ బదిలీ చేసిన నిధుల్ని శ్రవణ్‌రావు వేరే అవసరాలకు మళ్లించినట్లు గుర్తించారు. దీనిపై పలుమార్లు ప్రశ్నించినా శ్రవణ్‌రావు నుంచి సరైన సమాధానం రాలేదు. కొన్ని రోజులకు శ్రవణ్‌రావు విదేశాలకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఆకర్ష్ తన నిధులకు సంబంధించి శ్రవణ్ భార్య స్వాతితో పాటు వేదమూర్తిని పలుమార్లు సంప్రదించాడు. గత ఏడాది సెప్టెంబర్ వరకు వారు కేవలం రూ.50 లక్షలు మాత్రమే తిరిగి చెల్లించారు. గత నెల వరకు ఎదురు చూసిన ఆకర్ష్ దీనిపై సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదుతో పాటు బాధితుడు అనేక వాట్సాప్ చాటింగ్స్, ఈ-మెయిల్స్ ప్రతులకు జత చేశాడు. ఈ కేసును అధికారులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

విజయ్ దేవరకొండపై రాణాలో ఫిర్యాదు



షాద్‌నగర్‌రూరల్: గిరిజన జాతిని అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు విజయ్‌దేవరకొండపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎస్ఐ దేవరాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయక్ మాట్లాడుతూ.. సమాజంలో ఎంతో ఉన్నత విలువలు, సంస్కృతి, ఆచారాలను పాటిస్తున్న ఏకైన జాతి గిరిజన జాతి మాత్రమేనన్నారు. ఓ చిత్రం విడుదల వేడుకలో గిరిజనుల మనోభావాలు దెబ్బతినేలా విజయ్ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం నాయకులు సంతోష్‌నాయక్, చందర్‌నాయక్, శ్రీనివాస్, అంబాదాస్ ఉన్నారు.

ఎల్ఆర్ఎస్@255 కోట్లు

క్రమబద్ధీకరణకు విశేష స్పందన

- రాయితీ గడువు ముగింపు



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

తుర్కయంజాల్: అక్రమ లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు విశేష స్పందన లభించింది. ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించడంతో దరఖాస్తు దారులు చాలా మంది రుసుం చెల్లించారు. తొలుత మార్చి 31 వరకు రాయితీతో కూడిన గడువు ప్రకటించినప్పటికీ.. తరువాత మరో నెల, అనంతరం మే 3వ తేదీ వరకు అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఖాళీ స్థలాల యజమానులు ముందుకు రావడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది.

రూ.255.56 కోట్ల ఆదాయం

జిల్లాలోని 14 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్ల పరిధి నుంచి 2020 సంవత్సరంలో 2లక్షల 55వేల 923 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో లక్షా 78వేల 591 దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని అధికారులు ఆన్‌లైన్ ద్వారా సమాచారం అందజేశారు. దీంతో 65వేల 186 మంది రుసుం చెల్లించారు. దీంతో ప్రభుత్వానికి రూ.255 కోట్ల 56 లక్షల ఆదాయం వచ్చింది. అత్యధిక దరఖాస్తులు తుర్కయంజాల్ నుంచి 54,331 వచ్చినప్పటికీ, ఆదాయం మాత్రం పెద్ద అంబర్‌పేట నుంచి రూ.53 కోట్ల 85 లక్షలు వచ్చింది. బడంగ్‌పేట కార్పొరేషన్ నుంచి రూ.48 కోట్ల 45లక్షలు వచ్చాయి. అత్యల్పంగా శంషాబాద్ మున్సిపాలిటీలో 10,086 అర్జీలు వచ్చినప్పటికీ 111జీఓ పరిధిలో ఉండటంతో కేవలం 270 మందిని మాత్రమే అర్హులుగా పేర్కొంటూ రుసుం చెల్లించాలని సూచించారు. ఇందులో 151 మంది రూ.ఒక కోటి 59 లక్షలు చెల్లించారు.

మరో అవకాశం కల్పిస్తే..

ప్రభుత్వం రాయితీ ప్రకటించిన నాటి నుంచి ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు భారీగా ప్రచారం చేశారు. ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి, దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించారు. సులభంగా అర్థమయ్యేలా మొబైల్‌లో ఫైల్ స్టేటస్ చెక్ చేసుకోవడంతో పాటు, డబ్బులు చెల్లించే వెసులుబాటు కల్పించారు. దీంతో చాలా మంది రుసం చెల్లించారు. ప్రభుత్వం గడువు మరింత పెంచి, రాయితీ కల్పిస్తే మరికొందరు ఫీజు చెల్లించే అవకాశాలు ఉన్నాయి.

ప్రాసీడింగ్స్‌కు వేచి ఉండాల్సిందే

పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో భారీగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించినప్పటికీ.. వీటి పరిశీలనకు వేచి చూడక తప్పని పరిస్థితి. వారం క్రితం వరకు దరఖాస్తులను కేవలం టౌన్ ప్లానింగ్ అధికారులు అప్రూవల్ చేస్తే సరిపోయేది. కానీ తిరిగి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అంగీకారం కూడా కావాల్సి ఉంది. దీంతో అత్యధికంగా ఫీజులు చెల్లించిన చోట ఇబ్బందులు తప్పేలా లేవు. మూడు శాఖల అధికారులు ధ్రువీకరించి, ఆమోదం తెలిపితే ఎల్ఆర్ఎస్ ప్రాసీడింగ్ పొందవచ్చు.

బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నేతలు

ఫిలింనగర్: బీసీ కుల గణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, బీసీల పట్ల చొరవ తీసుకుని పార్లమెంట్‌లో చట్టం చేసి బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాల్సిందిగా బీసీ సంక్షేమ సంఘం ఖైరతాబాద్ నియోజకవర్గ నేతలు జి.నరసింహ, భాస్కర్‌గౌడ్, రాములు, సహదేవ్, లక్ష్మణ్ తదితరులు కోరారు. ఆదివారం ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కూడా 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయాలి

లిబర్టీ: రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పీపీ రాజేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. దేశవ్యాప్తంగా నిఘా వ్యవస్థను విస్తరింపజేయాలని ఉగ్రవాద కార్యక్రమాలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు పలు చర్యలకు పాల్గొన్నారని ఇటీవల పాల్గంలో 26 మందిని పొట్టన పెట్టుకున్నారని జమ్ముకశ్మీర్‌లోను దేశంలోని వివిధ రాష్ట్రంలోనూ ఉగ్రవాదుల కార్యకలాపాలు జరగకుండా పౌరుల రక్షణ కోసం దేశ భద్రత కోసం రక్షణ రంగంలో నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సరిహద్దులతో పాటు ఉగ్రవాద కార్యకలాపాలు జరగకుండా ఆధునిక పరికరాలు పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో సౌభాగ్యవతి, పి.వి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

వెంగళరావునగర్: బహుర్భూమికి వెళ్లిన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును యువకుడు లాక్కెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే మంగళం శంకరమ్మ ప్రతిరోజు యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్, బస్తీల్లోని ప్రాంతాల్లో హౌస్ కీపింగ్‌గా పని చేస్తోంది. ఆదివారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తూ పక్కనే ఉన్న కల్లు దుకాణంలో కల్లు సేవించింది. అనంతరం జానకమ్మతోట సమీపంలో బహుర్భూమికి వెళ్లింది. ఆ సమయంలో దాదాపు 25–27 ఏళ్ల మధ్య ఉన్న యువకుడు ఆమె వద్దకు వచ్చి అరిచి గొడవ చేస్తే రాళ్లతో కొడతానని బెదిరించాడు. తీవ్రంగా భయపడిన ఆమె మౌనంగా ఉండటంతో ఆమె మెడలోని దాదాపు మూడున్నర తులాలు బంగారు గొలుసు లాక్కుని పరిగెత్తాడు. బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాలకోవ వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన పాలకోవ వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే వై.నాగుబాబు జూనియర్ ఆర్టిస్ట్. షూటింగ్స్ లేని సమయంలో పాలకోవ విక్రయిస్తుంటాడు. ఈనెల 2న రాత్రి పాలకోవ వాహనాన్ని తన ఇంటి ముందు పార్క్ చేసి మరుసటి రోజు వచ్చి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేదు. దాంతో ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధితుడికి తెలియకుండానే నగదు విత్‌డ్రా

మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు

వెంగళరావునగర్: మధురానగర్ హాస్టల్‌లో ఉంటున్న ప్రవీణ్‌కుమార్ ఈనెల 2న తన బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను చెక్ చేసుకున్నాడు. అయితే అతడికి తెలియకుండా గత నెల 29న రూ.18వేలు, ఈనెల 1న మరో రూ.7వేలు నగదు విత్‌డ్రా అయినట్లు గుర్తించాడు. వెంటనే అతడు సైబర్ క్రైమ్ పోలీసులకు జరిగిన విషయాన్ని తెలిపి ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

రహమత్‌నగర్: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీఆర్‌హిల్స్ వినాయకనగర్ బస్తీకి చెందిన జనార్దన్(30) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం రాజీవ్ గాంధీనగర్ వైన్స్ వద్ద జనార్దన్ పడిపోయి మృతి చెందినట్లు బస్తీవాసులు చెబుతున్నారు. అయితే మృతుడు మద్యం తాగడం వల్లే మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిస్ వరల్డ్‌తో మోక్షం.!

- పాడుపడిన ట్రాన్స్‌ఫార్మర్లు, పాత స్తంభాల తొలగింపు
- రంగంలోకి దిగిన విద్యుత్ అధికారులు



బంజారాహిల్స్ రోడ్డు నం.12లో ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు, కేబుల్ వైర్ల తొలగింపు

బంజారాహిల్స్: ప్రపంచ సుందరి పోటీలకు హైదరాబాద్ సిటీ ముస్తాబవుతోంది. మే 7 నుంచి 31 వరకు హైటెక్స్‌లో జరిగే పోటీల కోసం సుందరాంగులు నగరానికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నగరాన్ని సుందరీకరించే దిశలో వివిధ శాఖలు సమన్వయంతో ముందుకుసాగుతున్నాయి. ముఖ్యంగా అందగత్తెలు రాకపోకలు సాగించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న వైర్లు, తుప్పుబట్టిన కరెంటు స్తంభాల తొలగింపు, మరమ్మతులు చేస్తోంది. ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సబ్‌స్టేషన్ల పరిధిలో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు, లైన్‌మెన్లు, సిబ్బంది ఆదివారం మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.

- బంజారాహిల్స్ రోడ్డు నం.12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఈనెల 18న సుందరాంగులు రానున్న నేపథ్యంలో ఈ రోడ్డులో శిథిలావస్థకు చేరిన 12 ట్రాన్స్‌ఫార్మర్లను మార్చారు. తుప్పుబట్టిన కరెంటు స్తంభాల స్థానంలో కొత్తవి వేశారు. వేలాడుతున్న కేబుల్ వైర్లను సరిజేశారు. ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేస్తున్న సుందరాంగులు తమ షెడ్యూల్‌లో భాగంగా వివిధ ప్రాంతాలను సందర్శించనున్నారు. అలాగే పోటీలు జరిగే హైటెక్స్‌కు కూడా ఈ ప్రాంతాల నుంచే వెళ్తారు.
- ఇక్కడ ఉన్న స్టార్ హోటళ్లలోనే వారంతా బస చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు గత వారం రోజులుగా సుందరాంగులు రాకపోకలు సాగించే, పర్యటించే ప్రాంతాలను సర్వే చేశారు. రోడ్డు మార్గంలో వెళ్లే క్రమంలో ఎక్కడెక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు శిథిలావస్థకు చేరాయో వాటిని గుర్తించారు.





- ఓవైపు ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల జాబితాను తయారు చేశారు. దీని ఆధారంగానే ఆదివారం నుంచి మరమ్మతులు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు ఈ పనులు కొనసాగనున్నాయి. టీజీఎస్‌పీడీసీఎల్ ఫిలింనగర్ సబ్‌స్టేషన్ ఏఈ పవిత్ర పర్యవేక్షణలో 30 మంది సిబ్బంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. దాదాపు అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలోనూ పనులు చేస్తున్నారు.

తాగేనీళ్లు సరిపోతలేవ్..!

- ఖాళీ బిందెలతో నిరసనకు దిగిన మహిళలు
- లోప్రెషర్‌ను పరిష్కరించి.. సరఫరా సమయం పెంచాలని డిమాండ్



మూడు గుడుల వీధిలో నిరసన ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఫిలింనగర్: అసలే లో–ప్రెషర్.. అందులో అర్ధగంట కూడా నీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ మహిళలు నిరసన దిగారు. ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో మూడు గుళ్ల వద్ద ఉన్న వీధుల్లో నీటి సరఫరా సరిగా జరగడం లేదంటూ మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. బస్తీలో కొన్ని వీధుల్లో మాత్రమే నీరు సరిగా వస్తోందని మిగతా వీధుల్లో ఆ పరిస్థితి లేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత లైన్‌మెన్‌తో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. శాఖ ఉన్నతాధికారులు స్పందించి నీటి సరఫరాలో సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

లిబర్టీ: చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించలేమని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దమ్ముంటే ప్రకటించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి సవాల్ విసిరారు. బీసీలు కన్నెర్ర చేస్తే ప్రభుత్వం మనుగడ సాగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. బీసీ దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఉభయ సభల్లో ప్రవేశపెట్టలేదని కేంద్ర ప్రభుత్వం వల్ల సాధ్యంకాదని దమ్ముంటే ప్రకటించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వాలు తీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్రస్థాయిలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులు ఏమిటని కుమారస్వామి సూటిగా ప్రశ్నించారు. ఏ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీసీల నుంచి గుణపాఠం కేంద్ర ప్రభుత్వానికి తప్పదని హెచ్చరించారు.

మాకు మేమే సాటి..

ఆశ్రయ్–ఆకృతి బధిర పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత

శ్రీనగర్‌కాలనీ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మాకు మేమే సాటి అని నిరూపించారు ఆశ్రయ్–ఆకృతి బధిర పాఠశాల విద్యార్థులు. ప్రతి సంవత్సరం వందశాతం ఉత్తీర్ణతతో పాటు 80శాతంపైగా మార్కులతో వారి ప్రతిభను చూపడం ప్రశంసనీయమని ఆశ్రయ్–ఆకృతి సంస్థ డైరెక్టర్ డీపీకే బాబు, అకడమిక్ డైరెక్టర్ డి.శశికళ అన్నారు. శ్రీనగర్‌కాలనీ ఆశ్రయ్–ఆకృతి బధిర పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో ఆదివారం అభినందన సభను ఏర్పాటు చేశారు. బధిరులైనా వారి ప్రతిభాపాటవాలు ఇతరులకు ఆదర్శమని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు.



వందశాతం ఉత్తీర్ణత సాధించిన ఆశ్రయ్–ఆకృతి బధిర పాఠశాల విద్యార్థులు

తరచూ వైద్య పరీక్షలు చేయించుకోండి



ఐమాక్స్ ఎదురుగా ఉన్న లేక్‌వ్యూ పార్క్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఖైరతాబాద్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవనం కొనసాగించాలంటే అనారోగ్యాల బారిన పడకుండా ఉండేందుకు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్లు భానుప్రదీప్, డాక్టర్ సమీర్‌లు తెలిపారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని శ్రీకర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పార్క్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి వైద్య సలహాలు అందజేశారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వివేకానంద సేవా సమితి సభ్యులు, శ్రీకర హాస్పిటల్ డాక్టర్ సుమధుర, వాకర్లు పాల్గొన్నారు.

హెచ్ఎఫ్‌నగర్‌లో కంటి ఉచిత వైద్య శిబిరం..

రహమత్‌నగర్: శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఎఫ్‌నగర్‌లో ఆదివారం కంటి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సేవకుడు శ్యాంసుందర్, బస్తీ అధ్యక్షుడు సయ్యద్ షరీఫ్, బస్తీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు కిలో రూపాయాల్లో టమాట 13, నల్లవంకాయ 18, పొడుగువంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 45, పచ్చికాకరకాయ 40, పందిరిబీర 45, క్యాబేజీ 09, క్యారెట్ 21, దొండకాయ 23, గుండు బీన్నీస్ 105, గింజచిక్కుడు 65, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 75, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ 09, పొట్లకాయ 18, అరటికాయ 09, మునగకాయ 04, మామిడికాయ 45, ముల్లంగి 4–5, ఉల్లిపొరక 28లుగా ఉన్నాయి.

గమనిక: ఈ ధరలు సోమవారం ఉదయం 9గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్



బంజారాహిల్స్: మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇప్పటి వరకు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన పరశురామ్‌ను సీసీఎస్‌కు బదిలీ చేశారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.మేడి రమణ ఆదివారం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి ఇంత వరకు ఒక్క శాఖలో కూడ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం విచారకరమన్నారు.ఎస్సీ, ఎస్టీల ఉద్యోగాలను భర్తీ చేయకుండ ఖాళీగా ఉంచడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందన్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు వర్సిటీలలో ఖాళీగా బ్యాక్‌లాగ్ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేసి ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు.

టెన్త్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నం.10లోని గాయత్రీహిల్స్‌లోని లిటిల్ స్టార్ హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు సందడి చేశారు. ఇక్కడ పరీక్ష రాసిన 54 మందికి 54 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకున్నారు. 70శాతం మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించడం పట్ల స్కూల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. కష్టానికి తగిన ఫలితం లభించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. తాము అనుకున్న స్థాయిలనే ఫలితాలు వచ్చాయని ఆనందం వెలిబుచ్చారు. పక్కా ప్రణాళికతో ఉపాధ్యాయులు అంకిత భావంతో చేసిన బోధన చక్కని ఫలితాలు ఇచ్చిందని ఆమె తెలిపారు.

మహాత్మానగర్ బస్తీ ఎన్నికలకు సహకరించాలి

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని మహాత్మానగర్ బస్తీ వాసులు ఎన్నికలకు సన్నద్ధం అవుతున్నారు. ఆదివారం బస్తీలో సమావేశంలో స్థానికులు మాట్లాడుతూ... బస్తీ అభివృద్ధి ఎన్నికలపై మూడు వారాలుగా బస్తీవాసులు సమాలోచనలు చేస్తున్నప్పటికీ బస్తీ నాయకులు ముందుకు రావడం లేదన్నారు. మరోమారు సమావేశమై ఎన్నికలకు సంబంధించిన విషయంపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికైన బస్తీ ఎన్నికలకు సహకరించి బస్తీ అభివృద్ధికి పాటు పడాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా 'నీట్'



బేగంపేటలో నీట్ పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)–2025 ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 720 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 706 మంది హాజరయ్యారు. బేగంపేట పీజీ కళాశాలలో 720 మంది అభ్యర్థులకు గాను 704 మంది పరీక్ష రాశారు. బేగంపేటలో ఆయా కేంద్రాల వద్ద బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. ఇక అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులకు గాను 236 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

నార్త్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో 11 కేంద్రాలు..

నార్త్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో నీట్ పరీక్ష కోసం 11 కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా 5,000 పైచిలుకు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలకు దారితీసే అన్ని ముఖ్యమైన జంక్షన్లు, రోడ్ల వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూశారు.

ప్రతి ఒక్కరూ సేవా తత్పరతను కలిగి ఉండాలి



తాత్విక బాలవికాస్ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని తిలకిస్తున్న బ్రహ్మర్షి సద్గురు డాక్టర్ ఉమర్ అలీషా

ఖైరతాబాద్: ప్రతి ఒక్కరూ సేవా తత్పరతను కలిగి ఉండాలని... ప్రకృతి వైపరీత్యాలను అరికట్టేందుకు పంచభూతాల సమతుల్యత పాటిస్తూ.. 'నా మొక్క నా శ్వాస' అనే యజ్ఞాన్ని ఆచరించి ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని శ్రీవిశ్వజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి బ్రహ్మర్షి సద్గురు డాక్టర్ ఉమర్ అలీషా తెలిపారు. ఆదివారం వాసవీ సేవా కేంద్రంలో విశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో వైశాఖ మాస పర్యటనలో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బ్రహ్మర్షి సద్గురు డాక్టర్ ఉమర్ అలీషా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉమర్ అలీషా మాట్లాడుతూ... మానవత్వమే ఈశ్వర తత్వమని, తాత్విక ధ్యాన మార్గం ద్వారా జాతి, కుల, స్త్రీ, పురుష, మత, ధనిక తారతమ్యాలు లేకుండా ఆధ్యాత్మిక తత్వాన్ని మానవాళికి ప్రసాదించి తరిపంజేసేదే ఆధ్యాత్మిక పీఠమని తెలిపారు. సమాజంలో ఉద్రిక్తమైన వాతావరణం, క్షణికావేశంలో ఆలోచనలు కోల్పోయి అనేక రకాల సంక్షోభాలు సృష్టించుకొని జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. దీనికి కారణం మనలో ఉన్న కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు.. అనే ఆరు శత్రువులే కారణమన్నారు. ఇవి మనలో ఉండి మన జీవన వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తూ అలజడి, అశాంతి, అసహనాలను మనలో ప్రేరేపింపజేసి సమాజంలో తీవ్రమైన సంక్షోభాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. ఇలాంటి సంక్షోభాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ వార్వారి మత ధర్మాల ఆధ్యాత్మిక విలువలు పాటిస్తూ, మతం ఒక జ్ఞాన మార్గంగా భావించి భగవంతుడు ప్రసాదించిన జన్మను సార్థకం చేసుకోవాలని సూచించారు. మనతో పాటు మన కింద ఉన్న జీవరాసులను కాపాడుకుంటూ, భూగ్రహాన్ని నివాసయోగ్యంగా ఆహ్లాదంగా ఉండేలా కాపాడుకోవాలని సూచించారు. తాత్విక బాల వికాస్, తాత్విక యువ వికాస్ కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్, రామావతారం, డా.కిషోర్ కుమార్ వారి అనుభవాలను పంచుకున్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు



భగీరథ మహర్షి విగ్రహానికి నివాళులర్పిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఆదివారం ఫిలింనగర్‌లో ఘనంగా జరిగాయి. ఫిలింనగర్‌లోని విగ్రహాల చౌరస్తాలో ఉన్న భగీరథ మహర్షి విగ్రహానికి ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావుతో పాటు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుకున్నది సాధించే వరకు పట్టువదలని విక్రమార్కుడి వలే కృషి చేసే విషయంలో భగీరథ మహర్షిని ప్రతి ఒక్కరూ గుర్తుకు తెచ్చుకుంటారని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు మధు సాగర్, నాగేష్ సాగర్, సహదేవ్, ఎస్పీ శ్రీను. సి.రామచంద్రయ్య, వెంకటేశం, గోవిందు, శేఖర్, తిరుపతయ్య, కాటూరి రమేష్, రామకృష్ణ సాగర్, ఈశ్వర్, సగర మహిళా సంఘం నేతలు ఎం.స్వప్న, కె.లక్ష్మి, ఎస్పీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల చౌరస్తాలో..

భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఫిలింనగర్‌లోని మహనీయుల చౌరస్తాలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగీరథ మహర్షి విగ్రహానికి జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.



భగీరథ మహర్షి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఫిలింనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

టిప్పర్ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం

- 12 గంటలపాటు నిలిచిన కరెంటు సరఫరా


విరిగిన విద్యుత్ స్తంభం

జగద్గిరిగుట్ట: టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్త వల్ల ఒక ప్రాంతంలో అంధకారం నెలకొంది. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మైసమ్మ నగర్ బి బ్లాక్ రోడ్డు నెంబర్ 7లో ఆదివారం సుమారు 12 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఓ భవన నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని టిప్పర్‌లో తీసుకు వచ్చిన డ్రైవర్ వాహనాన్ని రివర్స్ తీసుకొనే క్రమంలో రెండు విద్యుత్ స్తంభాలను ఢీ కొట్టాడు. అందులో ఒకటి పూర్తిగా ధ్వంసం కాగా, మరొకటి ఒక వైపు ఒరిగి ప్రమాదకరంగా మారింది. స్తంభం విరిగిపడిన సమయంలో విద్యుత్ సరఫరా ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విరిగిన స్తంభం ఆ పక్కనే ఉన్న ఇంటిపై పడినా ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం మేరకు విద్యుత్ అధికారులు, సిబ్బంది ఉదయం నుంచి రాత్రి 6 గంటల వరకు మరమ్మతులు చేపట్టి రెండు కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. మరమ్మతుల కారణంగా 12 గంటలపాటు ఆ ప్రాంతంలో కరెంటు సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెలవు దినం కావడం, ఉదయం నల్లా నీళ్లు వచ్చే సమయంలో కరెంటు సరఫరా లేకపోవడంతో నానా అవస్థలు పడ్డారు.

బీ కేర్‌ఫుల్

- నకిలీ పేమెంట్ యాప్‌లు, వెబ్‌సైట్లు
- చెల్లింపులు పూర్తవగానే పనిచేయని ఖాతాలు
- ఆర్థికంగా నష్టపోతున్న దుకాణదారులు

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరస్తులు సరికొత్త మోసాలకు తెరలేపుతున్నారు. నకిలీ యూపీఐ పేమెంట్ అప్లికేషన్(యాప్)లను కూడా సృష్టిస్తూ ఆర్థికంగా గండికొడుతున్నారు. కస్టమర్ కేర్ ఫోన్ నంబర్లు, వెబ్‌సైట్లు, ఈ–మెయిల్ ఐడీలను స్పూఫింగ్ చేసి నకిలీవాటిని సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారు. డిమానిటైజేషన్ తర్వాతి నుంచి నగదు చెలామణి తగ్గడంతో చాలామంది డిజిటల్ పేమెంట్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ లావాదేవీలు బాగా పెరిగాయి. చిన్న కిరాణా షాపులు, కూరగాయల బండ్ల మీద కూడా యూపీఐ పేమెంట్ అప్లికేషన్లు కనిపిస్తున్నాయి. యాప్ పేమెంట్ వినియోగం విరివిగా అందుబాటులోకి రావటంతో మోసగాళ్లు వీటిపై కన్నేసి తమ మోసాలకు అనువుగా మలచుకుంటున్నారు.



ఎలా చేస్తారంటే..?

కొందరు కస్టమర్లు రిటైల్ షాపుల్లో ఈ స్పూఫింగ్ యాప్‌లతో లావాదేవీలు జరిపి దుకాణదారులను బురిడీ కొట్టిస్తున్నారు. ముందుగా సెల్‌ఫోన్‌లో గూగుల్ స్టోర్ నుంచి స్పూఫింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటారు. షాపింగ్ చేశాక కొనుగోలుదారుల మొబైల్‌లోని స్పూఫింగ్ ఈ–వ్యాలెట్‌లో షాప్ పేరు, ఫోన్ నంబర్, అమౌంట్ వంటి వివరాలను నమోదు చేసి ఎంటర్ చేస్తారు. దీంతో షాప్ యజమాని ఫోన్ నంబర్‌కు పేమెంట్ పూర్తయినట్లు నకిలీ నోటిఫికేషన్ వెళుతుంది. వాస్తవానికి ఓనర్ బ్యాంక్ ఖాతాలో మాత్రం నగదు జమ కాదు.

ఏం చేయాలంటే..

సాధారణంగా షాపు యజమానులు సెల్‌ఫోన్‌లో సందేశం చూసుకొని నగదు వచ్చేసిందనుకుంటారు. బ్యాంక్ అకౌంట్‌ను తెరిచి నగదు జమ అయిందో, లేదో యజమాని చూసుకునే తీరిక ఉండదు. తీరా ఖాళీ సమయంలో యజమాని తన అకౌంట్‌ను చూసుకుంటే ఆ నోటిఫికేషన్ తాలూకు పేమెంట్ అందులో జమై ఉండదు. దీంతో మోసపోయామని వారు గ్రహిస్తారు. ఒకవేళ షాప్ యజమాని పేమెంట్ జరిగిన వెంటనే ఖాతాలో చూసుకున్నా.. డేటా, సాంకేతిక సమస్య వల్ల ఖాతాలో అప్‌డేట్ ఆలస్యమవుతుందని కస్టమర్లు యజమానికి నచ్చచెబుతున్నారు. ఇలాంటి నకిలీ లావాదేవీలకు సౌండ్ బాక్స్‌తో చెక్ పెట్టొచ్చని యూపీఐ నిర్వాహకులు చెబుతున్నారు. పేమెంట్ జరిగిందో లేదో తక్షణమే తెలుసుకునేందుకు సౌండ్ బాక్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్, వాలెట్, డెబిట్, క్రెడిట్ కార్డ్స్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ యాప్‌లు ఏ మాధ్యమం ద్వారా అయినా సరే పేమెంట్ చేయగానే, ఖాతాలో నగదు జమ కాగానే సంబంధిత లావాదేవీ జరిగినట్లు సౌండ్ బాక్స్‌లో వాయిస్ వస్తుంది.

నగరంలో నేడు

- శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో డైరెక్ట్ వీవర్స్ 50 శాతం రాయితీపై అమ్మకాలు నిర్వహించనున్నారు.
- ఉప్పల్ స్టేడియంలో రాత్రి 7.30 నుంచి రాత్రి 11 గంటల వరకు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులుమాల్‌లో లులు బిగ్ చాకో దేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్–2025 ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్(టీపీఏ) 9వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా మానసిక ఆరోగ్య సాధన, కృత్రిమ మేధస్సుపై సదస్సు, ఆధునిక యుగంలో పిల్లల పెంపకం – సవాళ్లపై వ్యాసరచన పోటీలను హిమాయత్‌నగర్‌లోని టీపీఏ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నారు.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

గద్దర్ ఐకాన్ అవార్డుల ప్రదానం


అవార్డు గ్రహీతలతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: ప్రజాయుద్ధ నౌక గద్దర్ ప్రజల కోసమే జీవితాంతం పోరాడారని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో శ్రీ సాయి అలేఖ్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గద్దర్ ఐకాన్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సేవలను గుర్తించి ఆయన పేరు మీద అవార్డులను అందజేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గద్దర్ వెన్నెల మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర వహించిన వ్యక్తులను గుర్తించి అవార్డులు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీమంత్రి వేణు గోపాలచారి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నేత విమలక్క, దరువు అంజన్న, అరుణ అశోక్ పాల్గొన్నారు.

సీలింగ్ మరమ్మతు పనుల పరిశీలన

- చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సందర్శించిన ఉన్నతాధికారులు


చర్లపల్లి టెర్మినల్ సీలింగ్ మరమ్మతులను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఆదివారం దక్షిణ మధ్య రైల్వే అధికారుల బృందం సందర్శించింది. శనివారం ఈదురు గాలులకు టెర్మినల్ ప్రధాన మార్గంలోని సీలింగ్ ఊడి పడిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ నేతృత్వంలో అధికారుల బృందం టెర్మినల్ సందర్శించింది. కూలిన సీలింగ్ మరమ్మతు పనులను పరిశీలించింది. ఇటీవలే ప్రారంభమైన రైల్వే టెర్మినల్ సీలింగ్ కూలిపోవడంపై కాంట్రాక్టర్‌ను ఆరా తీశారు. భవిష్యత్తులో తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. జీఎం వెంట మేనేజర్ దిలీప్‌కుమార్, సీనియర్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్‌కుమార్ ఉన్నారు. కాగా, మూణాళ్ల ముచ్చటగా మారిన చర్లపల్లి టెర్మినల్ నాణ్యతపై సమగ్ర విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం

- జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు రాములు



మాట్లాడుతున్న రాములు. చిత్రంలో పళని రాజన్, రంగన్న, అంజనేయులు తదితరులు

చిక్కడపల్లి: ఉద్యోగులు సంఘటితంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె.రాములు అన్నారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఓ హోటల్‌లో జరిగిన ఆలిండియా పోస్టల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ 4వ సర్కిల్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ సమాన హక్కులు అందాలని అప్పట్లోనే పార్లమెంట్‌లో హిందూకోడ్ బిల్లు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పళనిరాజన్, తెలంగాణ సర్కిల్ మాజీ కార్యదర్శి రంగన్న, ఎం.అంజనేయులు, ఏఎస్ చలపతిగిరి, బి.అంబేడ్కర్ రాజు, ఎస్.రాజారత్నం, జి.నర్మద, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి: అనిల్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, శివచరణ్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: డ్రగ్స్ మహమ్మారి, బెట్టింగ్ యాప్స్ బారిన యువత పడకుండా రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వారం రోజులుగా ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న టి–20 క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను దృష్టిలో పెట్టుకొని 'క్రికెట్ ఖేలో– నషా ఛోడో'అనే నినాదంతో పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ యువత బంగారు భవిష్యత్తు నిమిత్తం యూత్ కాంగ్రెస్ తరఫున ఇలాంటి పలు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతకు రూ.5,55,555 నగదు, ట్రోఫీలను, రన్నరప్ జట్టుకు రూ.3,33,333 నగదు, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అరవింద్‌కుమార్ యాదవ్, మాజిద్, వంగ లక్ష్మీకాంత్‌రెడ్డి, గుర్రం శ్యామ్‌చరణ్ రెడ్డి, స్పోర్ట్స్ సెల్ ఇన్‌చార్జి పొన్నం తరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అల్జీమర్స్‌పై అవగాహనకు నాటక ప్రదర్శన

మాదాపూర్: సామాజిక చైతన్యం కలిగించే నాటకాలకు రోడ్ వేజ్ థియేటర్ ప్రసిద్ధి. ఈ సంస్థ అల్జీమర్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 16న హైటెక్ సిటీలోని టీ–హివ్ ఆగాలేరియా మాల్‌లో నాటకాన్ని ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేశారు. 'సంధ్య, తుమ్ కహాన్ హో'పేరిట ఈ నాటకాన్ని ప్రదర్శిస్తారు. ఈ నాటకానికి రచన, దర్శకత్వం కెప్టెన్ ఎస్ఎన్ అహ్మద్. సైన్యంలోని తన సహచరులు అల్జీమర్స్ వ్యాధితో పోరాడుతున్న దృశ్యాలను దగ్గరగా చూపించే ప్రయత్నం చేశారు. ప్రజాసమూహాన్ని ఆకట్టుకోవడంలోనే కాకుండా వారిలో చైతన్యం కలిగించడంలోనూ వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ఈ నాటకాన్ని రూపొందించినట్లు దర్శకుడు వివరించారు.

'పాస్టర్ ప్రవీణ్ హత్యలో ఆధారాల్లేకుండా కుట్ర'

లిబర్టీ: పాస్టర్ పగడాల ప్రవీణ్ హత్యకు సంబంధించిన ఆధారాలు లేకుండా ప్రభుత్వం కుట్రలు చేస్తోందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. పథకం ప్రకారం మతోన్మాద శక్తులు దాడి చేసి పాస్టర్‌ను చంపివేశాయని ఆరోపించారు. లిబర్టీ ప్లాజాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రవీణ్ రాయల్ ఎన్‌ఫీల్డ్ బండిపై ప్రయాణిస్తూ అదుపు తప్పి కింద పడిపోవడంతో చనిపోయాడని పోలీసులు చెప్పడం సిగ్గుచేటన్నారు. అసలు హత్యకు గల కారణాలు ఏమిటో చెప్పకుండా సీసీ ఫుటేజీ లేకుండా చేసి హత్య చేసిన దుండగులకు పోలీసులు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఏపీలోని తెలుగుదేశం ప్రభుత్వం సైతం దుండగులను కాపాడుతోందని కృష్ణస్వరూప్ ఆరోపించారు. ప్రవీణ్ హత్య కేసును మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.

'కళా కుసుమాలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్.గోపి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనంద లహరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి కందగట్ల కళావతి రచించిన 'కళా కుసుమాలు' పుస్తకావిష్కరణ సభను ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య ఎన్.గోపి హాజరై మాట్లాడుతూ.. సామాజిక స్పృహతో రాసే ప్రతి కవిత, రచన జనంలోకి వెళ్తుందన్నారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం, మిమిక్రీ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ లింగాల సంధ్యారాణి కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు రాధా కుసుమ, ప్రముఖ మిమిక్రీ కళాకారులు మల్లం రమేశ్ పాల్గొన్నారు.

సగరుల సంక్షేమానికి కృషి: పొన్నం



గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సగర సంఘం ఆధ్వర్యంలో మహర్షి భగీరథ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించిందని తెలిపారు. రాష్ట్రంలో కులాల సర్వే నిర్వహించామని చెబుతున్నప్పటికీ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదన్నారు. కులగణన సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం మోడల్‌గా నిలవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. సగరులు ఐక్యంగా ఉండాలని, అప్పుడే అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన సర్వే చేయలేమని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవిధంగా చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సగర సంఘం అధ్యక్షుడు ఉప్పర శేఖర్ సగర, గౌరవ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సగర, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బాల్‌రాజ్ గౌడ్, గణేష్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్, మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.

గోహత్య నిరోధక చట్టాన్ని అమలు చేయాలి


గోరక్షా కరపత్రం, వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న చావ్లా

హిమాయత్‌నగర్: గోహత్య నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలనివిశ్వహిందూ పరిషత్ అఖిల భారత ఉపాధ్యక్షుడు ఉకుంచంద్ చావ్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. విశ్వహిందూ పరిషత్ గోరక్షా విభాగ్ ఆధ్వర్యంలో గో భక్తుల సమ్మేళనం ఆదివారం సాయంత్రం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా గోరక్ష కరపత్రం, వాల్ పోస్టర్‌ను చావ్లా ఆవిష్కరించి మాట్లాడారు. గో సంరక్షణకు ఈ నెల 7 నుంచి 12 తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల అధికారులకు వినతిపత్రాలు సమర్పించడంతోపాటు నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అఖిలభారత రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గో సేవా సహ సంయోజక్ రాఘవన్, గోరక్ష విభాగం అఖిలభారత ఉపాధ్యక్షులు జగ్రాజ్ శ్రీమల్, గోరక్ష విభాగ్ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు డాక్టర్ జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ కీర్తనలకు ప్రచారం కల్పిస్తాం

- మంత్రి జూపల్లి కృష్ణారావు


త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: త్యాగరాజ కీర్తనలకు బహుళ ప్రాచుర్యం కల్పించడానికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఆదివారం ఎల్బీ స్టేడియంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ వాగ్గేయకారులు శ్రీ త్యాగరాజస్వామి 258వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కృష్ణారావు మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతమే ధ్యాసగా, శ్వాసగా ఉన్న కళాకారులకు త్యాగరాజు పూజ్యనీయులని అన్నారు. నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు కీర్తనలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. అంతకు ముందు గాయకులతో కలిసి త్యాగరాజ పంచరత్న కీర్తనలను మంత్రి ఆలపించారు. వందలాది సంగీత బృందాల త్యాగరాజ కీర్తనల ఆలాపనతో ఎల్బీ స్టేడియం ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.పద్మావతి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు శోభారాజు, ఎల్లా వెంకటేశ్వర్‌రావు, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల, హైదరాబాద్ సిస్టర్ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి జయంతి

నల్లకుంట: నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ సమీపంలోని శ్రీ సరస్వతి సంగీత విద్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆధునిక సంగీతానికి పితామహుడు త్యాగరాజ స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. దీనికి హాజరైన ప్రముఖ సంగీత విద్వాంసుడు, పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాస శర్మ త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా సంగీత విద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులచే నిర్వహించిన గాత్ర కచేరీ ఆకట్టుకుంది. అనంతరం సంగీత అధ్యాపకులు తేజస్విని, మల్లాది యశస్వినితోపాటు మరికొందరిని సన్మానించారు. వేడుకలో సంగీత విద్యాలయం విద్యార్థులు శ్రీవిద్య, శ్రీకర్, నిఖిల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు పూర్తి కాకుండానే ఫ్లైఓవర్ ప్రారంభమా?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించిన ఎమ్మెల్యే కాలేరు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్. చిత్రంలో కార్పొరేటర్లు

అంబర్‌పేట: సర్వీసు రోడ్డు పూర్తి కాకుండానే అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను అధికారికంగా ఎలా ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ఆదివారం గోల్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు బి.పద్మా వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్‌లతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుమారు రూ.415 కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్‌కు గోల్నాక వద్ద సర్వీసు రోడ్డు లేదని, దీనిపై దృష్టి సారించకుండా స్థానిక ఎంపీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫ్లైఓవర్ ప్రారంభానికి ఏర్పాట్లు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణానికి స్థానికులు సహకరించినా వారికి ప్రయోజనం లేకుండా పోయిందని, పైగా 7 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సర్వీసు రోడ్ల సమస్య పరిష్కారంపై స్పష్టత ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఫ్లైఓవర్‌ను అస్తవ్యస్తంగా నిర్మించి దాని పరిసర ప్రాంతాలు వర్షపు నీటి ముంపునకు గురయ్యేలా చేశారని విచారం వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ ప్రారంభంలో ప్రొటోకాల్ పాటించడం లేదని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నేత బి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు


కుస్తీ పోటీల విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హిమాయత్‌సాగర్‌లోని శ్రీ సాయి రెజ్లింగ్ అకాడమీలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఫ్రీ స్టైల్, గ్రీకో–రోమన్, మహిళల కుస్తీ అనే మూడు విభాగాల్లో 120 మంది యువ కుస్తీ క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ యువతలో కుస్తీపట్ల ఆసక్తి పెరిగిందని రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ తేలుకుంట సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అహ్మద్ బిన్ హంజా క్రీడాకారులను అభినందించారు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్(టీజీఏడబ్ల్యూఏ) క్రీడాకారులందరికీ ప్రయాణ ఖర్చులను భరించడమే కాకుండా ఆర్థిక ఇబ్బందులను తగ్గించి రాష్ట్ర నలుమూలల నుంచి ఎక్కువ మంది పాల్గొనేలా చొరవ తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కుస్తీ పోటీలను ప్రోత్సహించడానికి అసోసియేషన్ కట్టుబడి ఉందని అన్నారు.

త్యాగరాజ కీర్తనల గానం రమణీయం


తెలుగు వెలుగు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కీర్తనల గోష్ఠి గానం

ఖైరతాబాద్: యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ఐఐఎంసీ కళాశాల, తెలుగు రథం సంస్థ సంయుక్తంగా ఆదివారం ఐఐఎంసీ కళాశాలలో తెలుగు వెలుగు సమాఖ్య ఏడో సమావేశం నిర్వహించారు. త్యాగరాయ జయంతి సందర్భంగా కీర్తనల గానం, కొమ్మూరు రాజేశ్వరి సంగీత సప్తస్వర రథం వారిచే త్యాగరాజ పంచరత్న కీర్తనల గోష్ఠిగానం ఎంతో రమణీయంగా సాగింది. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడుతూ యువభారతి సంస్థ నిర్వహించిన కార్యక్రమాల ద్వారా స్ఫూర్తి పొందానని తెలిపారు. తెలుగు భాషా సాహిత్య విస్తరణకు గాను పత్రికలు తెలుగులో ఎన్నో వ్యాసాలను ప్రచురిస్తూ దోహదం చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో యువభారతి వ్యవస్థాపక సమావేశ కర్త ఆచార్య వంగపల్లి విశ్వనాథం, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, జి.వెంకట్రావు, అశ్విని కుమార్, కె.హనుమంతు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేషధారణలు.. దారి పొడవునా భజనలు

జియాగూడ: బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని జియాగూడ బసవ మండప్ నుంచి భవ్య శోభాయాత్ర ప్రారంభమై నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకుంది. ఆదివారం బసవ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ బసవ దళ్, లింగాయత్ ధర్మ మహాసభ, క్రాంతి గంగోత్రి అక్క నాగాలాంబిక మహిళా గణ్, యువ రాష్ట్రీయ బసవ దళ్ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు కొనసాగింది. జియాగూడ బసవ మండప్, పురానాపూల్, జుమ్మేరాత్ బజార్, బేగం బజార్, ఎంజే మార్కెట్ మీదుగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు చేరుకుంది. బసవేశ్వరుడి భారీ విగ్రహం, గంగా మాతా జీ, అక్క మహాదేవి, మహాపురుషుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. దారి పొడవునా భజనలు, కీర్తనలు మహిళలు నిర్వహించగా మేళతాళాలతో ఊరేగింపు కొనసాగింది.



ఊరేగింపులో బసవేశ్వరుడు, ఇతర మహా రుషుల వేషధారణలు

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా..

చిత్రకారుల నిరసన




పంజగుట్ట : పహల్గామ్‌లో ఉగ్రవాదులు అమాయక టూరిస్టులపై జరిపిన దాడుల్లో మృతి చెందిన 26 మందికి నివాళిగా, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నగరంలోని పలువురు చిత్రకారులు వినూత్నంగా నిరసన తెలిపారు. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, ఎమ్‌వి.రమణారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ హైదరాబాద్, పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఆర్టిస్టులు కె.మురళీధర్, డాక్టర్ హోతి బసవరాజ సత్య గనోజ్, రాజేందర్ నాగుల, రమణారెడ్డి స్లోగన్స్ చేసి, కార్టూన్‌లు, చిత్రాలు వేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్ నుంచి ప్రధాన రహదారి వరకూ క్యాండిల్ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో 9వ నిజాం రౌనత్ యార్ జంగ్, సీనియర్ సంపాదకులు దేవులపల్లి అమర్ పాల్గొన్నారు. ఏ వర్గం, ఏ ప్రాంతం, ఏ దేశం అయినా హింస చేస్తే దాన్ని వ్యతిరేకించాల్సిందే అన్నారు. జమ్మూ కశ్మీర్ చాలాకాలంగా భారత్, పాక్‌ల మధ్య వివాదంగా మారిందని, దీంతో కశ్మీర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రస్తుతం పర్యాటకులపై దాడి జరగడంతో కశ్మీర్ ప్రజలు కొన్ని సంవత్సరాలు కోలుకోలేని స్థితికి వెళతారని అభిప్రాయపడ్డారు.

పెట్స్ గ్రూమ్.. ఫిష్ థీమ్..



సాక్షి, సిటీబ్యూరో: పెంపుడు జంతువుల కోసం వినూత్న తరహాలో ఫిష్ థీమ్‌తో రూపుదిద్దుకున్న పెట్ గ్రూమింగ్ స్టోర్ పెట్‌లోక్.. నార్సింగిలో ఏర్పాటైంది. దీనిని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.జయేష్ రంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ నిర్వాహకులు మాట్లాడుతూ పెట్స్ పోషణ, ఆరోగ్యానికి సంబంధించి తాము అందించే ప్రత్యేక సేవలను వివరించారు. నగరంతో పాటు దేశవ్యాప్తంగానూ 100 అవుట్‌లెట్లను ప్రారంభించనున్నామని తెలిపారు.




వేసవి సెలవులు వస్తున్నాయంటే చాలు నగరంలోని విద్యార్థులు, యువత.. స్కిల్ డెవలప్మెంట్, టెక్నికల్ అంశాల్లో శిక్షణ తీసుకోడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా నగరాల్లోని విద్యార్థులు, యువతకు విజ్ఞానం పెంచుకునేందుకు, నైపుణ్యాలు అభివృద్ధి చేసుకునేందుకు ఇది ఉత్తమ సమయం. గత కొన్నేళ్లుగా ఆన్‌లైన్ వేదికలు వృద్ధి చెందడంతో, ఇంటి వద్ద నుంచే విద్యను అందుకోవడం సులభమైంది. హైదరాబాద్ వంటి నగరాల్లో నివసించే విద్యార్థులు, యువత ఆన్‌లైన్ శిక్షణ ద్వారా సిటీ లైఫ్‌కు అనుగుణంగా ఉన్న అనేక రంగాల్లో నైపుణ్యాలను సంపాదిస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

వేసవి విజ్ఞానం.. భవిష్యత్తు ప్రాధాన్యం..

- వేసవిలో ఆన్‌లైన్ శిక్షణకు మొగ్గు చూపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైన్, డేటా సైన్స్ తదితర అంశాల్లో ఇప్పటికే కోర్సులు ప్రారంభం
- సమయాన్ని అందిపుచ్చుకుంటున్న నగర యువత
- రెండు నెలల్లో పూర్తయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు





ప్రస్తుత ప్రపంచం మొత్తం డిజిటల్ రంగంవైపు అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైన్, డేటా సైన్స్, వెబ్ డెవలప్మెంట్ వంటి కోర్సులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. యువత ఈ కోర్సుల ద్వారా స్వయం ఉపాధికి మార్గం ఏర్పరచుకుంటోంది. సిటీ లైఫ్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, స్టార్టప్, ఈ–కామర్స్ రంగాల్లో అవకాశాలను గమనించిన యువత వీటిని అందిపుచ్చుకోడానికి ఈ శిక్షణలపై ఆసక్తి చూపుతోంది.

ఇప్పటి నుంచే ఉద్యోగాలకు సన్నద్ధం..

మారుతున్న కాలానికి అనుగుణంగా కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, ఇంటర్వ్యూ ఫేసింగ్ వంటి సాఫ్ట్ స్కిల్స్ వంటి అంశాలపై శిక్షణ విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. ఈ శిక్షణలు ఉద్యోగావకాశాలకు సన్నద్ధమవడంలో ఎంతో సహాయపడతాయి. అర్బన్ యూత్‌కు అవసరమైన టైమ్ మేనేజ్మెంట్, ఫైనాన్షియల్ లిటరసీ కోర్సులను చాలామంది ఎంచుకుంటున్నారు.

విద్య, ఉద్యోగానికి సమాంతరంగా..

వేసవి సెలవుల్లో ఇలా ఆన్‌లైన్ వేదికల ద్వారా విద్యను కొనసాగించడం ద్వారా యువత తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. సిటీ జీవితానికి అవసరమైన నూతన నైపుణ్యాలను అందిపుచ్చుకుని, తన అవకాశాలను విస్తరించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. దీనివల్ల చదువు, ఉద్యోగం మధ్య సమతుల్యతను ఏర్పరచుకునే అవకాశం దక్కుతోందని ఆన్‌లైన్ శిక్షణ రంగాలకు చెందిన నిపుణులు పేర్కొంటున్నారు.



ప్రముఖ ఆన్‌లైన్ వేదికల ఆహ్వానం..

ప్రముఖ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ అయిన కోర్సెరా, యుడెమీ, బైజూస్, స్కిల్‌షేర్, స్వయం మొదలైన సంస్థలు ఉచితంగా, చౌకగా శిక్షణను అందిస్తున్నాయి. కొన్ని ప్లాట్‌ఫామ్స్ సర్టిఫికెట్‌తో కూడిన కోర్సులను అందించడమే కాకుండా, లైవ్ సెషన్స్, ప్రాజెక్ట్‌లు, ఇంటరాక్టివ్ లెర్నింగ్ ద్వారా విద్యార్థులను సమర్థులుగా తీర్చిదిద్దుతున్నాయి. కేవలం రెండు నెలల సమయంలోనే పూర్తయ్యేలా ప్రత్యేక కోర్సులు డిజైన్ చేస్తున్నారు.







- విశిష్ట జ్యువెలర్స్ వేదికగా సినీ తార అనన్య నాగళ్ల సందడి
- బంపర్ డ్రా విజేతలకు బహుమతులు

మగువల మనసు బంగారం..

సాక్షి, సిటీ బ్యూరో: ప్రముఖ సినీ తార అనన్య నాగళ్ల కొత్తపేటలోని విశిష్ట జ్యువెలర్స్ వేదికగా సందడి చేశారు. విశిష్ట జ్యువెలర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బంపర్ డ్రా కార్యక్రమంలో అనన్య నాగళ్ల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'మగువల మనసు బంగారం' అని, అయినప్పటికీ మళ్లీ బంగారాన్ని కొనడానికి ఇష్టపడతారని తెలిపారు. ఈ బంపర్ డ్రాలో పలువురు కస్టమర్లు ఎలక్ట్రిక్ బైకులు, ఫ్రిడ్జ్‌లు, టీవీలు గెలుచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా విశిష్ట జ్యువెలర్స్ వ్యవస్థాపకుడు పాలబట్ల ఆనంద్ బాబు నెలవారీ గోల్ స్కీమ్స్ గురించి వివరించారు.

జూన్ 28న ఇంటర్నేషనల్ ఐకానిక్ టాలీవుడ్ అవార్డ్స్

▶ పోస్టర్ ఆవిష్కరించిన ప్రముఖ నటులు



సాక్షి, సిటీబ్యూరో: తెలుగు చిత్రరంగానికి సంబంధించిన ఇంటర్నేషనల్ ఐకానిక్ అవార్డ్స్ టాలీవుడ్ (ఐఐఏ), సీజన్–1 జూన్ 28న నగరంలో జరగనుంది. దీనిని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని ఓ స్టార్ హోటల్‌లో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నటుడు రవిప్రకాష్ మాట్లాడుతూ కళాకారులకు రివార్డులతో పాటు అవార్డులూ ముఖ్యమని, అవి ప్రోత్సాహాన్ని ఇస్తాయని అన్నారు. నిర్వాహక సంస్థ వ్యవస్థాపకుడు మొహమ్మద్ లతీఫ్ మాట్లాడుతూ తెలంగాణ పర్యాటక రంగం సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామని, తెలుగు చిత్ర పరిశ్రమలో కళాకారులతో పాటు పలు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్న వారిని గుర్తించి, వందకి పైగా అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ చైర్మన్ ఆదిత్య ఖురానా, బాలీవుడ్ నటి నికితా రావల్, దర్శకులు ప్రదీప్ మదల్లి, రాకీ సింగ్, నటుడు రేవంత్ లెవాకా తదితరులు పాల్గొన్నారు.

చోటా బీమ్.. బడా కామ్..

వెస్ట్రన్ రైల్వే భద్రతా విభాగం అంబాసిడర్‌గా బాధ్యతలు

సాక్షి, సిటీబ్యూరో: రైల్వే భద్రతపై ప్రయాణీకులు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చోటా బీమ్ మాతృ సంస్థతో పశ్చిమ రైల్వే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు చోటా బీమ్ చిత్రంతో డిజిటల్, రేడియో, టీవీ, ప్రింట్, రైల్వే స్టేషన్లలో భద్రతాపరమైన అవగాహనా కార్యక్రమాలు చేపట్టనున్నారు.



17 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో మైలు రాళ్లను అందుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాం. గతేడాది మన్‌కీబాత్‌లో ప్రధాని మోదీ చోటాబీమ్‌ను ప్రస్తావించారు. ఇకపై కొత్త బాధ్యతలు చేపట్టనున్నాం. రైల్వే భద్రతా విభాగం అంబాసిడర్‌గా కొత్త పాత్రలో చోటా బీమ్ కనిపించనున్నారని నిర్వహణా సంస్థ గ్రీన్‌గోల్డ్ యానిమేషన్ వ్యవస్థాపకుడు రాజీవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నోని కీర్తికి స్త్రీ శక్తి పురస్కారం



నోనీ సాగులో అపూర్వ అనుభవం	ఔషధగని నోని ఫ్రూట్ పై అధ్యయనం	పాతిక ఉత్పత్తులకు ప్రభుత్వ అనుమతులు	ప్రతిష్టాత్మక స్త్రీశక్తి పురస్కార గ్రహీత ప్రయాణం



సాక్షి, సిటీబ్యూరో : 'పరిశ్రమ స్థాపించిన ప్రతి మహిళ వెనుక ఒక కథ ఉంటుంది. అందుకు నేనే ప్రత్యక్ష ఉదాహరణ' అని చెక్ బయో ఆర్గానిక్స్ కో–ఫౌండర్ కీర్తి అంటున్నారు. ఇటీవల నగరంలోని నోవోటెల్ హోటల్ వేదికగా స్త్రీ శక్తి పురస్కార ప్రదానోత్సవం జరిగింది. తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్స్ నిర్వహించిన కార్యక్రమంలో ఎంటర్‌టైన్‌మెంట్, బ్యూటీ, టూరిజమ్, వైద్యం, ఎంటర్‌ప్రెన్యూర్ వంటి వివిధ విభాగాల్లో 30 మంది మహిళలు పురస్కారాలను అందుకున్నారు. వారిలో చెకోటి కీర్తి రెడ్డి ఎంటర్‌ప్రెన్యూర్ జర్నీ వైవిధ్యమైనది. ఆమె ఏనాడూ ఒక పారిశ్రామికవేత్త కావాలని కల కనలేదు. కంప్యూటర్ రంగాన్ని ఎంచుకున్న కీర్తి, హైదరాబాద్‌కి కంప్యూటర్ పరిచయమైన తొలినాళ్లలో కోచింగ్ సెంటర్ నిర్వహించారు. కానీ జీవితం ఆమెను వ్యవసాయం, పరిశ్రమల రంగం వైపు నడిపించింది. పరిశ్రమను నడిపించడంలో ఆమె పాటించిన నియమాలే ఆమెను తన రంగంలో వన్ అండ్ ఓన్లీగా నిలిపాయి. 'రైతు నేస్తం, ఏరువాక, నాచురల్ హెల్త్ సైన్స్ అసోసియేషన్ అవార్డు, ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్' పురస్కారాలు ఆమెకు గతంలో గుర్తింపునిచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఢిల్లీ వేదికగా ప్రకటించిన 'నారీశక్తి' పురస్కారానికి ఎంపికయ్యారు. ఆ కీర్తి ప్రస్తుతం స్త్రీ శక్తి పురస్కారం అందుకుని మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలిచారు.

పాతిక ఉత్పత్తులకు ప్రభుత్వ అనుమతులు..!!

'తొగర చెట్టు.. ప్రకృతి మనదేశానికి అందించిన వరం. సంజీవని వంటి తొగర పండు మీద పాశ్చాత్య దేశాలు పరిశోధనలు చేస్తున్నాయి. కానీ ఆ చల్లటి వాతావరణంలో ఈ చెట్లు మనలేవు. మా కుటుంబ సభ్యులకు నోని ఫ్రూట్ ఔషధంగా పని చేయడంతో నేను ఆ పండు మీద అధ్యయనం మొదలుపెట్టాను. దీని కోసం పొలం కొని పంట వేశాను. పండ్లతో జ్యూస్‌లు, లోషన్, షాంపూ, హెయిర్ ఆయిల్ వంటి పాతిక ఉత్పత్తులకు ప్రభుత్వ అనుమతులు లభించాయి. కేవలం పరిశ్రమ నిర్వహణ మాత్రమే కాకుండా వ్యవసాయం, ఆరోగ్యం కలగలిసి ఉండడంతో నాకు 'ఫార్మర్స్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ వెల్‌నెస్ ప్రొడక్ట్స్' విభాగంలో ఈ పురస్కారం లభించింది. నోని పండు మీద చేసిన పరిశోధనల కారణంగా 'నోని కీర్తి' నయ్యాను. ఈ స్త్రీ శక్తి పురస్కారం ఎంపిక ప్రక్రియలో దేశ విదేశాలకు చెందిన వివిధ రంగాల నిపుణులు పాతిక మంది పాల్గొన్నారు. జ్యూరీ సభ్యులు పురస్కార గ్రహీతలను జూమ్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు' అని వివరించారు కీర్తిరెడ్డి. ఈ కార్యక్రమంలో 30 మంది మహిళలు స్త్రీశక్తి పురస్కారాన్ని అందుకున్నారు. వీరితోపాటు తెలంగాణ సంప్రదాయ గోంద్‌లడ్డు, నారాయణపేట చీరలు, టెర్రకోట బొమ్మలు వంటి హస్తకళాకృతులను తయారు చేస్తున్న ఐదుగురు గ్రామీణ, ఆదివాసీ మహిళలు స్త్రీ రత్న పురస్కారాలను అందుకున్నారు.

అందాల తారల ఆగమనం..

- నగరానికి చేరుకుంటున్న వివిధ దేశాల సుందరీమణులు
- ఆదివారం మిస్ బ్రెజిల్ జెస్సికా, మిస్ సౌత్ ఆఫ్రికా జోయలైజ్ రాక
- 6 వరకూ శంషాబాద్‌లో కొనసాగనున్న అందాల హడావుడి





సాక్షి, సిటీ బ్యూరో: నగర వేదికగా జరగనున్న 72వ ప్రపంచ సుందరి పోటీల కోసం నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబై ఎదురుచూస్తోంది. ఇందులో భాగంగా దాదాపు 120 దేశాలకు చెందిన అందాల భామలు ఒక్కొక్కరుగా నగరానికి చేరుకుంటున్నారు. ఇప్పటికే మిస్ వరల్డ్ సీఈవో, చైర్ పర్సన్ జూలియా ఈవేలిన్ మోర్లీ, మిస్ కెనడా మిస్ ఎమ్మా డయన్నా క్యాథరీన్ మొర్రిసన్ వంటి ప్రముఖులు నగరానికి చేరుకున్నారు. కాగా ఆదివారం మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాన్డియుజ్జి పెడ్రోసో, మిస్ సౌత్ ఆఫ్రికా జోయలైజ్ జాన్సెన్ వాన్ రెన్స్‌బర్గ్ నగరానికి చేరుకున్నారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌కి చేరుకున్న మిస్ బ్రెజిల్ జెస్సికా, మిస్ సౌత్ ఆఫ్రికా జోయలైజ్‌కు భారతీయ సంస్కృతి, సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. భారతీయ సాంస్కృతిక నృత్యాలతో జెస్సికాను, జోయలైజ్‌ను ఆహ్వానించిన విధానం విశేషంగా ఆకట్టుకుంది. ఈ నెల 10 నుంచి 31వ తేదీ వరకూ జరగనున్న అంతర్జాతీయ కార్యక్రమం 'మిస్ వరల్డ్–2025' పోటీల్లో పాల్గొనడానికి వివిధ దేశాల నుంచి మరికొందరు సుందరీమణులు ఈనెల 6వ తేదీ వరకూ ఒక్కొక్కరుగా రానున్నట్లు నిర్వాహక ప్రతినిధులు తెలిపారు.

బాలీవుడ్, హాలీవుడ్ ప్రముఖుల సందడి..

మరి కొద్ది రోజుల్లో నగర వేదికగా జరగనున్న ప్రారంభ వేడుకల్లో గ్లోబల్ సెలబ్రిటీలు పాల్గొని సందడి చేయనున్నారు. వీరి కోసం నగరంలోని పలు ఫైవ్ స్టార్ హోటల్స్, 3 స్టార్ హోటల్స్‌లో ముందస్తు బుకింగ్ చేశారు. అంతేకాకుండా విమానాశ్రయంలో వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీరితోపాటు భారత్ నుంచి మిస్ వరల్డ్‌గా నిలిచిన మాజీ మిస్ వరల్డ్‌లు సైతం నగరానికి చేరుకోనున్నారు. ఈనెల 10వ తేదీ లోపు బాలీవుడ్, హాలీవుడ్ సినీ ప్రముఖులు సైతం ముఖ్య అతిథులుగా రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పంజాబ్ పరాక్రమం

- మరో విజయంతో 'ప్లే ఆఫ్స్'కు చేరువ
- 37 పరుగులతో లక్నో చిత్తు



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రభ్‌సిమ్రన్

ధర్మశాల: ఐపీఎల్‌లో ఎప్పుడో 2014లో ఫైనల్ చేరిన పంజాబ్ ఇప్పుడు 11 ఏళ్ల తర్వాత 'టాప్-4'లో నిలిచేందుకు మరింత చేరువైంది. సమష్టి ప్రదర్శనతో చెలరేగిపోతున్న జట్టు ఆదివారం జరిగిన పోరులో 37 పరుగులతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (48 బంతుల్లో 91; 6 ఫోర్లు, 7 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ (25 బంతుల్లో 45; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (15 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), జోష్ ఇన్‌గ్లిస్ (14 బంతుల్లో 30; 1 ఫోర్, 4 సిక్స్‌లు) జట్టు భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు. అనంతరం లక్నో 20 ఓవర్లలో 7 వికెట్లకు 199 పరుగులు చేసింది. ఆయుశ్ బదోని (40 బంతుల్లో 74; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (24 బంతుల్లో 45; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడైన బ్యాటింగ్‌తో పోరాడినా విజయానికి అది సరిపోలేదు.

సమష్టిగా చెలరేగి...

తొలి ఓవర్లోనే ప్రియాన్ష్ ఆర్య (1) అవుట్ కావడం మినహా ఇన్నింగ్స్ ఆసాంతం పంజాబ్ హవానే సాగింది. బరిలోకి దిగిన మిగతా ఆరుగురు బ్యాటర్లూ మెరుపు షాట్లతో దూకుడు ప్రదర్శించడంతో భారీ స్కోరు సాధ్యమైంది. మయాంక్ తొలి ఓవర్లో ఇన్‌గ్లిస్ వరుసగా 3 సిక్సర్లతో చెలరేగిపోగా... అతని రెండో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ 2 సిక్స్‌లు, ఫోర్ బాదాడు. ప్రభ్‌సిమ్రన్ 21 పరుగుల వద్ద ఉన్నప్పుడు మిడాఫ్‌లో సులువైన క్యాచ్ వదిలేసి పూరన్ పెద్ద తప్పిదం చేశాడు! పవర్‌ప్లేలో పంజాబ్ 66 పరుగులు చేసింది. 30 బంతుల్లో ప్రభ్‌సిమ్రన్ వరుసగా మూడో హాఫ్ సెంచరీని నమోదు చేశాడు. శ్రేయస్ కూడా కొన్ని చక్కటి షాట్లతో స్కోరు వేగం తగ్గకుండా చూడగా, వధేరా (16) కూడా ధాటిగా ఆడాడు. 16 ఓవర్లలో జట్టు స్కోరు 171/4. అవేశ్ వేసిన 18వ ఓవర్లో శశాంక్ 2 ఫోర్లు...ప్రభ్‌సిమ్రన్ వరుసగా 6, 4 6 బాదడంతో మొత్తం 26 పరుగులు లభించాయి. చివరి 4 ఓవర్లలో పంజాబ్ 65 పరుగులు రాబట్టింది. ఛేదనలో లక్నో పూర్తిగా తడబడింది. ఆరంభంతోనే చక్కటి బౌలింగ్‌తో 3 వికెట్లు తీసిన అర్ష్‌దీప్ ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. తన రెండో ఓవర్లో మిచెల్ మార్ష్ (0), మార్క్‌రమ్ (13)లను వెనక్కి పంపిన అర్ష్‌దీప్, తన తర్వాతి ఓవర్లో పూరన్ (6)ను కూడా అవుట్ చేయడంతో లక్నో కష్టాల్లో పడింది. రిషభ్ పంత్ (18) తన వైఫల్యాన్ని కొనసాగించగా, డేవిడ్ మిల్లర్ (11) కూడా ప్రభావం చూపలేకపోయాడు.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) మయాంక్ (బి) ఆకాశ్ 1; ప్రభ్‌సిమ్రన్ (సి) పూరన్ (బి) రాఠీ 91; ఇన్‌గ్లిస్ (సి) మిల్లర్ (బి) ఆకాశ్ 30; శ్రేయస్ (సి) మయాంక్ (బి) రాఠీ 45; వధేరా (బి) ప్రిన్స్ 16; శశాంక్ (నాటౌట్) 33; స్టొయినిస్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (20 ఓవర్లలో 5 వికెట్లకు) 236. **వికెట్ల పతనం:** 1–2, 2–50, 3–128, 4–162, 5–216. **బౌలింగ్:** ఆకాశ్ సింగ్ 4–0–30–2, మయాంక్ యాదవ్ 4–0–60–0, అవేశ్ ఖాన్ 4–0–57–0, దిగ్వేశ్ రాఠీ 4–0–46–2, ప్రిన్స్ యాదవ్ 4–0–43–1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (బి) అర్ష్‌దీప్ 13; మార్ష్ (సి) వధేరా (బి) అర్ష్‌దీప్ 0; పూరన్ (ఎల్బీ) (బి) అర్ష్‌దీప్ 6; పంత్ (సి) శశాంక్ (బి) అజ్మతుల్లా 18; బదోని (సి) అర్ష్‌దీప్ (బి) చహల్ 74; మిల్లర్ (సి) శశాంక్ (బి) అజ్మతుల్లా 11; సమద్ (సి) అండ్ (బి) 45; అవేశ్ (నాటౌట్) 19; ప్రిన్స్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 199. **వికెట్ల పతనం:** 1–15, 2–16, 3–27, 4–58, 5–73, 6–154, 7–188. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–16–3, యాన్సెన్ 4–0–31–1, అజ్మతుల్లా 4–0–33–2, చహల్ 4–0–50–1, వైశాక్ 3–0–49–0, స్టొయినిస్ 1–0–17–0.



వరుసగా రెండో రోజు మరో ఉత్కంఠ భరిత పోరు. ఆఖరి బంతిదాకా విజయం కోసం రెండు జట్ల సమరం. చివరకు పరుగు తేడాతో ఒక జట్టు గట్టెక్కితే... మరో జట్టు పోరాడి ఓడింది. 6 బంతుల్లో 22 పరుగులు చేస్తేనే రాజస్తాన్ రాయల్స్‌ను విజయం వరిస్తుంది. ఇది రాయల్స్‌కు క్లిష్టమైంది. కోల్‌కతాకు కలిసొచ్చేది. వైభవ్ అరోరా వేసిన ఈ ఓవర్లో 5 బంతులు ముగిసేసరికి 2, 1, 6, 4, 6లతో 19 పరుగులు వచ్చేశాయి. ఇక 1 బంతి 3 పరుగులు... ఇది ఇరుజట్లను మునికాళ్లపై నిలబెట్టేసింది. అప్పటిదాకా సిక్స్‌లు, ఫోర్ బాదిన శుభమ్ దూబే భారీషాట్ ఆడలేకపోయాడు. 'టై' కోసం రెండు పరుగులు తీసే ప్రయత్నం కూడా ఆర్చర్ రనౌట్‌తో వృథా ప్రయాసే అయ్యింది. చివరకు ఒకే ఒక్క పరుగుతేడాతో నైట్‌రైడర్స్ ఊపిరి పీల్చుకుంది.

ఆర్చర్‌ను రనౌట్ చేసిన వైభవ్ అరోరా

కోల్‌కతా బతికిపోయింది!

- ఉత్కంఠపోరులో గట్టెక్కిన నైట్‌రైడర్స్
- రసెల్ మెరుపులు
- ఆఖరి బంతికి రాయల్స్‌కు నిరాశ
- పరాగ్ పోరాటం వృథా

కోల్‌కతా: ఇకపై ప్రతీ మ్యాచ్ నెగ్గితేనే ముందుకెళ్లే పరిస్థితుల్లో ఉన్న డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ గెలిచి 'ప్లే ఆఫ్స్' రేసులో నిలిచింది. ఆదివారం ఉత్కంఠరేపిన ఐపీఎల్ మ్యాచ్‌లో రహానే సారథ్యంలోని కోల్‌కతా ఒక్క పరుగు తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై నెగ్గింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆంద్రీ రసెల్ (25 బంతుల్లో 57 నాటౌట్; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు ఫిఫ్టీ సాధించాడు. అంగ్‌క్రిష్ రఘువంశీ (31 బంతుల్లో 44; 5 ఫోర్లు), గుర్బాజ్ (25 బంతుల్లో 35; 4 ఫోర్లు, 1 సిక్స్), రహానే (24 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. ఆర్చర్, పరాగ్, తీక్షణ, యుద్‌వీర్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (21 బంతుల్లో 34; 5 ఫోర్లు, 1 సిక్స్) జోరు కనబరిచాడు. టాపార్డర్‌లో వైభవ్ సూర్యవంశీ (4), కునాల్ రాథోడ్ (0), మిడిలార్డర్‌లో ధ్రువ్ జురేల్ (0), హసరంగ (0) నిరాశపరిచినా... కెప్టెన్ రియాన్ పరాగ్ (45 బంతుల్లో 95; 6 ఫోర్లు, 8 సిక్స్‌లు) వీరోచిత పోరాటం చేశాడు. హెట్‌మైర్ (23 బంతుల్లో 29; 1 ఫోర్, 1 సిక్స్) కీలక దశలో షరామామూలుగా చేతులెత్తేశాడు. శుభమ్ దూబే (14 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఆఖరి బంతిదాకా జట్టు గెలిచేందుకు నిలిచినా... ఆర్చర్ (12) రనౌట్‌తో ఆశలు కూలాయి. మొయిన్ అలీ, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి తలా 2 వికెట్లు పడగొట్టారు.



రసెల్



పరాగ్... 6 బంతుల్లో 6 సిక్స్‌లు

ఒకే ఓవర్ కాకపోయినా... పరాగ్ తానెదుర్కొన్న వరుస ఆరు బంతుల్లో (వైడ్ మినహా) ఆరు సిక్సర్లతో చెలరేగాడు. ముందుగా మొయిన్ అలీ 12వ ఓవర్లో తొలి బంతికి హెట్‌మైర్ పరుగు తీశాడు. 2వ బంతి నుంచి స్ట్రయిక్ తీసుకున్న పరాగ్ 6, 6, 6, 6, వైడ్, 6లతో ఆ ఓవర్లో 32 పరుగులు వచ్చాయి. మళ్లీ మరుసటి ఓవర్లో హెట్‌మైర్ సింగిల్ తీయగా, పరాగ్ 6 బాదడంతో రెండు ఓవర్లలో వరుసగా 6 బంతుల్ని సిక్సర్లుగా మలిచాడు. ఈ 8 బంతుల్లో సాధించిన 39 పరుగులతోనే జట్టు లక్ష్యఛేదనలో ఆశలుపెంచింది.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) హెట్‌మైర్ (బి) తీక్షణ 35; నరైన్ (బి) యుద్‌వీర్ 11; రహానే (సి) జురేల్ (బి) పరాగ్ 30; రఘువంశీ (సి) సబ్-అశోక్ (బి) ఆర్చర్ 44; రసెల్ (నాటౌట్) 57; రింకూ సింగ్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం** (20 ఓవర్లలో 4 వికెట్లకు) 206. **వికెట్ల పతనం:** 1–13, 2–69, 3–111, 4–172. **బౌలింగ్:** ఆర్చర్ 4–0–30–1, యుద్‌వీర్ 2–0–26–1, తీక్షణ 4–0–41–1, ఆకాశ్ 3–0– 50–0, హసరంగ 4–0–35–0, పరాగ్ 3–0–21–1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) రింకూ సింగ్ (బి) మొయిన్ అలీ 34; వైభవ్ (సి) రహానే (బి) వైభవ్ అరోరా 4; కునాల్ (సి) రసెల్ (బి) మొయిన్ అలీ 0; పరాగ్ (సి) వైభవ్ అరోరా (బి) హర్షిత్ 95; ధ్రువ్ జురేల్ (బి) వరుణ్ 0; హసరంగ (బి) వరుణ్ 0; హెట్‌మైర్ (సి) నరైన్ (బి) హర్షిత్ 29; శుభమ్ దూబే (నాటౌట్) 25; ఆర్చర్ (రనౌట్) 12; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 205. **వికెట్ల పతనం:** 1–5, 2–8, 3–66, 4–71, 5–71, 6–163, 7–173, 8–205. **బౌలింగ్:** వైభవ్ అరోరా 4–0–50–1, మొయిన్ అలీ 3–0–43–2, హర్షిత్ రాణా 4–0–41–2, వరుణ్ చక్రవర్తి 4–0–32–2, సునీల్ నరైన్ 4–0–27–0, రసెల్ 1–0–11–0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	11	7	4	0	14	1.274
గుజరాత్	10	7	3	0	14	0.867
ఢిల్లీ	10	6	4	0	12	0.362
కోల్‌కతా	11	5	5	1	11	0.249
లక్నో	11	5	6	0	10	-0.469
రాజస్తాన్	12	3	9	0	6	-0.718
హైదరాబాద్	10	3	7	0	6	-1.192
చెన్నై	11	2	9	0	4	-1.117

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × ఢిల్లీ
వేదిక: హైదరాబాద్

రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఏడేళ్ల తర్వాత...

భారత మహిళల జట్టుపై శ్రీలంక గెలుపు



రిచా

కొలంబో: మహిళల ముక్కోణపు వన్డే టోర్నమెంట్‌లో భారత జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. గత రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు ఆదివారం జరిగిన పోరులో శ్రీలంక చేతిలో 3 వికెట్ల తేడాతో ఓడింది. వన్డేల్లో లంక జట్టుకు భారత్‌పై ఏడేళ్ల తర్వాత ఇదే తొలి విజయం కావడం విశేషం. మొదట భారత జట్టు 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 275 పరుగులు చేసింది. వికెట్ కీపర్ రిచా ఘోష్ (48 బంతుల్లో 58; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్. ప్రతీక రావల్ (35; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (30; 3 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (37;3 ఫోర్లు), హర్లీన్ డియోల్ (29; 4 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేశారు. తన 100వ వన్డేలో స్మృతి మంధాన (18; 3 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోయింది. శ్రీలంక బౌలర్లలో సుగంధిక, చమరి చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 49.1 ఓవర్లలో 7 వికెట్లకు 278 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నీలాక్షిక సిల్వా (33 బంతుల్లో 56; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ హాఫ్ సెంచరీతో ఆకట్టుకోగా... హర్షిత (53; 5 ఫోర్లు), కవిశ (35; 5 ఫోర్లు), విష్మీ (33) రాణించారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 3 వికెట్లు పడగొట్టింది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా బుధవారం దక్షిణాఫ్రికాతో ఆడుతుంది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

యూనియన్ బ్యాంక్‌లో 500 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని యూనియన్ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 500.
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్ (క్రెడిట్)–250, అసిస్టెంట్ మేనేజర్ (ఐటీ)–250.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, ఎంసీఏ, పీజీడీబీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.48,480 నుంచి రూ.85,920.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.05.2025.
- **వెబ్‌సైట్:** https://www.unionbankofindia.co.in/

ఇండియన్ మిలిటరీ అకాడమీ టీజీసీ-142 కోర్సులో ప్రవేశాలు

డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీ.. 2026 జనవరిలో ప్రారంభమయ్యే 142వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు(టీజీసీ)లో ప్రవేశాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీగా సీట్ల వివరాలు:** సివిల్–08, మెకానికల్–06, సీఎస్(కంప్యూటర్ సైన్స్)–06, ఎలక్ట్రికల్–02, ఎలక్ట్రానిక్స్–06, ఇతర విభాగాలు–02.
- **అర్హత:** కోర్సును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ(మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, సీఎస్, ఇతర ఇంజనీరింగ్ విభాగాలు)లో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.01.2026 నాటికి 20 నుంచి 27 ఏళ్లు ఉండాలి.అభ్యర్థులు 02.01.1999 నుంచి 01.01.2006 మధ్య జన్మించి ఉండాలి.
- **స్టైపెండ్:** నెలకు రూ.56,100.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.05.2025.
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

సీపెట్ అడ్మిషన్ టెస్ట్-2025

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్‌ఈటీ).. దేశవ్యాప్తంగా ఉన్న సిపెట్ కేంద్రాల్లో డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సిపెట్ అడ్మిషన్ టెస్ట్–2025 నిర్వహిస్తుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సుల వివరాలు:** డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ, పోస్ట్–గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్–టెస్టింగ్, పోస్ట్–గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్.
- **అర్హత:** కోర్సును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** గరిష్ఠ వయో పరిమితి లేదు.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.05.2025.
- **పరీక్ష తేది:** 08.06.2025.
- **కోర్సు ప్రారంభతేది:** 14.07.2025.
- **వెబ్‌సైట్:** https://www.cipet.gov.in/

పదితోనే బీటెక్‌కు మార్గం

- ఏపీ ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల నోటిఫికేషన్
- పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక
- ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్‌లో చేరే అవకాశం

బీటెక్.. లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ఇందుకోసం పదో తరగతి తర్వాత ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీలో చేరి జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, ఈఏపీసెట్ వంటి ఎంట్రన్స్ టెస్ట్‌లకు ప్రిపరేషన్ సాగిస్తుంటారు. అయితే పదో తరగతి అర్హతతోనే అకడమిక్ మార్కుల ఆధారంగా నేరుగా బీటెక్‌లో చేరే అవకాశం కూడా ఉంది. అదే.. ఏపీ ట్రిపుల్ ఐటీలు!! ఈ క్యాంపస్‌లలో సీటు సొంతం చేసుకుంటే ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం లభిస్తుంది! తాజాగా.. 2025-26 సంవత్సరానికి సంబంధించి ఏపీ ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఏపీ ట్రిపుల్ ఐటీల ప్రత్యేకత, ప్రవేశ విధానం, కోర్సులు, ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..



ఏపీ ట్రిపుల్ ఐటీ

ఏపీ ట్రిపుల్ ఐటీల ద్వారా పదో తరగతితోనే నేరుగా బీటెక్‌లో చేరే అవకాశముంది. ఏపీ ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల వ్యవధిలోని ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి.. మానస పుత్రికలుగా ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్‌లు.. ఏపీ ట్రిపుల్ ఐటీలు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవాలనే సదాశయంతో వీటిని ఏర్పాటుచేశారు. వీటి పర్యవేక్షణకు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్‌జీయూ కేటీ)పేరుతో ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేశారు.

నాలుగు క్యాంపస్‌లు.. 4,400 సీట్లు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం నాలుగు క్యాంపస్‌ల ద్వారా ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నారు. ప్రస్తుతం ఆర్.కె.వ్యాలీ (ఇడుపులపాయ), నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళంలో ఈ క్యాంపస్‌లు ఉన్నాయి. ఒక్కో క్యాంపస్‌లో 1,100 సీట్లు చొప్పున మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రతి క్యాంపస్‌లో పది శాతం సీట్లను ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థుల కోసం కేటాయించారు.

అర్హత

మే 20, 2025 నాటికి పదో తరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత (విద్యార్థులు మొదటి ప్రయత్నంలోనే పాసవ్వాలి) ఉండాలి.

మెరిట్ ఆధారంగా ప్రవేశాలు

- ఏపీ ట్రిపుల్ ఐటీల్లో పదో తరగతిలో మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు పదిలో వారు పొందిన మార్కులకు అదనంగా నాలుగు మార్కులను డిప్రైవేషన్ స్కోర్ పేరిట కలుపుతారు.
- దరఖాస్తు సమయంలోనే నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి.. విద్యార్థులు పొందిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి సీట్ల కేటాయింపు చేస్తారు.

అప్‌లోడ్ చేయాల్సిన సర్టిఫికెట్లు

ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో.. పదో తరగతి హాల్‌టికెట్ నెంబర్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఎన్‌సీసీ, పీహెచ్, సీఏపీ కేటగిరీ విద్యార్థులు అందుకు సంబంధించిన ధ్రువ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, –ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, తెల్ల రేషన్ కార్డ్/రైస్ కార్డ్, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్. లోకల్ కేటగిరీ కోరుకుంటున్న అభ్యర్థులు అందుకు సంబంధించి అధికారులు జారీ చేసిన రెసిడెన్స్ సర్టిఫికెట్ తదితరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

పీయూసీ + బీటెక్

ఏపీ ట్రిపుల్ ఐటీల విద్యా విధానం వినూత్నమని చెప్పొచ్చు. ఇక్కడ పదో తరగతితోనే ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో చేరొచ్చు. ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో.. తొలి రెండేళ్లను పీయూసీ (ఇంటర్మీడియెట్ తత్సమాన) కోర్సుగా పరిగణిస్తారు. ఆ తర్వాత నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్ బోధన సాగుతుంది.

పీయూసీ రెండేళ్లు

ఇంటర్మీడియెట్‌లో విద్యార్థులు ఎంచుకున్న గ్రూప్ సబ్జెక్ట్‌లలో బోధన ఉంటుంది. కాని ఏపీ ట్రిపుల్ ఐటీల్లో మొదటి రెండేళ్ల పీయూసీ విధానం అమలు చేస్తారు. వీరికి ఎంపీసీ గ్రూప్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, తెలుగు, ఐటీ కోర్సులను అందిస్తున్నారు. బయాలజీ సబ్జెక్ట్‌ను ఆప్షనల్‌గా ఎంచుకునే అవకాశం కూడా ఉంది. ఇలా బయాలజీని ఆప్షనల్‌గా ఎంచుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్‌లకు హాజరయ్యే అర్హత సైతం లభిస్తుంది.

మూడో ఏడాది నుంచి బీటెక్

మొదటి రెండేళ్ల పీయూసీ పూర్తి చేసుకున్న తర్వాత విద్యార్థులకు మూడో ఏడాది నుంచి బీటెక్ ప్రోగ్రామ్ ప్రారంభమవుతుంది. బీటెక్‌లో ఏడు బ్రాంచ్‌లను ఎంచుకునే అవకాశం ఉంది. కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఏఐ-ఎంఎల్ స్పెషలైజేషన్), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో చేరొచ్చు. తొలి రెండేళ్ల పీయూసీ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులు.. తమ ఆసక్తి, అభిరుచి మేరకు బ్రాంచ్‌ను ఎంచుకోవచ్చు.

'పీయూసీ'తో ఎగ్జిట్ అవకాశం

రెండేళ్ల పీయూసీ పూర్తయ్యాక జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ, నీట్ యూజీ వంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ పరీక్షల ద్వారా సీటు సొంతం చేసుకున్న విద్యార్థులు అవకాశం కోల్పోకుండా ఎగ్జిట్ సదుపాయాన్ని కల్పిస్తు న్నారు. ఇలాంటి విద్యార్థులకు పీయూసీ సర్టిఫికెట్ అందిస్తారు. దీని ఆధారంగా వారు ఐఐటీలు, ఎన్ ఐటీలు, మెడికల్ కళాశాలల్లో చేరే అవకాశం లభిస్తుంది.

బీటెక్‌లో నచ్చిన ప్రోగ్రామ్

రెండేళ్ల పీయూసీని పూర్తి చేసుకున్న విద్యార్థులు బీటెక్ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తమకు నచ్చిన బ్రాంచ్‌లను ప్రాథమ్యాల వారీగా పేర్కొనాలి. ఆ తర్వాత ప్రవేశాల కమిటీ.. ఆయా దరఖాస్తులను పరిశీలించి.. పీయూసీలో పొందిన మార్కులు, బీటెక్‌లో సదరు క్యాంపస్‌లో అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకుని బ్రాంచ్‌లను కేటాయిస్తుంది.

ఇంటర్న్‌షిప్ అవకాశాలు

ఏపీ ట్రిపుల్ ఐటీల్లో బీటెక్ చదువుతున్న వారికి ఇంటర్న్‌షిప్ అవకాశాలు కూడా లభిస్తున్నాయి. ప్రభుత్వ పరిధిలోని ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, ఎలక్ట్రికల్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ శిక్షణ పొందొచ్చు. వీటితోపాటు పలు ప్రైవేట్ సంస్థల్లోనూ ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేలా యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

స్కాలర్‌షిప్ సదుపాయం

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం సైతం అందుబాటులో ఉంది. కుటుంబ వార్షికాదాయం రూ.2.5 లక్షలలోపు ఉన్న వారికి ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ లభిస్తుంది.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

ఏపీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో పలు ఎంఎన్‌సీ సంస్థలు రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహించి ఆకర్షణీయ వేతనాలతో ఆఫర్లు ఇస్తున్నాయి. అదేవిధంగా యూపీఎస్సీ నిర్వహించే ఈఎస్ఈ, ఇతర ఉద్యోగ పోటీ పరీక్షల్లోనూ విజయం సాధించిన విద్యార్థులున్నారు. ఏపీ ట్రిపుల్ ఐటీల విద్యార్థులు బీటెక్ తర్వాత గేట్, పీజీఈసెట్ తదితర ఉన్నత విద్య ఎంట్రన్స్ టెస్ట్‌లలో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు చివరి తేదీ: 2025, మే 20
- స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్: మే 28 నుంచి 30 వరకు
- ఎంపిక జాబితా వెల్లడి(స్పెషల్ కేటగిరీ మినహా): జూన్ 6
- సంబంధిత క్యాంపస్‌లలో రిపోర్టింగ్ తేదీ: 2025, జూన్ 30
- వివరాలకు వెబ్‌సైట్: www.rgukt.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–సైన్స్ అండ్ టెక్నాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–కంప్యూటర్ అవేర్‌నెస్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
260	12
80,502	24,347

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,978	▲	267
డోజోన్స్	41,314	▲	561
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,596	▲	99
డాక్స్	23,087	▲	590
హాంగ్‌సెంగ్	3,279	▼	8
నికాయ్	36,831	▲	378

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.60	84.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.50	113.39
€	యూరో	ఎస్‌బీఐ	93.82	96.49
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.85	60.39
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.91	55.09
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.01	67.72
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.66	23.17
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.14	23.92
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.76	12.58

బఫెట్ వారసుడొచ్చాడు..!

బెర్క్‌షైర్ సీఈవోగా గ్రెగ్ అబెల్‌కు బాధ్యతలు
- ఈ ఏడాది చివర్లో బఫెట్ పదవీ విరమణ
- ఆరు దశాబ్దాల నాయకత్వానికి గుడ్‌బై...
- కంపెనీ వాటాదారుల సమావేశంలో షాకింగ్ ప్రకటన..

ఒమాహా: ప్రపంచ ప్రఖ్యాత ఇన్వెస్టర్, బిలియనీర్ వారెన్ బఫెట్ (94) 'బెర్క్‌షైర్ హాతవే' చైర్మన్‌గా ఈ ఏడాది చివర్లో తప్పుకోనున్నారు. తన స్థానంలో వైస్ చైర్మన్ గ్రెగ్ అబెల్‌కి సారథ్య బాధ్యతలు అప్పగించాలంటూ కంపెనీ బోర్డుకు సిఫారసు చేయనున్నట్లు శనివారం ప్రకటించి ఇన్వెస్టర్లను, ఫాలోవర్లను షాక్‌కు గురిచేశారు. దీంతో ఆరు దశాబ్దాల పెట్టుబడుల యాత్రకు బఫెట్ ముగింపు పలకనున్నారు. ''కంపెనీ సీఈవోగా ఈ ఏడాది చివర్లో గ్రెగ్ బాధ్యతలు చేపట్టే సమయం ఆసన్నమైంది'' అంటూ వాటాదారులతో నిర్వహించిన ప్రశ్న–జవాబుల కార్యక్రమం చివర్లో బఫెట్ ప్రకటించారు. దీనిపైపై మాత్రం ప్రశ్నలకు అనుమతించలేదు. ఈ నిర్ణయం కంపెనీ బోర్డు సభ్యులైన తన ఇద్దరు పిల్లలు హోవర్డ్, సూసీ బఫెట్‌కు మాత్రమే తెలుసని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం వేదికపై బఫెట్ పక్కనే గ్రెగ్ అబెల్ ఆసీనులై ఉండడం గమనార్హం. ''బెర్క్‌షైర్ హాతవే కంపెనీ షేరు ఒక్కటి కూడా విక్రయించాలన్న ఉద్దేశం నాకు లేదు. చివరికి వీటిని విరాళంగా ఇచ్చేయాల్సిందే. కానీ, ప్రతీ షేరును కొనసాగించాలన్న నిర్ణయం ఆర్థిక కోణంలో తీసుకున్నదే. ఎందుకంటే నా కంటే కూడా గ్రెగ్ నాయకత్వంలో బెర్క్‌షైర్ భవిష్యత్ మెరుగ్గా ఉంటుందని భావిస్తున్నాను'' అని బఫెట్ తెలిపారు.

ఇప్పటికే కీలక బాధ్యతలు..

బఫెట్ భవిష్యత్ వారసుడిగా గ్రెగ్ అబెల్ (62) గతంలోనే నియమితులయ్యారు. కంపెనీ నాన్ ఇన్సూరెన్స్ వ్యాపార బాధ్యతలను ఆయనే నిర్వహిస్తున్నారు. కానీ, బఫెట్ మరణానంతరమే ఆయన స్థానంలో కంపెనీ బాధ్యతల్లోకి గ్రెగ్ వస్తారన్న అంచనాలు నెలకొన్నాయి. తనకు రిటైర్మెంట్ ప్రణాళికలేవీ లేవంటూ లోగడ బఫెట్ ప్రకటించడం ఇందుకు దారితీసింది. బెర్క్‌షైర్ కంపెనీని నడిపించే సామర్థ్యాలు గ్రెగ్ అబెల్‌కు ఉన్నాయని చాలా మంది ఇన్వెస్టర్లు అభిప్రాయపడుతున్నారు. ఇకపై ఇన్సూరెన్స్ వ్యాపారం బాధ్యతల నిర్వహణతోపాటు కంపెనీ వద్దనున్న భారీ నగదు నిల్వలను (2024 చివరికి 334 బిలియన్ డాలర్లు) అబెల్ ఎలా పెట్టుబడులుగా మలుస్తారన్న ఆసక్తి నెలకొంది. బఫెట్ ప్రకటన తర్వాత వేలాది మంది ఇన్వెస్టర్లు నిల్చుని మరీ దిగ్గజ ఇన్వెస్టర్ సేవలకు ప్రశంసలు కురిపించడం కనిపించింది. బఫెట్ సారథ్యంలో (1965 నుంచి నేటి వరకు) బెర్క్‌షైర్ ఎస్‌అండ్‌పీ 500 కంటే (ఏటా 10.4 శాతం) రెట్టింపు స్థాయిలో ఏటా 19.9 శాతం కాంపౌండెడ్ రాబడులు అందించడం గమనార్హం. బ్లూంబర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం వారెన్ బఫెట్ సంపద విలువ ప్రస్తుతం 169 బిలియన్ డాలర్లుగా ఉంది.



త్వరలో కేంద్రీకృత కేవైసీ వ్యవస్థ

- ఆర్థిక శాఖ, నియంత్రణ సంస్థలతో సంప్రదింపులు
- సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే




న్యూఢిల్లీ: కేంద్రీకృత కేవైసీ (నో యువర్ కస్టమర్/నీ కస్టమర్ గురించి తెలుసుకో) వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఆర్థిక శాఖ, ఆర్థిక నియంత్రణ సంస్థలతో సంప్రదింపులు నిర్వహిస్తున్నట్టు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. కస్టమర్ల కేవైసీ వివరాలను ఒకే చోట నిర్వహించేదే సెంట్రల్ కేవైసీ. దీనివద్ద కేవైసీ వివరాలను అప్‌డేట్ చేస్తే.. అన్ని ఆర్థిక సంస్థల వద్ద ఆటోమేటిక్‌గా అది అప్‌డేట్ అయిపోతుంది. ఎప్పటిలోగా దీన్ని తీసుకొచ్చేదీ పాండే స్పష్టంగా వెల్లడించలేదు. కానీ వీలైనంత త్వరగా చేయాల్సి ఉందన్నారు. ఉమ్మడి కేవైసీ వ్యవస్థ గురించి ఎదురైన ఓ ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. ''ఈ విషయంలోనూ మేము సానుకూలంగా ముందుకు వెళ్లాలనుకుంటున్నాం. మరింత సమర్థవంతమైన వ్యవస్థ ఏర్పాటుకు ప్రయతిస్తున్నాం''అని చెప్పారు. ఆర్థిక శాఖ కార్యదర్శి అధ్యక్షతన గల కమిటీ ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. 2025లో నూతన సెంట్రల్ కేవైసీ రిజిస్ట్రీని తీసుకురానున్నట్టు బడ్జెట్‌లో భాగంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. సెక్యూరిటీలకు సంబంధించి టీప్లస్0 సెటిల్‌మెంట్ ప్రస్తుతం ఐచ్ఛికంగానే ఉందని పాండే చెప్పారు. దీనివల్ల మార్కెట్ భాగస్వాములు క్రమంగా కొత్త వ్యవస్థకు మారేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. నిఘా, ఐపీవో దరఖాస్తులను వేగంగా మదింపు వేసేందుకు ప్రస్తుతం సెబీ కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగిస్తున్నట్టు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని చోట్ల దీన్ని వాడనున్నట్టు తెలిపారు. టీప్లస్1 ప్రస్తుతం తప్పనిసరిగా అమల్లో ఉన్న విధానం. స్టాక్స్ కొనుగోలు చేసిన తర్వాతి పని దినం రోజున అవి కస్టమర్ల డీమ్యాట్ ఖాతాలకు జమ అవుతాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్లపై ఫెడ్ క్యూ4 ఎఫెక్ట్ | సరళతర ఎఫ్‌డీఐ విధానంతో భారీ అవకాశాలు

పెట్టుబడులకు కాస్త స్థిరత్వం

కెనరా రొబెకో ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్

పెట్టుబడులకు వైవిధ్యం ఎంత అవసరమో ఇటీవలి మార్కెట్ పతనం చూసి తెలుసుకోవచ్చు. లార్జ్‌క్యాప్‌తో పోల్చితే మిడ్, స్మాల్ క్యాప్ కంపెనీల్లో గణనీయమైన దిద్దుబాటు కనిపించింది. పెట్టుబడులపై మెరుగైన రాబడులు కోరుకోవడంలో తప్పు లేదు. అదే సమయంలో ఆర్థిక అనిశ్చితుల్లో పెట్టుబడులకు స్థిరత్వం కూడా అవసరమే. కనుక ముఖ్యమైన ఆర్థిక లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసే ప్రతి ఒక్కరూ నిర్దేశిత శాతం మేర డెట్ సాధనాలకూ కేటాయించుకోవాలి. ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్స్ ఇదే పని చేస్తాయి. ఇవి ఈక్విటీతోపాటు కొంత మేర డెట్ సాధనాల్లోనూ ఇన్వెస్ట్ చేస్తుంటాయి. తద్వారా పెట్టుబడిపై మెరుగైన రాబడికి తోడు అస్థిరతల్లో మెరుగైన రక్షణను ఆఫర్ చేస్తుంటాయి. ఈ విభాగంలో కెనరా రొబెకో ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ మెరుగైన పనితీరు చూపిస్తోంది.



రాబడులు

ఈ పథకంలో ఏడాది కాల రాబడి 10 శాతంగా ఉంది. గడిచిన ఏడాది కాలంలో మార్కెట్లలో అస్థిరతలు, దిద్దుబాట్ల నేపథ్యంలో దీన్ని మెరుగైన రాబడిగానే చూడొచ్చు. మూడేళ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే ఏటా 14 శాతానికి పైనే రాబడి తెచ్చిపెట్టింది. ఇక ఐదేళ్లలో 18.55 శాతం, ఏడేళ్లలో 13.95 శాతం, పదేళ్లలో 13.45 శాతం చొప్పున ఈ ఫండ్ డైరెక్ట్ ప్లాన్‌లో రాబడులు కనిపిస్తాయి.



పెట్టుబడుల విధానం

అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఈక్విటీ పథకాలు ఈక్విటీ, డెట్ కలయికగా పెట్టుబడులు పెడుతుంటాయి. ఈక్విటీల వ్యాల్యుయేషన్స్ (స్టాక్స్ విలువలు) ఆకర్షణీయంగా ఉన్న సందర్భాల్లో మొత్తం పెట్టుబడుల్లో 80 శాతం వరకు ఈక్విటీలకు కేటాయించి మిగిలిన 20 శాతాన్ని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. అదే విధంగా ఈక్విటీ వ్యాల్యుయేషన్లు ఖరీదుగా మారాయని భావించి సందర్భాల్లో ఈక్విటీ కేటాయింపులను 65 శాతానికి పరిమితం చేసి, మిగిలిన మేర డెట్ సాధనాలకు మళ్లిస్తుంటాయి. ఇలా పరిస్థితులకు తగినట్టు మార్పులు చేస్తూ అధిక రాబడులు తెచ్చిపెట్టే విధంగా ఈ పథకాలు పనిచేస్తాయి. మార్కెట్ కరెక్షన్లలో నష్టాలను పరిమితం చేస్తుంటాయి. ఈ తరహా పెట్టుబడుల వ్యూహాలను ఈ పథకంలో గమనించొచ్చు.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతానికి రూ.10,372 కోట్ల పెట్టుబడులున్నాయి. ఇందులో 71 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, డెట్‌లో 25.58 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. మరో 3.29 శాతం పెట్టుబడులను నగదు రూపంలో కలిగి ఉంది. ఈక్విటీల్లో అనిశ్చితుల నేపథ్యంలో కొంత నగదు నిల్వలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. పోర్ట్‌ఫోలియోలో 64 స్టాక్స్‌ను కలిగి ఉంది. ఈక్విటీల్లోనూ 77 శాతం మేర కేటాయింపులు మెగా, లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 19.78 శాతం ఉంటే, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 3 శాతం పెట్టుబడులు ఉన్నాయి. డెట్‌లో రిస్క్ అత్యంత కనిష్టంగా ఉండే ఏఏఏ రేటెడ్, ఎస్‌వోవీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఈక్విటీ పెట్టుబడుల్లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వాటిల్లో 25 శాతం ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత టెక్నాలజీ కంపెనీలకు 8.99 శాతం, ఇండస్ట్రియల్ కంపెనీలకు 8.28 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషనరీ కంపెనీలకు 6.55 శాతం, ఇంధన రంగ కంపెనీలకు 6 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.17
ఐసీఐసీఐ బ్యాంక్	4.97
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.64
ఇన్ఫోసిస్	2.60
పీఎఫ్‌సీ	2.46
ఎయిర్‌టెల్	2.34
యాక్సిస్ బ్యాంక్	2.09
బజాజ్ ఫైనాన్స్	2.07
ఎల్అండ్‌టీ	1.94
ఎస్‌బీఐ	1.76

ఐటీఆర్-3ని నోటిఫై చేసిన ఆదాయపన్ను శాఖ



న్యూఢిల్లీ: వ్యాపారం లేదా వృత్తిపరమైన ఆదాయం కలిగిన వారు దాఖలు చేయాల్సిన ఐటీఆర్ పత్రం ఫారమ్ 3ని ఆదాయపన్ను శాఖ నోటిఫై చేసింది. ఐటీఆర్ 3ని ఏప్రిల్ 30న నోటిఫై చేసినట్టు ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ఆదాయపన్ను శాఖ ప్రకటించింది. వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) వ్యాపారం నుంచి లాభ/నష్టాలు ఉంటే లేదా వృత్తిపరమైన ఆదాయం ఉంటే వారికి ఐటీఆర్ ఫారమ్ 3 వర్తిస్తుంది. 'షెడ్యూల్ ఏఎల్' కింద వెల్లడించాల్సిన ఆస్తులు/అప్పుల పరిమితి ఇప్పటివరకు రూ.50 లక్షలుగా ఉంటే రూ.కోటికి పెంచింది. దీనివల్ల ఆలోపు ఆదాయం ఉంటే వివరాలు వెల్లడించాల్సిన భారం తొలగిపోయింది. ఐటీఆర్ క్యాపిటల్ గెయిన్స్ షెడ్యూల్‌లో మూలధన లాభాలను ఇకపై 2024 జులై 23 ముందు, తర్వాత వాటిని వేరుగా చూపించాల్సి ఉంటుంది. బడ్జెట్‌లో రియల్ ఎస్టేట్‌పై మూలధన లాభాలను గతంలో ఉన్న 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గించడం తెలిసిందే. దీని ప్రకారం 2024 జులై 23కు ముందు ప్రాపర్టీని కొనుగోలు చేసిన వారు కొత్త పథకం కింద ఇండెక్సేషన్ ప్రయోజనం లేకుండా 12.5 శాతం మూలధన లాభాల పన్నును ఎంపిక చేసుకోవచ్చు. లేదంటే పాత విధానంలో మాదిరిగా ఇండెక్సేషన్ ప్రయోజనంతో 20 శాతం పన్ను అయినా చెల్లించొచ్చు.

న్యూ ఫండ్ ఆఫర్

యూటీఐ మల్టీ క్యాప్ ఫండ్

వివిధ మార్కెట్ క్యాప్స్‌వ్యాప్తంగా ఇన్వెస్ట్ చేసే మల్టీ క్యాప్ ఫండ్‌ను ప్రకటించింది యూటీఐ మ్యూచువల్ ఫండ్. ఈ న్యూ ఫండ్ ఆఫర్ మే 13 వరకు అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ సెగ్మెంట్ స్టాక్స్‌లో 3ఎస్ విధానంతో (సైజు, సెక్టార్, స్టయిల్) ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఒక్కో సెగ్మెంట్‌కి కనీసం 25 శాతం మొత్తాన్ని కేటాయిస్తుంది. పటిష్టమైన ఫండమెంటల్స్‌తో టర్న్‌రౌండ్ అవకాశాలు ఉండి ఆకర్షణీయమైన వేల్యుయేషన్స్‌లో లభించే స్టాక్స్‌లో ఇది ఇన్వెస్ట్ చేస్తుందని యూటీఐ ఏఎంసీ సీఐవో వెట్రి సుబ్రమణియమ్ తెలిపారు. దీనికి కార్తీక్‌రాజ్ లక్ష్మణన్ ఫండ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు.



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ క్వాలిటీ ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ క్వాలిటీ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ నూతన ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో) ఈ నెల 6న మొదలు కానుంది. 20వ తేదీ వరకు సబ్‌స్క్రిప్షన్లకు అనుమతి ఉంటుంది. ఈ పథకానికి ప్రామాణిక సూచీగా 'నిఫ్టీ 200 క్వాలిటీ 30 టీఆర్ఐ' కొనసాగుతుంది. ఇహబ్ దల్వాయ్, మసూమి జుర్మర్వాలా ఫండ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నారు. బలమైన ఆర్థిక మూలాలు, పటిష్టమైన నగదు ప్రవాహాలు, రుణ భారం తక్కువగా ఉండి, నిధుల వ్యయాల సామర్థ్యాలు గొప్పగా ఉన్న కంపెనీలను పెట్టుబడులకు ఎంపిక చేస్తుంది. అందుకే పథకానికి క్వాలిటీ అని పేరు పెట్టారు. సుమారు 625 కంపెనీలను జల్లెడ పట్టి అందులో మెరుగైన 40–60 కంపెనీలను గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంది. భౌగోళిక రాజకీయ, ఆర్థిక అనిశ్చితులు, వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇలాంటి సవాళ్లను నాణ్యమైన కంపెనీలు ఎదుర్కొని బలంగా నిలబడగలవని భావిస్తూ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ ఈ పథకాన్ని తీసుకొచ్చింది. పెట్టుబడులను ఏడాదిలోపు విక్రయిస్తే విలువపై ఒక శాతం ఎగ్జిట్ లోడ్ అమలవుతుంది. ఏడాది తర్వాత విక్రయిస్తే ఎగ్జిట్ చార్జీలు ఉండవు.



గ్రో సిల్వర్ ఈటీఎఫ్

వెండిలో పెట్టుబడులు పెట్టాలనుకునే వారి కోసం గ్రో మ్యూచువల్ ఫండ్ 'గ్రో సిల్వర్ ఈటీఎఫ్' ఎన్ఎఫ్‌వోను ప్రారంభించింది. ఈ నెల 16 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. అనంతరం మే 30 నాటికి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో రోజువారీ పెట్టుబడులు, విక్రయాలకు అందుబాటులోకి వస్తుందని సంస్థ ప్రకటించింది. దేశీ వెండి ధరలకు అనుగుణంగా గ్రో సిల్వర్ ఈటీఎఫ్ ట్రేడవుతుంటుంది. వెండి ధరల గమనానికి అనుగుణంగానే ఇందులో లాభ, నష్టాలు ఆధారపడి ఉంటాయి. భౌతిక వెండి కొనుగోలు, నిల్వ, విక్రయం వంటి సమస్యలను సిల్వర్ ఈటీఎఫ్ తప్పిస్తుంది. ఇందులో కనీసం రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. దీర్ఘకాలంలో రాబడులు కోరుకునే వారికి ఇది అనుకూలమని సంస్థ తెలిపింది. ప్రస్తుతం బంగారం–వెండి నిష్పత్తి 91.64 వద్ద ఉందని.. ఈ ప్రకారం చూస్తే బంగారం కంటే వెండి ధరలే అందుబాటులో ఉన్నట్టు పేర్కొంది.



స్టాక్స్ వ్యూ

సువెన్ ఫార్మా

బ్రోకరేజ్: గోల్డ్‌మన్ శాక్స్

ప్రస్తుత ధర: రూ. 1,136
టార్గెట్: రూ. 1,350

ఎందుకంటే: ఫార్మా రంగ కంపెనీ సువెన్ ఫార్మాస్యూటికల్స్ ప్రధానంగా స్పెషాలిటీ కెమికల్స్‌సహా మానవ ఆరోగ్య పరిరక్షణ సంబంధ ప్రొడక్టులను రూపొందిస్తోంది. ఎన్‌సీఈ ఆధారిత కేఎస్ఎంలు, బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియట్స్ అభివృద్ధి, తయారీలను చేపడుతోంది. తద్వారా గ్లోబల్ ఫార్మా, బయో టెక్నాలజీ, కెమికల్ దిగ్గజాలకు కాంట్రాక్ట్ రీసెర్చ్, తయారీ సర్వీసులు(సీడీఎంవో) అందిస్తోంది. గత రెండేళ్ల(2024, 2025 అంచనాలు)లో కంపెనీకి కీలకమైన కస్టమర్లు అనూహ్య(వన్‌టైమ్) ఆదాయ బేస్, నిల్వల(ఇన్వెంటరీ)ను తగ్గించుకోవడం పనితీరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) నుంచి పటిష్ట రీబౌండ్, నిర్మాణాత్మక వృద్ధిని కంపెనీ సాధించవచ్చని అంచనా. ఎంపాగ్లిఫ్లోజిన్, ఫైనెరినన్, ఏడీసీలతోపాటు టాప్–5 ఔషధాలు ఇందుకు తోడ్పాటునివ్వనున్నాయి. అంతేకాకుండా జాంగెర్టినిబ్, నెరన్‌డోమిలస్ట్ తదితర కొత్త ఔషధ అనుమతి అవకాశాలు సహకరించనున్నాయి. వీటితోపాటు కోహాన్స్ లైఫ్‌సైన్సెస్, సపాలా, ఎన్‌జీ బయోల విజయవంత ఇంటిగ్రేషన్, అగ్రికెమ్ పరిస్థితులు టర్న్‌అరౌండ్‌కావడం సైతం వీటికి జత కలవనున్నాయి. సీడీఎంవో, అగ్రికెమ్ ప్రొడక్టుల సమగ్ర విశ్లేషణ తదుపరి సమీప, దీర్ఘకాల భవిష్యత్‌లో కంపెనీ బిజినెస్ వృద్ధి అవకాశాల పట్ల ఆశావహ అంచనాలకు వచ్చాం. కన్సాలిడేటెడ్ నిర్వహణ లాభం సగటున వార్షికంగా 20 శాతం పురోగతిని సాధించగలవని విశ్వసిస్తున్నాం. కీలక ప్రొడక్టులలో పురోగతి, కొత్త అనుమతులు, విజయవంత ఇంటిగ్రేషన్ సానుకూల అంశాలుకాగా.. ప్రొడక్టులు, కస్టమర్లు, ప్రాంతాలవారీ రిస్కులు, నిబంధనలు తదితరాలను కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

కొనొచ్చు



360 వన్ వామ్

బ్రోకరేజ్: వెంచురా సెక్యూరిటీస్

ప్రస్తుత ధర: రూ. 945
టార్గెట్: రూ. 1,058

ఎందుకంటే: అత్యంత పోటీగల వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలో 360 వన్ వామ్‌ను నంబర్ వన్ కంపెనీగా పేర్కొనవచ్చు. రూ. 5.2 లక్షల కోట్ల విలువైన నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం)రీత్యా నాన్‌బ్యాంకింగ్ సంస్థలలో దిగ్గజంగా నిలుస్తోంది. వెల్త్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ 2029కల్లా రెట్టింపునకు అంటే రూ. 2.3 లక్షల కోట్లకు చేరుకోగలదని అంచనా. తద్వారా 36 వన్ అత్యధికంగా లాభపడే అవకాశముంది. దీంతో వార్షికంగా సంస్థ ఏయూఎం 16 శాతం చొప్పున పుంజుకోగలదని భావిస్తున్నాం. వెరసి 2029కల్లా ఏయూఎం రూ. 7.3 లక్షల కోట్లను తాకే వీలుంది. ఇందుకు వార్షికంగా 16 శాతం వృద్ధితో రూ. 12,417 కోట్లకు చేరనున్న అసెట్ మేనేజ్‌మెంట్ ఏయూఎం, 20 శాతం వార్షిక పురోగతితో రూ. 2,19,858 కోట్లను తాకనున్న కస్టడీమినహా వెల్త్ మేనేజ్‌మెంట్ ఏయూఎం, 15 శాతం వార్షిక వృద్ధితో రూ. 2,10,913 కోట్లకు చేరనున్న లావాదేవీలు, బ్రోకింగ్ ఏయూఎం తోడ్పాటునివ్వనున్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 16 శాతం చొప్పున పుంజుకోవడం ద్వారా రూ. 3,149 కోట్లకు చేరగలదని భావిస్తున్నాం. అసెట్ మేనేజ్‌మెంట్ ఏఆర్ఆర్ వార్షిక ప్రాతిపదికన 13 శాతం చొప్పున ఎగసి రూ. 705 కోట్లను తాకగలదని అంచనా. ఈ బాటలో 360 వన్ నికర లాభం వార్షికంగా 19.4 శాతం చొప్పున మెరుగుపడి రూ. 1,368 కోట్లకు చేరే వీలుంది. వెరసి నికర లాభ మార్జిన్లు 268 బేసిస్ పాయింట్లు(2.68 శాతం) బలపడి 34.8 శాతాన్ని తాక వచ్చని అంచనా. దీంతో ఆర్‌వోఈ 32.4 శాతాన్ని అందుకోవచ్చు. కంపెనీకున్న వృద్ధి అవకాశాలరీత్యా షేరు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. అయితే ఈక్విటీ మార్కెట్లలో ఆటుపోట్లు, వెల్త్ మేనేజ్‌మెంట్ నిబంధనలలో మార్పులు వంటి అంశాలు కీలక రిస్కులుగా భావించవచ్చు.

కొనొచ్చు




గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

డీటీహెచ్ బిజినెస్ విలీనానికి చెక్

ఎయిర్‌టెల్, టాటా చర్చలకు ఫుల్‌స్టాప్

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్, ప్రయివేట్ రంగ దిగ్గజం టాటా గ్రూప్ మధ్య డైరెక్ట్ టు హోమ్(డీటీహెచ్) బిజినెస్ విలీనానికి చెక్ పడింది. విలీన చర్చలను విరమించుకున్నట్లు ఎయిర్‌టెల్ తాజాగా వెల్లడించింది. చర్చలలో రెండువైపులా సంతృప్తికర ఫలితాలను సాధించకపోవడంతో వెనక్కి తగ్గినట్లు తెలిపింది. డీటీహెచ్ బిజినెస్‌ల విలీనానికి టాటా గ్రూప్ డీటీహెచ్ విభాగం టాటా ప్లేతో అనుబంధ సంస్థ భారతీ టెలిమీడియా చర్చిస్తున్నట్లు 2025 ఫిబ్రవరి 26న ఎయిర్‌టెల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలో రెండు సంస్థలూ సరైన పరిష్కారాన్ని సాధించలేకపోవడంతో చర్చలు విరమించుకున్నట్లు వివరించింది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-5-2025

విశాఖ	480-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	465-00
వరంగల్	467-00
రిటైల్ ధర	5.25

అనిశ్చితిని ఎలా ఎదుర్కోవాలి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపన్ను నిబంధనలు అమల్లోకి వచ్చాయని విన్నాను. ఆదాయపన్ను శ్లాబుల్లో, టీడీఎస్ పరిమితుల్లోనూ మార్పులు చేసినట్టు తెలిసింది. సీనియర్ సిటిజన్‌గా (60 ఏళ్లకు పైన) నాకు డెట్ సాధనాలపై వస్తున్న వడ్డీ ఆదాయమే ప్రధానంగా ఉంది. కనుక ఆదాయపన్ను మార్పుల ప్రభావం నాపై ఏ మేరకు ఉంటుంది?

– వినోద్ బాబు

కొత్త విధానం కింద ఆదాయపన్ను శ్లాబుల్లో, టీడీఎస్‌లో మార్పులు చోటుచేసుకున్నాయన్నది నిజమే. టీడీఎస్ పరిమితిని సీనియర్, నాన్ సీనియర్ సిటిజన్లకూ (60 ఏళ్లలోపు) తగ్గించారు. సీనియర్ సిటిజన్స్‌కు ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.50,000 వరకు వడ్డీ ఆదాయంపై టీడీఎస్ మినహాయింపు ఉంది. ఇప్పుడు ఈ పరిమితి రూ.లక్షకు పెరిగింది. ఆదాయం ఈ లోపు ఉంటే టీడీఎస్ వర్తించదు. నాన్ సీనియర్ సిటిజన్స్‌కు రూ.40,000గా ఉన్న పరిమితి రూ.50,000కు పెరిగింది. అంటే వడ్డీ ఆదాయం రూ.50వేలు మించినప్పుడే టీడీఎస్ వర్తిస్తుంది. అద్దె ఆదాయంపై టీడీఎస్ అమలును రూ.2.4 లక్షల పరిమితి నుంచి రూ.6లక్షలకు పెంచారు. ఇది పన్ను చెల్లింపుదారులులందరికీ వర్తిస్తుంది. మ్యూచువల్ ఫండ్స్ నుంచి వచ్చే డివిడెండ్ ఆదాయం రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచారు. అంటే ఫండ్స్ నుంచి డివిడెండ్ ఆదాయం రూ.10,000 మించినప్పుడే టీడీఎస్ అమలవుతుంది. కొత్త పన్ను విధానంలో ఆదాయపన్ను శ్లాబుల్లోనూ మార్పులు జరిగాయి. మొత్తం ఆదాయం రూ.12లక్షల వరకు ఉంటే సెక్షన్ 87ఏ కింద రాయితీ ప్రయోజనంతో ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. స్టాక్స్, ఈక్విటీ ఫండ్స్ నుంచి వచ్చే మూలధన లాభాలు కూడా రూ.12 లక్షల ఆదాయంలోపే ఉన్నప్పటికీ.. మూలధన లాభాలపై విడిగా పన్ను చెల్లించడం తప్పనిసరి.

మార్కెట్లు అస్థిరతంగా ఉన్నాయి. ఈ పరిస్థితులను ఇన్వెస్టర్లు ఎలా ఎదుర్కోవాలి?

– ఉష

మార్కెట్లలో అస్థిరతలు సహజమే. ఇప్పుడనే కాదు.. గతంలోనూ ఎన్నో సందర్భాల్లో ఇలాంటి ఆటుపోట్లను చూశాం. భవిష్యత్తులో మరింత ఎక్కువగా ఉండొచ్చు. గడిచిన ఐదు, పదేళ్ల కాలంలో ఇదే ధోరణి కనిపిస్తోంది. వీటిని ఎదుర్కొనే విధంగా ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రణాళిక ఉండాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమల్లో పెట్టాల్సి ఉంటుంది. ముందుగా లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్‌తో కుటుంబానికి ఆర్థిక, ఆరోగ్య రక్షణ కల్పించుకోవాలి. ఊహించని అవసరాలు ఏర్పడితే ఈక్విటీ పెట్టుబడులపై ఆధారపడకుండా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. మీరు ఇన్వెస్ట్ చేస్తున్న పెట్టుబడులు కనీసం ఐదు నుంచి పదేళ్లు అంతకంటే ఎక్కువ కాలానికి అయి ఉండాలి. దీంతోపాటు క్రమం తప్పకుండా మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా అస్థిరతల నుంచి గరిష్ట ప్రయోజనాన్ని పొందొచ్చు. రెగ్యులర్‌గా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్ కరెక్షన్లలో మంచి పెట్టుబడుల అవకాశాలు వస్తుంటాయి. వీటిని అనుకూలంగా మలుచుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌక ధరల వద్ద కొనుగోలు చేసుకోవచ్చు. తద్వారా దీర్ఘకాలంలో రాబడులను పెంచుకోవచ్చు.


యూట్యూబర్ అన్వేష్‌పై కేసు

- డీజీపీ, ఐఏఎస్‌లపై తప్పుడు ఆరోపణలు
- రూ.300 కోట్ల బెట్టింగ్ స్కాంలో ఉన్నారని వీడియో
- సుమోటోగా తీసుకున్న సైబర్ క్రైం పోలీసులు

సాక్షి, హైదరాబాద్: రూ.300 కోట్ల బెట్టింగ్ స్కాంలో ఐఏఎస్ అధికారులు, డీజీపీ ఉన్నారంటూ తప్పుడు ఆరోపణలు చేసిన యూట్యూబర్ అన్వేష్‌పై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. అన్వేష్ తన 'నా అన్వేషణ'అనే యూట్యూబ్ చానల్ ద్వారా ఒక వీడియోలో.. చేసిన ఆరోపణలను పోలీసులు గుర్తించారు. తన వీడియోలో, తెలంగాణ డీజీపీ జితేందర్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఐఏఎస్ అధికారులు శాంతికుమారి, దానకిశోర్, వికాస్‌రాజు తదితరులు బెట్టింగ్ యాప్ ద్వారా నిధులను దుర్వినియోగం చేశారని, గణనీయమైన ఆర్థిక దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని అన్వేష్ ఆరోపించాడు. ఈ ఆరోపణలు నిరాధారమైనవిగా భావించిన సైబర్ క్రైమ్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని బెట్టింగ్ యాప్‌లపై అన్వేష్ వీడియోలు చేస్తున్నాడు. బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా రూ.1,000 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయని ఆరోపించాడు. బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించడంతో లబ్ధి పొందారని ఆరోపిస్తూ.. అనేకమంది టాలీవుడ్ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల పేర్లను అన్వేష్ ప్రస్తావించడం తెలిసిందే.

డాల్ఫిన్లు ఏమంటున్నాయి?

డాల్ఫిన్లు వివిధ రకాలైన వింత శబ్దాలను చేస్తాయి. జంతువుల్లా అరుస్తాయి. పక్షుల్లా కూస్తాయి. మనుషుల్లా మూలుగుతాయి. ఈలలు వేస్తాయి. కిచకిచమంటాయి. పకపకమంటాయి. పెద్ద బుడగ పగిలినట్లుగా ధడేల్మంటాయి. అవి ఉన్న పరిస్థితిని బట్టి, తమ ప్రవృత్తిని, ప్రకోపాన్ని అనుసరించి విభిన్నమైన ధ్వనులతో తమలో తాము సంభాషించుకుంటాయి! ఆ సంభాషణలకు, లేదా వాటి ధ్వనులకు అర్థం ఏమైనా ఉంటుంది? అది తెలుసుకోటానికే... 'డాల్ఫిన్‌జెమ్మా' అనే డాల్ఫిన్ ఏఐ మోడల్‌ను (సాఫ్ట్‌వేర్‌ను) భుజాన వేసుకుని 'గూగుల్' సముద్ర పరిశోధనలు చేస్తోంది! డాల్ఫిన్‌లతో మాటలు కలపటానికి వాటి అరుపులను అనుకరిస్తోంది. ఆ అరుపుల అర్థాలను డీకోడ్ చేయవచ్చని భావిస్తోంది. అయితే, ఏఐ సహాయంతో మనిషి ఏనాటికైనా మానవేతర జీవుల మనసును పసిగట్టగలదా? కృత్రిమ మేధ, మానవ అంతర్‌దృష్టిని దాటి లోలోపలికి చూడగలదా అన్నదే పెద్ద ప్రశ్న.



డాల్ఫిన్‌ల శబ్దాలకు అర్థాలు వెతుకుతున్న గూగుల్!

- స్వరాలు, ప్రవర్తనల డేటా సేకరణకు 'డాల్ఫిన్ జెమ్మా'
- డాల్ఫిన్‌లతో మాటామాటా కలిపిన ఏఐ మోడల్
- మిగతా జీవులపైనా జరుగుతున్న ఏఐ అధ్యయనాలు
- పరిశోధనలు ఫలిస్తే మూగజీవాలకు 'మాటలొచ్చినట్లే'!

సాక్షి, స్పెషల్ డెస్క్

డాల్ఫిన్లు కూడా మనుషుల్లాగే సామాజిక నైపుణ్యం కలిగినవి. చెప్పాలంటే తెలివైనవి, చురుకైనవి కూడా. మచ్చికైన మనుషులతో భావోద్వేగాలను కూడా పంచుకుంటాయి! అలాగే ఇతర జంతువులు కూడా. బ్రిటిష్ మహిళా ఎథాలజిస్ట్ (మానవేతర జంతు ప్రవర్తనల అధ్యయన శాస్త్రవేత్త) జేన్ గుడాల్ అడవి చింపాంజీల సామాజిక కుటుంబ పరస్పర పరిశోధనలను చేసిన విధంగానే, ప్రముఖ మహిళా పరిశోధకురాలు డెనిస్ హెర్జింగ్ 1985 నుండే డాల్ఫిన్ కమ్యూనికేషన్ మీద అధ్యయనం చేస్తున్నారు. 'ది వైల్డ్ డాల్ఫిన్ ప్రాజెక్ట్' (డబ్ల్యు.డి.పి.) అనే ప్రతిష్టాత్మకమైన భారీ సముద్ర గర్భ ప్రాజెక్టులో తలమునకలై ఉన్నారు. గూగుల్ ఇప్పుడు ఆ డబ్ల్యు.డి.పి. ప్రాజెక్టుతో, జార్జియా టెక్ యూనివర్సిటీతో కలిసి డాల్ఫిన్‌ల స్వర నమూనాలను విశ్లేషించడానికి, వాటి నిర్మాణాన్ని గుర్తించడానికి తొలిసారి 'డాల్ఫిన్ ఏఐ మోడల్'తో ప్రయోగాలు తలపెట్టింది.

ఏమిటీ 'డాల్ఫిన్ ఏఐ మోడల్'

?

ఇది ఎలా పని చేస్తుందంటే..

డాల్ఫిన్లు భిన్న సామాజిక, పరిసర పరిస్థితులకు భిన్న శబ్దాలను చేస్తాయి. ముఖ్యంగా తల్లులు, పిల్లల మధ్య వ్యక్తిగత గుర్తింపు కోసం ఈలలు వేస్తాయి. ఘర్షణ పడుతున్నప్పుడు 'క్కే క్కే' మంటాయి. ప్రేమలో ఉన్నప్పుడు / సహజీవనం చేస్తున్నప్పుడు చేగోడీలు కొరికితే వచ్చే చప్పుడును చేస్తాయి. ఈ శబ్దాలను విని ఫీడ్ చేసుకునేందుకు, ప్రతిస్పందన శబ్దాలు చేసేందుకు పిక్సెల్ 6 స్మార్ట్‌ఫోన్‌లపై పనిచేసే 'డాల్ఫిన్ జెమ్మా'ను గూగుల్.. బహమాస్ ద్వీపంలో కలియతిప్పుతోంది. డబ్ల్యు.డి.పి. నుంచి వచ్చిన డేటాతో ఆడియో సాంకేతికతను మిళితం చేయటం ద్వారా గూగుల్ డాల్ఫిన్ ఏఐ మోడల్.. జల గర్భంలోని డాల్ఫిన్‌ల శబ్దాలను డీకోడ్ చేస్తుంది. ఏప్రిల్ 14న 'జాతీయ డాల్ఫిన్ దినోత్సవం' నాడు, గూగుల్ తన డాల్ఫిన్ ఏఐ నమూనా పురోగతిని ప్రదర్శించింది. ఫలితం ఏంటంటే – అది ఎంతో చక్కగా డాల్ఫిన్ స్వర నమూనాలను విశ్లేషిస్తోంది. నిజమైన డాల్ఫిన్ లాంటి శబ్దాలను సైతం తనే ఉత్పత్తి చేస్తోంది.

అన్ని జంతువులపైనా ఏఐ పరిశోధనలు

చిలుకలు, కాకులు, తోడేళ్లు, తిమింగలాలు, చింపాంజీలు, ఆక్టోపస్‌లు ఎలా సంభాషిస్తాయో గుర్తించడానికి కూడా ఇప్పుడు ఏఐ ఉపయోగపడుతోంది. 'నేచురల్ ఎల్.ఎం. ఆడియో' అనేది జంతువుల శబ్దాల కోసం నిర్మించిన మొట్టమొదటి ఆడియో–భాషా నమూనా. దీని ద్వారా ఇంతవరకు కనిపించని జాతుల శబ్దాలను సైతం విశ్లేషించవచ్చు. మరికొన్ని ప్రాజెక్టుల ద్వారా స్పెర్మ్ వేల్ వెలువరించే ధ్వనుల అర్థాలను కనిపెట్టటానికి ఏఐని, రోబోటిక్స్‌ను ఉపయోగిస్తున్నారు. అలాగే జంతువుల లైంగిక ప్రవర్తనలను అంచనా వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉపగ్రహ చిత్రాలు, కెమెరా ట్రాప్‌లు, బయో అకౌస్టిక్‌ల అనుసంధానం కలిగి ఉన్న ఏఐను పక్షుల సంరక్షణకు, పర్యవేక్షణకు, అమెజాన్ ప్రాంత రక్షణకు ఉపయోగిస్తున్నారు. కొలంబియాలోని యూనివర్సిడాడ్ డి లాస్ ఆండీస్, ఇన్‌స్టిట్యూటో సించి, ఇన్‌స్టిట్యూటో హంబోల్ట్, ప్లానెట్ ల్యాబ్స్, మైక్రోసాఫ్ట్ ఏఐ ఫర్ గుడ్ ల్యాబ్‌ల సహకారంతో ఈ ప్రాజెక్టు నడుస్తోంది.

ఏఐ ప్రయోగం.. ఏమిటి ప్రయోజనం?

అంతరించిపోతున్న జీవ జాతులను పర్యవేక్షించడం ద్వారా వాటి పరిరక్షణకు ఏఐ మోడల్ సహాయపడుతుంది. ఇక డీకోడింగ్ కమ్యూనికేషన్ అన్నది జీవజాతుల పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని వెల్లడిస్తుంది. కాలుష్యం, వాతావరణ మార్పుల గురించి మానవుల్ని హెచ్చరిస్తుంది. ఏఐ మానవులు – మూగజీవుల మధ్య పరస్పర సాహచర్యాన్ని పెంచుతుంది, సహానుభూతిని పెంపొందిస్తుంది.



కృత్రిమ మేధకూ పరిమితులు

కృత్రిమ మేధ జంతువుల ధ్వని నమూనాలను గుర్తించగలదు, కానీ అనూహ్యంగా జరిగే జంతువుల అకాల సంభోగం, వేళ కాని వేళ అవి ఆహారం తీసుకోవటం లేదా ఏదైనా ప్రమాదంలో అవి చేసే ధ్వనులను గుర్తించటంలో కృత్రిమ మేధకు పరిమితులు ఉంటాయి. జంతువులు మానవుల మాదిరిగానే 'మాట్లాడుకుంటాయి' అనేది పొరపాటు భావన అయినప్పుడు, క్షేత్రస్థాయి వివరాలు చిక్కుముడిగా లభ్యం అవుతున్నప్పుడు కూడా జీవజాతుల–నిర్దిష్ట ప్రవర్తనల విశ్లేషణ ఏఐకి క్లిష్టతరం అవుతుంది. చాలాసార్లు మానవ అంతర్‌దృష్టి జోడింపు అవసరం కావచ్చు. పైగా ఇలాంటి అధ్యయనాలకు తరచుగా కస్టమ్ మోడళ్లు, విస్తృతమైన వనరులు అవసరమవుతాయి. దాంతో జంతువుల కమ్యూనికేషన్ అన్నది డీకోడింగ్‌ను సంక్లిష్టమైన ప్రయత్నంగా మారుస్తుంది.

జననీ.. జన్మధన్యం

- 98,152 కిలోమీటర్లు అమ్మతో కలిసి ఆధ్యాత్మిక యాత్ర
- లక్షకుపైగా ప్రధాన పుణ్యక్షేత్రాల సందర్శన
- తల్లి రుణం తీర్చుకున్న తనయుడు

తిరుపతి సిటీ: చిన్నప్పుడు అమ్మ కొంగుపట్టుకుని తిరుగుతాం. పెద్దయ్యాక ఆమెను ఎక్కడికైనా తీసుకెళ్లాలంటే మనసు రాదు. వృద్ధులైన తల్లిదండ్రులను భారంగా భావిస్తున్న రోజులివీ.. ఈనాటి రోజుల్లోనూ తల్లిని అమితంగా ప్రేమించే తనయులు ఉన్నారంటే అతిశయోక్తికాదు. ఈ కోవకు చెందిన వారే మైసూరుకు చెందిన దక్షిణామూర్తి కృష్ణకుమార్. ఆయనో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. 75 ఏళ్ల తల్లి రత్నమ్మ కోరికను తీర్చేందుకు టీమ్‌లీడర్ స్థాయి ఉద్యోగాన్ని నెలకు రూ.1.60 లక్షల వేతనం వస్తున్నా తృణప్రాయంగా వదిలేశారు. అమ్మతో కలిసి 2018 జనవరి 16న పుణ్యక్షేత్రాల యాత్ర చేపట్టారు. ద్విచక్రవాహనంపైనే సుమారు 98,152 కిలోమీటర్లు అమ్మతో కలిసి ఆధ్యాత్మిక యాత్ర సాగించారు. లక్షకుపైగా పుణ్యక్షేత్రాలు సందర్శించారు. ఆదివారం సాయంత్రం తిరుపతి కోదండరామస్వామి దేవస్థాన సమీపంలోని శృంగేరి మఠానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణకుమార్ తన యాత్ర విశేషాలు పంచుకున్నారు. దేశంతోపాటు భూటాన్, మయన్మార్, నేపాల్ దేశాల్లోని పుణ్యక్షేత్రాలనూ సందర్శించినట్టు చెప్పారు. మరో పదిరోజుల్లో స్వస్థలానికి చేరకుంటామని, ఇక ఆజన్మాంతం బ్రహ్మచారిగానే ఉండి తల్లికి సేవ చేసుకుంటానని వెల్లడించారు. మరో జన్మంటూ ఉంటే కృష్ణకుమార్ తల్లిగానే పుట్టాలని ఉందని రత్నమ్మ తన గుండెల్లో నుంచి పొంగుకొస్తున్న సంతోషాన్ని ఆనందబాష్పాలతో పంచుకోవడం విశేషం.



కృష్ణకుమార్, ఆయన తల్లి చూడ రత్నమ్మ

స్వయంగా వచ్చే వీఐపీలకే ప్రొటోకాల్ దర్శనం



యాదగిరిగుట్ట: వేసవిలో శని, ఆదివారాల్లో ప్రొటోకాల్ ప్రత్యేక దర్శనాలను స్వయంగా వచ్చే వీఐపీలకు మాత్రమే పరిమితం చేయనున్నట్లు యాదగిరిగుట్ట దేవాలయం ఈవో వెంకట్రావ్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సాధారణ భక్తులకు సులభతరంగా, త్వరితగతిన దర్శన సదుపాయం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో యాదగి రి క్షేత్రానికి భక్తులు అధికంగా వస్తున్నందున వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాజన్నసేవలో హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జి జస్టిస్ మధుసూదన్‌రావుకు స్వామి వారి ప్రసాదాలు అందజేస్తున్న ఏఈవో శ్రీనివాస్

వేములవాడ: హైకోర్టు జడ్జి జస్టిస్ మధుసూదన్‌రావు కుటుంబ సభ్యులతో ఆదివారం వేముల వాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం అనంతరం ఆయనకు అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేశారు. సైబర్ క్రైం అడిషనల్ ఎస్పీ చంద్రకాంత్ దంపతులు కూడా స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
సోమవారం। 5-5-2025

భువనగిరి.. సినిమాలకు సిరి

ప్రకృతి రమణీయత, కోనసీమను తలపించే దృశ్యాలకు నెలవు యాదాద్రి భువనగిరి జిల్లా

హైదరాబాద్ శివారులో ఉండటంతో మరింత అనుకూలం

పోచంపల్లి, రాచకొండ ప్రాంతాల్లో స్టార్ హీరోల సినిమా షూటింగ్‌లు


రాచకొండ గుట్టల్లో 'ఆగడు' సినిమా షూటింగ్‌లో హీరో మహేశ్‌బాబు

హైదరాబాద్ శివారులోని యాదాద్రి భువనగిరి జిల్లా.. సినిమాలు, టెలిఫిల్మ్‌లు, యాడ్ ఫిల్మ్‌ల షూటింగ్‌లకు అనుకూలంగా ఉండటం దర్శక నిర్మాతలకు కలిసొస్తోంది. పేరు మోసిన డైరెక్టర్లు, హీరో, హీరోయిన్లతో ఇక్కడ సినిమాలు చేస్తున్నారు. పల్లె వాతావరణం, ప్రకృతి రమణీయత, పచ్చని వరి పొలాలు, చెరువులు, దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, గుట్టలు ఫిలిం సిటీ పక్కనే ఉండటం..సినిమా నిర్మాణానికి అనుకూలంగా ఉంది. జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, భువనగిరి, రాజాపేట ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి. కోనసీమను మించిన అందాలు జిల్లాలో కనువిందు చేయడం, హైదరాబాద్‌కు అతి దగ్గరగా ఉండటం.. కలిసి వస్తోంది. ప్రజల ఆత్మీయత, నిర్మాతలకు ఖర్చు తక్కువగా కావడం, ప్రశాంతమైన వాతావరణం ఇక్కడ ఉన్నాయి.

– సాక్షి, యాదాద్రి


భూదాన్ పోచంపల్లిలో జరిగిన సినిమా షూటింగ్‌లో నటుడు సాయికుమార్ తదితరులు..

15 ఏళ్లుగా షూటింగ్‌లు

భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్, రేవణపల్లి, కొత్తగూడెం గ్రామాల్లో 15 ఏళ్లుగా సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి. వందకు పైగా సినిమా షూటింగ్‌లు జరిగాయి. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటం, పోచంపల్లి శివారులో గ్రామీణ వాతావరణం, చేనేత గృహాలు, రైతుల ఇళ్లు, పాతకాలం నాటి గచ్చు పెంకుటిళ్లు, షూటింగ్‌లకు అనుకూలంగా పచ్చదనం, తాటివనాలు, పర్యాటక వసతి అందుబాటులో ఉండటం ప్రయోజనకరంగా మారింది.

పోచంపల్లిలోనే ఎక్కువ షూటింగ్‌లు

పోచంపల్లిలో 'జైబోలో తెలంగాణ' చిత్రం హీరో హీరోయిన్‌ల మధ్య పాటలను చిత్రీకరించారు. మహేశ్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, జగపతి బాబు, సీనియర్ నరేశ్, రామ్‌చరణ్, సాయికుమార్, నితిన్, గిరిబాబు, జయసుధ, హాస్య నటులు, కొత్త నటీ నటులతో సినిమాలను ఇక్కడే చిత్రీకరిస్తున్నారు. దర్శకులు సుకుమార్, తివిక్రమ్.. ఇంకా ఎందరో దర్శకులు ఇక్కడ సినిమాలు తీశారు. ఇక్కడి కట్టెకోత మెషీన్‌లో పుష్ప–2 సినిమా షూటింగ్ కూడా జరిగింది. 'సీతా కల్యాణ వైభోగమే' చిత్రాన్ని కూడా ఇక్కడే తీశారు. సాయికుమార్ చేనేత కళాకారునిగా మగ్గం నేయడం, గ్రామస్తులతో మాట్లాడడం, బైక్‌పై వెళ్లడం వంటి సన్నివేశాలను చిత్రీకరించారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్‌లో బాలకృష్ణ ఇటీవల తీసిన 'డాకు మహారాజ్' సినిమాలోని రాజస్తాన్ గ్రామం సెట్ వేసి.. పలు సన్నివేశాలను చిత్రీకరించారు. భువనగిరి ఖిలాపై హిందీ, తెలుగు సినిమాల షూటింగ్‌లు జరిగాయి.

రాజాపేట పోలీస్ స్టేషన్‌లో, భువనగిరిలోని డిగ్రీకళాశాలలో 'ఆపరేషన్ దుర్యోధన' చిత్రాన్ని అప్పట్లో చిత్రీకరించారు. ఈ సినిమాలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ముఖ్యమంత్రిగా నటించారు. హీరోగా శ్రీకాంత్ నటించారు. కాగా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి ఎఫ్‌సీఐ గోదాముల్లో రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమా షూటింగ్ నాలుగు రోజులు జరిగింది. భువనగిరి ఖిలాపై సినిమాలు తీశారు. బీబీనగర్ మండలం మహదేవ్‌పూర్‌లో అక్కన్నమాదన్నలు నిర్మించిన వేణుగోపాల స్వామి ఆలయం, జియాపల్లి, నాగినేనిపల్లిలో తాటిచెట్లు, చెరువుతో గ్రామీణ వాతావరణం ఉంటుంది. 'రజాకార్' సినిమాలోని బతుకమ్మ పాట చిత్రీకరణ, కొన్ని ఫైట్ సన్నివేశాలు ఇక్కడే తీశారు. ఇక్కడ విద్యుత్ తీగలు లేకుండా పూర్తిగా గ్రామీణ వాతావరణం ఉంటుంది. మహదేవ్‌పూర్‌లో సినీనటుడు శ్రీకాంత్ నటించిన 'దేవరాయ' షూటింగ్ ఇక్కడే జరిగింది. 'ఎగిరే పావురమా' సినిమాను బీబీనగర్ పాతరోడ్డు వంతెనపై చిత్రీకరించారు.


భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గోదాంలో గేమ్‌ఛేంజర్ సినిమా షూటింగ్ సందర్భంగా హీరో రామ్‌చరణ్

రాచకొండలో పలు షూటింగ్‌లు..

రాచకొండ ఫిలిం సిటీకి అనువైన ప్రాంతం. ఈ ప్రాంతమంతా గుట్టలతో నిండి ఉంది. ప్రకృతి అందాలను మైమరపించే లొకేషన్లతోపాటు, గుట్టలపై నుంచి జాలువారే సెలయేళ్లు ఉన్నాయి. అపురూపమైన కట్టడాలు, చారిత్రక సంపద ఎంతో ఉంది. రాచకొండ గుట్టల్లో ఇప్పటికే పలు సినిమాలు రూపుదిద్దుకున్నాయి. చిరంజీవి నటించిన 'సైరా నర్సింహారెడ్డి' సినిమా షూటింగ్ 2019లో దండుమల్కాపూర్‌లో జరిగింది. శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో జరిగే పూజలు, పాట, ఫైటింగ్ సన్నివేశాలను ఇక్కడ నెల రోజుల పాటు తీశారు. మల్కాపురం ఘాట్ కంచె భూముల్లో 'రెబల్' చిత్రం క్లైమాక్స్ సన్నివేశంతో పాటు, పవన్‌కల్యాణ్ నటించిన 'గబ్బర్‌సింగ్' సినిమా చివరి సన్నివేశాన్ని కూడా ఇక్కడే చిత్రీకరించారు. మహేశ్‌బాబు హీరోగా నిర్మించిన 'ఆగడు' చిత్రం క్లైమాక్స్ ఫైట్‌ను కూడా ఇక్కడే తీశారు. రాచకొండలో శ్రీకాంత్ హీరోగా నటించిన 'విరోధి', 'సీతారాముల కల్యాణం'లో క్లైమాక్స్ ఫైట్లను చిత్రీకరించారు. 'జానకిరామ' హిందీ సీరియల్ నిర్మాణంతో పాటు అనేక షార్ట్ ఫిలింలను చిత్రీకరించారు.


చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్‌లో సినిమా షూటింగ్‌లో సినీనటుడు సుమన్


చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్‌లో సినిమా షూటింగ్‌లో హీరో ప్రభాస్

హైదరాబాద్ శివారు కావడంతో..

సినిమా పరిశ్రమ కేంద్రీకృతమైన హైదరాబాద్‌కు యాదాద్రి భువనగిరి జిల్లా శివారులోనే ఉంది. దేశంలోని పలువురు సినీరంగ ప్రముఖులు హైదరాబాద్ చేరుకునే అంతర్జాతీయ విమానాశ్రయం అతి చేరువలో ఉంది. స్థానికులు సినిమా వారిని ప్రేమతో ఆదరిస్తారు. ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లాగే.. సినిమాకు అనువైన ప్రాంతాలు జిల్లాలోనూ ఉన్నాయి. ఎత్తయిన గుట్టలు, కొండలు, పచ్చని పొలాలు, జలపాతాలు.. సినిమా షూటింగ్‌లకు కలిసి వస్తున్నాయి. సినిమా నిర్మాతలకు తక్కువ వ్యయం అవుతోంది. దీనికితోడు ఇక్కడ ఉదయం సినిమా షూటింగ్‌లు చేసి.. సాయంత్రం హైదరాబాద్‌లోని తాము బస చేసిన హోటళ్లకు, ఇళ్లకు చేరుకోవచ్చు. విశాలమైన రోడ్డు సౌకర్యంతో పాటు, అందమైన లొకేషన్లు ఉండడం డైరెక్టర్లను ఆకర్షిస్తోంది.


పోచంపల్లిలో పుష్ప–2 సినిమాలోని కట్టె మెషీన్ సీన్


రాచకొండ గుట్టల్లో 'సైరా నరసింహారెడ్డి' సినిమా సెట్టింగ్‌లు



బీఆర్‌ఎస్ కార్యాలయంలో భగీరథ జయంతి

బీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆదివారం భగీరథ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు జి.దేవీప్రసాద్, చిరుమళ్ల రాకేశ్ కుమార్, కె.కిశోర్‌గౌడ్, తుంగబాలు, జూలూరు గౌరీశంకర్, సుమిత్రా ఆనంద్, సుశీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంథని బొక్కలవాగులో కనువిందు చేస్తున్న పచ్చదనం

నిండుకుండ.. ఎదనిండా..

పెద్దపల్లి జిల్లా మంథని మండలం కమాన్‌పూర్ – మంథని మార్గంలోని బొక్కలవాగు నిండు వేసవిలో నీటితో కళకళలాడుతోంది. దానిపై పరుచుకున్న పచ్చదనం కనువిందు చేస్తోంది. వాగుకు ఇరువైపులా నిర్మించిన కరకట్టల మధ్య పచ్చని గుర్రపుడెక్కతీగలు.. సమీపంలోని చెక్ డ్యాంకు పారుతున్న జలాలు ఆహ్లాదం కలిగిస్తున్నాయి.

కమాన్‌పూర్(మంథని)

కిటకిటలాడిన యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట: వేసవి సెలవులతో పాటు ఆది వారం కావడంతో జంట నగరాలు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి తరలి వచ్చారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి నాలుగు గంటల సమయం.. వీఐపీ దర్శనానికి గంటన్నర సమ యం పట్టింది. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.50,52,970 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.భక్తులు అధికంగా కార్లలో రావడంతో కొండపైన, కింద వాహనాల రద్దీ కొనసాగింది. ఇక రింగ్ రోడ్డు సమీపంలో, వైకుంఠద్వారం వద్ద బైక్‌లను అధికంగా పార్కింగ్ చేశారు. కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.5,70,500 ఆదాయం ఆలయానికి వచ్చింది.


ఆలయ ముఖ మండపంలో భక్తులు


ఆలయ ఉత్తర మాడ వీధిలో భక్తుల సందడి


కొండపైన కిక్కిరిసిన వాహనాలు

విశాఖపట్నంలో..



కడపలో..



తిరుపతిలో..



వైద్య రంగంలో కీలక, కఠిన పరీక్ష అయిన 'నీట్'ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఆరు గంటల నుంచే పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు తరలివచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద చిత్రాలివి... - సాక్షి, నెట్‌వర్క్

ఊరి బావిలో.. నమ్మకాల ఊట



ఓ బావి నీటితో కోర్కెలు తీరుతాయని విశ్వాసం

మరో బావి నీటితో కవలలు!

కొన్ని బావుల్లో నిత్యం జలకళలు

ఒకప్పుడు మంచి నీరు కావాలంటే బావికి వెళ్లాల్సిందే. తెల్లారితే చాలు గ్రామాలు, చిన్నపాటి పట్టణాల్లో కావిడి భుజాన వేసుకుని, చేతిలో చేద పట్టుకుని వీధుల నిండా జనం కనిపించేవారు. ఊరంతటికీ మంచినీటి బావి ఒకటుండేది. అక్కడకు వెళ్లే అందరూ మంచినీరు తెచ్చుకునే వారు. బావి లేని ఊరుండేది కాదు. రానురానూ బోర్లు, మంచినీటి పథకాలు అందుబాటులోకి వచ్చాక చాలా వరకూ బావులు కనుమరుగైపోయాయి. మంచినీటి మాట అటుంచితే కనీసం వాడుకలో కూడా లేకుండా పోయాయి. బావులు అంటే ఏమిటో భావితరాలకు తెలియని రీతిలో కనుమరుగయ్యాయి. కానీ చరిత్రలో తాము ఉన్నామంటూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కొన్ని బావులు మాత్రం ఇప్పటికీ ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. ఒక్కో బావి చుట్టూ ఓ క్కో విశ్వాసం పెనవేసుకుపోయింది. దీంతో ఆ బావుల్లో నమ్మకాల ఊట ఇప్పటికీ ఊరుతూనే ఉంది. అలాంటి బావులివిగో..

-పిఠాపురం

గొల్లగుంట నుయ్యి



కొత్తపల్లిలో గొల్లగుంట బావి

కాకినాడ జిల్లాలో మండల కేంద్రమైన ఉప్పాడ కొత్తపల్లిలో ఈ బావి పూర్వం నుంచీ పేరెన్నికగన్నది. గతంలో కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప గ్రామాలకు ఇదే మంచినీటి బావి. ఈ మూడు గ్రామాల ప్రజలు ఈ బావి నుంచే మంచినీరు తెచ్చుకునే వారు. వందల ఏళ్ల నాటి ఈ బావి నుంచే పిఠాపురం మహారాజా వారి సంస్థానానికి గుర్రపు బగ్గీలపై మంచినీరు తీసుకెళ్లేవారని పెద్దలు చెబుతారు. సముద్ర తీరం దగ్గరలో ఉన్న ఈ గ్రామాల్లో ఎక్కడ తవ్వినా ఉప్పు నీరే పడగా ఈ బావిలో మాత్రమే మంచినీరు.. అదీ కొబ్బరి నీళ్లలా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలందరూ దీనినే మంచినీటికి ఉపయోగించే వారు. ఎంతమంది ఎన్ని నీళ్లు తోడుకున్నా ఈ బావి ఎప్పుడూ ఎండిపోకపోవడం విశేషంగా చెబుతారు. ఎన్ని రకాల మంచినీటి పథకాలు వచ్చినా ఇప్పటికీ కొందరు ఈ బావి నీటినే తాగుతూంటారు.

కవలల బావి



దొడ్డిగుంటలో కవలల బావి (అంతరచిత్రం) దొడ్డిగుంటలో కవలలు

తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం పాత దొడ్డిగుంట గ్రామంలోని బావి కవల పిల్లల బావిగా పేరొందింది. ఈ బావి నీరు తాగితే కవల పిల్లలు పుడతారనే నమ్మకం పలువురిలో బలంగా ఉంది. ఈ గ్రామంలో ఏకంగా 110 మందికి పైగా కవల పిల్లలు పుట్టడమే దీనికి నిదర్శనమని చెబుతారు. ఈ గ్రామంలో ఆరు నెలల చిన్నారుల నుంచి 60 ఏళ్ల ముసలివాళ్ల వరకూ కవలలున్నారు. గతంలో మూర్తి అనే ఒక ఉపాధ్యాయుడు గ్రామంలో జనాభా లెక్కల కోసం రాగా ఎక్కువగా కవల పిల్లలుండటం చూసి ఆశ్చర్యపోయారు. కొన్నాళ్లకు ఆయన అదే గ్రామానికి ఉపాధ్యాయుడిగా వచ్చి, అక్కడే నివాసం ఉన్నారు. కొద్ది రోజులకు ఆయనకు కూడా కవల పిల్లలు పుట్టారు. దీంతో, ఆ గ్రామంలోని బావి నీరు తాగడంతో కవల పిల్లలు పుడుతున్నారని అందరికీ చెప్పడంతో అప్పటి నుంచీ ఇది కవల పిల్లల బావిగా పేరొందింది. సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక ప్రపంచమంతా ఈ బావి పేరు మార్మోగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి సైతం జనం వచ్చి ఈ బావి నీటిని తీసుకెళ్తున్నారంటే ఎంతగా పేరొందిందో అర్థం చేసుకోవచ్చు. ఇలా కవలలు ఎక్కువగా ఉండడం వల్లే తమ ఊరికి గుర్తింపు వచ్చిందని గ్రామస్తులు చెబుతున్నారు.

బొటన బావి



తిరుపతి ఆలయంలోని బొటన బావి



బొటన బావిలో నీరు తాగుతున్న భక్తులు

కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చదలవాడ తిరుపతి క్షేత్రంలోని శ్రీ శృంగార వల్లభ స్వామి వారి ఆలయంలో ఉంది. సుమారు 9 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయ నిర్మాణమంతా ఈ బావి నీటితోనే చేసినట్లు శాసనాలు చెబుతున్నాయి. ఆలయానికి ఆగ్నేయ మూలలో చతురస్రాకారంలో ఈ బావి ఉంది. చుట్టూ రాళ్లు పేర్చి చేసిన ఈ నేలబావి నిర్మాణం వింత గొలుపుతుంది. ఈ బావి నీటితోనే ఆలయంలోని మూలవిరాట్టుకు అభిషేకాలు నిర్వహిస్తూంటారు. ఈ బావిలోని నీటితో స్నానం చేసి, స్వామిని దర్శించుకుని, మొక్కుకుంటే కోరికలు తీరుతాయని భక్తులు నమ్ముతారు. పెళ్లి, ఉద్యోగం, వ్యాపారం, సంతానం వంటి కోరికలు తీరుతాయని పలువు రు విశ్వసిస్తారు. కార్తిక మాసంలో ఈ బావి నీటితో స్నానం చేస్తే సంతాన భాగ్యం కలుగుతుందన్నది భక్తుల నమ్మకం. కార్తిక పౌర్ణమి నాడయితే మరింత ప్రాశస్త్యమని చెబుతారు. అది కూడా అర్చకులతో నీరు తోడించుకుని స్నానం చేస్తూంటారు. చైత్రం, శ్రావణం, ధనుర్మాసాల్లో భక్తులే స్వయంగా స్నానం చేస్తారు. ఈ ఆలయానికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఈ బావి నీటిని సీసాల్లో నింపి, తీర్థంలా తమతో తీసుకుని వెళ్లి, మామూలు నీటితో కలిపి స్నానం చేస్తారు. ఎంత వర్షాభావ పరిస్థితులున్నా ఎప్పుడూ ఈ బావి ఎండిన ఆనవాళ్లు లేవని స్థానికులు చెబుతారు. ఎంత నీరు తోడినా ఈ బావి ఎప్పుడూ నిండు కుండలా కళకళలాడుతూంటుంది.

నిండు కుండలా..



సామర్లకోటలోని బావి

సామర్లకోటలోని మాండవ్య నారాయణస్వామి వారి ఆలయంలో ఉన్న పురాతన బావి ఎప్పుడూ నిండుకుండలా ఉంటుంది. మామూలు బావుల్లో వేసవిలో నీరు అడుగంటుతూంటుంది. కనీసం నీరు తగ్గుతుంది. కానీ ఈ బావిలో నీరు ఎప్పుడూ ఒకే స్థాయిలో ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు.

బావి నీరు వల్లే కవలలు



మా గ్రామంలోని బావి నీరు తాగడం వల్లే కవలలు పుడుతున్నారన్నది మా నమ్మకం. ఎక్కువ మంది కవలలు ఒకే గ్రామంలో పుట్టడం అరుదుగా ఉంటుంది. అలా మా గ్రామంలో వంద మందికి పైగా కవలలు పుట్టారంటే దీనికి కారణం మా గ్రామంలోని బావి నీరేనని అందరూ నమ్ముతున్నారు. మాకు కవలలే పుట్టారు. గతంలో చాలా మంది నమ్మేవారు కాదు. కానీ, ఈ బావి నీరు తీసుకెళ్లిన దూర ప్రాంతాల వాళ్లకు కూడా కవలలు జన్మించినట్లు చెబుతూండటంతో అందరూ ఈ విషయం నమ్మి తీరుతున్నారు.

– అడబాల రామదాసు, కవల పిల్లల తండ్రి, దొడ్డిగుంట, రంగంపేట మండలం

కోరికలు తీర్చే బావిగా నానుడి



మా ఊరి గుడిలోని బొటన బావి నీటితో స్నానం చేసి, స్వామిని దర్శించుకుని, మొక్కుకుంటే కోరికలు తీరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. అలా కోరికలు తీరిన వారు మా గ్రామంలో చాలా మంది ఉన్నారు. అందుకే ఇక్కడకు దర్శనానికి వచ్చేవారు తప్పకుండా ఈ బావి నీటితో స్నానం చేయడం లేదా తాగడం చేస్తారు. తమతో పాటు నీటిని తీసుకెళతారు. ఈ బావి నీటిని స్వామి వారి తీర్థంగా భావిస్తారు. అంత పవిత్రంగా చూస్తారు. కోరిన కోర్కెలు తీరాక వచ్చి, స్వామి వారికి తులాభారాలు ఇస్తూంటారు.

– కూనపురెడ్డి కోదండ రామయ్య, తిరుపతి, పెద్దాపురం మండలం

అపోహే..

ఇదిలా జరుగుతుందని మానసికంగా అపోహపడటం తప్ప బావి నీరు తాగడం వల్ల కవల పిల్లలు పుట్టడం, సంతానం కలగడం వంటివి ఉండవు. సంతాన ఉత్పత్తి జన్యుపరంగా జరుగుతుంది. మానసికంగా ఒక నమ్మకం కలిగించుకుంటారు తప్ప వాటి వల్ల ఎలాంటి సంతానం కలిగే అవకాశం శాస్త్రీయంగా లేదు.

– డాక్టర్ కాటన్, మానసిక వైద్యుడు, జీజీహెచ్, కాకినాడ

బావి నీటి వల్ల కాదు

కవలలు పుట్టడం, సంతానం కలగడం వంటివి భార్యాభర్తల మధ్య జన్యుపరంగా జరిగేవే. బావి నీటి వల్ల కాదు. అలాగైతే పూర్వం అన్ని గ్రామాల్లో బావులుండేవి. అందరికీ కవలలు పుట్టాలి కదా! ఇదంతా ఒక నమ్మకం మాత్రమే. ఎక్కువగా ఆడపిల్ల ఇంట్లో కవలలు పుట్టిన వారు ఉంటే ఆ కుటుంబంలో మిగిలిన వారికి కవలలు పుట్టే అవకాశం ఉంటుంది. దొడ్డిగుంటలో ఇదే జరిగి ఉండవచ్చు. కేవలం రెండు అండాలు విడుదలవ్వడం వల్ల మాత్రమే కవలలు జన్మిస్తూంటారు. అంతే తప్ప బావి నీరు తాగడం వల్ల మాత్రం కాదు.

– డాక్టర్ అనిత, గైనకాలజిస్టు, పిఠాపురం

ఐసెట్ హాల్ టికెట్లు విడుదల

తిరుపతి సిటీ : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాల కోసం ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐసెట్–2025 హాల్ టికెట్లను ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబర్, హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని అధికారులు వెల్లడించారు. ఈనెల 7వ తేదీన ఐసెట్–2025 పరీక్ష నిర్వహించనున్నారు.

ఉండి 'విధ్వంసం'పై దృష్టి సారించండి

సీఎంకు సీపీఎం లేఖ

సాక్షి, అమరావతి: డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆదేశాలతో పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను, చిన్న దుకాణాలను బుల్డోజర్లతో తొలగిస్తున్నారని, ఈ విధ్వంసాన్ని తక్షణం ఆపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను ఆదివారం ఆయన మీడియాకు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉండి ఎమ్మెల్యే పేదల ఇళ్లపై బుల్డోజర్ సంస్కృతికి తెరలేపారని విమర్శించారు. రఘురామకృష్ణరాజు ప్రోద్బలంతో ఆకివీడు మండలంలో 355, పాలకోడేరు మండలంలో 165, కాళ్ల మండలంలో 100పైగా మొత్తం 700 పైగా పేదల ఇళ్లను, ఉండిలో చిన్న దుకాణాలు అక్రమంగా కూల్చేశారన్నారు. మరికొందరికి నోటీసులు జారీ చేశారని తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కొందరు భూస్వాముల ప్రయోజనాల కోసం నిరు పేదల ఇళ్ళను అన్యాయంగా కూల్చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు స్టే ఉన్నా, పట్టించుకోవడం లేదన్నారు. భూములు ఆక్రమించుకున్న భూస్వాముల జోలికి మాత్రం వెళ్లడంలేదన్నారు. పేదల సమస్యలపై తక్షణం దృష్టి సారించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రాకేష్ తికాయత్‌పై దాడి హేయం

సాక్షి, అమరావతి : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముజఫర్ నగర్‌లో జాతీయ రైతు నాయకుడు రాకేష్ తికాయత్‌పై దాడి హేయమైన చర్య అని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, ప్రసాద్ అన్నారు. తికాయత్‌పై దాడిని ఖండిస్తూ ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా నిర్వహించిన రైతాంగ ఉద్యమంలో తికాయత్ ప్రధాన పాత్ర పోషించారన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

సాక్షి, అమరావతి :రాష్ట్రంలో ఆదివారం కురిసిన అకాల వర్షం, గాలులతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన క్రమంలో పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్టు విద్యుత్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్.. ఏపీ పవర్ యుటిలిటీస్ అధికారులతో వర్చువల్ సమీక్ష నిర్వహించారు. స్తంభాలు కూలిపోవడంతో సీపీడీసీఎల్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సీఎండీ భాస్కర్ తెలిపారు. వెంటనే పునరుద్ధరణ చర్యలకు ఉపక్రమించామని చెప్పారు.

అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తగ్గించాలి

సాక్షి, అమరావతి : అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్ల నుంచి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల వరకు యాప్‌లతో పనిభారం విపరీతంగా పెరిగిపోయిందని, ప్రభుత్వం యాప్‌ల భారాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీకాంత్‌రాజు అన్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13 ఉమ్మడి జిల్లాల్లోని సూపరింటెండెంట్ పోస్టులు భర్తీ చేయాలని, పదోన్నతులు కల్పించాలని, ఐసీడీఎస్‌లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రకాష్‌కుమారి తదితరులు మాట్లాడారు.



శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధ రాత్రి వరకు 84113 మంది స్వామివారిని దర్శించుకోగా 33,868 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.12 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నృత్యం..సమ్మోహనం



చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన వారాంతపు కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. చెన్నైకు గౌతమి మహేష్ శివార్పణం స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. పుష్పాంజలి, గణేష కవుతువం, అలరిప్పు, జాతీశ్వరం చక్రవాకం, శబ్దం, నాటవకురుంజి వర్ణం, మూషిక వాహన, కోలాటం..తదితర పాటలకు కళాకారులు సాయి కీర్తన రాజన్, పూజ, యజ్ఞనశ్రీ, రజిత, నిహారిక, దివ్యదర్శిని, ధృతి, అభిరామి, పూజా రాణి, శ్రీయ, నిత్య శ్రీనివాసిని, యోవిహి, సంగీత తదితరులు హావభావాలతో సమ్మోహితుల్ని చేశారు. అనంతరం ఏటీ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

కిక్కిరిసిన కాణిపాకం



కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. అన్ని క్యూలు కిక్కిరిశాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

బోయకొండకు పోటెత్తిన భక్తులు



చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల పోటెత్తారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటలవరకు భక్తుల రద్దీ కొనసాగింది. వృద్ధులు, చిన్న బిడ్డల తల్లులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉచిత ప్రసాదాలు సరిపడా లేకపోవడంతో భక్తులు నిరాశతో వెనుతిరిగారు. కౌంటర్ల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోయకొండలో వివిధ టికెట్ల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.12,47,400 ఆదాయం వచ్చినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. అలాగే నిత్యాన్నదానానికి రూ.10వేలు, గోశాలకు రూ.10,116 విరాళం వచ్చినట్లు వివరించారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం కామవరం అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 8 గంటల సమయంలో భారీ వర్షం కురవడంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు. కమిటీ వారు ఏర్పాటు చేసిన షెడ్లలో వంటలు చేసుకుని అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. భారీగా వర్షం కురిసినప్పటికీ ఎక్కడా కొండ కాల్వలు పొంగలేదు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి : ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాట్నాల కుంట కొలువైన శ్రీరాట్నాలమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వారం పూజా టిక్కెట్లు, విరాళాలు, లడ్డు ప్రసాదం తదితరాల ద్వారా మొత్తం రూ.82,192 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ చెప్పారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

సాక్షి ప్లస్
సోమవారం ॥ 5-5-2025

ఇది తొమ్మిది రోజుల యాత్ర... దక్షిణాదిలో దివ్యమైన యాత్ర.
మూడు కడలి తీరాలను చూద్దాం... తొమ్మిది ప్రదేశాలను వీక్షిద్దాం.
అరుణాచలం... శ్రీరంగం... మధురై... కన్యాకుమారి... రామేశ్వరం..
కోవళమ్... త్రివేండ్రమ్... తంజావూరులతో తీర్థయాత్ర పరిపూర్ణం.

ట్రావెల్

దివ్య దక్షిణ యాత్ర విత్ జ్యోతిర్లింగ (ఎస్‌సీజెడ్‌బీజీ42). ఇది 9 రోజులు ప్యాకేజ్. సికింద్రాబాద్‌లో మొదలై సికింద్రాబాద్‌కి చేరడంతో పూర్తయ్యే ఈ ప్యాకేజ్‌లో తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రమ్, తంజావూరు కవర్ అవుతాయి. భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్‌లో మే నెల 22వ తేదీన టూర్ మొదలవుతుంది.



ముక్కడలి తీరం
దివ్య పర్యాటకం


1 రోజు తిరు యాత్ర షురూ!

మధ్యాహ్నం పన్నెండు గంటలకు సికింద్రాబాద్‌లో మొదలైన ప్రయాణం రెండవ రోజు ఉదయం ఏడున్నరకు తిరువణ్ణామలైకి చేరుతుంది. ఈ మధ్యలో భోన్‌గిర్, జన్‌గాన్, ఖాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా ప్రయాణం సాగుతుంది. ఈ ప్యాకేజ్‌లో బుక్ చేసుకున్న వాళ్లు సికింద్రాబాద్‌లోనే రైలెక్కాల్సిన తప్పనిసరి ఏమీ ఉండదు. ఈ రైలు ఆగే ఈ జాబితాలో ఎవరికి వారు తమకు సౌకర్యంగా ఉన్న స్టేషన్‌లో జాయిన్ కావచ్చు. అలాగే పర్యటన పూర్తయిన తర్వాత తిరుగు ప్రయాణంలోనూ తమకు అనువైన చోట దిగవచ్చు. అయితే మధ్యలో ఎక్కినా, దిగినా టికెట్ ధరలో కన్సెషన్ ఉండదు. సికింద్రాబాద్ నుంచి సికింద్రాబాద్‌కి బుక్ చేసుకోవాల్సిందే.

2 రోజు తొమ్మిది గోపురాల తిరువణ్ణామలై

తిరువణ్ణామలై స్టేషన్‌లో దిగిన తర్వాత హోటల్ రూమ్‌లో చెక్ ఇన్ కావడం. రిఫ్రెష్‌మెంట్ తర్వాత అరుణాచలం ఆలయ దర్శనం. ఇతర దర్శనాలు పూర్తయిన భోజనం చేసుకుని స్టేషన్‌కి వచ్చి రైలెక్కాలి. రైలు రాత్రి పదింటికి బయలుదేరుతుంది.

తిరువణ్ణామలై ఆలయంలోని దేవుడు అరుణాచలేశ్వరుడు కావడంతో దీనిని అరుణాచలం అని కూడా పిలుస్తారు. ఈ ఆలయాన్ని పాతిక ఎకరాల్లో నిర్మించారు. బయటి ప్రహరీ గోడకు నాలుగు ప్రాకారాలు, లోపల మరో ప్రహరీ కి నాలుగు ప్రాకారాలతోపాటు గర్భాలయ గోపురం మొత్తం తొమ్మిది గోపురాల ఆలయం ఇది. గణపతి మందిరం దగ్గర నేల మీద వలయాకారంలో పెయింట్ చేసి ఉంటుంది. ఆ వలయంలో నిలబడి చూస్తే తొమ్మిది గోపురాలనూ చూడవచ్చు. ఇక్కడ మరో విశిష్టత ఏమిటంటే గిరి ప్రదక్షిణ చేసే అరుణాచలం కొండ చుట్టూ ఇంద్ర, అగ్ని, యమ, నిరుతి, వరుణ, వాయు, కుబేర, ఈశాన్య లింగాల అష్ట లింగాల ఆలయాలుంటాయి. ఇక్కడ రమణమహర్షి ఆశ్రమాన్ని కూడా తప్పకుండా చూడాలి. అరుణాచలం కొండ చుట్టూ 14 కిలోమీటర్ల దూరం గిరి ప్రదక్షణ చేయాలనుకునే వారు చేయవచ్చు. కాలి నడకన చేయలేని వారి కోసం ఆటోలు ఉంటాయి. గిరి ప్రదక్షణలో భాగంగా అష్ట లింగాల ఆలయాల దగ్గర ఆపుతారు. వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి ప్రయాణాన్ని కొనసాగించాలి.



తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర దేవాలయం


3 రోజు రాముడు కొలిచిన శివుడు (రామేశ్వరం)

ఉదయం ఆరున్నరకు రైలు కుదాల్‌నగర్ చేరుతుంది. రైలు దిగి రోడ్డు మార్గాన రామేశ్వరానికి చేరి అక్కడ హోటల్‌లో చెక్ ఇన్. రిఫ్రెష్‌మెంట్ తర్వాత స్థానికంగా ఉన్న ఆలయాలు, ఇతర పర్యాటక ప్రదేశాలను చూసుకోవాలి. రాత్రి బస రామేశ్వరంలోనే.

రామేశ్వరం మనదేశ భూభాగానికి దూరంగా బంగాళాఖాతం- హిందూమహాసముద్రం మధ్యలో ఉన్న దీవి. రామాయణం ప్రకారం రాముడు... రావణాసురుడిని సంహరించిన తర్వాత బ్రహ్మహత్యాపాతకాన్ని పోగొట్టుకోవడానికి శివలింగాన్ని స్థాపించి పూజించాలనుకున్నాడు. హిమాలయాల నుంచి శివలింగాన్ని తీసుకురావలసిందిగా హనుమంతుడిని ఆదేశిస్తాడు. హనుమంతుడు శివలింగాన్ని తీసుకురావడం ఆలస్యం కావడంతో విశేషఘడియలు ముగిసేలోపు రాముడు సముద్రపు ఇసుకతో లింగాన్ని చేసి ప్రతిష్ఠించాడు. రాముడు ప్రతిష్ఠించాడు కాబట్టి ఈ శివుడికి రామేశ్వరుడనే పేరు వచ్చింది. పన్నెండు జ్యోతిర్లింగాల్లో రామేశ్వరం ఒకటి. రామేశ్వరం అనే పేరుకు ముందు ఆ దీవి పేరు పంబన్. రామేశ్వరానికి – భారత్ ప్రధాన భూభాగానికి మధ్య నిర్మించిన వంతెనకు పంబన్ బ్రిడ్జి అని పేరు పెట్టారు. పంబన్ బ్రిడ్జి మీద రామేశ్వరానికి చేరతాం. ఇక్కడి నుంచి శ్రీలంక కేవలం 18 నాటికల్ మైళ్ల దూరంలోనే ఉంది.




రామేశ్వరం దేవాలయం


రామేశ్వరం పంబన్ బ్రిడ్జి

4 రోజు కనువిందైన మధురై

మధ్యాహ్నం తర్వాత రామేశ్వరం నుంచి మధురైకి బస్‌లో వెళ్లాలి. సాయంత్రానికి మధురై చేరడం, మీనాక్షి దర్శనం, షాపింగ్ చేసుకుని బస్‌లో కుదాల్ నగర్ స్టేషన్‌కి చేరాలి. రాత్రి పదకొండున్నరకు రైలు కదులుతుంది. కన్యాకుమారి వైపు సాగిపోవాలి.

మధుర మీనాక్షి ఆలయాన్ని చూసిన తర్వాత ఎవరికైనా కలిగే ఫీలింగ్ ఒక్కటే. ఈ ఆలయాన్ని చూడకపోయి ఉంటే జీవితంలో గొప్ప సంతోషాన్ని మిస్ అయ్యేవాళ్లం... అనే గొప్ప అనుభూతి అది. మీనాక్షీ సుందరేశ్వర ఆలయం వైష్ణవం- శైవాల మధ్య మైత్రిబంధానికి ప్రతీక. వధువు మీనాక్షి అమ్మవారి చేతిని శివుడి చేతిలో పెడుతున్నది స్వయానా విష్ణుమూర్తి. మధురై ఆలయంలోకి కెమెరాలు, సెల్‌ఫోన్‌లను అనుమతించరు. కంటి నిండా చూసి మదినిండా గుర్తుంచుకోవాల్సిందే. మీనాక్షి- సుందరేశ్వరుల వివాహాన్ని విష్ణుమూర్తి తన చేతుల మీదుగా జరిపిస్తున్న శిల్పాన్ని చూడడం మరిచిపోవద్దు. వైష్ణవం- శైవ మతాల మధ్య సోదరబంధాన్ని తెలియచేసే శిల్పం అది. సున్నితమైన ఆభరణాలను సునిశితంగా చెక్కిన శిల్పి నైపుణ్యానికి సలామ్ అనాల్సిందే.



మధుర మీనాక్షి దేవాలయం

5 రోజు మూడు సముద్రాల కలయిక

ఉదయం ఎనిమిది గంటలకు రైలు కన్యాకుమారికి చేరుతుంది. రూమ్‌కి వెళ్లి రిఫ్రెష్ అయిన తర్వాత బయలుదేరి వివేకానంద రాక్ మెమోరియల్, గాంధీ మండపం, సన్‌సెట్ పాయింట్ చూసుకుని రాత్రికి గదికి చేరాలి. రాత్రి బస కన్యాకుమారిలో.

మూడు నదులు కలిస్తే త్రివేణి సంగమం అంటాం. మూడు సముద్రాలు కలుస్తున్న ప్రదేశాన్ని ఏమనాలి? మూడు కడలుల సంగమం అంటే ముక్కడలి తీరం అందామా! చిరు అలలతో సొగసుగా కదిలే అరబిక్ కడలి అందాన్ని మాత్రమే కాదు, ఉవ్వెత్తున ఎగిసిపడే బంగాళాఖాతం దుడుకుతనాన్ని చూస్తూ, ధీరగంభీరంగా ఉండే హిందూ మహాసముద్రం నీటితో పాదాలను అభిషేకించుకుందాం. కన్యాకుమారి అంటే ప్రకృతి ప్రేమికులకు గుర్తొచ్చేది మూడు సముద్రాల మీద సూర్యోదయం, సూర్యాస్తమయం. వీటితోపాటు తమిళ కవి వళ్లువార్ విగ్రహం, వివేకానంద రాక్ మెమోరియల్‌ని కూడా చూడాలి. అలాగే 2004, డిసెంబర్ 26వ తేదీ చేదు జ్ఞాపకానికి స్మారక స్థూపం సునామీ మెమోరియల్‌ని చూడడం మర్చిపోకూడదు.


తిరువళ్లువార్ విగ్రహం
వివేకానంద రాక్ మెమోరియల్


తిరువనంతపురం అనంతపద్మనాభస్వామి దేవాలయం

6 రోజు సంపన్న దేవుడు పద్మనాభుడు

ఉదయం హోటల్ గది చెక్ అవుట్ చేసి కన్యాకుమారి రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైలెక్కాలి. రైలు తొమ్మిది గంటలకు కొచ్చువెలి వైపు వెళ్తుంది. పన్నెండున్నరకు చేరుతుంది. రైలు దిగి రోడ్డు మార్గాన త్రివేండ్రమ్‌కు వెళ్లాలి. పద్మనాభ స్వామి దర్శనం, కోవళం బీచ్ విహారం తర్వాత తిరిగి రైల్వే స్టేషన్‌కు చేరి అదే రైలెక్కాలి. రాత్రి తొమ్మిదిన్నరకు రైలు తిరుచ్చికి బయలుదేరుతుంది. రాత్రి భోజనం రైల్లోనే.


తిరువనంతపురం దేవుడు అనంత పద్మనాభుడు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన దేవుడు. ట్రావెన్‌కోర్ రాజవంశం నిర్వహణలో ఉన్న పద్మనాభ స్వామి ఆలయం బంగారుమయం. 108 దివ్యదేశాల్లో ఇదొకటి. ఇది కేరళ- తమిళ వాస్తుశైలి సమ్మేళనం. ఈ ఆలయంలోకి ప్రవేశించాలంటే డ్రెస్‌కోడ్‌ను అనుసరించాలి. భారత సంప్రదాయ వస్త్రధారణలో ఉండాలి.



ట్రావెన్‌కోర్ ప్యాలెస్

7 రోజు యునెస్కో రంగనాథుడు... బృహదీశ్వరుడు

తెల్లవారుజామున ఐదింటికి తిరుచ్చిలో రైలు దిగి హోటల్ గదిలో చెక్ ఇన్. రిఫ్రెష్‌మెంట్ తర్వాత శ్రీరంగం ఆలయ దర్శనం. మధ్యాహ్న భోజనం తర్వాత తంజావూరు (60 కిమీలు). బృహదీశ్వరాలయ దర్శనంతో పర్యటన పూర్తవుతుంది. ఏడవ తేదీ రాత్రి పదకొండు గంటలకు తిరుగుప్రయాణం మొదలవుతుంది.

శ్రీరంగం అంటే చాలా మంది కావేరీ తీరాన ఉన్న పట్టణం అనే అభిప్రాయంలో ఉంటారు. కానీ ఇది కావేరీ నదికి దాని ఉపనది కొల్లిడమ్ నదికి మధ్యనున్న ద్వీపం. తిరుచిరా పల్లికి సమీపంలోని ఈ దీవిలో ఉన్న రంగనాథ ఆలయం పేరుతో ఈ దీవికి శ్రీరంగం అనే పేరు వ్యవహారంలోకి వచ్చింది. ఈ వైష్ణవాలయం కూడా 108 దివ్యదేశాల్లో ఒకటి. ఇది యునెస్కో గుర్తించిన హెరిటేజ్ సైట్ కూడా. ఈ ఆలయంలో 21 ఎత్తైన గోపురాలున్నాయి. ప్రపంచంలో ఆంగ్‌కోర్‌వాట్ తర్వాత అత్యంత పెద్ద హిందూ ఆలయాల్లో ఇదొకటి.


శ్రీరంగం దేవాలయ గోపురం


తంజావూరు బృహదీశ్వరాలయం

దక్షిణాది కృష్ణుడు


తంజావూరులో ఉన్న ఆలయాలన్నింటిలోకి పెద్ద ఆలయం బృహదీశ్వరాలయం. వెయ్యేళ్ల నాటి ఈ ఆలయాన్ని చోళ చక్రవర్తి మొదటి రాజరాజ కట్టించాడు. రాజ్యంలో రాజకీయ సంక్షోభం, సంక్లిష్టతలు ఎదురైనప్పుడు కళలకు ప్రాధాన్యం తగ్గిపోతుందనడానికి నిదర్శనం కూడా ఈ ఆలయాన్ని చెప్పవచ్చు. శిఖరం ఎత్తు 216 అడుగులు. శివలింగం 29అడుగులు. నంది కూడా పెద్దదే. ఈ నిర్మాణంలోని ప్రతి అంగుళమూ చోళుల కళాభిరుచికి అద్దం పడుతుంది. ఆలయనిర్మాణం పూర్తయ్యే సమయానికి యుద్ధం వచ్చింది. కొత్తగా నిధుల కేటాయింపు తగ్గిపోయింది. ఉన్న డబ్బుతో నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి వచ్చింది. దాంతో ప్రవేశ గోపురం ఎత్తును ముందు అనుకున్నట్లు ఆలయగోపురానికి దీటుగా నిర్మించలేకపోయారు. ఈ గోపురం కింది భాగం విశాలంగా ఉంటుంది, గోపురం ఎత్తు తక్కువగా ఉంటుంది. ఖర్చు, సమయం దృష్ట్యా ఎత్తు తగ్గించి రాజీ పడ్డారు. కానీ చేసిన పనిలో శిల్పనైపుణ్యంలో ఎక్కడా రాజీ పడలేదు. ఆలయంలోపల ఉన్న చిత్రకళ నాయకరాజుల అభిరుచికి నిదర్శనం. ఆలయం పై కప్పుకు రాగి ఆకులో కృష్ణుడి చిత్రం ఉంది. దానిని బాగా పరిశీలించి చూడండి. ఆ కృష్ణుడి ముఖంలో దక్షిణాది పోలికలు ముఖ్యంగా తమిళుల ముఖకవళికలు కనిపిస్తాయి. ఎత్తులో పై కప్పుకు ఉన్న చిత్రాన్ని పరిశీలించడానికి వీలుకాకపోతే ఫొటో తీసుకుని జూమ్ చేసి చూడవచ్చు. 'గ్రేట్ లివింగ్ చోళా టెంపుల్స్'గా గుర్తింపు పొందిన ఆలయం ఇది. యునెస్కో ఈ ఆలయాన్ని వరల్డ్ హెరిటేజ్ సైట్‌ల జాబితాలో చేర్చింది.


రాగి ఆకుపై కృష్ణుడి చిత్రం

8 రోజు ఇక ఇంటిదారి

ఉదయం తొమ్మిది గంటలకు రేణిగుంటకు చేరుతుంది. వెళ్లిన క్రమంలోని స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తూ తొమ్మిదవ రోజు మధ్యాహ్నం రెండున్నరకు సికింద్రాబాద్‌కు చేరుతుంది. ఎవరికి అనువైన స్టేషన్‌లో వాళ్లు దిగిపోవడమే.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి



ఖర్చు చేసిన తర్వాత మిగిలింది పొదుపు చేయొద్దు.
పొదుపు చేసిన తర్వాత మిగిలింది ఖర్చు చేయాలి
- వారెన్ బఫెట్

బిజినెస్ రీల్

డీమార్ట్ లాభం ఫ్లాట్

- క్యూ4లో రూ. 551 కోట్లు
- ఆదాయం 17 శాతం అప్



న్యూఢిల్లీ: డీమార్ట్ బ్రాండ్ రిటైల్ స్టోర్ల దిగ్గజం ఎవెన్యూ సూపర్‌మార్ట్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 2 శాతం నీరసించి రూ. 551 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది (2023-24) ఇదే కాలంలో రూ. 563 కోట్లు ఆర్జించింది. నిర్వహణ లాభం (ఇబిటా) స్వల్ప (1 శాతం) వృద్ధితో రూ. 955 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 944 కోట్ల ఇబిటా సాధించింది. అయితే మొత్తం ఆదాయం 17 శాతం జంప్‌చేసి రూ. 14,872 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 12,727 కోట్ల టర్నోవర్ అందుకుంది. మార్జిన్లు 7.4 శాతం నుంచి 6.4 శాతానికి బలహీనపడ్డాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం భారీగా ఎగసి రూ. 7,099 కోట్లకు చేరింది. 2023-24లో కేవలం రూ. 3,241 కోట్ల లాభం ఆర్జించింది.

ఫారెక్స్ మార్కెట్లకు ప్రస్తుత ట్రేడింగ్ వేళలే

ఆర్‌బీఐ కమిటీ సిఫార్సులు



ముంబై: ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లకు ప్రస్తుత ట్రేడింగ్ వేళలనే కొనసాగించాలని రిజర్వ్ బ్యాంక్ కమిటీ సిఫార్సు చేసింది. కాల్ మనీ మార్కెట్ టైమింగ్స్‌ను మాత్రం రాత్రి 7 గం.ల వరకు పొడిగించాలని సూచించింది. ప్రస్తుతం కరెన్సీ మార్కెట్ల ట్రేడింగ్ వేళలు ఉదయం 9 గం.ల నుంచి సాయంత్రం 3.30 గం.ల వరకు ఉంటున్నాయి. అయితే, ఆన్‌షోర్ మార్కెట్ వేళల తర్వాత నాన్-రెసిడెంట్లు ప్రభుత్వ సెక్యూరిటీల్లో లావాదేవీలు నిర్వహించేందుకు సాయంత్రం 5 గం.ల నుంచి రాత్రి 11.30 గం.ల వరకు ట్రేడింగ్ వేళలు ఉంటున్నాయి. మరోవైపు, కాల్ మనీ మార్కెట్ వేళలు ఉదయం 9 గం.ల నుంచి సాయంత్రం 5 గం.ల వరకు, రెపో మార్కెట్ టైమింగ్స్ ఉదయం 9 గం.ల నుంచి మధ్యాహ్నం 2.30 గం.ల వరకు ఉంటున్నాయి.

సెమీకండక్టర్ల తయారీకి జోహో బ్రేక్

ZOHO

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ జోహో కార్పొరేషన్ ప్రస్తుతానికి సెమీకండక్టర్ల ఉత్పత్తిపై ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళికలను పక్కన పెట్టింది. తయారీకి ఉపయోగించే టెక్నాలజీ ఆప్షన్లపై అంతగా నమ్మకం కుదరకపోవడమే ఇందుకు కారణమని సంస్థ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తెలిపారు. సెమీకండక్టర్ ఫ్యాబ్ వ్యాపారానికి భారీగా పెట్టుబడులు, ప్రభుత్వ మద్దతు కూడా అవసరమవుతుందని ఆయన పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారుల సొమ్మును సహాయంగా తీసుకోవడానికి ముందు తాము సరైన టెక్నాలజీనే ఎంచుకుంటున్నామనే అంశాన్ని నిర్ధారించుకోదల్చుకున్నామని శ్రీధర్ చెప్పారు. మెరుగైన టెక్నాలజీ అందివచ్చేంత వరకు చిప్‌ల తయారీ ఐడియాను పక్కన పెట్టాలని బోర్డు నిర్ణయించినట్లు తెలిపారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) కింద ప్రోత్సాహకాలను కోరుతూ జోహో గతంలో చిప్‌ల తయారీ ప్రాజెక్టు కోసం సిలెక్ట్రిక్ సెమీకండక్టర్ తయారీ సంస్థను ఏర్పాటు చేసింది. మైసూరులో రూ. 3,426 కోట్ల పెట్టుబడులతో తలపెట్టిన సిలెక్ట్రిక్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాజెక్టుకు 2024 డిసెంబర్‌లో కర్ణాటక ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

మార్కెట్లపై ఫెడ్, క్యూ4 ఎఫెక్ట్

భారత్, పాక్ ఉద్రిక్తతలపై దృష్టి

- యూఎస్ కేంద్ర బ్యాంకు సమావేశం
- ఫలితాలు ప్రకటించనున్న దిగ్గజాలు
- ఈ వారం పలు కీలక అంశాలకు చోటు

దేశీ స్టాక్ మార్కెట్లలో ఈ వారం ట్రెండ్ పలు కీలక అంశాలపై ఆధారపడనుంది. దేశీయంగా కార్పొరేట్ ఫలితాలు ప్రభావం చూపనున్నాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పరపతి సమీక్షకు తెరతీయనుంది. మరోపక్క భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో ఈ వారం ఆటుపోట్లకు అవకాశమున్నట్లు నిపుణులు భావిస్తున్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లకు దిక్సూచిగా నిలవగల అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ బుధవారం పాలసీ సమీక్షను ప్రకటించనుంది. రెండు రోజులపాటు సమావేశమయ్యే ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) 7న వడ్డీ రేట్లపై నిర్ణయాలు ప్రకటించనుంది. అయితే మార్చి నెల సమావేశంమాదిరిగా ఈసారికూడా ఫెడ్ యథాతథ రేట్ల అమలుకే కట్టుబడే అవకాశమున్నట్లు అత్యధిక శాతంమంది ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. గత సమావేశంలో ఫెడ్ ఫండ్స్ రేట్లను 4.25-4.5 శాతంగా కొనసాగించేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. కాగా.. ఏప్రిల్ నెలకు యూఎస్ సర్వీసుల పీఎంఐ గణాంకాలు సోమవారం(5న) విడుదల కానున్నాయి. ఇక చైనా ఏప్రిల్ వాణిజ్య గణాంకాలు 9న వెల్లడికానున్నాయి. మార్చిలో ఎగుమతుల జోరు కారణంగా 102 బిలియన్ డాలర్లకుపైగా వాణిజ్య మిగులు నమోదైంది.

బ్లూచిప్స్ ఫలితాలు

ఈ వారం ఆతిథ్య రంగ దిగ్గజం ఇండియన్ హోటల్స్, ఆటో దిగ్గజం ఎంఅండ్ఎం(5న), బ్యాంక్ ఆఫ్ బరోడా(6న), కోల్ ఇండియా, డాబర్(7న), మౌలిక దిగ్గజం ఎల్అండ్‌టీ, ఏషియన్ పెయింట్స్, బయోకాన్, టైటన్(8న), డాక్టర్ రెడ్డీస్(9న) గత ఆర్థి క సంవత్సరం చివరి త్రైమాసిక(జనవరి-మార్చి) ఫలితాలు ప్రకటించనున్నాయి. గత వారాంతాన(3న) బ్యాంకింగ్ దిగ్గజాలు స్టేట్‌బ్యాంక్, కొటక్ మహీంద్రాతోపాటు డీమార్ట్ క్యూ4 ఫలితాలు వెల్లడించాయి. ఈ ప్రభావం నేడు(5న) మార్కెట్లలో కనిపించనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా తెలియజేశారు. కాగా.. హెచ్ఎస్‌బీసీ పీఎంఐ సర్వీసుల డేటా 6న విడుదలకానుంది.

ఎఫ్‌పీఐల దన్ను

ఇటీవల కొద్ది రోజులుగా దేశీ స్టాక్స్‌లో కొనుగోళ్ల యూటర్న్ తీసుకున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) సెంటిమెంటుకు బలాన్నిస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. దీనికితోడు టారిఫ్‌ల విషయంలో యూఎస్‌తో ఒప్పందం కుదరనున్నట్లు అంచనాలు పెరిగినట్లు తెలియజేశారు. దీంతో గత 12 ట్రేడింగ్ సెషన్లలో ఎఫ్‌పీఐలు పెట్టుబడులకే ఆసక్తి చూపుతున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పెట్టుబడుల ప్రధాన వ్యూహకర్త వీకే విజయకుమార్ తెలియజేశారు. ఫలితంగా యూఎస్ డాలరుతో మారకంలో రూపాయి వేగంగా బలపడుతున్నట్లు పేర్కొన్నారు. మరోపక్క స్టాక్ మార్కెట్లు సరికొత్త గరిష్టాలవైపు పరుగు తీస్తున్నట్లు వివరించారు. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ 99కు బలహీనపడటం కూడా రూపాయికి ప్రోత్సాహాన్నిస్తున్నట్లు ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. దేశీయంగా తొలి మూడు నెలల(జనవరి-మార్చి) తదుపరి ఏప్రిల్‌లో ఎఫ్‌పీఐలు నికరంగా రూ. 4,223 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం!

యుద్ధభయాలు

పహల్గామ్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. దీంతో ఇన్వెస్టర్లలో ఓవైపు ఆందోళనలు నెలకొన్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ఎస్‌వీపీ అజిత్ మిశ్రా తెలియజేశారు. ఫలితంగా భారత్, పాకిస్తాన్ మిలటరీ దళాల ప్రతీ కదలికలనూ కూలంకషంగా పరిశీలించే వీలున్నట్లు వివరించారు. ఫలితంగా మార్కెట్లలో ఆటుపోట్లు కనిపించవచ్చని లెమన్ మార్కెట్స్ డెస్క్ విశ్లేషకులు గౌరవ్ గార్గ్ అంచనా వేశారు. సాంకేతికంగా ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ 24,400 పాయింట్ల వద్ద కీలక అవరోధాన్ని ఎదుర్కొనే వీలున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ఈ స్థాయికి ఎగువన నిలిస్తే మరింత బలపడవచ్చని, లేదంటే పరిమిత శ్రేణి కదలికలకే పరిమితంకావచ్చని అంచనా వేశారు. క్యూ1లో యూఎస్ జీడీపీ నీరసించడం గ్లోబల్‌స్థాయిలో అనిశ్చితికి దారితీస్తున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ విశ్లేషించారు. దీంతో ఫెడ్ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడినట్లు తెలియజేశారు.

గత వారమిలా

గురువారం సెలవు కావడంతో 4 రోజులకే ట్రేడింగ్ పరిమితమైన గత వారం.. సెన్సెక్స్ 1289 పాయింట్లు(1.6 శాతం) ఎగసి 80,502కు చేరింది. నిఫ్టీ 307 పాయింట్లు(1.3 శాతం) పుంజుకుని 24,347 వద్ద నిలిచింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం బలపడగా.. స్మాల్ క్యాప్ మాత్రం 1.33 శాతం క్షీణించింది.

సరళతర ఎఫ్‌డీఐ విధానంతో భారీ అవకాశాలు

డెలాయిట్ ఇండియా



న్యూఢిల్లీ: భారత్ అమలు చేస్తున్న సరళతర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానం (ఎఫ్‌డీఐ) విదేశీ ఇన్వెస్టర్లకు అపారమైన పెట్టుబడి అవకాశాలను ఆఫర్ చేస్తోందని డెలాయిట్ ఇండియా తెలిపింది. ఫార్మాస్యూటికల్స్, ఆటో, పర్యాటక రంగాలకు ఎఫ్‌డీఐలను ఆకర్షించే శక్తితోపాటు ఉపాధి కల్పనకు చోదకాలుగా నిలవగలవని పేర్కొంది. వీటికితోడుగా ఎగుమతులు, ఆవిష్కరణలు భారత్ తదుపరి దశ వృద్ధిని నడిపించగలవని తెలిపింది. చాలా రంగాల్లో ఆటోమేటిక్ మార్గంలో(అనుమతుల్లేని) 100 శాతం ఎఫ్‌డీఐల రాకకు అనుమతించడం ద్వారా భారత్ ఎంతో ప్రగతి సాధించినట్టు గుర్తు చేసింది. పర్యాటకం, నిర్మాణం, హాస్పిటల్స్, మెడికల్ డివైజ్‌లను ప్రస్తావించింది. ఈ విధాన నిర్ణయాలు స్థిరత్వాన్ని, స్పష్టతను అందిస్తున్నట్టు డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి మజుందార్ పేర్కొన్నారు. 70 బిలియన్ డాలర్ల జాతీయ మోనిటైజేషన్ పైప్‌లైన్, 100 పట్టణాల్లో పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి కార్యక్రమాలు అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు వెంటనే కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు వీలైన పెట్టుబడి జోన్లను అందిస్తున్నట్టు చెప్పారు. పర్యాటకం, ఆతిథ్య రంగంలో హోటళ్లు, రిక్రియేషన్ కేంద్రాల నిర్మాణానికి 100 శాతం ఎఫ్‌డీఐని అనుమతిస్తున్నట్టు గుర్తు చేశారు. పారదర్శక, స్థిరమైన పెట్టుబడుల కేంద్రంగా భారత్ ప్రతిష్ట దీంతో మరింత ఇనుమడిస్తుందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం, సరళతర ఎఫ్‌డీఐ విధానం.. లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్, పట్టణాభివృద్ధి రంగాల్లో అపార అవకాశాలను తీసుకొస్తున్నట్టు మజుందార్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2024-2025) తొలి తొమ్మిది నెలల్లో (ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) 27 శాతం అధికంగా 40.67 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ భారత్‌లోకి రావడం గమనార్హం.

రేట్ల తగ్గింపుతో బ్యాంకుల లాభాలకు చిల్లు

ఆస్తులపై రాబడి 0.20 శాతం తగ్గొచ్చు

- నికర వడ్డీ మార్జిన్ కూడా ఇదే స్థాయిలో తగ్గుతుంది
- క్రిసిల్ రేటింగ్స్ అంచనా



ముంబై: ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపుతో 2025-26లో బ్యాంకుల లాభదాయకత 0.20 శాతం మేర తగ్గిపోతుందని క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. లాభదాయకతకు సంబంధించి కీలక కొలమానమైన రిటర్న్ ఆన్ అసెట్స్ (ఆర్‌వోఏ/ఆస్తులపై రాబడి) 0.10-0.20 స్థాయిలో తగ్గి 1.1-1.2 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. 2024-25లో ఇది 1.3 శాతంగా ఉన్నట్టు తెలిపింది. బ్యాంకుల నికర వడ్డీ మార్జిన్‌లో ఇదే స్థాయి క్షీణత ఆర్‌వోఏ తగ్గేందుకు కారణమవుతుందని వివరించింది. వడ్డీ రేట్లు తగ్గే క్రమంలో డిపాజిట్ల కంటే రుణాలపైనే వడ్డీ రేట్ల కుదింపు వేగంగా ఉంటుందని గుర్తు చేసింది. ''బ్యాంకు రుణాల్లో 45 శాతం ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేటు (ప్రధానంగా రెపో) ఆధారితమే ఉంటాయి. రేట్ల తగ్గింపుతో ఈ రుణాల రేటు సవరణ వేగంగా చేయాల్సి వస్తుంది. మరోవైపు టర్మ్ డిపాజిట్లపై రేటు తగ్గింపు అన్నది తాజా డిపాజిట్లకే వర్తిస్తుంది. కనుక డిపాజిట్లపై రేట్ల తగ్గింపు అన్నది నిదానంగా ఉంటుంది''అని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ శుభశ్రీ నారాయణన్ తెలిపారు. నికర వడ్డీ మార్జిన్లకు తోడు రుణ వ్యయాలు కూడా బ్యాంకుల లాభాలపై ప్రభావం చూపిస్తాయని క్రిసిల్ రేటింగ్స్ వెల్లడించింది. రుణ వ్యయాలు కనిష్ట స్థాయికి చేరుకున్నట్టు తెలిపింది. ఇతర ఆదాయం, నిర్వహణ వ్యయాలు ఫ్లాట్‌గా ఉంటాయని అంచనా వేసింది. దీంతో నికర వడ్డీ మార్జిన్ల తగ్గుదల నేరుగా ఆర్‌వోఏపై ప్రభావానికి దారితీస్తుందని వివరించింది.

డిపాజిట్లపై వ్యయాలు కీలకం..: డిపాజిట్లపై వ్యయాలను తగ్గించుకోవడంపైనే బ్యాంకుల నికర వడ్డీ మార్జిన్ల తగ్గుదల ఆధారపడి ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది. అయితే డిపాజిట్ల కోసం ఉన్న పోటీ దృష్ట్యా ఈ వెసులుబాటు పరిమితమేనని అభిప్రాయపడింది. వ్యవస్థలో తగినంత లిక్విడిటీకి ఆర్‌బీఐ ప్రాధాన్యం ఇస్తుండడం బ్యాంకుల లిక్విడిటీ కవరేజీ నిష్పత్తి 6 శాతం పెరిగేందుకు సాయపడుతుందని తెలిపింది. అన్ని బ్యాంక్‌లు సేవింగ్స్ డిపాజిట్ రేటును 0.25 శాతం తగ్గించడం వల్ల వాటి నికర లాభాల మార్జిన్ 0.06 శాతం పెరిగేందుకు దారితీస్తుందని క్రిసిల్ రేటింగ్స్ అసోసియేట్ డైరెక్టర్ వాణి ఓజస్వి తెలిపారు. నికర వడ్డీ మార్జిన్ 0.1-0.2 శాతం స్థాయిలో తగ్గి 2.8-2.9 శాతానికి పరిమితం కావొచ్చన్నారు.

పెట్రోల్, డీజిల్‌కు పెరిగిన డిమాండ్

అమ్మకాలు 4 శాతం అధికం



న్యూఢిల్లీ: కీలక ఇంధనాలైన పెట్రోల్, డీజిల్ వినియోగం ఏప్రిల్‌లో పెరిగింది. వరుసగా కొన్ని నెలల పాటు క్షీణత అనంతరం 4 శాతం మేర అమ్మకాలు పెరిగాయి. ఏప్రిల్‌లో డీజిల్ వినియోగం 8.23 మిలియన్ టన్నులకు చేరుకుంది. క్రితం ఏడాది ఏప్రిల్ నెల అమ్మకాలతో పోల్చి చూస్తే 4 శాతం పెరిగినట్టు పెట్రోలియం ప్రణాళిక, విశ్లేషణ విభాగం (కేంద్ర పెట్రోలియం శాఖ పరిధిలోని) డేటా తెలియజేస్తోంది. 2023 ఏప్రిల్ నెల విక్రయాలతో పోల్చి చూసినా 5.3 శాతం మేర వినియోగం పెరిగింది. కరోనా ముందు నాటి సంవత్సరం 2019 ఏప్రిల్ నెల గణాంకాలతో పోల్చి చూస్తే 10.45 శాతం అధికం కావడం గమనించొచ్చు. కస్టమర్లు క్రమంగా ఎలక్ట్రిక్, పెట్రోల్ వేరియంట్ల వైపు మొగ్గు చూపిస్తుండడంతో డీజిల్ వినియోగంపై కొంత కాలంగా నెలకొన్న సందేహాలకు తాజా గణంకాలు తెరదించినట్టయింది. మొత్తం పెట్రోలియం ఇంధనాల్లో డీజిల్ వాటా 38 శాతంగా ఉంటుంది. ఇక ఏప్రిల్ నెలలో పెట్రోల్ అమ్మకాలు సైతం క్రితం ఏడాది ఇదే నెల గణాంకాలతో పోల్చి చూస్తే 4.6 శాతం పెరిగి 3.43 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. గతేడాది ఏప్రిల్‌లో ఎన్నికల కారణంగా పెట్రోల్ అమ్మకాలు 19 శాతం వృద్ధిని నమోదు చేయగా, నాటి గరిష్ట పరిమితి మీద మెరుగైన వృద్ధి నమోదైంది. ఎల్‌పీజీ విక్రయాలు 6.7 శాతం పెరిగి 2.62 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. విమానయాన ఇంధనం (ఏటీఎఫ్) అమ్మకాలు 3.25 శాతం తగ్గి 7,66,000 టన్నులుగా ఉన్నాయి.

రెస్టారెంట్ రంగంలో కోటిన్నర కొలువులు

2028 నాటికి ఎన్ఆర్ఏఐ అంచనా

న్యూఢిల్లీ: ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభిస్తే దేశీయంగా రెస్టారెంట్ రంగం 2028 నాటికి 1.5 కోట్ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించగలదని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) వైస్ ప్రెసిడెంట్ జొరావర్ కల్రా తెలిపారు. ఇందుకోసం 'పరిశ్రమ' హోదా కల్పించాలని, జీఎస్‌టీపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ప్రయోజనాల్లాంటివి ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం 85 లక్షల మంది ఉద్యోగావకాశాలు పొందుతున్నారు. ఎన్ఆర్ఏఐలో సుమారు 5 లక్షల రెస్టారెంట్లకు సభ్యత్వం ఉంది. స్వంత ప్రైవేట్-లేబుల్ బ్రాండ్లతో క్విక్ కామర్స్ విభాగంలో దూసుకెళ్లిపోతున్న స్విగ్గీ, జొమాటోలాంటి ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్లతో నెలకొన్న వివాదం సామరస్యంగా సద్దుమణుగుతుందని కల్రా ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫారం 16 మారిందండీ..

2024-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఫారంలో 16 మార్పులు వచ్చాయి. మీ యజమాని ఈ మార్పులు చేసిన తర్వాత మీకు ఫారం 16 జారీ చేస్తారు.



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఫారం 16 అంటే ఏమిటి?

యజమాని తన దగ్గర చేసే ఉద్యోగులకు ప్రతి సంవత్సరం జారీ చేసేది ఫారం 16. ఇందులో మొదటి భాగంలో ఉద్యోగులు, యజమాని ప్రాథమిక వివరాలు ఉంటాయి. రెండో భాగంలో జీతభత్యాలకి సంబంధించిన పూర్తి వివరాలు .. అంటే జీతాలు, అలవెన్సులు, టాక్సబుల్ ఇన్‌కం వివరాలు, మినహాయింపులు, తగ్గింపులు, డిడక్షన్లు, నికరజీతం లేదా ఆదాయం, టీడీఎస్ వివరాలు ఉంటాయి. 'సులభతరం, పారదర్శకత, స్పష్టత' అనే లక్ష్యాలతో ఫారం 16 రాబోతోంది.

ఫారం 16 చాలా ముఖ్యమైంది..

రిటర్నులు వేయడానికి మొదటగా చూసే డాక్యుమెంటు ఇదే. లోన్ ఇచ్చేందుకు బ్యాంకులు, రుణ సంస్థలు ఈ ఫారంనే ప్రాతిపదికగా తీసుకుంటాయి. ఈ ఫారంతో ఉద్యోగి 'రుణ స్తోమత' నిర్ధారిస్తారు. దీంతోనే పన్ను భారం, చెల్లింపులు నిర్ధారించవచ్చు. రీఫండు కోసం కూడా ఇదే ఫారంని 'బేస్'గా తీసుకుంటారు. ఎందుకంటే, పన్ను వసూలు చేయడం, దాన్ని ప్రభుత్వానికి చెల్లించడాన్ని దీని ద్వారానే నిర్ధారించుకుంటారు. ఇవే అంశాలు 26ఏఎస్‌లో ఉంటాయి. ప్రతి మూడు నెలలకు సమ్మరీ, జీతం, టీడీఎస్ చెల్లించినది, గవర్నమెంటుకు ఎలా చెల్లించారు, ఏ బ్యాంకు ద్వారా చెల్లించారు, ఏ తేదీన కట్టారు, చలాన్ నంబరు ఎంత వగైరా వివరాలన్నీ ఉంటాయి. జీతం, అలవెన్సులు, బోనస్‌లు, ఏరియర్స్, సెక్షన్ 10 ప్రకారం మినహాయింపులు, ఇంటి అద్దె అలవెన్సు, గ్రాట్యుటీ మొదలైన అన్ని డిడక్షన్లు 80 C నుంచి 80 TTA వరకు ఉంటాయి. ఆ తరువాత పన్ను భారం లెక్కింపులు, స్టాండర్డ్ డిడక్షన్లు ఉంటాయి. 89(1) రిలీఫ్ కూడా ఉంటుంది.

వచ్చిన మార్పులు ఏమిటంటే..

80 ఇఇఏ ప్రకారం అగ్నివీర్ కార్పస్ ఫండ్‌కి ఇచ్చిన విరాళాలకు సంబంధించిన మినహాయింపు ఉంటుంది. జీతాలకు సంబంధించిన అంశాలు వర్గీకరిస్తారు. హెచ్ఆర్ఏకి సంబంధిత వివరాలుంటాయి. అలాగే రెంట్‌ఫ్రీ వివరాలు, ఇతర ప్రిరిక్విజిట్లు, ప్రతి డిడక్షన్‌కి సంబంధించి మరిన్ని వివరాలు పొందుపరుస్తారు. కొత్త కాలమ్ ద్వారా టీడీఎస్, టీసీఎస్‌కి సంబంధించిన వివరాలు తెలిసేలా, సరి చేసుకునే వీలు కల్పించడానికి ఫారం 24 Q టీడీఎస్/టీసీఎస్ రిటర్నులు కనిపించేలా చేస్తారు. దీనివల్ల 26 A ను అప్పటికప్పుడు చెక్ చేసుకోవచ్చు.

మీరు చేయాల్సిందేమింటంటే..

ఫారం 16 యజమాని ఇచ్చే సర్టిఫికేటు. ఇది విలువైంది. ఎందుకంటే ఇది మీ టీడీఎస్, టీసీఎస్ రికవరీ అయినట్లు... చెల్లించినట్లు. గవర్నమెంటు చేతికందినట్లూ. మీ ఖాతాలో జమ అయినట్లు ధృవీకరించే ఏకైక పత్రం. అయితే ఇందులో ప్రతి అంశాన్ని మీరే సరి చూసుకోవాలి. నెలసరి శాలరీ స్లిప్పులతో మినహాయింపు, తగ్గింపులు... మొదలైనవి చెక్ చేసుకోవాలి. మీరు ఇచ్చే ఆదాయపు వివరాలు ఉన్నాయా లేదా ఎక్కువ పడ్డాయా చెక్ చేసుకోవాలి. వాటికి సంబంధించిన కాగితాలు భద్రపరుచుకోవాలి. మీరు కొత్త రెజీమ్‌లో ఉన్నారా లేక పాత పద్ధతిలో ఉన్నారో చెక్ చేసుకొండి. మీరు సంవత్సరంలో ఉద్యోగం మారితే రెండు ఫారం 16లు ఉంటాయి. అప్పుడు రిపోర్టింగ్‌లో హెచ్చు తగ్గులు... డబుల్ క్లయిమ్/తప్పుడు క్లయిమ్ ఉండొచ్చు. చెక్ చేసుకోండి. యజమానికి అంటే 'డిస్బర్సింగ్' అధికారి ఇవన్నీ అదనపు భాధ్యతలు... తగిన జాగ్రత్త వహించాలి. గతంలో ఏర్పడిన ఇబ్బందులు, సమస్యలు కొత్త ఫారమ్ 16 వల్ల రావని ఆశిద్దాం!

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

ఎన్నడూ లేనంత ఆర్థిక అనిశ్చితి

- కరోనా సమయం కంటే ఎక్కువ
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ విశ్లేషణ
- వృద్ధి అంచనాలు గణనీయంగా తగ్గింపు



బార్సిలోనా: ప్రపంచ ఆర్థిక వృద్ధి అంచనాలను అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) గణనీయంగా తగ్గించేసింది. కరోనా సమయం కంటే అధిక అనిశ్చితి నెలకొన్నట్టు పేర్కొంది. ప్రపంచ జీడీపీ 2025లో 2.8 శాతం, 2026లో 3 శాతం చొప్పున వృద్ధి సాధిస్తుందని తాజాగా అంచనా వేసింది. యూరో ప్రాంతంలో వృద్ధి 2025లో 0.8 శాతం, 2026లో 1.2 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో ఐఎంఎఫ్ విడుదల చేసిన గణాంకాలతో పోల్చి చూస్తే ప్రపంచ వృద్ధి అంచనా 0.5 శాతం తగ్గగా, యూరో ప్రాంతం వృద్ధి అంచనా 0.2 శాతం తక్కువ కావడం గమనార్హం. మూడు నెలల క్రితంతో పోల్చితే మరింత అనిశ్చితుల్లో నేడు ప్రపంచం ఉన్నట్టు ఐఎంఎఫ్ తాజా నివేదిక పేర్కొంది.

టారిఫ్‌లు, అనిశ్చితి..

అమెరికా టారిఫ్ విధానాలను ఊహించలేకుండా ఉన్నామని ఐఎంఎఫ్ తెలిపింది. 2025 ఏప్రిల్ 2 లిబరేషన్ డే అన్నది ఆధునిక ప్రపంచంలో అతిపెద్ద టారిఫ్‌ల పెంపుగా నిలిచిపోతుందని పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల పెంపునకు 90 రోజుల విరామం ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ.. ఆ తర్వాత పరిస్థితి ఏంటన్న సందేహాన్ని వ్యక్తం చేసింది. వచ్చే డిసెంబర్, రెండేళ్ల తర్వాత పరిస్థితి ఏంటి? చైనా-అమెరికా మధ్య టారిఫ్‌ల పోరు ఎంత కాలం పాటు కొనసాగుతుంది? వీటికి సమాధానాలు ఎవరికీ తెలియవంటూ ఐఎంఎఫ్ నిట్టూర్చింది. ఐఎంఎఫ్ ప్రపంచ వాణిజ్య అశ్చితి సూచీ 2024 అక్టోబర్ నాటితో పోల్చితే ఏడు రెట్లు అధికంగా ఉండడం గమనార్హం. ఇది కరోనా విపత్తు నాటితో పోల్చినా గరిష్టానికి చేరింది. టారిఫ్‌ల కారణంగా కంపెనీలు తమ తయారీ చైన్‌ను పునర్‌వ్యవస్థీకరించుకోవాల్సి ఉంటుందని, వినియోగదారులు ప్రత్యామ్నాయ ఉత్పత్తుల వైపు చూడొచ్చని ఐఎంఎఫ్ నివేదిక తెలిపింది.

ఆర్థిక అస్థిరత..

టారిఫ్‌లు, ప్రణాళికలు తరచూ మారిపోతుండడం ఫైనాన్షియల్ మార్కెట్లలో పెద్ద ఎత్తున అస్థిరతకు దారితీస్తుందని ఐఎంఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. కరోనా నాటి స్థాయి అనిశ్చితులను ఫైనాన్షియల్ మార్కెట్లు ప్రస్తుతం ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. ''ఐదేళ్ల క్రితం అమెరికా రుణ భారంతో అనిశ్చితులు పెరిగాయి. రక్షణాత్మక ధోరణితో ఇన్వెస్టర్లు అధిక రిస్క్‌తో కూడిన సాధనాల్లో (ఈక్విటీ) అమ్మకాలు చేసి, బంగారం, ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులకు ఆసక్తి చూపించారు. ఇప్పుడు దీనికి పూర్తి విరుద్ధమైన పరిస్థితిని చూస్తున్నాం. యూఎస్ బాండ్ల ధరలు లిబరేషన్ డే నాటి నుంచి తగ్గిపోయాయి. అంటే ఇన్వెస్టర్లు వాటిని విక్రయిస్తున్నారు. అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలను సురక్షిత పెట్టుబడి సాధనంగా మార్కెట్లు భావించడం లేదు. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్, అమెరికా రుణానికి ఉన్న పాత్రను దృష్టిలో పెట్టుకుని చూస్తే, భవిష్యత్తులో మరింత ఆర్థిక అస్థిరతకు దారితీయవచ్చు''అని ఐఎంఎఫ్ తెలిపింది. కరోనా సమయంలో ఉత్పత్తి కార్యకలాపాలను బలవంతంగా నిలిపివేయాల్సి రావడంతో అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో అవరోధాలు ఏర్పడగా.. నేడు టారిఫ్‌ల కారణంగా అదే పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చినట్టు పేర్కొంది. నేడు ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో అనిశ్చితులకు ఎలాంటి వైరస్ కారణం కాదంటూ.. ట్రంప్ సలహాదారులు అమెరికా ఆర్థిక ప్రయోజనాల కోణంలో వీటికి కారణమవుతున్నట్టు తెలిపింది.

మ్యాక్స్‌వెల్ స్థానంలో మిచ్ ఓవెన్



ముల్లాన్‌పూర్: గాయం కారణంగా ఐపీఎల్‌కు దూరమైన ఆ్రస్టేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ స్థానంలో పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ మరో ఆసీస్ ఆల్‌రౌండర్ మిచ్ ఓవెన్‌ను జట్టులోకి తీసుకుంది. గత నెల 26న ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్ సదర్భంగా మ్యాక్స్‌వెల్ గాయపడ్డాడు. అతడి వేలు విరగడంతో ఈ సీజన్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. 'పంజాబ్ జట్టు మ్యాక్స్‌వెల్ స్థానంలో మిచ్ ఓవెన్‌ను ఎంపిక చేసుకుంది. ఇప్పటి వరకు 34 టి20 మ్యాచ్‌లాడిన ఓవెన్ 646 పరుగులు చేశాడు. అందులో రెండు సెంచరీలు ఉన్నాయి. మరోవైపు బంతితో 10 వికెట్లు పడగొట్టాడు' అని ఐపీఎల్ పాలక మండలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 23 ఏళ్ల కుడి చేతివాటం పేస్ ఆల్‌రౌండర్ అయిన మిచ్ ఓవెన్... ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 14 మ్యాచ్‌లు ఆడాడు. అతడికి పంజాబ్ ఫ్రాంచైజీ రూ. 3 కోట్లు కేటాయించింది. ఈ సీజన్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన మ్యాక్స్‌వెల్ 7 మ్యాచ్‌లాడి 48 పరుగులు మాత్రమే చేశాడు.

సన్‌రైజర్స్‌కు ఆఖరి చాన్స్!

ఓడితే 'ప్లే ఆఫ్స్' ఆశలు ఖతం

- నేడు సొంతగడ్డపై ఢిల్లీ క్యాపిటల్స్‌తో పోరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్ 18వ సీజన్‌లో గత ఏడాది రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రస్థానం ఆఖరి దశకు చేరింది. సీజన్‌లో మరో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా... చావో రేవో తేల్చుకోవాల్సిన స్థితిలో జట్టు నిలిచింది. నేడు ఉప్పల్ స్టేడియంలో జరిగే పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో హైదరాబాద్ తలపడుతుంది. ప్రస్తుతం సన్‌రైజర్స్ ఖాతాలో 3 విజయాలతో 6 పాయింట్లు మాత్రమే ఉన్నాయి. మిగిలిన నాలుగూ గెలిస్తే గరిష్ఠంగా 14 పాయింట్లకు జట్టు చేరుకుంటుంది. దీని వల్ల 'ప్లే ఆఫ్స్' స్థానం ఖాయమయ్యే అవకాశాలు కూడా చాలా తక్కువ. అయితే సాంకేతికంగా, ఇతర జట్ల సమీకరణాలను బట్టి ఆశలు పెట్టుకోవచ్చు. కానీ నేటి మ్యాచ్‌లో ఓడితే మాత్రం అధికారికంగా 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి మాజీ చాంపియన్ నిష్క్రమిస్తుంది. మరోవైపు ఢిల్లీ ప్రయాణం కూడా తడబడుతూ సాగుతోంది. తొలి 4 మ్యాచ్‌లు వరుసగా గెలిచి ఘనంగా ప్రారంభించిన టీమ్ ఆ తర్వాతి 6 మ్యాచ్‌లలో 4 ఓడిపోయింది. అయితే పరిస్థితి ఇంకా చేయిదాటిపోలేదు కాబట్టి ఈ మ్యాచ్‌లో నెగ్గితే ఢిల్లీ మరింత మెరుగైన స్థితికి చేరుకుంటుంది.

బ్యాటర్లు చెలరేగితేనే...

గుజరాత్ చేతిలో ఓడిన గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ బ్యాటింగ్ బలహీనత మరోసారి కనిపించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ మినహా అంతా విఫలమయ్యారు. మిగతా ప్రధాన బ్యాటర్లు విఫలం కావడం మాత్రమే కాదు వారి షాట్లలో ఆత్మవిశ్వాసం కనిపించడం లేదు. ఎంతో నమ్మకం పెట్టుకున్న హెడ్, క్లాసెన్ పేలవంగా ఆడి నిష్క్రమించగా... ఇషాన్ కిషన్ ప్రతీ పరుగు కోసం తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. టాప్-4 ఇలా ఆడితే ఏ జట్టయినా విజయాన్ని కోరుకోవడం అత్యాశే అవుతుంది. ఆరంభ మ్యాచ్‌లలో కనిపించిన పట్టుదలను అనికేత్ కొనసాగించలేకపోయాడు. నితీశ్ కుమార్ రెడ్డి గత మ్యాచ్‌లో ఫర్వాలేదనిపించినా అప్పటికే మ్యాచ్ చేయిదాటిపోయాక అతని ఇన్నింగ్స్‌కు విలువ లేకుండా పోయింది. హోం గ్రౌండ్‌లోనైనా వీరంతా తమ బ్యాటింగ్‌కు పదును పెడితే భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. అయితే బ్యాటింగ్‌కంటే చెత్త బౌలింగ్ రైజర్స్‌ను వెనకబడేలా చేసింది. ప్రధాన బౌలర్లు మొహమ్మద్ షమీ 11.23, కెప్టెన్ ప్యాట్ కమిన్స్ 9.64, హర్షల్ పటేల్ 9.50, అన్సారీ 9.74 ఎకానమీతో బౌలింగ్ చేస్తుంటే ఏ జట్టయినా ఏమీ చేయలేదు. వీరిలో ఒక్కరి ప్రదర్శన మెరుగుకావడం లేదు. తప్పనిసరి గెలవాల్సిన మ్యాచ్‌లోనైనా బౌలర్ల ఆటతీరు మారితే రైజర్స్ విజయంపై నమ్మకం ఉంచవచ్చు.

సమష్టి ఆటపై ఆశలు...

సీజన్‌లో జోరుగా దూసుకొచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్ గత రెండు మ్యాచ్‌లలో వరుసగా ఓడి 'ప్లే ఆఫ్స్' రేసులో కాస్త వెనుకబడింది. ముఖ్యంగా కోల్‌కతాతో జరిగిన గత పోరులో మంచి విజయావకాశాలు ఉన్న స్థితి నుంచి మ్యాచ్‌ను చేజార్చుకుంది. అంతకు ముందు బెంగళూరుతో మ్యాచ్‌లో కూడా బ్యాటింగ్ విఫలమైంది. బ్యాటింగ్ ఆర్డర్ చూస్తే కనీసం ఎనిమిదో స్థానం వరకు కూడా ధాటిగా ఆడగల రెగ్యులర్ బ్యాటర్లు కనిపిస్తున్నారు. కానీ గత రెండు మ్యాచ్‌లలో ఈ లైనప్ అంచనాలను నిలబెట్టుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో తమ లోపాలను అధిగమించి మరోసారి బ్యాటర్లు చెలరేగాలని ఢిల్లీ కోరుకుంటోంది. పొరేల్ ధాటిగా ఆడుతున్న ఎక్కువసేపు నిలబడటం ముఖ్యం. డుప్లెసిస్ దూకుడు సానుకూలాంశం కాగా... కేఎల్ రాహుల్ ఈ సీజన్ ఆరంభంలో చూపించిన ఫామ్ ఇప్పుడు కనిపించడం లేదు. వరుసగా విఫలమవుతున్న కరుణ్ నాయర్ స్థానంలో మరొకరికి అవకాశం ఇస్తారా చూడాలి. గత మ్యాచ్‌లో గాయపడిన కెప్టెన్ అక్షర్ పటేల్ పూర్తిగా కోలుకొని ఫిట్‌గా మారడం ముఖ్యం. లేదంటే అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లోనూ జట్టుకు దెబ్బ పడుతుంది. స్టబ్స్, విప్‌రాజ్, అశుతోష్ చివరి ఓవర్లలో చెలరేగితే క్యాపిటల్స్ పైచేయి సాధించవచ్చు. కేవలం 6.74 ఎకానమీతో 12 వికెట్లు తీసిన కుల్దీప్ బౌలింగ్‌లో జట్టు ప్రధాన అస్త్రం. స్టార్క్ వికెట్లు తీస్తున్నా పరుగులను నిలువరించడం ముఖ్యం. ముకేశ్, చమీరా, మోహిత్ ప్రభావం చూపలేకపోవడం ఢిల్లీ బౌలింగ్‌ను కాస్త బలహీనంగా మార్చింది.

13 ఐపీఎల్ టోర్నీలో ఇప్పటి వరకు హైదరాబాద్, ఢిల్లీ జట్లు ముఖాముఖిగా 25 సార్లు తలపడ్డాయి. 13 మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ గెలుపొందగా... 12 మ్యాచ్‌ల్లో ఢిల్లీ జట్టుకు విజయం దక్కింది. ఢిల్లీపై హైదరాబాద్ అత్యధిక స్కోరు 266 పరుగులుకాగా... అత్యల్ప స్కోరు 116. హైదరాబాద్‌పై ఢిల్లీ అత్యధిక స్కోరు 207 పరుగులుకాగా... అత్యల్ప స్కోరు 80.

సూపర్ సబలెంకా

- మూడోసారి మాడ్రిడ్ ఓపెన్ టైటిల్ హస్తగతం
- ఫైనల్లో కోకో గాఫ్‌పై విజయం



మాడ్రిడ్: ఈ ఏడాది తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ ప్రపంచ నంబర్‌వన్ అరీనా సబలెంకా (బెలారస్) మూడో సింగిల్స్ టైటిల్‌ను తన ఖాతాలో జమ చేసుకుంది. మాడ్రిడ్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 సిరీస్ టోర్నీలో టాప్ సీడ్ సబలెంకా మూడోసారి చాంపియన్‌గా నిలిచింది. అమెరికా స్టార్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ కోకో గాఫ్‌తో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో సబలెంకా 6-3, 7-6 (7/3)తో విజయాన్ని అందుకొని మూడోసారి మాడ్రిడ్ ఓపెన్ టైటిల్‌ను దక్కించుకుంది. 2023, 2021లలో కూడా సబలెంకా ఈ టోర్నీలో చాంపియన్‌గా నిలిచింది. పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) తర్వాత మాడ్రిడ్ ఓపెన్ టైటిల్‌ను మూడుసార్లు గెలిచిన రెండో ప్లేయర్‌గా సబలెంకా గుర్తింపు పొందింది. ఓవరాల్‌గా సబలెంకా కెరీర్‌లో ఇది 19వ టైటిల్‌కాగా, ఈ ఏడాది మూడోది. ఈ సంవత్సరం ఆమె బ్రిస్బేన్ ఓపెన్, మయామి ఓపెన్‌లలో విజేతగా నిలిచింది. కోకో గాఫ్‌తో 1 గంటా 39 నిమిషాల పాటు జరిగిన ఫైనల్లో సబలెంకా రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయిన బెలారస్ స్టార్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. 142 పాయింట్లకుగాను సబలెంకా 81 పాయింట్లు, కోకో గాఫ్ 61 పాయింట్లు గెలిచారు. విజేతగా నిలిచిన సబలెంకాకు 9,85,030 యూరోల (రూ. 9 కోట్ల 40 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. రన్నరప్ కోకో గాఫ్‌కు 5,23,870 (రూ. 5 కోట్లు) యూరోల ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి.

వైభవ్ ఆట ఆకట్టుకుంది

ప్రధాని నరేంద్ర మోదీ కితాబు



పట్నా: ఈ సీజన్ ఐపీఎల్‌లో సంచలన బ్యాటింగ్‌తో అందరికంటా పడిన వైభవ్ సూర్యవంశీని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలతో ముంచెత్తారు. అతను పడిన కష్టం, ఆడిన తీరు తనని అమితంగా ఆకట్టుకుందని అన్నారు. బిహార్‌లో 'ఖేలో ఇండియా' గేమ్స్ ఆరంభోత్సవం సందర్భంగా మోదీ వీడియో సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా క్రీడాకారుల కష్టాన్ని కొనియాడిన ఆయన వైభవ్ విధ్వంసక శతకాన్ని ఆ వీడియో సందేశంలో ప్రముఖంగా ప్రస్తావించారు. 'బిహార్ ముద్దుబిడ్డ వైభవ్ సూర్యవంశీ. అతను ఆడిన మ్యాచ్‌ను చూశాను. 14 ఏళ్ల కౌమార ప్రాయంలోనే కళ్లుచెదిరే ప్రదర్శన కనబరిచాడు. ఇన్నాళ్లు ఏ భారత బ్యాటర్‌కు సాధ్యం కానీ రికార్డును సాధించిన ఘనత వైభవ్‌కే దక్కుతుంది. ఇంతచిన్న వయసులో అంతటి ఇన్నింగ్స్ ఆడటం మాటలు కాదు. దీనికోసం అతనెంతో కష్టపడ్డాడు. ఆటకోసం తపించాడు. అంకితభావంతో ముందడుగు వేశాడు. అతన్ని చూస్తుంటే ముచ్చటేస్తుంది' అని ఆ సందేశంలో ప్రశంసల వర్షం కురిపించారు. 'ఖేలో ఇండియా' కార్యక్రమంతో తమ ప్రభుత్వం క్రీడాకారుల సాఫల్యం కోసం కృషిచేస్తోందని చెప్పారు. అన్ని రకాలుగా అండదండలు అందించేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మన భారత అథ్లెట్లు క్రికెట్, హాకీలే కాదు కొత్తకొత్త క్రీడలపై కూడా కసరత్తు చేయాలని ప్రధాని సూచించారు. గ్రామీణ క్రీడ ఖో-ఖోతో పాటు గట్కా, మల్లకంబ, యోగాసన తదితర కొత్త క్రీడల్ని 'ఖేలో-ఇండియా'లో భాగం చేశామని చెప్పారు. టీనేజ్ కుర్రాడు వైభవ్ గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో విధ్వంసరచన చేశాడు. కేవలం 35 బంతుల్లోనే వేగవంతమైన సెంచరీ సాధించిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. 18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఇది రెండో ఫాస్టెస్ట్ సెంచరీగా నిలిచింది. 30 బంతుల్లో గేల్ చేసిన సెంచరీ మొదటి స్థానంలో ఉంది.



విజేత గోవా ఎఫ్‌సీ

భువనేశ్వర్: సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో గోవా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు చాంపియన్‌గా నిలిచింది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీ ఫైనల్లో గోవా 3-0 గోల్స్ తేడాతో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీపై విజయం సాధించింది. ఈ విజయంతో గోవా జట్టు ఏఎఫ్‌సీ చాంపియన్స్ లీగ్-2 ప్రిలిమ్స్‌కు అర్హత సాధించింది. గోవా జట్టు తరఫున బోర్జా హెరెరా (23వ, 51వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో విజృంభించగా... డెజన్ డ్రాజిక్ (72వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో జరిగిన ఈ పోరు ఆరంభం నుంచే మనోలో శిక్షణలోని గోవా క్లబ్ సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. ఫెడరేషన్ కప్‌నకు ప్రత్యామ్నాయంగా 2018 నుంచి నిర్వహిస్తున్న ఈ టోర్నీలో గోవా జట్టు రెండోసారి విజేతగా నిలిచింది. 2019లో మొదటిసారి చాంపియన్‌గా నిలిచిన గోవా మళ్లీ ఇప్పుడు రెండోసారి ట్రోఫీ చేజిక్కించుకుంది.

భారత మహిళల జట్టును గెలిపించిన నవ్‌నీత్ కౌర్

చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళల జట్టు ఓటమి



పెర్త్: ఆ్రస్టేలియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టుకు తొలి విజయం దక్కింది. టూర్‌లో భాగంగా గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడిన భారత అమ్మాయిల జట్టు... ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో 1-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్‌ను భారత స్ట్రయికర్ నవ్‌నీత్ కౌర్ (21వ నిమిషంలో) నమోదు చేసింది. హోరాహోరీగా సాగిన పోరు తొలి క్వార్టర్‌లోనే ఆ్రస్టేలియా రెండు పెనాల్టీ కార్నర్‌లను భారత డిఫెండర్లు సమర్థవంతంగా అడ్డుకున్నారు. రెండో క్వార్టర్‌లో వైస్ కెప్టెన్ నవ్‌నీత్ కౌర్ ఫీల్డ్ గోల్‌తో భారత్ ఖాతా తెరవగా... మ్యాచ్ ముగిసేంత వరకు అదే ఆధిపత్యం కొనసాగించి విజయం సాధించింది. ఈ పర్యటనలో భాగంగా తొలుత ఆ్రస్టేలియా 'ఎ' జట్టుతో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన టీమిండియా... ఆ తర్వాత ఆ్రస్టేలియా సీనియర్ జట్టుతో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ పరాజయం పాలైంది. చివరి పోరులో డిఫెన్స్‌లో సత్తా చాటిన సలీమా టెటె సారథ్యంలోని భారత జట్టు విజయంతో పర్యటనను ముగించింది. తదుపరి భారత జట్టు ప్రొ హాకీ లీగ్ చివరి అంచె పోటీల్లో బరిలోకి దిగనుంది. జూన్ 14 నుంచి జూన్ 29వ తేదీ వరకు ఈ మ్యాచ్‌లు లండన్, ఆంట్‌వర్ప్, బెర్లిన్ నగరాల్లో జరుగుతాయి.



నాలుగేళ్ల తర్వాత..

ఒసాకా ఖాతాలో టైటిల్

మాలో (ఫ్రాన్స్): నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ జపాన్ టెన్నిస్ స్టార్ నయోమి ఒసాకా డబ్ల్యూటీఏ సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం ముగిసిన ఎల్ ఓపెన్ 35 డబ్ల్యూటీఏ-125 టోర్నీలో ఒసాకా విజేతగా నిలిచింది. 2021 ఆ్రస్టేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ తర్వాత ఒసాకాకు ఇదే తొలి టైటిల్ కావడం విశేషం. ఫైనల్లో ఒసాకా 6-1, 7-5తో కాజా జువాన్ (స్లొవేనియా)పై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన రెండో సీడ్ ఒసాకా... ఒక ఏస్ కొట్టి 6 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 6 బ్రేక్ పాయింట్లు కాచుకున్న ఈ మాజీ ప్రపంచ నంబర్‌వన్... ఓవరాల్‌గా 70 పాయింట్లు సాధించింది. 2023 జూలైలో పాపకు జన్మనిచ్చిన ఒసాకా ఆ తర్వాత నెగ్గిన తొలి డబ్ల్యూటీఏ టైటిల్ ఇదే. ఇటీవలి కాలంలో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న 27 ఏళ్ల ఒసాక ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లో పరాజయం పాలైంది.

ఎదురులేని చైనా

14వసారి సుదిర్మన్ కప్ టైటిల్ సొంతం



జియామెన్ (చైనా): అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో తమకు తిరుగులేదని చైనా జట్టు మరోసారి నిరూపించుకుంది. ఆదివారం ముగిసిన ప్రపంచ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సుదిర్మన్ కప్‌లో చైనా జట్టు 14వసారి విజేతగా నిలిచింది. దక్షిణ కొరియాతో జరిగిన ఫైనల్లో చైనా జట్టు 3-1తో విజయం సాధించింది. 1989లో ప్రారంభమైన సుదిర్మన్ కప్‌లో చైనా జట్టు 1995, 1997, 1999, 2001, 2005, 2007, 2009, 2011, 2013, 2015, 2019, 2021, 2023, 2025లలో టైటిల్ దక్కించుకోవడం విశేషం. కొరియాతో జరిగిన ఫైనల్ పోరులో తొలి మ్యాచ్‌గా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫెంగ్ యాన్ జె-హువాంగ్ డాంగ్‌పింగ్ జోడీ 21-16, 17-21, 21-15తో సియో సెంగ్ జే-చయి యు జుంగ్ జంటను ఓడించి చైనాకు 1-0 ఆధిక్యం అందించింది. రెండో మ్యాచ్‌గా జరిగిన మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సె యంగ్ (కొరియా) 21-17, 21-16తో వాంగ్ జి యిపై నెగ్గి స్కోరును 1-1తో సమం చేసింది. మూడో మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ షి యుకీ 21-5, 21-5తో జెయోన్ హ్యోక్ జిన్‌ను ఓడించి చైనాను 2-1తో ఆధిక్యంలో నిలిపాడు. నాలుగో మ్యాచ్‌గా జరిగిన మహిళల డబుల్స్‌లో లియు షెంగ్ షు-టాన్ నింగ్ జోడీ 21-14, 21-17తో బేక్ హా నా-లీ సో హీ జంటపై గెలిచి చైనాకు 3-1తో టైటిల్‌ను ఖరారు చేసింది.






దివంగత పోప్ ఫ్రాన్సిస్ చిత్రం ఇతివృత్తంగా రోమ్‌లోని దుకాణాల్లో ప్రదర్శనకు ఉంచిన బాటిల్, నాణెం, కీ చెయిన్ తదితర రూపాల్లోని జ్ఞాపికలు. పోప్ ఫ్రాన్సిస్ ఏప్రిల్ 21న తుదిశ్వాస విడిచిన విషయం తెల్సిందే.

పుత్తడి పుట్టిందెక్కడ?


అంతుచిక్కని బంగారం పుట్టుపూర్వోత్తరాలు

- నక్షత్రాలు ఢీకొనడం వల్ల పుట్టిందంటున్న శాస్త్రవేత్తలు
- పేలిన నక్షత్రాలే పసిడిని వెదజల్లుతాయంటున్న పరిశోధన

బంగారం. ఈ పేరు వింటేనే భారతీయులు మైమరిచిపోతారు. మనోళ్ల బంగారం మోజు దెబ్బకు పదిగ్రాముల పుత్తడి ధర ఏకంగా రూ.లక్ష మార్కు దాటేయడం తెల్సిందే. పసిడి అంటే సామాన్యులతో పాటు శాస్త్రవేత్తలకు సైతం ప్రత్యేక ఆసక్తి. పుత్తడి పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకునేందుకు వాళ్లు తెగ ఆసక్తి చూపిస్తారు. ''స్వర్ణం మూలాలెక్కడున్నాయి? బంగారు లోహం భూమ్మీదకు ఎలా వచ్చింది?'' అన్న ప్రశ్నలు శాస్త్రజ్ఞులను ఎప్పటినుంచో తొలుస్తున్నాయి. పేలిపోయిన నక్షత్రాల నుంచి బంగారం ఉద్భవించిందని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. న్యూట్రాన్ నక్షత్రాలే పుత్తడికి పుట్టిల్లు అని సరికొత్త అధ్యయనం తెలిపింది. ఇందుకు సంబంధించిన పరిశోధన పత్రం తాజాగా 'ది ఆస్ట్రో ఫిజిక్స్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమైంది. దాదాపు 1,380 కోట్ల సంవత్సరాల క్రితం బిగ్‌బ్యాంగ్ వల్ల విశ్వం ఆవిర్భవించిందన్నది శాస్త్రవేత్తల సిద్ధాంతం. విశ్వం ఏర్పడిన తొలినాళ్లలో అత్యంత తేలికైన హైడ్రోజన్, హీలియం, అంతకంటే తక్కువ పరిమాణంలో లిథియం వంటి మూలకాలు మాత్రమే ఏర్పడ్డాయి. ఆ సమయంలో పేలిన నక్షత్రాలు ఇనుము వంటి కాస్త బరువైన మూలకాలను విశ్వమంతటా వెదజల్లాయి. ఇనుము కంటే సాంద్రత ఎక్కువ ఉండే బంగారం ఎప్పుడు, ఎలా ఉద్భవించిందనే ప్రశ్నకు 'మ్యాగ్నెటార్' సరైన సమాధానమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఏమిటీ మ్యాగ్నెటార్లు?

మనకు అతి సమీపంలోని నక్షత్రమైన సూర్యుడు అపారమైన శక్తిని వెలుతురు, ఉష్ణ శక్తి రూపంలో నిరంతరం విశ్వంలోకి వెదజల్లుతూనే ఉంటాడు. ఇలా నక్షత్రం తనలోని అపారమైన శక్తినంతా వెదజల్లాక గురుత్వాకర్షణ బలాలను కోల్పోతుంది. దీంతో ఎర్ర రంగుకు మారి తుదకు పేలిపోతుంది. దాన్ని సూపర్‌నోవా అంటారు. పేలిన నక్షత్రం న్యూట్రాన్ నక్షత్రంగా, లేదంటే బ్లాక్‌హోల్ (కృష్ణబిలం)గా రూపాంతరం చెందుతుంది. ఈ న్యూట్రాన్ నక్షత్ర ద్రవ్యరాశి అత్యంత ఎక్కువగా ఉంటుంది. ఈ స్థితిలో అది గురుత్వాకర్షణ శక్తిని తరంగాల రూపంలో విశ్వంలోకి వెదజల్లుతుంది. వాటితోపాటు 'గామా' కిరణాలను, అణు కేంద్రకాలను కూడా అతి వేగంగా వెదజల్లుతుంది. దీన్ని ఆర్-ప్రాసెస్ అంటారు. బరువైన మూలకమైన బంగారం ఈ క్రమంలోనే జనించిందని అధ్యయనం విశ్లేషించింది. ''విశ్వంలోని ప్రాథమిక అంశాల పుట్టుక నిజంగా నవ్వు తెప్పించే క్లిష్టతరమైన పజిల్ వంటిది. వాటి పుట్టుపూర్వోత్తరాలను మనం పూర్తిగా కనుక్కోలేం. రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఢీకొంటే బంగారం పుట్టిందని గతంలో భావించేవారు. కానీ అత్యంత శక్తివంతమైన మ్యాగ్నెటార్ (న్యూట్రాన్ నక్షత్రం) నుంచి కూడా బంగారం పుడుతోందని అధ్యయనంలో తేలింది'' అని కొలంబియా వర్సిటీ ఫిజిక్స్ డాక్టోరల్ విద్యార్థి, పరిశోధన ముఖ్య రచయిత అనిరుధ్ పటేల్ చెప్పారు.



20 ఏళ్ల సమాచారం...

''2017లో రెండు నక్షత్రాలు ఢీకొనడాన్ని శాస్త్రవేత్తలు గమనించారు. దాంతో అంతరిక్షంలో అలల్లా గురుత్వాకర్షణ తరంగాలు విస్తరించాయి. వీటితోపాటే గామా కిరణాలు పెద్దమొత్తంలో వెలువడ్డాయి. ఇలా ఢీకొనడాన్ని కిలోనోవాగా పేర్కొన్నారు. దాని ఫలితంగా బరువైన బంగారం, ప్లాటినం, లెడ్ ఏర్పడ్డాయి. అందుకే కిలోనోవాలను బంగారం కర్మాగారాలుగా చెబుతారు. మ్యాగ్నెటార్లు గామా కిరణాలను వెదజల్లినప్పుడే బంగారం పుట్టింది'' అని లూసియానా స్టేట్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎరిక్ బర్న్స్ చెప్పారు.

నక్షత్రకంపం!

న్యూట్రాన్ నక్షత్రాల్లో అత్యంత కాంతిమయ నక్షత్రాలనే మ్యాగ్నెటార్లు అంటారు. కేవలం టీస్పూన్ సైజులో ఉండే మ్యాగ్నెటార్ ద్రవ్యరాశి కూడా ఏకంగా 100 కోట్ల భూగోళాలంత బరువుంటుంది! మ్యాగ్నెటార్ చుట్టూ అత్యంత శక్తివంతమైన గురుత్వాకర్షణ క్షేత్రం ఉంటుంది. బిగ్‌బ్యాంగ్ జరిగిన 20 కోట్ల ఏళ్లకే మ్యాగ్నెటార్లు ఏర్పడ్డాయని భావిస్తున్నారు. భూమి అంతర్గత పొరల్లో సర్దుబాటు వల్ల భూకంపాలు వచ్చినట్టే నక్షత్రంలోనూ నక్షత్ర కంపం పుడుతుంది. మాగ్నెటార్ అంతర్భాగంలోని ద్రవరూప పదార్థంలో సర్దుబాటు కారణంగా నక్షత్ర బాహ్యావలయాల్లో 'స్టార్‌క్వేక్'లు వస్తాయట.

- సాక్షి, నేషనల్ డెస్క్

స్టార్‌షిప్ పరీక్షిస్తుండగా పేలుడు, ప్రయోగం వాయిదా

టెక్సాస్: ఎలాన్‌మస్క్ స్పేస్‌ఎక్స్ సంస్థ స్టార్‌షిప్ రాకెట్ తొమ్మిదో ప్రయోగం కూడా వాయిదా పడింది. టెక్సాస్‌లోని బేస్ ఫెసిలిటీలో స్టాటిక్ ఫైర్ టెస్ట్ సందర్భంగా భారీ పేలుడు సంభవించింది. పేలుడుతో ఎవరికీ ఎలాంటి హానీ జరగనప్పటికీ.. స్టార్‌షిప్ ప్రోటోటైప్‌కు గణనీయమైన నష్టాన్ని కలిగించింది. దీంతో ప్రయోగాన్ని వాయిదా వేస్తున్నట్లు స్పేస్‌ఎక్స్ సంస్థ ప్రకటించింది. పేలుడు, వైఫల్యానికి కారణాన్ని గుర్తించి, పరిష్కరించడానికి పనిచేస్తోంది. స్టార్‌షిప్ ఎదుర్కొంటున్న వరుస ఎదురుదెబ్బల్లో తాజాగా సంఘటన ఒకటి. ఇటీవలే ఓ స్పేస్‌క్రాఫ్ట్ నియంత్రణ కోల్పోయి టేకాఫ్ అయిన కొన్ని నిమిషాల తర్వాత కూలిపోయింది. శిథిలాలు కరీబియన్ దీవులపై చెల్లాచెదురుగా పడిపోయాయి.. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) యూఎస్ గగనతలాన్ని తాత్కాలికంగా మూసివేసింది. ప్రతి ప్రమాదం సమగ్ర సమీక్ష జరిపి, నవీనీకరిస్తున్నా.. పదేపదే వైఫల్యాలు ప్రోగ్రామ్ వేగం, భద్రతా ప్రోటోకాల్స్ గురించిన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అయినప్పటికీ చంద్రుడు, అంగారక గ్రహాలపైకి మానవులను తీసుకెళ్లగల సామర్థ్యంతో స్టార్‌షిప్‌ను పూర్తిగా పునర్వినియోగ రాకెట్‌గా మార్చేందుకు స్పేస్‌ఎక్స్ ప్రయత్నిస్తోంది.

ప్రెస్‌మీట్‌లో పాక్ జర్నలిస్టుల బూతులు

లండన్: లండన్‌లోని ఓ కేఫ్‌లో ఇద్దరు పాక్ జర్నలిస్టులు దారుణంగా ప్రవర్తించారు. పాక్ నేత ప్రెస్‌మీట్ సందర్భంగా జరిగిన గొడవ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ సెక్రటరీ జనరల్, జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అనుచరుడు సల్మాన్ అక్రమ్ రాజా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సఫీనా ఖాన్, హమ్ న్యూస్‌లో పనిచేస్తున్న మాలిక్, ఇతర పాకిస్తాన్ జర్నలిస్టులు పలువురు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం సఫీనా ఖాన్, అసద్ మాలిక్ గొడవకు దిగారు. బూతులు తిట్టుకున్నారు. కుటుంబాలను సైతం దూషించుకున్నారు. అనంతరం మాలిక్, ఇతర పాక్ జర్నలిస్టులు తనను చంపేస్తామని బెదిరించారని సఫీనా ఖాన్ ట్వీట్ చేశారు. తనకు ఏదైనా జరిగితే ఈ ముగ్గురు రిపోర్టర్లే బాధ్యత వహిస్తారని పేర్కొన్నారు. ఆరోపణలను అసద్‌ఖాన్ తోసిపుచ్చారు.

'పహల్గాం'లో భద్రతా లోపాలు : సీపీఎం

న్యూఢిల్లీ: పహల్గాంలో 26 మందిని పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడి భద్రతా లోపాల కారణంగానే జరిగిందని, దీనిపై విచారణ జరిపించాలని సీపీఎం డిమాండ్ చేసింది. హంతకులను గుర్తించి శిక్షించడానికి అన్ని ప్రయత్నాలు చేయాలని కోరింది. సోషల్ మీడియాలో ముస్లింలు, కశ్మీరీలపై జరుగుతున్న విద్వేష ప్రచారాన్ని, దాడుల ఘటనలను ఖండించింది. శనివారం పొలిట్‌బ్యూరో సమావేశం నిర్వహించిన పార్టీ.. ఆదివారం ప్రకటన విడుదల చేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు సైనిక ప్రతిస్పందన ఉపయోగపడుతుందో లేదో ప్రభుత్వం బేరీజు వేసుకోవాలని సూచించింది. దాడిని కశ్మీర్ ప్రజలు ఖండించడం, నిరసన తెలపడం అత్యంత ముఖ్యమైన ఘటనగా వర్ణించింది. 'లోయలో బంద్ జరిగింది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద శక్తులను ఏకాకిని చేయడానికి ఈ ప్రజా సెంటిమెంట్‌ను నిర్మించాలి. అమాయక కుటుంబాలను ప్రభావితం చేసి, ప్రజలను దూరం చేసే ఇళ్ల కూల్చివేయడం వంటి చర్యలేవీ తీసుకోకపోవడం మంచిది' అని పేర్కొంది. మత ప్రాతిపదికన ప్రజలను చీల్చడానికి బీజేపీ వక్ఫ్ చట్టాన్ని ఉపయోగిస్తోందని సీపీఎం ఆరోపించింది.

నీట్ రాసిన 60 ఏళ్ల సిద్ధ వైద్యుడు

సాక్షి, చెన్నై: తమిళనాడులోని తూత్తుకుడిలో 60 ఏళ్ల సిద్ధ వైద్యుడు పచైమాల్ నీట్ పరీక్ష రాశారు. తనకు వైద్యంపై మక్కువ ఎక్కువ అని పచైమాల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా చెన్నై శివారులోని తాంబరంలోని నీట్ రాయాల్సిన కయల్విళి(17)పరీక్షా భయంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

ఇమ్రాన్ ఖాన్, బిలావల్ ఎక్స్ ఖాతాలు బ్లాక్

న్యూఢిల్లీ: పహల్గాం దాడి తర్వాత ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పాక్‌పై భారత్ మరో చర్య తీసుకుంది. తాజాగా పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్, మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో ఎక్స్ ఖాతాలను భారత్‌లో నిషేధించింది. న్యాయపరమైన డిమాండ్‌కోసం దానిని భారత్‌లో నిలిపివేసినట్లు సందేశం కనిపించింది. ఇరువురు నేతల ఎక్స్ ఖాతా ప్రొఫైల్ పిక్చర్, కవర్ ఇమేజ్ ఖాళీగా కనిపించాయి. పాకిస్తాన్ సమాచార, ప్రసార శాఖ మంత్రి అతావుల్లా తరార్ ఎక్స్ ఖాతాను ఇప్పటికే బ్లాక్ చేసింది. హనియా అమీర్, మహీరా ఖాన్‌తో సహా పాక్ నటుల ఇన్‌స్టా ఖాతాలను కూడా నిలిపివేసింది.

ట్రంప్‌తో ప్రపంచం నాశనం

హాలీవుడ్ నటుడు సీన్ పెన్



వాషింగ్టన్: వ్యక్తిగత జీవితంతోనే కాదు.. రాజకీయ అభిప్రాయాలతోనూ వివాదాస్పదమైన హాలీవుడ్ నటుడు సీన్ పెన్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారాన్ని నిలుపుకోవడానికి ప్రపంచాన్ని నాశనం చేస్తారన్నారు. అంతేకాదు.. హంతకుడైన అసూయపూరిత జీవిత భాగస్వామిగా అభివర్ణించారు. డెమొక్రటిక్ ప్రతినిధి ఎరిక్ స్వాల్వెల్‌తో కలిసి జిమ్ అకోస్టా పాడ్ కాస్ట్ 'ది జిమ్ అకోస్టా షో'లో పెన్ మాట్లాడారు. తనకు కాకపోతే ఇంకెవ్వరికీ దక్కవద్దన్న ధోరణి ట్రంప్‌లో ఉంటుందన్నారు.తన అధికారంతో విధ్వంసానికి పాల్పడే స్వార్థపూరిత వ్యక్తిగా ట్రంప్‌ను అభివర్ణించారు. మూడోసారి అధ్యక్ష పదవికోసం ట్రంప్ ప్రయత్నిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు పెన్ పై సమాధానమిచ్చారు. ఇక డెమొక్రాట్ అయిన స్వాల్వెల్ మాట్లాడుతూ.. నియంతలెప్పుడూ తమ వారసత్వాన్ని కొనసాగించడానికి ప్రణాళికలు వేయలేదన్నారు. తనను తాను రక్షించుకోవడానికి దేశాన్ని ఏం చేయడానికైనా ట్రంప్ సిద్ధమవుతారని వ్యాఖ్యానించారు.

మూడేళ్ల చిన్నారి 'సల్లేఖనం'

ఆమరణ నిరాహార దీక్ష ● పది నిమిషాలకే మరణం

ముంబై: మూడేళ్ల చిన్నారి వియానా. ఐటీలో పనిచేసే పీయూష్, వర్షా జైన్ దంపతుల ఒక్కగానొక్క కూతురు. మాటలు కూడా పూర్తిగా రాని చిన్నారికి బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్టు గత జనవరిలో నిర్ధారణ అయ్యింది. ముంబైలో ఆపరేషన్ చేయించినా లాభం లేకపోయింది. రోజురోజుకూ పరిస్థితి విషమించడంతో జైన మతస్తులైన వారు ఇండోర్‌లోని తమ మత గురువు రాజేష్ ముని మహరాజ్ దగ్గరకు వెళ్లారు. చిన్నారిని 'సంతారా/సల్లేఖన' (ఆమరణ నిరాహార దీక్ష) చేయించాలని సూచించగా అగీకరించారు. అయితే ఆ దీక్ష తీసుకున్న పది నిమిషాల్లోనే చిన్నారి మరణించింది. అతి పిన్న వయసులో 'సల్లేఖన దీక్ష' స్వీకరించిన వ్యక్తిగా 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో వియానా పేరు నమోదవడంతో విషయం వెలుగులోకి వచ్చింది.



వియానాతో పీయూష్ దంపతులు

ఏమిటీ దీక్ష?

సంతారా లేదా సల్లేఖనం అంటే స్వచ్ఛందంగా ఆమరణ నిరాహార దీక్ష చేసే జైన ఆచారం. అలా శరీరాన్ని కృశింపజేసుకుంటూ మరణాన్ని ఆహ్వానించడం. సాధారణంగా వృద్ధులు ఈ దీక్ష తీసుకుంటారు. మూడేళ్ల చిన్నారికి అలాంటి దీక్ష ఇవ్వడం చర్చనీయంగా మారింది. జీవించే హక్కును కాలరాస్తూ తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారుతోంది. తల్లిదండ్రుల వాదన వేరేలా ఉంది. ''కూతురు చనిపోవాలని ఏ తల్లీ కోరుకోదు. నా బిడ్డతో సంతార ప్రతిజ్ఞ చేయించడానికి ఎంత బాధపడ్డానో చెప్పలేను! ట్యూమర్‌తో తను విలవిల్లాడుతోంది. ఆ స్థితిలో చూడలేకే అంగీకరించాం'' అని వర్ష తెలిపింది. ''నీళ్లు తాగడానికి కూడా ఇబ్బంది పడ్డ స్థితిలో పాపకు చివరి క్షణాలు సమీపించాయి గనుక మా గురువు సలహా మేరకు సంతారకు అంగీకరించాం'' అని పీయూష్ చెప్పారు. కానీ అలాంటి నిర్ణయం తీసుకునే హక్కు తల్లిదండ్రులకు లేదని న్యాయ నిపుణులు అంటున్నారు. ''మత స్వేచ్ఛ నమ్మకానికి సంబంధించింది మాత్రమే. ప్రాణాలు తీసే ఆచారాలను పాటించడానికి కాదు'' అన్నది వారి వాదన.

సల్లేఖనం నేరమన్న హైకోర్టు

సంతారా/సల్లేఖన దీక్ష నేరమని 2015లో రాజస్థాన్ హైకోర్టు పేర్కొంది. ఈ ఆచారాన్ని ఆత్మహత్యకు ప్రేరేపించడం, ఆత్మాహత్యాయత్నంగా పరిగణించి శిక్షార్హమైన నేరంగా ప్రకటించింది. ఇది న్యాయ, జైన మత వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. తీర్పును జైన సంస్థలు సుప్రీంకోర్టులో సవాలు చేయడంతో హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది.

7 నుంచి రష్యాలో జిన్ పింగ్ పర్యటన

బీజింగ్: చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ రష్యా పర్యటన తేదీ ఖరారయ్యింది. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు రష్యాలో ఆయన పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మాస్కోలో జరిగే 80వ వార్షిక విక్టరీ డే వేడుకల్లో పాల్గొననున్నారు. అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమై పలు కీలక అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై చర్చించనున్నారు. అమెరికా, చైనా మధ్య టారిఫ్‌ల యుద్ధం, ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలంటూ రష్యాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిళ్లు పెంచుతున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరువురు నేతలు పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ఆదివారం తెలిపింది. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టాక జిన్ పింగ్ రష్యా వెళ్లడం ఇదే మొదటిసారి. చివరగా ఆయన 2024లో రష్యాలో బ్రిక్ శిఖరాగ్రంలో పాల్గొనేందుకు వెళ్లారు. కాగా, 9న జరిగే విక్టరీ డే పరేడ్‌లో పాల్గొనాలంటూ భారత ప్రధాని మోదీకి సైతం పుతిన్ ఆహ్వానం పంపారు. అయితే, మోదీ రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌ను పంపుతున్నారు. పహల్గాం ఘటన అనంతరం పాక్‌తో ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు.

మాటలొద్దు.. చేతలు కావాలి: ప్రియాంక

తిరువనంతపురం: పహల్గాం ఉగ్రదాడికి కారణమైన పాకిస్తాన్‌కు తగు గుణపాఠం చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ప్రధాని మోదీ తీసుకునే చర్యలపై దేశం యావత్తూ ఎదురుచూస్తోందని తెలిపింది. దారుణం జరిగి 15 రోజులైనా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రధానిని ప్రశ్నించింది. కాంగ్రెస్ నేతలు ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్ ఆదివారం వయనాడ్, తిరువనంతపురంలలో మాట్లాడారు. బహిరంగ సభలు, సమావేశాల్లో అది చేస్తాం, ఇది చేస్తాం అని ప్రకటనలు చేయడం మినహా చేసిందేమీ లేదని మండిపడింది. 'మీకు 54 అంగుళాల ఛాతీ ఉంది. అది ప్రదర్శించే సమయమొచ్చింది. పాక్‌కు బుద్ధి చెప్పే విషయంలో ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వెన్నంటే ఉంటాయి'అని పేర్కొన్నారు. గతంలో ముంబై ఉగ్రదాడుల విషయంలో పాక్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మోదీ ప్రభుత్వం తప్పుబట్టిన విషయాన్ని గుర్తు చేస్తూ..పహల్గాం ఘటనకు బాధ్యతగా హోం మంత్రి అమిత్ షాతో రాజీనామా చేయిస్తారా అని ప్రశ్నించారు. కశ్మీర్‌ను సురక్షితంగా మార్చామంటూ ప్రచారం చేసుకున్న మోదీ ప్రభుత్వం.. పర్యాటకుల భద్రతకు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మండిపడ్డారు.

వేడెక్కుతున్న సముద్రాలు

ఇలాగే కొనసాగితే ఎన్నో దుష్పరిణామాలు ● గ్రీన్‌హౌస్ వాయువుల వల్ల పెనుముప్పు

మనిషి నిర్వాకాల పుణ్యమా అని వాతావరణం విపరీతమైన మార్పులకు లోనవుతోంది. మితిమీరుతున్న కాలుష్యం, గ్రీన్‌హౌజ్ వాయువుల దెబ్బకు భూగోళం కాస్తా అగ్నిగోళంగా మారిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో సముద్రాలు సైతం అసాధారణ రీతిలో వేడెక్కుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామం ఇలాగే కొనసాగితే సముద్రాల్లోని జీవజాలం మనుగడ కోల్పోవడమే గాక రుతువులు గతి తప్పే ప్రమాదముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా రెండు ప్రాంతాల్లో సముద్రాలు అధికంగా వేడెక్కుతున్నట్లు తాజా అధ్యయనంలో గుర్తించారు. ఉత్తర, దక్షిణార్ధ గోళాల్లో 40 డిగ్రీల అక్షాంశాలసమీపంలో సముద్రాల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ కెవిన్ ట్రెన్‌బెర్త్ చెప్పారు. దక్షిణార్ధ గోళంలో 40-45 డిగ్రీల అక్షాంశాల మధ్య కడలి వేడి వేగంగా పెరిగిపోతున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా న్యూజిలాండ్, టాస్మానియా చుట్టుపక్కల, అర్జెంటీనా తూర్పు భాగంలో అట్లాంటిక్ సముద్రంలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ఉత్తరార్ధ గోళంలో 40 డిగ్రీల అక్షాంశానికి ఉత్తర దిక్కున, అమెరికాకు తూర్పున నార్త్ అట్లాంటిక్, జపాన్‌కు తూర్పున నార్త్ పసిఫిక్ సముద్రాలు అసాధారణ స్థాయిలో వేడెక్కుతున్నట్లు స్పష్టంచేశారు. ఇది నిజంగా ఆందోళనకర పరిణామమేనని వెల్లడించారు. యూనివర్సిటీ ఆఫ్ అక్లాండ్, నేషనల్ సెంటర్ ఆఫ్ అట్మాస్ఫిరిక్ రీసెర్చ్(ఎన్‌సీఏఆర్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అధ్యయన వివరాలను జర్నల్ ఆఫ్ క్లైమేట్‌లో ప్రచురించారు.



- సముద్రాల ఉష్ణోగ్రతలు పెరిగిపోతే ఎన్నో దుష్పరిణామాలు ఎదురవుతాయి. ముఖ్యంగా సముద్ర పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటుంది.
- సముద్రాల నుంచి నీటి ఆవిరి స్థాయిలు పెరుగుతాయి. ఈ ఆవిరి గ్రీన్‌హౌస్ వాయువుగా తిరిగి వాతావరణంలోనే కలుస్తుంది. దీనివల్ల వాతావరణం అస్తవ్యస్తంగా మారి తుఫాన్లు, వరదల ముప్పు మరింత పెరుగుతుంది.
- భూగోళంపై 70 శాతానికిపైగా విస్తీర్ణాన్ని సముద్రాలు ఆక్రమిస్తున్నాయి. గ్రీన్‌హౌస్ వాయువుల వల్ల ఉత్పత్తి అయ్యే వేడిలో 90 శాతాన్ని సముద్రాలే గ్రహిస్తున్నాయి. దాంతో అవి ఆక్సిజన్‌ను కోల్పోతూ వేడెక్కుతున్నాయి.
- 1980 దాకా సముద్ర ఉష్ణోగ్రతలు ప్రతి పదేళ్లకోసారి 0.06 డిగ్రీల చొప్పున పెరిగాయి. గత నాలుగు దశాబ్దాలుగా ప్రతి పదేళ్లకోసారి 0.27 డిగ్రీల చొప్పున పెరుగుతున్నాయి. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు పెరగడమే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నిప్పు చల్లగా.. మంచు మంటగా!

ఆస్ట్రేలియా యువకునికి చికిత్స లేని వ్యాధి

మెల్‌బోర్న్: మంటను ముట్టుకుంటే కాలిపోతుంది. మంచును టచ్ చేస్తే చల్లగా ఉంటుంది. కానీ ఈ ఆస్ట్రేలియా వ్యక్తికి మాత్రం నిప్పు చల్లగా ఉంటుంది. చల్లని పదార్థం చురుక్కుమటుంది. అదెలా సాధ్యమంటే, అదో వింత వ్యాధి. అతని కాళ్లు, చేతులు గ్రహణ శక్తి కోల్పోయాయి. ఈ వ్యాధితో అతను ఐదేళ్లుగా బాధపడుతున్నాడు. ఎన్నో పరీక్షలు చేసినా వ్యాధేమిటో తెలిసింది కానీ చికిత్స ఏమిటో తెలియడం లేదు.



ఆస్ట్రేలియాకు చెందిన 22 ఏళ్ల ఎయిడెన్ మెక్‌మానస్ 17వ ఏట హైస్కూల్ చివరి ఏడాదిలో ఉండగా ఈ సమస్య మొదలైంది. పాదాల్లో కొద్దికొద్దిగా అనుభూతిని కోల్పోవడం మొదలైంది. పాదాలు చక్కిలిగింతలు పెట్టినట్టుగా, తిమ్మిరెక్కినట్టుగా అనిపించడం మొదలైంది. పాదాల్లోకి రక్తం, ఇతర ద్రవాల సరఫరా లేదంటూ డాక్టర్ మందులిచ్చాడు. అవేవీ పని చేయలేదు. నడవడమే కష్టంగా మారడంతో న్యూరాలజిస్టులు 20కి పైగా రక్త పరీక్షలు చేశారు. బయాప్సీ కూడా చేసినా వ్యాధి నిర్ధారణ కాలేదు. చివరకు అతను ఆక్సోనల్ పెరిఫెరల్ న్యూరోపతితో బాధపడుతున్నాడని డాక్టర్లు తేల్చి చెప్పారు. ఇది శరీరానికి సంకేతాలను ప్రసారం చేయకుండా నాడీ కణాలను అడ్డుకుంటుంది. దాంతో తన కుమారుడు వేడిగా ఏదైనా తీసుకున్నప్పుడు, చల్లగా అనిపిస్తుందని, చల్లగా ఉన్నప్పుడు మండుతున్న అనుభూతిని పొందుతాడని తల్లి ఏంజిలా మెక్‌మానస్ వాపోయారు. అతని రోజురోజుకీ పరిస్థితి దిగజారిపోతోంది. నడక సామర్థ్యం, కాళ్లు, చేతుల్లో సమతుల్యత, సమన్వయం తగ్గుతున్నాయి. నయం చేయలేని ఈ వ్యాధికి చికిత్సను భరించలేమని నేషనల్ డిజేబులిటీ ఇన్సూరెన్స్ ఏజెన్సీ (ఎన్‌డీఐఏ) సైతం చేతులెత్తేసింది. చికిత్సేమిటో తెలియకుండా నిధులివ్వలేమని తేల్చేసింది. కానీ నొప్పి నివారణ మందులు తప్ప ప్రస్తుతానికి అతనికి చికిత్స అందుబాటులో లేదని న్యూరాలజిస్ట్ చెప్పుకొచ్చారు. పరిస్థితి నానాటికి దిగజారిపోయే పరిస్థితి ఉంది గనుక ఎన్‌డీఐఏలో చేర్చాలంటూ ఏజెన్సీకి లేఖ రాశారు.

128 ఏళ్ల బాబా శివానంద్ కన్నుమూత



బాబా శివానంద్

వారణాసి: ఆధ్యాత్మిక గురువు, పద్మశ్రీ గ్రహీత బాబా శివానంద్ ఆరోగ్య సమస్యలతో కన్నుమూశారు. ఆయన వయసు 128 ఏళ్లని శిష్యులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఆయన్ను ఏప్రిల్ 30న బీహెచ్‌యూ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ప్రజల సందర్శనార్థం భౌతిక కాయాన్ని కబీర్‌నగర్ కాలనీలోని ఆయన నివాసంలో ఉంచారు. సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేసినట్లు శిష్యులు తెలిపారు. 1896 ఆగస్ట్ 8న నేటి బంగ్లాదేశ్‌లోని సిల్హెట్‌లో జన్మించిన బాబా శివానంద్ ఆరేళ్ల వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయారు. అనంతరం గురువు ఓంకార్‌నాథ్ సంరక్షణ, మార్గదర్శకత్వంలో ఆధ్యాత్మిక శిక్షణ పొందారు. అప్పట్నుంచే ఒంటిపూట భోజనం వంటి కఠిన నియమాలను పాటిస్తూ వచ్చారు. నిత్యం తెల్లవారుజామున మూడింటికే మేల్కొని యోగ సాధన చేసేవారు. ఆధ్యాత్మిక, యోగసంబంధ అంశాల్లో సేవలకు కేంద్ర ప్రభుత్వం 2022లో ఆయన్ను పద్మశ్రీతో గౌరవించింది. బాబా లేని లోటు పూడ్చలేదంటూ ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.

సీడబ్ల్యూసీ తీర్మానాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

పీసీసీలకు కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలోని చేసిన తీర్మానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అధిష్టానం ఆ పార్టీ శ్రేణులను కోరింది. ఈ మేరకు ఆదివారం పీసీసీలకు ఒక సర్క్యులర్ జారీ చేసింది. సంవిధాన్ బచావో ర్యాలీల్లో భాగంగా మే 30 వరకు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించింది. కుల గణనపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలని, ప్రతి నియోజకవర్గంలో సంవిధాన్ బచావో ర్యాలీలు చేపట్టాలని ఆదేశించింది. సోషల్ మీడియా వేదికలపై పెద్దఎత్తున ప్రచారం చేయాలని కోరింది. 30 వరకు జరగాల్సిన సంవిధాన్ బచావో ర్యాలీలు, ఇంటింటి ప్రచారా లను పీసీసీ అధ్యక్షుడు స్వయంగా పర్యవేక్షించాలంది. సామాజిక కార్యకర్తలు, పౌర సమాజ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, న్యా యవాదులు, దుకాణదారులు, స్వయం సహా యక సంఘాల సభ్యులు, బహుజన వర్గాల క్రియాశీల భాగస్వామ్యంతో 'చౌపాల్'సమా వేశాలు నిర్వహించాలంది.

జిల్లా కలెక్టర్ వ్యవస్థను ఎప్పుడు ఏర్పాటు చేశారు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్

రాజ్యాంగం పనితీరును సమీక్షించడానికిఎన్డీఏ ప్రభుత్వం 2000 ఫిబ్రవరి 22న జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్య అధ్యక్షతన 10 మంది సభ్యులతో భారత రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

ఈ కమిషన్ సభ్యుడు పి.ఎ. సంగ్మా కమిషన్ నివేదిక సమర్పించక ముందే రాజీనామా చేశారు. ఈ కమిషన్‌కు కార్యదర్శిగా డా.రఘువీర్‌సింగ్ వ్యవహరించారు. ఈ కమిషన్ రచనా సంఘం 2001 సెప్టెంబర్‌లో డా.సుభాష్ సి.కశ్యప్ అధ్యక్ష తన ఇద్దరు సభ్యులతో ఏర్పడింది. రచనా సంఘంలో కె.పరాశరన్, డా. అబిద్ హుస్సేన్‌లను సభ్యు లు గా నియమించారు. ఈ రాజ్యాంగ సమీక్ష సంఘం 18 పర్యాయాలు సమావేశమై 46 రోజులు సంప్రదింపులు జరిపింది. రాజ్యాంగ సమీక్ష కమిషన్ 2002 మార్చి 11న తన అధ్యయన నివే దికను ఆమోదించింది. 2002 మార్చి 31న అధ్య యన నివేదికను నాటి ప్రధానమంత్రి వాజ్ పేయికి సమర్పించింది. ఈ కమిషన్ 249 సిఫా రసులతో 11 శీర్షికలుగా నివేదికను రూపొందించింది.

సూచనలు:

- ఏడాదిలో కనీసం 80 రోజులు వేతనం అందేలా గ్రామాల్లో ఉపాధి పొందే హక్కును కల్పించడం.
- భారత రాజ్యాంగంలోని 4వ భాగం శీర్షిక- రాజ్యాంగ విధాన 'ఆదేశిక సూత్రాలు' అనే చర్యగా సవరించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గురించి, ప్రాథమిక విధులకు సంబంధించి పౌరులకు తగిన అవగాహన, పరిజ్ఞానం కల్పించే చర్యలు చేపట్టాలి.
- ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల వ్యయాన్ని ప్రభుత్వమే భరించేలా సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలి.
- రాజకీయ పార్టీలన్నీ మహిళలకు 30 శాతం స్థానాలు కేటాయించాలి.
- పార్లమెంటు ఏడాదికి 120 రోజులు సమావేశం కావాలి. రాజ్యసభ 100 రోజులు సమావేశం కావాలి. రాష్ట్రాల శాసన సభలు కూడా ఏడాదికి 90 రోజులు సమావేశం కావాలి.
- కార్యనిర్వహణ శాఖ, ప్రభుత్వ పాలన, అధికారుల్లో బాధ్యత, జవాబుదారీతనం పెంపొందించడానికి సామాజిక తనిఖీ వ్యవస్థను ప్రవేశపెట్టాలి.
- కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలంగా ఉండాలి, అంతర్రాష్ట్ర మండలి ద్వారా కేంద్ర ప్రభుత్వం వైయుక్తికంగా, సమష్టిగా రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి.
- న్యాయశాఖలో మార్పులు చేపడుతూ, జాతీయ న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.
- అధికార వికేంద్రీకరణ, స్వావలంబన, గ్రామ పంచాయతీలను స్వయం పాలనా సంస్థలుగా ప్రకటించి వాటికి ప్రత్యేక అధికారాలు కేటాయించాలి.
- వ్యవస్థీకృతమైన మార్పులు జరగాలి. సాంఘిక, ఆర్థిక మార్పులతో పాటు అభివృద్ధి క్రమం విస్తరించాలి. మైనారిటీ వర్గాల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి చర్యలు చేపట్టాలి.

లక్ష్యాలు

- దేశంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సమర్థవంతమైన, జవాబుదారీతనం, పారదర్శకత, నీతివంతమైన పాలన కోసం ఏ మేరకు రాజ్యాంగపరమైన అంశాలు దోహదపడతాయనే అంశాలను సునిశితంగా పరిశీలించి సూచనలు చేయడం.
- రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగం కలగకుండా రాజ్యాంగపరమైన అంశాల్లో అవసరమైన క్రమానుగత మార్పులను సూచించడం.
- పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంవిధానం మేరకు ఆధునిక భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ అభివృద్ధి సాధనకు సవివరమైన సూచనలు చేయడం.

జిల్లా కలెక్టర్

దేశంలో జిల్లా కలెక్టర్ పదవిని 1772లో వారన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడు ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యానంతరం ఐఏఎస్‌కు చెందిన అధికారి జిల్లా కలెక్టర్‌గా నియమితు లవుతున్నారు. జిల్లా కలెక్టర్ హోదాను ఫ్రాన్స్ లోని ప్రిఫెక్ట్ అనే పదవితో పోల్చుతారు.

అధికారాలు-విధులు

1) రెవెన్యూ విధులు 2) న్యాయపరమైన విధులు 3) ఎన్నికల నిర్వహణ 4) ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయినవారిని ఆదుకోవడం 5) అభివృద్ధి కార్యక్రమాల అమలు 6) జనాభా లెక్కల సేకరణ 7) స్థానిక సంస్థలపై పర్యవేక్షణ.

నోట్: జిల్లా కలెక్టర్‌కు అనేక అంశాలతో జిల్లా పరిషత్‌లకు సంబంధం ఉంటుంది. జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలకు శాశ్వత ఆహ్వానితుడి హోదాలో కలెక్టర్ హాజరవుతాడు. జిల్లా పరిషత్ పనితీరు గురించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాడు. జిల్లా పరిషత్‌లోని వివిధ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తాడు.

జాతీయ న్యాయ మండలి

న్యాయమూర్తులను జవాబుదారీ చట్రంలోకి తెచ్చే దిశగా న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. న్యాయమూర్తులపై వచ్చే ఆరోపణలపై విచారణ చేయడానికి, దోషులుగా తేలిన న్యాయమూర్తులను తొలగించడానికి వీలుగా ఉండే 'The Judges Bill 2006'ను తీసుకురావాలని అప్పట్లో కేంద్ర మంత్రి మండలి నిర్ణయించింది. 2006 నవంబర్ 9న నాటి ప్రధాని అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. న్యాయ వ్యవస్థ పనితీరులో పారదర్శకత, జడ్జీలను జవాబుదారీ చేయడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. న్యాయ మూర్తులపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను విచారించడానికి జాతీయ న్యాయ మండలి (ఎన్‌జేసీ) ఏర్పాటు చేయాలని ఈ బిల్లు పేర్కొంటుంది. దీనికోసం 1968 జడ్జీల చట్టానికి సవరణ తీసు కొస్తారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మినహా ఇతర జడ్జీల్లో ఎవరిపై ఆరోపణలు వచ్చినా ఎన్‌జేసీ విచారిస్తుంది. జాతీయ న్యాయ మండలి లో భారత ప్రధాన న్యాయమూర్తితో పాటు సుప్రీంకోర్టులోని ఇద్దరు సీనియర్ న్యాయ మూర్తులు, మరో ఇద్దరు సీనియర్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తులు సభ్యులుగా ఉంటారు. ఒకవేళ సుప్రీంకోర్టులోని జడ్జిపై ఫిర్యాదును విచారించాల్సి వస్తే హైకోర్టు న్యాయమూర్తుల స్థానంలో మరో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు. జడ్జీలపై తప్పుడు ఆరోపణలు చేస్తే అతడికి ఏడాది జైలు, రూ. 25 వేల వరకు జరిమానా విధిస్తారు. ఈ న్యాయ మండలి నేరుగా లేదా లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్‌పర్సన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తుంది. ఫిర్యాదుదారు, జడ్జి ఎవరనేది రహస్యంగా ఉంచేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా నెల పాటు శిక్ష, రూ. 500 జరిమానా లేదా రెండూ అమలు చేయవచ్చు. ఫిర్యాదులను ఎన్‌జేసీ రహస్యంగా విచారిస్తుంది. జడ్జి దుష్ప్రవర్తన, అసమర్థతతో వ్యవహరించినట్లు రుజువైతే.. అతడ్ని తొలగించాల్సిన అవసరం లేదని న్యాయ మండలి భావిస్తే, ఈ కింది చర్యలు తీసుకోవచ్చు.

- సలహాలు ఇవ్వడం.
- హెచ్చరికలు చేయడం
- స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలని కోరడం
- బహిరంగంగా లేదా రహస్యంగా మందలించడం లేదా అభిశంసించడం చేస్తుంది.

ఒకవేళ న్యాయమూర్తి తొలగింపు తప్పదని భావిస్తే, ఆ మేరకు రాష్ట్రపతికి న్యాయ మండలి సిఫారసు చేస్తుంది. దీన్ని స్వీకరించిన రాష్ట్రపతి మండలి గుర్తించిన అంశాలు, సంబంధిత నివేదికలను, సిఫారసులను పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపెట్టాలని కోరతాడు. అప్పుడు జడ్జి తొలగింపు కోసం రాష్ట్రపతికి అభ్యర్థన చేస్తూ సభలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశ పెడుతుంది. ఆ తీర్మానం ఆమోదం ద్వారా తొలగింపునకు గురైన న్యాయమూర్తి వివిధ రకాల విధులకు అనర్హుడవుతారు. లా కమిషన్ 195వ నివేదికలో చేసిన సిఫారసుల ప్రాతిపదికన ఈ నూతన బిల్లును రూపొందించారు. జస్టిస్ వెంకటాచలయ్య కమిటీ, జాతీయ లా కమిషన్‌లు న్యాయమూర్తులను జవాబుదారీ చట్రంలోకి తీసుకురావాలని సిఫారసు చేశాయి.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం

పదవి, డబ్బులకోసం సభ్యులు పార్టీలు మారడం 1967 తర్వాత ఎక్కువగా జరిగాయి. దీన్నే ఫ్లోర్ క్రాసింగ్ అంటారు. పార్టీ ఫిరాయింపులను నివారించడానికి 1985లో 52వ రాజ్యాంగ సవరణ చేశారు. పార్టీ ఫిరాయింపు చట్టం ప్రకారం ఈ కింది కారణాలతో సభ్యులను తొలగించవచ్చు.

- పార్టీ సభ్యుడు తాను ఎన్నికైన పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పుడు.
- పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా సభలో తన ఓటు హక్కును వినియోగించినప్పుడు, ముందుగా అనుమతి తీసుకోకుండా ఓటింగ్‌కు గైర్హాజరైనప్పుడు.

అయితే అత్యవసర కారణాల వల్ల సభకు రాలేకపోయాడని గైర్హాజరైన 15 రోజుల లోపు పార్టీ గుర్తిస్తే పార్టీ ఫిరాయింపు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. 1942లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పార్టీలు జారీ చేసే విప్.. విశ్వాస, అవిశ్వాస తీర్మానాలకు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. స్వతంత్రంగా ఎన్నికైన సభ్యుడు ఏదైనా పార్టీలో చేరితే సభ్యత్వం కోల్పోతాడు. నామినేటెడ్ సభ్యుడు ఆరు నెలల తర్వాత ఏదైనా పార్టీలో చేరితే సభ్యత్వం కోల్పోతాడు.

ముఖ్యాంశాలు:

- భారత రాజ్యాంగంలో రాజకీయ పార్టీ అనే పదం 10వ షెడ్యూల్‌లో మాత్రమే ఉంది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హయాంలో 52వ రాజ్యాంగ సవరణ చేసి ఫిరాయింపుల చట్టానికి సంబంధించి 102(2), 191(2) అధికరణలను చేర్చారు.
- దేశంలో రాజకీయ పార్టీలు రాజ్యాంగ బద్ధమైనవి కావు. అవి కేవలం చట్టబద్ధంగా ఎన్నికల కమిషన్ ద్వారా గుర్తింపు పొంది ఏర్పాటయ్యాయి.

వర్తించని సందర్భాలు:

- పార్టీలలో చీలిక ఏర్పడి మూడో వంతు సభ్యులు గ్రూప్‌గా ఏర్పడితే ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి రాదు.
- పార్టీ సభ్యుల్లో 2/3వ వంతు సభ్యులు వేరే పార్టీలో చేరినప్పుడు కూడా ఈ చట్టం పరిధిలోకి రాదు.
- లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌లు తమ పదవులు వదిలి వారి పార్టీల్లో చేరినప్పుడు వారికి ఈ చట్టం వర్తించదు. రాష్ట్రాల్లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.
- పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు విషయంలో చైర్మన్, స్పీకర్‌దే అంతిమ నిర్ణయం.
- రాజకీయ పార్టీల్లో చీలికలను నిరోధించడానికి, రాష్ట్రాల్లో మంత్రివర్గ పరిమాణాన్ని నియంత్రించడానికి ఉద్దేశించిన 97వ రాజ్యాంగ సవరణ బిల్లు, 91వ రాజ్యాంగ సవరణ చట్టం 2003గా అమల్లోకి వచ్చింది. ఈ బిల్లు ప్రకారం పార్టీ నుంచి ఎంతమంది ఫిరాయించినా వారు అనర్హులవుతారు. తిరిగి పోటీ చేసి గెలిచే వరకూ వారు ప్రతిఫలాన్నిచ్చే ఏ పదవీ చేపట్టడానికి వీలులేదు.
- పార్టీ అధ్యక్షుడి ఫిర్యాదు మేరకు స్పీకర్ వారి సభ్యత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంటుంది.

సభ్యత్వం రద్దు-సుప్రీంకోర్టు తీర్పు

1993లో కిహోటో ఉలాహన్ వర్సెస్ జాచి లు కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ.. సభ్యుడి సభ్యత్వం రద్దుపై స్పీకర్(సభాధ్యక్షుడు)ది తుది నిర్ణయం కాదని వారి నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని పేర్కొంది.

ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ

క్రిమినల్ కేసుల్లో కోర్టు దోషులుగా నిర్ధారించిన వ్యక్తులు శిక్ష అనుభవిస్తున్న కాలం తర్వాత మరో ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసే వీలు లేకుండా ప్రజాప్రాతినిధ్యం చట్టం (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించింది. నేర చరితులను చట్టసభలకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణ చేస్తున్నారు. గతంలో దీర్ఘకాలం శిక్షపడిన వ్యక్తులు తొలి ఆరేళ్లలో పోటీ చేయలేకపోయినా తర్వాత జైలులో ఉండి పోటీ చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు అలాంటి అవకాశం లేకుండా చేశారు. అవినీతి నిరోధక చట్టం, తీవ్రవాద నిరోధక చట్టం కింద శిక్షపడిన వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు. అవినీతి నిరోధక చట్టం కింద కనీసం రెండు సంవత్సరాలు శిక్షపడినా అనర్హత వర్తిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. రాజ్యాంగ సమీక్ష కోసం ఏర్పాటైన జాతీయ కమిషన్‌కు అధ్యక్షత వహించిన వారు?
   ఎ) పి.ఏ సంగ్మా
   బి) జస్టిస్ బి.పి జీవన్‌రెడ్డి
   సి) జస్టిస్ ఎంఎన్. వెంకటాచలయ్య
   డి) సీఆర్ ఇరానీ
2. జిల్లా కలెక్టర్ వ్యవస్థను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   ఎ) 1771 బి) 1772
   సి) 1773 డి) 1774
3. ఎన్నికల ప్రక్రియలో వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలని సిఫారసు చేసిన కమిషన్?
   ఎ) వీరప్ప మొయిలీ కమిటీ
   బి) రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్
   సి) సర్కారియా కమిషన్
   డి) పైవేవీ కావు

సమాధానాలు

1) సి; 2) బి; 3) బి.

తెలుగు భాషకు వ్యవహారంలో లేని పేరు?



బోధన పద్ధతులు

ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు తెలుగు బోధన పద్ధతులు తప్పనిసరి అంశం. కాబట్టి అభ్యర్థులు తెలుగు మెథడాలజీపై ప్రత్యేక దృష్టిని సారించాలి. ఎందుకంటే డీఎస్సీలో ఏ విభాగాన్నీ అశ్రద్ధ చేయకూడదు. ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్ తెలుగు అభ్యర్థులు డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని చదవాలి. గత టెట్, డీఎస్సీ పరీక్షల్లో తెలుగు అకాడమీ పుస్తకాల నుంచే ఎక్కువ ప్రశ్నలు ఇచ్చారు. అందువల్ల గత ప్రశ్నపత్రాలను కూడా పరిశీలించాలి. ఇక్కడ డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకంలోని 'ఆంధ్ర సాహితీ సంగ్రహం' అధ్యాయంలో ప్రశ్నలను సమగ్రంగా తెలుసుకుందాం. ముఖ్యంగా ఈ చాప్టర్ తెలుగు కంటెంట్‌కు కూడా ఉపయోగపడుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. తెలుగు ఏ భాషా జన్యం?
   1) సంస్కృత 2) ఆర్య
   3) ద్రావిడ 4) ఇండో - ఆర్యన్
2. తెలుగు భాషకు వ్యవహారంలో లేని పేరు?
   1) ఆంధ్రం 2) దేశం
   3) తెనుగు 4) తెలుగు
3. 'ఆంధ్ర' అనే పదం మొదట ఏ పదంగా కనిపిస్తుంది?
   1) దేశవాచకం 2) భాషావాచకం
   3) జాతివాచకం 4) అన్నీ
4. కొన్ని విశిష్టమైన, సమానమైన ధర్మాలు ఉన్న కాలాన్ని ఏమంటారు?
   1) దశాబ్దం 2) శతాబ్దం
   3) కాలక్రమం 4) యుగం
5. 'సమగ్రాంధ్ర సాహిత్యం' ఎవరి రచన?
   1) పింగళి లక్ష్మీకాంతం
   2) వీరేశలింగం
   3) దివాకర్ల వేంకటావధాని 4) ఆరుద్ర
6. ఎక్కువ మందికి ఆమోదయోగ్యమైన తెలు గు సాహిత్య 'యుగ విభజన'ను ఎవరు చేశారు?
   1) కందుకూరి వీరేశలింగం
   2) గురజాడ శ్రీరామమూర్తి
   3) పింగళి లక్ష్మీకాంతం
   4) ఖండవల్లి లక్ష్మీరంజనం
7. తెలుగు సాహిత్యంలో 1500-1600 వరకు మధ్య కాలాన్ని ఏమంటారు?
   1) శ్రీనాథుని యుగం 2) ప్రబంధ యుగం
   3) సంధి యుగం 4) దక్షిణాంధ్ర యుగం
8. ఏ కావ్యం ఆధారంగా శాతవాహనుల కా లం నాటికే తెలుగు జన వ్యవహారంలో ఉం దని పరిశోధకులు పేర్కొంటున్నారు?
   1) ఋగ్వేదం 2) గాథాసప్తశతి
   3) బృహత్కథ 4) ఆది పురాణం
9. ఏ కవి తన కాలంలో వ్యాప్తిలో ఉన్న 'నాగ గీతాలు' అనే గేయాలను భారతంలో పేర్కొన్నాడు?
   1) నన్నయ 2) తిక్కన
   3) ఎర్రన 4) అధర్వణుడు
10. తుమ్మెద పదాలు, గొబ్బి పదాలు, వెన్నెల పదాలు ఏ కవి కాలం నాటికి బహుళ ప్రచారంలో ఉన్నాయి?
    1) నన్నయ 2) తిక్కన
    3) నన్నెచోడుడు
    4) పాల్కురికి సోమనాథుడు
11. తెలుగు కవిత్వానికి మూల ఛందం?
    1) తరువోజ 2) ద్విపద
    3) కందం 4) మధ్యాక్కర
12. కంద పద్యం ఎవరి కాలం నుంచి నేటిదాకా తెలుగునాట ప్రచారంలో ఉందని చెప్పొచ్చు?
    1) నన్నయ 2) హాలుడు
    3) తిక్కన 4) పాల్కురికి సోమనాథుడు
13. నన్నయకు పూర్వం ఆంధ్ర వాఙ్మయ స్వరూపం తెలుసుకోవడానికి ప్రధాన ఆధారాలు?
    1) శాసనాలు 2) తాళపత్ర గ్రంథాలు
    3) జైనమత గ్రంథాలు
    4) ప్రాకృత గ్రంథాలు
14. అభినవ దండి బిరుదాంకితుడు ఎవరు?
    1) తిక్కన 2) కేతన
    3) గౌరన 4) నాచన సోమన
15. తెలుగు కవిత ఎవరి ప్రేరణతో దేశీ రూపంగా ఆరంభమైంది?
    1) పల్లవుల 2) శాతవాహనుల
    3) రెడ్డిరాజుల 4) చాళుక్యుల
16. తొలి తెలుగు పద్యం అయిన 'తరువోజ' ఏ శాసనంలో లభిస్తుంది?
    1) కలమళ్ల శాసనం 2) అద్దంకి శాసనం
    3) బెజవాడ శాసనం
    4) అమరావతి స్తూపం
17. ఐదు మధ్యాక్కర పద్యాలు లభిస్తున్న బెజవాడ శాసనాన్ని ఎవరు వేయించారు?
    1) ధనుంజయుడు
    2) గుణగ విజయాదిత్యుడు
    3) యుద్ధమల్లుడు 4) పండరంగడు
18. ప్రబంధ రత్నావళి ఎవరి సంకలన గ్రంథం?
    1) వేటూరి ప్రభాకర శాస్త్రి
    2) రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ
    3) మానవల్లి రామకృష్ణ కవి
    4) మడికి సింగన
19. సర్వదేవుడు రాసిన ప్రసిద్ధ జైన కావ్యం?
    1) పద్మ పురాణం 2) జినేంద్ర పురాణం
    3) ఆది పురాణం 4) అగ్ని పురాణం
20. నన్నయకు ముందున్న శాసన కవులు?
    1) పద్మకవి, సర్వదేవుడు
    2) నారాయణుడు, అధర్వణుడు
    3) గజాంకుశుడు, నన్నెచోడుడు
    4) శ్రీపతి పండితుడు, అయ్యనభట్టు
21. నన్నెచోడుడు నన్నయకు ముందువాడని ఎవరి అభిప్రాయం?
    1) నిడుదవోలు వెంకట్రావు
    2) మానవల్లి రామకృష్ణ కవి
    3) వేటూరి ప్రభాకర శాస్త్రి
    4) రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ
22. మహాభారతానికి గల నామాంతరం?
    1) జయ కావ్యం 2) సాత్వతసంహిత
    3) పంచమ వేదం 4) 1, 3
23. గాసటబీసటగా ఉన్న తెలుగు భాషకు ఒక స్థిరమైన రూపాన్ని ఏర్పర్చినవారు?
    1) నన్నయ 2) తిక్కన
    3) నన్నెచోడుడు 4) ఎర్రన
24. మత ప్రచారానికి కవిత్వాన్ని సాధనంగా వాడుకోవడం ఎవరి ప్రత్యేకత?
    1) కవిత్రయ కవులు 2) ప్రబంధ కవులు
    3) శతక కవులు 4) శివ కవులు
25. మార్గదేశి కవితల ప్రస్తావన చేసిన మొదటి కవి?
    1) నన్నయ 2) తిక్కన
    3) నన్నెచోడుడు
    4) పాల్కురికి సోమనాథుడు
26. జాను తెనుగు అంటే?
    1) శుద్ధ గ్రాంథికం 2) అచ్చ తెనుగు
    3) తత్సమ - తద్భవ తెనుగు
    4) మార్గ - దేశి తెనుగు
27. 'ప్రథమ ప్రబంధం' అని చరిత్రకారులు ఏ గ్రంథాన్ని పేర్కొన్నారు?
    1) మను చరిత్ర 2) హరి వంశం
    3) కుమార సంభవం 4) శృంగార నైషధం
28. అచ్చమైన తెలుగు ఛందస్సు ద్విపదకు పట్టం కట్టినవారు?
    1) గోన బుద్ధారెడ్డి 2) తాళ్లపాక చిన్నన
    3) గౌరన 4) పాల్కురికి సోమనాథుడు
29. తెలుగు, సంస్కృత భాషల్లో మొదటి ఉదాహరణ కావ్యాన్ని ఎవరు రాశారు?
    1) నన్నెచోడుడు 2) పాల్కురికి సోమన
    3) పండితారాధ్యుడు
    4) రావిపాటి త్రిపురాంతకుడు
30. 'సర్వేశ్వర శతకం' కర్త?
    1) యథావాక్కుల అన్నమయ్య
    2) చక్రపాణి రంగన
    3) తాళ్లపాక అన్నమయ్య
    4) పాల్కురికి సోమనాథుడు
31. శివలీలలను వర్ణించే 'శివతత్త్వసారం' ఎవరి రచన?
    1) శ్రీనాథుడు
    2) మల్లికార్జున పండితారాధ్యుడు
    3) పాల్కురికి సోమనాథుడు
    4) నన్నెచోడుడు
32. ఎవరు తన కవిత్వంలో లలిత పదాలుంటాయని పేర్కొన్నారు?
    1) నన్నెచోడుడు 2) శ్రీనాథుడు
    3) తిక్కన 4) పోతన
33. 'అమలోదాత్త మనీష నేనుభయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమునం బారగుడ కళావిదుడ' నని చెప్పుకున్న కవి?
    1) నన్నయ 2) తిక్కన
    3) శ్రీనాథుడు 4) భట్టుమూర్తి
34. ఎవరి రచనలు తెలుగు నుడికారంతో, సజీవ పాత్ర చిత్రణతో, రసాభ్యుచిత బంధంతో, అర్థ గాంభీర్యంతో ఉంటాయి?
    1) తిక్కన 2) ఎర్రన
    3) శ్రీనాథుడు 4) రామరాజభూషణుడు
35. మార్కండేయ పురాణం కర్త?
    1) తిక్కన 2) కేతన
    3) మారన 4) గౌరన
36. మంచన ఏ గ్రంథం ఆధారంగా కేయూర బాహు చరిత్ర రచించాడు?
    1) మార్కండేయ పురాణం
    2) విద్ధసాలభంజిక
    3) సింహాసన ద్వాత్రింశిక
    4) పంచతంత్రం
37. కృష్ణమాచార్యుడు రాసిన సింహగిరి నరహరి వచనాలు ఏ వచన భేదానికి చెందినవి?
    1) పదాలు 2) సంకీర్తనలు
    3) అష్టపదులు 4) చూర్ణికలు
38. గోన బుద్ధారెడ్డి రాసిన రంగనాథ రామాయణం ఏ కావ్యం?
    1) చంపూ కావ్యం 2) పద్య కావ్యం
    3) ద్విపద కావ్యం
    4) మంజరీ ద్విపద కావ్యం
39. ఎర్రన గారి ఏ రచన పేరుకు పురాణమైనా రచనా విధానాన్ని బట్టి రసవత్కావ్యం?
    1) హరివరణం 2) నృసింహపురాణం
    3) అరణ్య పర్వశేషం 4) గరుడ పురాణం
40. ప్రబంధ పరమేశ్వరుడు అని ఎవరినంటారు?
    1) ఎర్రన 2) నన్నెచోడుడు
    3) తిక్కన 4) అల్లసాని పెద్దన
41. 'శ్రీమత్సకలభాషాభూషణ, సాహిత్య రస పోషణ, సంవిధాన చక్రవర్తి, సంపూర్ణకీర్తి, నవీన గుణసనాథ' అని ఎవరు ఏ కావ్యం లో చెప్పుకున్నారు?
    1) తిక్కన-నిర్వచనోత్తర రామాయణంలో
    2) ఎర్రన-హరివంశం కావ్య అవతారికలో
    3) కేతన - దశకుమార చరిత్రలో
    4) నాచన సోమనాథుడు-హరివంశం గద్యలో
42. శ్రీనాథ యుగానికి గల నామాంతరం?
    1) ప్రబంధ యుగం 2) కావ్యయుగం
    3) స్వర్ణయుగం 4) పురాణేతిహాస యుగం
43. తెలుగులో కవిత్రయం తర్వాత అంతటి ప్రతిభావంతుడైన కవి?
    1) పోతన 2) వేములవాడ భీమకవి
    3) శ్రీనాథుడు 4) అల్లసాని పెద్దన
44. 'ఈక్షోణిన్ నినుబోలు సత్కవులు లేరు ఈనాటి కాలమ్మునన్' అని రాజులు, మంత్రులు కొనియాడిన కవీశ్వరుడు?
    1) చేమకూర వెంకటకవి
    2) శ్రీనాథుడు 3) అల్లసాని పెద్దన
    4) రామరాజభూషణుడు
45. తెలుగు సాహిత్యంలో కథా ప్రాధాన్యం తగ్గుతూ రస ప్రధానమైన రచనలు ఎవరితో ప్రారంభమయ్యాయని విమర్శకుల అభిప్రాయం?
    1) పాల్కురికి సోమనాథుడు 2) పోతన
    3) అల్లసాని పెద్దన 4) శ్రీనాథుడు
46. పిల్లలమర్రి పినవీరభద్రుడి జైమినీభారతం ఒక?
    1) వీరరస కావ్యం 2) శృంగార కావ్యం
    3) శాంతరస కావ్యం 4) కరుణ రస కావ్యం

సమాధానాలు

1) 3;	2) 2;	3) 3;	4) 4;
5) 4;	6) 3;	7) 2;	8) 2;
9) 1;	10) 4;	11) 3;	12) 2;
13) 1;	14) 2;	15) 4;	16) 2;
17) 3;	18) 1;	19) 3;	20) 4;
21) 2;	22) 4;	23) 1;	24) 4;
25) 3;	26) 2;	27) 3;	28) 4;
29) 2;	30) 1;	31) 2;	32) 3;
33) 2;	34) 1;	35) 3;	36) 2;
37) 4;	38) 3;	39) 2;	40) 1.
41) 4;	42) 2;	43) 3;	44) 2;
45) 4;	46) 1.		

గత డీఎస్సీ ప్రశ్నలు

1. సంస్కృతం, తెలుగు భాషల్లో మొదటి ఉదాహరణ రచన?
   1) రామరాజీయం 2) బసవోదాహరణం
   3) వెంకటేశ్వరోదాహరణం
   4) శివతత్త్వసారం
2. ఆంధ్ర సాహిత్యంలో ప్రబంధమనే పదాన్ని మొట్టమొదట ప్రయోగించినవారు?
   1) తిక్కన 2) అల్లసాని పెద్దన
   3) నన్నెచోడుడు 4) చేమకూర వెంకటకవి
3. సింహగిరి నరహరి వచనాలు రచించిన వీరిని గద్య వాఙ్మయానికి ఆద్యుడిగా పేర్కొంటారు?
   1) కృష్ణమాచార్యులు
   2) కందుకూరి వీరేశలింగం
   3) పరవస్తు చిన్నయసూరి
   4) అయ్యగారి వీరభద్రరావు
4. మిరియాల కామసాని గూడూరు శాసనంలోని వృత్తాలు?
   1) మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలు
   2) మూడు ఉత్పలమాలలు, రెండు మత్తేభాలు
   3) మూడు శార్దూలాలు, రెండు చంపకమాలలు
   4) రెండు చంపకమాలలు, మూడు ఉత్పలమాలలు
5. శ్రీనాథుడి 'పల్నాటి వీర చరిత్ర' రచనలోని ఛందస్సు?
   1) వసంత తిలకం 2) కవిరాజ విరాజితం
   3) మంజరీ ద్విపద 4) సీసం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 1; 5) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

రైట్స్ లిమిటెడ్, గుర్గావ్‌లో టెక్నీషియన్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్).. టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 02.
- అర్హత: బీఎస్సీ డిగ్రీ(ఫిజిక్స్, కెమిస్ట్రీలతో) ఉత్తీర్ణులవ్వాలి.
- వయసు: 40 ఏళ్లు మించకూడదు.
- వేతనం: టెక్నీషియన్ పోస్టుకు రూ.26,649.
- ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 19.05. 2025.
- రాతపరీక్ష తేది: 24.05.2025.
- వెబ్‌సైట్: http://rites.com/

దేశంలో పవనశక్తి ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఉన్న రాష్ట్రం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ



మాదిరి ప్రశ్నలు

1. భూమిపై నుంచి ఒక పౌనపున్యం ఉన్న సమాచారాన్ని స్వీకరించి మరొక పౌనపున్యం ఉన్న సమాచారాన్ని భూమికి పంపడాన్ని ఏమంటారు?
ఎ) ట్రాన్స్‌మిషన్
బి) ట్రాన్స్‌పాండర్
సి) డౌన్‌లింకింగ్
డి) రిసీవింగ్ పౌనపున్యం
2. తిరుపతి సమీపంలోని ఎంఎస్‌టీ -రాడార్ కింది ఏ ఆవరణంపై పరిశోధన చేయదు?
ఎ) మీసో స్పియర్
బి) స్ట్రాటోస్పియర్
సి) ట్రోపోస్పియర్
డి) ఎక్సోస్పియర్
3. టాటా స్కై, డిష్ టీవీ ప్రసారాలు కింది ఏ శాటిలైట్ నుంచి లభిస్తాయి?
ఎ) ఇన్‌శాట్ - 4 సీఆర్
బి) ఇన్‌శాట్ - 6 ఆర్
సి) జీశాట్ - 6
డి) ఇన్‌శాట్ - 1 ఎ
4. టెలీ మెడిసిన్- వైద్యయోజన్‌ను మొదట ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?
ఎ) తెలంగాణ బి) కర్ణాటక
సి) ఒడిశా డి) తమిళనాడు
5. దేశంలోనే మొదటి ఎలక్ట్రానిక్ నాలెడ్జ్ ఆధారిత పంచాయతీ?
ఎ) మెదక్‌లోని రామచంద్రాపురం
బి) విజయవాడలోని మొఘల్రాజపురం
సి) రంగారెడ్డిలోని మియాపూర్
డి) కడపలోని ఓబులవారి పల్లి
6. అంతరిక్ష కార్యక్రమాల్లో వివిధ భాగాల్లో అవసరమైన పరికరాలు తయారీ ఎక్కడ జరుగుతోంది?
ఎ) ముంబయి బి) హైదరాబాద్
సి) పింప్రీ డి) కోయంబత్తూర్
7. మనదేశంలోని ఎత్తయిన రాకెట్?
ఎ) సింథటిక్ అపర్చర్ రాడార్
బి) ఎస్ఏఆర్ఏఎల్
సి) పీఎస్ఎల్వీ చాప్టర్-2
డి) కేఐటీ శాట్
8. ఇస్రో చరిత్రలో 'సువర్ణ సంవత్సరం'గా పేర్కొనదగిన ఏడాది?
ఎ) 1969 బి) 2008
సి) 2014 డి) 2003
9. కిందివాటిలో చంద్రయాన్ లక్ష్యం కానిది?
ఎ) చంద్రుడి ఉపరితలాన్ని 3-డిలో ఫొటోలు తీసి మ్యాపింగ్ చేయడం
బి) ఖనిజాలు, రసాయనిక పరిశోధనలు
సి) నీటి ఉనికి గుర్తింపు
డి) మానవ జాడ అన్వేషణ
10. ప్రధానంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు ఉపయోగించుకునే సమాచార ప్రసార సాంకేతికత?
ఎ) ఇ-మెయిల్
బి) వి-శాట్ నెట్‌వర్క్
సి) కార్టోశాట్
డి) మొబైల్‌ఫోన్ - వాట్సప్
11. 1995లో మనదేశంలో ఏ సంస్థను ప్రారంభించడం ద్వారా ఇంటర్నెట్ సేవలు ప్రారంభమయ్యాయి?
ఎ) ఐఎస్‌డీఎన్ బి) వీఎస్ఎన్ఎల్
సి) బీఎస్ఎన్ఎల్ డి) ఫ్లిప్‌కార్ట్
12. మనదేశంలో ఏర్పాటు చేసిన మొదటి జల విద్యుత్ ప్రాజెక్ట్?
ఎ) శివ సముద్రం
బి) కృష్ణ రాజసాగర్
సి) నాగార్జునసాగర్ డి) జంఝావతి
13. జతపర్చండి.
1. కల్పకం ఎ) కర్ణాటక
2. కాక్రపారా బి) తమిళనాడు
3. కైగా సి) గుజరాత్
ఎ) 1-ఎ, 2-బి, 3-సి
బి) 1-సి, 2-బి, 3-ఎ
సి) 1-బి, 2-సి, 3-ఎ
డి) 1-ఎ, 2-సి, 3-బి
14. కల్పకం రియాక్టర్‌ను 'ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్' అంటారు. ఇందులో వాడే ఇంధనం?
ఎ) ప్లుటోనియం
బి) యురేనియం
సి) సీసం కలిసిన పెట్రోలు
డి) ద్రవ హైడ్రోజన్
15. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రంలో వాడే ఇంధనం?
ఎ) ప్లుటోనియం బి) యురేనియం
సి) కార్బన్‌డై ఆక్సైడ్ డి) మిక్స్‌డ్ ఆక్సైడ్
16. రావత్ భట్టా అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?
ఎ) మహారాష్ట్ర బి) రాజస్థాన్
సి) తమిళనాడు డి) తెలంగాణ
17. మణుగూరు(ఖమ్మం)లో ఏ ప్లాంటు ఉంది?
ఎ) అణువిద్యుత్ కేంద్రం
బి) భార జల ప్లాంట్
సి) యురేనియం శుద్ధి
డి) అణుబాంబు తయారీ
18. ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ 1962లో వేటిపై అవగాహన కల్పించింది?
ఎ) బయోగ్యాస్ బి) ఖాదీ దుస్తులు
సి) సిమెంట్ వాడకం
డి) కాలుష్య నియంత్రణ
19. దేశంలో పవనశక్తి ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఉన్న రాష్ట్రం?
ఎ) తెలంగాణ బి) తమిళనాడు
సి) కేరళ డి) హిమాచల్‌ప్రదేశ్
20. ప్రపంచంలో అత్యంత సామర్థ్యం ఉన్న గాలిమర ఎక్కడ ఉంది?
ఎ) పెరంబూర్ బి) పనాజీ
సి) మంగుళూరు డి) పెరంబుడి
21. గాలి మరలను రూపొందించే సంస్థ?
ఎ) బీహెచ్ఈఎల్ బి) ఈసీఐఎల్
సి) హెచ్ఏఎల్ డి) మిధాని
22. సుజ్లాన్ కంపెనీకి సంబంధమున్న అంశం?
ఎ) పవనశక్తి
బి) సముద్ర అలల శక్తి
సి) జీవ ఇంధనం
డి) ఉదజని ఇంధనం
23. టైడల్ ఎనర్జీ ఉత్పత్తికి కావలసిన అలల ఎత్తు?
ఎ) 5 - 12 మీటర్లు
బి) 10 -15 మీటర్లు
సి) 2 - 3 మీటర్లు
డి) 12 - 16 మీటర్లు
24. భూగర్భోష్ణశక్తి కేంద్రం ఎక్కడ ఉంది?
ఎ) గంగాలోయ
బి) సబర్మతి లోయ
సి) తాతావని డి) మణికారన్
25. భారతదేశంలో పెట్రోల్‌ను మొదట కనుగొన్న ప్రాంతం?
ఎ) మఖుమ్ - అసోం
బి) డిగ్బాయ్ - అసోం
సి) బాంబే హై - మహారాష్ట్ర
డి) కృష్ణపట్నం- ఆంధ్రప్రదేశ్
26. ద్రవరూప సోడియంను మితకారిగా ఏ రియాక్టర్లలో వాడతారు?
ఎ) లైట్ వాటర్ రియాక్టర్
బి) ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్
సి) హెవీ వాటర్ రియాక్టర్
డి) ఎలక్ట్రిక్ రియాక్టర్
27. మిశ్రమ ఆక్సైడ్‌లో ఉండే పదార్థాలు?
ఎ) సీసం, యురేనియం
బి) సీసం, సెలీనియం
సి) యురేనియం, ప్లుటోనియం
డి) యురేనియం, ప్లుటోనియం ఆక్సైడ్‌లు
28. కెనడా సహకారంతో స్థాపించిన అణు రియాక్టర్ ఏది?
ఎ) సిరస్ బి) అప్సర
సి) జెర్లీనా డి) ధ్రువ
29. కల్పకంలోని మినీ రియాక్టర్?
ఎ) పూర్ణిమ బి) ధ్రువ
సి) కామిని డి) టోక్‌మాక్
30. భారజలం రసాయనిక నామం?
ఎ) డ్యుటీరియం ఆక్సైడ్
బి) డ్యుటీరియం హైడ్రాక్సైడ్
సి) కార్బన్ డై ఆక్సైడ్
డి) సల్ఫ్యూరస్ ఆమ్లం
31. ప్లాస్మా స్థితిని ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే పరికరం ఏది?
ఎ) టోక్‌మాక్ బి) ప్లాస్మోడ్రోమ్
సి) టోరోడియల్ డి) ట్యూరమ్ టీ
32. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్' ఎక్కడ ఉంది?
ఎ) అలహాబాద్ బి) కోల్‌కతా
సి) గాంధీనగర్ డి) భువనేశ్వర్
33. మనదేశంలో ఎనర్జీ స్టేట్‌గా పిలిచే రాష్ట్రం?
ఎ) మేఘాలయ
బి) హిమాచల్‌ప్రదేశ్
సి) న్యూఢిల్లీ డి) కేరళ
34. సెంట్రల్ షీప్ బ్రీడింగ్ ఫార్మ్ ఎక్కడ ఉంది?
ఎ) సింగూరు - పశ్చిమబెంగాల్
బి) అనంతపురం - ఆంధ్రప్రదేశ్
సి) నిర్మల్ - తెలంగాణ
డి) హిస్సార్ - హర్యానా
35. 'అమ్రపాలి' ఏ మొక్కల్లోని ఒక రకం?
ఎ) అరటి బి) మామిడి
సి) పెసర డి) వరి
36. కిందివాటిలో అధిక దిగుబడిని ఇచ్చే బాతులు?
ఎ) కాకి కాంబెల్ బి) ఇండియన్ రన్నర్
సి) బకర్‌వాల్ డి) గొడ్డి
37. జీవ ఎరువుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జాతీయ సంస్థ ఎక్కడ ఉంది?
ఎ) భువనేశ్వర్ బి) హిస్సార్
సి) ఘజియాబాద్ డి) నాగపూర్

సమాధానాలు

1) బి;	2) డి;	3) ఎ;	4) సి;
5) ఎ;	6) బి;	7) సి;	8) బి;
9) డి;	10) బి;	11) బి;	12) ఎ;
13) సి;	14) ఎ;	15) డి;	16) బి;
17) బి;	18) ఎ;	19) బి;	20) డి;
21) ఎ;	22) ఎ;	23) ఎ;	24) ఎ;
25) ఎ;	26) బి;	27) డి;	28) ఎ;
29) సి;	30) ఎ;	31) ఎ;	32) సి;
33) బి;	34) డి;	35) బి;	36) ఎ;
37) సి.			

First electronic computer in the world?

Bank Exams

Computer Awareness

COMPUTER GENERATIONS

Generation in computer terminology is a change in technology a computer is/was being used. Initially, the generation term was used to distinguish between varying hardware technologies. But nowadays, generation includes both hardware and software, which together make up an entire computer system. There are totally five computer generations known till date.

FIRST GENERATION

- The period of first generation was 1942-1954.
- First generation of computer started with using vacuum tubes as the basic components for memory and circuitry for CPU (Central Processing Unit).
- In this generation mainly batch processing operating system were used.
- In this generation Punched cards, Paper tape, Magnetic tape Input & Output device were used.

The main features of First Generation are:

- Supported Machine language only.
- Very costly.
- Generate lot of heat.
- Slow Input/output device.
- Huge size.
- Need of A.C.
- Non portable.
- Consumed lot of electricity.

Some computers of this generation were:

- ENIAC, EDVAC, UNIVAC, IBM-701, IBM-650

SECOND GENERATION

- The period of second generation was 1952-1964.
- This generation using the transistor was cheaper, consumed less power, more compact in size, more reliable and faster than the first generation machines made of vacuum tubes.
- In this generation, magnetic cores were used as primary memory and magnetic tape and magnetic disks as secondary storage devices.
- In this generation assembly language and high level programming language were used.
- There was Batch processing and Multiprogramming Operating system used.

The main features of Second Generation are:

- Reliable as compared to First generation computers.
- Smaller size as compared to First generation computers.
- Generate less heat as compared to First generation computers.



- Consumed less electricity as compared to First generation computers.
- Faster than first generation computers.
- Still very costly.
- A.C. needed.

Some computers of this generation were:

- IBM 1620, IBM 7094, CDC 1604, CDC 3600, UNIVAC 1108

THIRD GENERATION

- The period of third generation was 1964-1972.
- The third generation of computer is marked by the use of Integrated Circuits (IC's).
- This development made computers smaller in size, reliable and efficient.
- In this generation Remote processing, Time-sharing, Real-time, Multi-programming Operating System were used.
- High level languages were used during this generation.

The main features of Third Generation are:

- More reliable.
- Smaller size.
- Generate less heat.
- Faster.
- Lesser maintenance.
- Still costly.
- A.C needed.
- Consumed lesser electricity.
- Support high level language.

Some computers of this generation were:

- IBM-360 series, Honeywell-6000 series, PDP (Personal Data Processor), IBM-370/168, TDC-316

FOURTH GENERATION

- The period of Fourth Generation was 1972-1990.
- The fourth generation is made of Very Large Scale Integrated (VLSI) circuits.
- Fourth Generation computers became more powerful, compact, reliable, and affordable. As a result, it gave rise to personal computer (PC) revolution.
- In this generation Time sharing, Real time, Networks, Distributed Operating System were used.
- All the Higher level languages like C and C++, DBASE etc. were used in this generation.

The main features of Fourth Generation are:

- VLSI technology used.
- Very cheap.
- Portable and reliable.
- Use of PC's.
- Very small size.
- Pipeline processing.
- No A.C. needed.
- Concept of internet was introduced.
- Great developments in the fields of networks.
- Computers became easily available

Some computers of this generation were:

- DEC 10, STAR 1000, PDP 11, CRAY-1(Super Computer), CRAY-X-MP (Super Computer)

FIFTH GENERATION

- The period of Fifth Generation is 1990-till date.
- In the fifth generation, the VLSI became ULSI (Ultra Large Scale Integration) technology.
- This generation is based on parallel processing hardware and AI (Artificial Intelligence) software.
- All the Higher level languages like C and C++, Java, .Net etc. are used in this generation.

The main features of Fifth Generation are:

- ULSI technology.
- Development of true artificial intelligence.
- Development of Natural language processing.
- Advancement in Parallel Processing.
- Advancement in Superconductor technology.
- More user friendly interfaces with multimedia features.
- Availability of very powerful and compact computers at cheaper rates.

MODEL QUESTIONS

1. The first microprocessor built by the Intel Corporation was called_____
1) 8008 2) 8080 3) 4004
4) 8800 5) None of these
2. Daisy wheel printer is a type of_____
1) Matrix primer
2) Impact printer
3) Laser printer
4) Manual printer
5) None of these
3. The first electronic computer in the world was_____
1) UNIVAC 2) EDVAC
3) ENIAC 4) All of above
5) None of these
4. Before a disk can be used to store data it must be_____
1) Formatted 2) Reformatted
3) Addressed 4) Readdressed
5) None of the above
5. _____is network operating system
1) DOS 2) Win-95 3) Win-98
4) WIN-2000 server 5) None
6. Orkut was officially launched _____
1) 20-jan-2004 2)15- jan-2004
3) 26-jan-2006 4)24-jan -2004
5) None
7. Malicious Hacker known as_____
1) White hat hacker
2) Hacker 3) Cracker
4) Ethical 5) None
8. AltaVista, Google and Bing are the example of_____
1) Search engine
2) Brand name
3) Virus name
4) Antivirus program 5) None
9. What is the Transmission rate of fiber optics cable?
1) 10 mbps 2) 1000 mbps
3) 100 mbps 4) 1000 bps
5) None
10. _____ is a search engine introduced by MICROSOFT?
1) Google 2) Khoj.com
3) Bing 4) Yahoo 5) None
11. Tally is _____
1) Open S/W 2) System S/W
3) Application S/W
4) Closed S/W 5) None
12. Keyboard Converts typed in character to _____code
1) Binary 2) ASCII
3) Decimal 4) EBCIDIC
5) None
13. Which of the following sequence is correct?
1) Source code -linker - object code-compiler - executable code
2) Source code - compiler - object code - linker - executable code
3) Object code - compiler - source code - linker - executable code
4) Object code -linker - source code - compiler - executable code
5) None
14. Who developed the language C#?
1) Dennis Ritchie
2) Brian Kernighan
3) Anders Hejlsberg
4) John McCarthy
5) None
15. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ____
1) ISDN 2) Cable modem
3) Microwave 4) DSL
5) DSN
16. Codes consisting of lines of varying widths or lengths that are computer readable are known as____
1) an ASCII code
2) a magnetic tape
3) a bar code
4) an OCR scanner
5) None of these
17. Time required by a sector to reach below the head is known as_____
1) Seek time 2) Latency time
3) Access time 4) Disk time
5) None of these
18. IP-Address 192.5.48.3 belong to_____
1) Class A 2) Class B
3) Class C 4) Class D
5) None of these
19. Internet-like networks within an enterprise known as_____
1) Intranet 2) Internet
3) Extranet 4) Network
5) None of these
20. What is standard Layout of keyboard?
1) QWERTY 2) DVORAK
3) AZERTY 4) 1 and 2
5) None
21. Most powerful computer in a typical network is_____
1) Desktop
2) Network client
3) Network server
4) Network 5) None
22. _____Viruses are often transmitted by a floppy disk left in the floppy drive
1) Trojan horse
2) Boot sector
3) Script
4) Logic bomb
5) None of these
23. _____is a combination of black hat and white hat hacker.
1) White hat
2) Grey hat
3) Blue hat
4) Red hat
5) None
24. The ability to recover and read deleted or damaged files from a criminal's computer is an example of a law enforcement specialty called_____
1) Robotics. 2) Simulation
3) Computer forensics.
4) Animation. 5) None of these
25. How many types of database objects are there in MS Access?
1) 5 2) 6 3) 7
4) 8 5) None of these

KEY

1) 3	2) 2	3) 3	4) 1
5) 4	6) 4	7) 3	8) 1
9) 2	10) 3	11) 3	12) 2
13) 2	14) 3	15) 4	16) 3
17) 2	18) 3	19) 1	20) 1
21) 3	22) 2	23) 3	24) 3
25) 3			